ఈనాడు

విజయవాడ 13-7-2025 ఆదివారం సిటీ సంపుటి 51 . సంచిక 334

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మా జీన్స్ బాగున్నాయా?

వివాహానికి ముందు.. సంతానానికి ముందు.. ▶ జన్యు పరీక్షలు

పెళ్లికి... కొందరు జాతకాలు చూస్తారు... మరికొందరు ఆస్తిపాస్తులు చూస్తారు... ఏడు తరాల చరిత్రను చూసేవారూ ఉన్నారు. వీటి సంగతెలా ఉన్నా జన్యు చరిత్రను కూడా చూడాల్సిందే అంటోంది నవతరం. ఎందుకంటే అది బాగుంటే పుట్టే పిల్లల ఆరోగ్యమూ సరిగ్గా ఉంటుంది. అందుకే పెళ్లికి ముందే జన్యు పరీక్షలకు ముందుకొస్తున్నారు. ఇంకొందరు పిల్లలు పుట్టేముందు జన్యు విశ్లేషణలు చేయించుకుంటున్నారు.



ప్రస్తుతం అనేక రకాల క్యాన్సర్లు, గుండె వ్యాధులు దాడి చేస్తున్నాయి. చిన్న వయసులోనే ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. మధుమేహం, అధిక రక్తపోటులాంటి దీర్ఘకాలిక వ్యాధులూ విపరీతంగా పెరుగుతున్నాయి.

ఇక పిల్లల్లో మెదడు, ఎదుగుదల సమస్యలు సరేసరి. జన్యువుల ఆరోగ్యం బాగుంటే వీటన్నిటి నుంచి చాలావరకు రక్షణ ఉంటుంది. ఈ నేపథ్యంలో జన్యు పరీక్షలు, కౌన్సెలింగ్‌పై అవగాహన పెరుగుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. పెళ్లికి ముందే పరీక్షలు చేయించుకోవడానికి యువతరం ముందుకొస్తోంది. కొందరైతే జన్యు విశ్లేషణ తర్వాతే పిల్లలను ప్లాన్ చేసుకుంటున్నారు.


(మిగతా 6లో)



- దేశంలో ఏటా 2.50 కోట్ల మంది శిశువులు జన్మిస్తున్నారు.
- వీరిలో 17 లక్షల మందిలో ఏదో ఒక జన్యు లోపం ఉంటోంది.
- దాదాపు 7 వేల రకాల జన్యు వ్యాధులు ఉన్నాయి.
- వాటిలో ఎక్కువ మందిలో కనిపించేవి 40-43 రకాలు మాత్రమే.

15 నాటికి జాబితాలు సిద్ధం చేయండి

నామినేటెడ్ పోస్టుల భర్తీపై సీఎం ఆదేశం



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆలయ కమిటీలు, మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) ఛైర్‌పర్సన్లు, సభ్యుల పోస్టులకు అభ్యర్థుల ఎంపికను ఈ నెల 15లోగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గడువు నిర్దేశించారు. ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను వారం, పది రోజుల్లోపే భర్తీ చేయాలని ఆదేశాలిచ్చారు. ఇప్పటికే ఈ పదవుల కోసం ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు ప్రతిపాదించిన పేర్లను తెదేపా కార్యాలయంలో వడపోస్తున్నారు. ఎన్నికల సమయంలో కుదిరిన అవగాహన ప్రకారం తెదేపా, జనసేన, భాజపా మధ్య నామినేటెడ్ పదవుల పంపిణీ జరుగుతుంది. కూటమి పార్టీల ఎమ్మెల్యేల నుంచీ జాబితాలు తీసుకున్నారు. రాష్ట్రంలో 900 దేవాలయాలకు ఛైర్మన్లు, కమిటీ సభ్యుల్ని నియమించాలి. మార్కెట్ కమిటీల్లోనూ (మిగతా 6లో)

వివేకా హత్య కేసుపై అంతులేని తాత్సారం!

కీలక దశలో దర్యాప్తు ప్రక్రియను నిలిపేసిన సీబీఐ • రెండేళ్లుగా ఈ కేసు ఊసే ఎత్తని అధికారులు

- ప్రధాన కుట్రదారులెవరో వెలికితీసే స్థాయికి దర్యాప్తు.. ఆ దశలోనే నిలిపివేత
- సుప్రీంకోర్టు నియమించిన సిట్‌లో మిగిలింది ఒక్కరే
- నిందితులు సాక్షుల్ని ప్రభావితం చేస్తున్నా బెయిల్ రద్దు పిటిషన్ లేదు

ఈనాడు - అమరావతి





వీటిని తేల్చలేదెందుకు?

- ➤ వివేకా హత్య సమాచారం బయట ప్రపంచానికి వెల్లడవటానికి కొన్ని గంటల ముందే జగన్, భారతికి ఎలా తెలిసింది? ఎవరు చెప్పారు?
- ➤ హత్యకు ముందూ తర్వాతా వాట్సప్‌లో యాక్టివ్‌గా ఉన్న కడప ఎంపీ అవినాష్ రెడ్డి... ఎవరితో చాట్స్, కాల్స్ చేశారు. జగన్‌కు సమాచారం చేరవేతలో ఆయన పాత్ర ఏమిటి?
- ➤ హత్యలో జగన్, భారతి ప్రమేయమేంటి? వారి మద్దతు లేకుండా ఇంత పెద్ద కుట్ర అమలు సాధ్యమేనా?
- ➤ వివేకా హత్యకు రూ.40 కోట్లు వెచ్చించడానికి సిద్ధమైంది ఎవరు? హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న నలుగురికి రూ.కోటి చొప్పున ఇచ్చిన అడ్వాన్సును ఎవరు సమకూర్చారు?
- ➤ వివేకాను చంపాక సునీల్ యాదవ్(ఏ-2).. అవినాష్‌రెడ్డి ఇంటికి ఎందుకెళ్లాడు?
- ➤ అవినాష్‌రెడ్డిని, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని.. ఈ కేసు నుంచి రక్షించటానికి జగన్ సర్వశక్తులూ ఒడ్డారు. సీఎం హోదాలో ప్రభుత్వ వ్యవస్థలను దీని కోసం వాడుకున్నారు. హత్యతో ఏ సంబంధమూ లేకపోతే ఆయన వారిని ఎందుకు రక్షిస్తున్నట్లు?

... ఇలాంటి కీలక అంశాలను తేల్చకుండా, చిక్కుముడులు విప్పకుండా వివేకా హత్యకేసు దర్యాప్తును సీబీఐ నిలిపేసింది.

వివేకా హత్యకేసులో అన్ని వేళ్లూ జగన్, ఆయన సతీమణి భారతి వైపే చూపిస్తున్నా వారిని సీబీఐ ఒక్కసారీ ప్రశ్నించలేదు. విచారణకు పిలుస్తూ నోటీసులైనా ఇవ్వలేదు. ప్రధాన కుట్రదారులెవరో వెలికితీసే స్థాయి వరకూ దర్యాప్తును తీసుకొచ్చి వదిలేసింది. ఈ హత్య వెనక ఉన్న విస్తృత కుట్ర కోణాన్ని వెలికితీసే దిశలో దర్యాప్తు కొనసాగించాల్సి ఉందంటూ న్యాయస్థానాల్లో చెప్పిన సీబీఐ... రెండేళ్లుగా కేసు ఊసే ఎత్తట్లేదు. 2023 జూన్ 30న రెండో అనుబంధ అభియోగపత్రం దాఖలు చేశాక దర్యాప్తును ఆపేసింది. అసలు అంశాల్ని ఛేదించకుండా వదిలేసింది. దర్యాప్తును కొనసాగించి అత్యున్నత స్థాయిలో ఉన్న ప్రధాన కుట్రదారుల పాత్రను బయటపెట్టాలని వివేకా కుమార్తె సునీత కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే వారు లేరు.

కోర్టుకు చెప్పి.. ముడి విప్పకుండానే..

'వివేకా మృతి చెందినట్లు ఆయన వ్యక్తిగత సహాయకుడు ఎంవీ కృష్ణారెడ్డి 2019 మార్చి 15న ఉదయం 6.15 గంటలకు బయట ప్రపంచానికి వెల్లడించారు. అంతకు కొన్ని గంటల ముందే జగన్‌కు ఈ సమాచారం తెలుసు. హత్యకు ముందూ తర్వాతా ఎంపీ అవినాష్‌రెడ్డి వాట్సప్‌లో యాక్టివ్‌గా ఉన్నారు. కాల్స్ కూడా చేశారు. వివేకా హత్య సమాచారాన్ని జగన్‌కు చేరవేయటంలో అతని పాత్రపై మరింత లోతుగా విచారించాల్సి ఉంది. హత్యకు పన్నిన భారీ కుట్రలో ఇంకా (మిగతా 6లో)

మద్యం ముడుపులతో దుబాయ్‌లో కంపెనీలు

హవాలా ఏజెంట్ల ద్వారా రూ.వందల కోట్ల తరలింపు

ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డిని ముందు పెట్టి దందా

నాలుగేళ్లలో 29 సార్లు దుబాయ్‌కి కిరణ్

కంపెనీల్లో పెట్టుబడుల పర్యవేక్షణ

సిట్ దర్యాప్తులో గుర్తింపు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తులో రూ.వందల కోట్లను వైకాపా ముఠా హవాలా మార్గాల్లో దుబాయ్‌కి తరలించింది. ఈ అక్రమార్జనను పెట్టుబడులుగా పెట్టి అక్కడ అనేక కంపెనీలు నెలకొల్పింది. గత ప్రభుత్వ పెద్దల తరఫున ఈ కుంభకోణాన్ని నడిపించిన రాజ్ కెసిరెడ్డి ప్రధాన అనుచరుడు తూకేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డి (ఏ9)తో ఈ కంపెనీల్ని ఏర్పాటు చేయించింది. ఈ అక్రమ సొత్తుతో భారత్‌లో పెట్టుబడులు పెట్టినా, ఆస్తులు కొన్నా రాష్ట్రంలో ప్రభుత్వం మారి దర్యాప్తు జరిగితే.. వాటిని స్వాధీనం చేసుకుంటుందని భావించి దుబాయ్‌లో పెట్టుబడులు (మిగతా 5లో)

ఇంధన స్విచ్‌ల వైఫల్యంతోనే ఘోరం

సెకను వ్యవధిలో రెండు ఇంజిన్లకు ఆగిపోయిన సరఫరా

- ఆ స్విచ్‌లను ఎందుకు ఆపావన్న ఒక పైలట్
- తాను ఆపలేదన్న మరొకరు..
- మళ్లీ ఇంజిన్ స్టార్టయ్యేలోగా ఘోరం
- అహ్మదాబాద్‌లో కూలిన విమానంపై 15 పేజీల ప్రాథమిక నివేదిక

దిల్లీ: రెండు ఇంజిన్లకు రెప్పపాటు (సెకను) వ్యవధిలో ఇంధన సరఫరా నిలిచిపోవడంవల్లే అహ్మదాబాద్‌లో ఎయిరిండియాకు చెందిన ఏఐ171 విమానం కూలిపోయిందని ప్రాథమిక దర్యాప్తు నివేదిక తేల్చింది. ఇంధన సరఫరా నిలిచిపోవడంతో కాక్‌పిట్‌లో అయోమయం నెలకొందని, ఫలితంగా టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయిందని వెల్లడించింది. ఇంధన సరఫరాను ఎందుకు ఆపావని (మిగతా 6లో)

నివేదికలోని అంశాలు

- ➤ ఒక సెకను వ్యవధిలోనే ఇంధన సరఫరా స్విచ్‌లు రన్ నుంచి కటాఫ్‌లోకి మారిపోయాయి. వెంటనే హైడ్రాలిక్ పవర్‌ను సరఫరా చేసేందుకు 'ర్యాట్'ను (ర్యామ్ ఎయిర్ టర్బైన్) మోహరించినా అప్పటికే రెండు ఇంజిన్లు తిరిగి పుంజుకోలేని స్థాయికి పడిపోయాయి.



- ➤ 10 సెకన్ల తర్వాత మొదటి ఇంజిన్ ఇంధన స్విచ్.. కటాఫ్ నుంచి రన్ పొజిషన్‌లోకి వచ్చింది. ఆ తర్వాత 4 సెకన్లకు రెండో ఇంజిన్ ఇంధన స్విచ్ రన్ స్థాయికి వచ్చింది. అప్పుడు రెండు ఇంజిన్లను తిరిగి పునరుద్ధరించేందుకు పైలట్లు ప్రయత్నించారు. అయితే ఒక ఇంజినే ఆన్ అయింది. రెండో ఇంజిన్ విఫలమైంది. ఒక ఇంజిన్ పవర్.. విమానాన్ని తిరిగి పైకి లేపేంత శక్తిని కూడగట్టుకోలేకపోయింది.
- ➤ ప్రమాదాన్ని వెంటనే గుర్తించిన పైలట్.. మేడే.. మేడే.. మేడే అంటూ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన సిబ్బంది.. ఏం జరిగిందని అడిగేలోగా విమానాశ్రయానికి బయట విమానం కూలిపోయింది. చెట్లను తాకుకుంటూ హాస్టల్ (మిగతా 6లో)

నైపుణ్యానికి విదేశీ విద్య ప్రామాణికం కాదు



"స్కాలర్‌షిప్ ఉంటే విదేశాల్లో విద్యాభ్యాసానికి వెళ్లవచ్చు. రుణాలు తీసుకుని వెళ్లడం సరి కాదు. విదేశీ విద్యాభ్యాసంతో ఒక్కో కుటుంబంపై రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల భారం పడుతోంది. అప్పులు చేసి పంపిస్తున్న కుటుంబాలు వాటిని తీర్చలేక ఇబ్బందులు ఎదుర్కొంటాయి. దానికంటే కొద్దిపాటి పెట్టుబడితో ఇక్కడే ప్రాక్టీస్ ప్రారంభించి, కొంత ఆర్జించిన తర్వాత విదేశాలకు వెళ్లి చదువుకోవచ్చు.

– సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్

- దేశంలో పీజీ, పరిశోధనల నాణ్యత పెంపొందించాలి
- న్యాయవాద వృత్తిలో కఠిన సవాళ్లు
- 'నల్సార్' స్నాతకోత్సవంలో సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్

ఈనాడు, హైదరాబాద్: నైపుణ్యానికి విదేశీ విద్య ప్రామాణికం కాదని... బ్రాండ్ పేరుతో, ఒత్తిళ్లతో అక్కడికి వెళ్లరాదని, ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని వెళ్లాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ అన్నారు. మన దేశంలో పీజీ విద్యాభ్యాసం, పరిశోధన అవకాశాలపై నమ్మకం లేకపోవడం వల్ల పలువురు విదేశాలకు వెళ్తున్నారని వ్యాఖ్యానించారు. దేశ న్యాయవ్యవస్థ ప్రయోజనాల పరిరక్షణకు, అత్యుత్తమ న్యాయవాదులను తీర్చిదిద్దేందుకు పీజీ విద్య, పరిశోధనల్లో ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సిన అవసరముందని, వాటి ప్రమాణాలను మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన 22వ స్నాతకోత్సవానికి జస్టిస్ గవాయ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

న్యాయవాద వృత్తి సులభమైంది కాదు...

"న్యాయవాద వృత్తి పవిత్రమైంది. అయితే, అంత సులభమైంది కాదు. కఠిన సవాళ్లుంటాయి. ఆదాయంపై హామీ ఉండదు. కోర్టుల ముందు, కక్షిదారుల ముందు ఎప్పటికప్పుడు రుజువు చేసుకోవాల్సి వస్తుంది. ఉన్నత నైపుణ్యాలతోనే కాకుండా సృజనాత్మక, నిర్మాణాత్మక ఆలోచనలతో రాణించవచ్చు. గంటల తరబడి (మిగతా 6లో)



గుహ వద్ద ఉన్న మహిళతో మాట్లాడుతున్న పోలీసులు

'గోకర్ణ' గుహలో రష్యా మహిళ రహస్య జీవనం

గుర్తించి, అడవి నుంచి బయటకు తీసుకొచ్చిన పోలీసులు

కార్వార, న్యూస్‌టుడే: హిందూ ధర్మంపై నమ్మకంతో భారత్‌కు వచ్చి.. గోకర్ణ సమీప రామతీర్థ అడవిలోని గుహలో ఉంటున్న రష్యా మహిళ మోహి(40)ని ఉత్తర కర్ణాటక జిల్లా పోలీసులు శనివారం బయటికి తీసుకొచ్చారు. ఆమె తన కుమార్తెలు ప్రియ(6), అమా(4)లతో కొన్నాళ్లుగా గుహలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గుహలో రుద్రదేవుడి విగ్రహాన్ని పెట్టుకొని పూజలు చేసుకుంటూ, అడవిలో దొరికిన కందమూలాలు, పండ్లు తిని జీవిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఓ విదేశీయురాలు పిల్లలతో గుహలో ఉంటున్నట్లు తెలుసుకున్న పోలీసులు శనివారం ఆ ప్రాంతంలో గాలించారు. స్థానిక రైతు (మిగతా 6లో)

లోపలి పేజీల్లో

ఐదు నగరాలకు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులు
స్వచ్ఛ లీగ్ ప్రత్యేక కేటగిరీలో విజయవాడ, గుంటూరు, తిరుపతి
ప్రత్యేక కేటగిరీ మినిస్టీరియల్ అవార్డుకు విశాఖ
రాష్ట్రస్థాయి మినిస్టీరియల్ కేటగిరీలో రాజమహేంద్రవరం ఎంపిక

సెల్ఫీ దిగుదామంటూ భర్తను నదిలోకి తోసేసిన భార్య!
ఈదుకుంటూ బండపైకి చేరిన బాధితుడిని రక్షించిన వాహనదారులు
తాను తోయలేదని.. ఆయనే పడిపోయాడంటూ ఆమె వాదన

ఇదీ సంగతి!



ప్రత్యర్థుల వ్యాఖ్యలను ఎలా ఖండించాలో ఈ రోజు నేర్చుకున్నారట!

పరిశ్రమ పెట్టరు.. పైసలు కట్టరు!

వైకాపా హయాంలో బొత్స కుటుంబానికి జగన్ భారీ నజరానా

- బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 30 ఎకరాలు రూ.3 కోట్లకే కేటాయింపు
- అప్పటి ఏపీఐఐసీ ధరల ప్రకారమే రూ.21.58 కోట్ల అనుచిత లబ్ధి
- రెండేళ్లవుతున్నా భూమికి చెల్లించింది రూ.29.99 లక్షలే
- ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఎకరం రూ.1.5 కోట్లపైనే
- కేటాయింపులు రద్దు చేయకుండా జాప్యమేల?

ఈనాడు-విజయనగరం, అమరావతి



వైకాపా హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్.. అస్మదీయులకు భూముల్ని, ప్రభుత్వ ఆస్తుల్ని పప్పూ బెల్లాల్లా పంచేశారు. ఇక మంత్రివర్గంలో సీనియర్ సహచరుడు, ఉత్తరాంధ్రలో కీలక నేత బొత్స సత్యనారాయణ అడిగితే కాదంటారా? ఏపీఐఐసీ లెక్కల ప్రకారమే దాదాపు పాతిక కోట్ల విలువైన 30 ఎకరాల భూమిని.. పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామన్న ముసుగులో రూ.మూడు కోట్లకే ఆయనకు కట్టబెట్టేశారు. బహిరంగ మార్కెట్‌లో దాని విలువ దాదాపు రూ.45 కోట్లు. పరిశ్రమ పెడతామంటే భూములిచ్చి రెండేళ్లయింది. ఇప్పటి వరకు పునాదిరాయి కూడా వేయని బొత్స కుటుంబం.. కనీసం భూమికి ఆ నామమాత్రపు ధర కూడా (మిగతా 6లో)

నెల రోజుల్లోనే.. రాసిచ్చేశారు

- **2023 జూన్ 21:** రాయితీపై భూమి కేటాయించాలని సీఎం కార్యాలయానికి సత్య బయోఫ్యూయల్స్ దరఖాస్తు
- **జూన్ 26:** ఆ దరఖాస్తును పరిశ్రమల శాఖకు పంపిన సీఎం కార్యదర్శి
- **జూన్ 27:** పరిశ్రమకు వేగవతి నది నుంచి రోజుకు 1600 కిలోలీటర్ల చొప్పున ఏడాదికి 0.013 టీఎంసీల జలాల్ని ఇథనాల్ తయారీ కోసం కేటాయించినట్లు జలవనరులశాఖ జీవో. కిలో లీటరు (వెయ్యి లీటర్లు) రూ.5 చొప్పున కేటాయిస్తూ ఉత్తర్వులు
- **జులై 10:** భూమి కేటాయింపునకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ గ్రీన్‌సిగ్నల్
- **జులై 11:** అప్పటి సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన ఎస్ఐపీబీ బోర్డు సమావేశంలో భూమి కేటాయిస్తూ నిర్ణయం
- **ఆగస్టు 8:** సత్య బయోఫ్యూయల్స్‌కు భూమి కేటాయించిన ఏపీఐఐసీ



ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది ప్రవాహంలో గోదావరి జలాలు కలవడంతో రంగు మారిన కృష్ణమ్మ

గోదారి పోటెత్తింది.. కృష్ణకు రంగేసింది!

పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా గలగలమంటూ గోదారి జలాలు వచ్చి కలుస్తుండటంతో బిరబిరా పారే కృష్ణా నది రంగు మారుతోంది. పోలవరం నుంచి గోదావరి జలాలు శనివారం ఉదయానికి ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరడంతో లేత నీలిరంగులోని కృష్ణా జలాలు ఎరుపు రంగు సంతరించుకున్నాయి. ఏలూరు, బందరు కాల్వలకు వెళ్లే సాగునీరు సైతం ఇదే రంగుతో పరవళ్లు తొక్కుతూ కనిపించింది. కృష్ణా నది ఒక్కసారిగా గోదారి ప్రవాహాన్ని తలపించడంతో విజయవాడ నగరవాసులు పవిత్ర సంగమాన్ని సందర్శిస్తున్నారు. మరోవైపు నగర శివారులో పోలవరం కుడి కాలువలో పట్టిసీమ ప్రవాహ అందాలు ఆకట్టుకుంటున్నాయి. (మిగతా 6లో)



గ్రాండ్ ఓపెన్ బాక్స్ సేల్
60%* వరకు తగ్గింపు
బజాజ్ ఎలక్ట్రానిక్స్™
LG Life's Good.
The Next Generation of LG AI TVs Tailored for You
LG OLED evo
LG QNED evo
SUPER OFFERS
3 YEAR WARRANTY
Upto 26% CASHBACK upto ₹26000
Upto 30% OFF ON LG SOUNDBAR
FIXED EMI Starting from ₹2999
SAMSUNG
Go Bigger with Samsung Vision AI
Bring home a new viewing experience with our AI Picture and AI Sound. Now available with the coolest offers.
Awesome India Offers
0 Down payment
Lowest EMI starting at ₹2990
Long tenure EMI up to 30 months
Up to 20% cashback + 10% extra cashback on Samsung Axis Bank credit cards
*T&C apply. Global No.1 Source - Omdia, Feb 2025. Results are not an endorsement of Samsung.
SONY
BRAVIA 5 NEW
Big on entertainment, easy to love.
Google TV
XR Backlight Master Drive
Studio Calibrated
IMAX ENHANCED
Range starts from Rs.1,44,990/-
XR Mini LED
SPECIAL OFFERS!
INSTANT CASHBACK Rs.15,000
30% OFF
TV + SOUNDBAR COMBO OFFER SAVE UPTO Rs.47,990/- BUY NOW AT Rs.2,995/-
LG
BE MONSOON READY
Exclusive Offer
CASHBACK upto 25%* Upto ₹9,000/-*
On Select Front Load Washing Machines
SAMSUNG
Hottest Deals of Summer
Bring home the 12kg and 9kg Bespoke AI™ Laundry with exclusive summer offers.
upto 22.5% CASHBACK Max amount ₹9,000*
EMI Starting @ ₹2490*
20 years warranty* on Digital Inverter Motor
Haier
DISCOVER THE FUTURE OF LAUNDRY with AI DBT
WASHING ASSURANCE 30-DAY MONEYBACK GUARANTEE
EXCITING OFFERS
0 DOWN PAYMENT
₹994
20% CASH BACK
5 YEARS WARRANTY
BOSCH
Invented for life
BIG BOSCH OFFER
Inspired by innovation, designed for fabric care.
Bosch Over 100 Years in India
₹9,000*
EASY EMI
REFRIGERATORS
RANGE STARTS FROM ₹12,490/-*
LG SAMSUNG Haier Whirlpool BOSCH
AIR CONDITIONERS
WIDEST RANGE OF SPLIT AC
RANGE STARTS FROM ₹29,990/-*
ATTRACTIVE CASHBACK*
NO COST EMI*
INSTALLATION FREE*
LG LLOYD DAIKIN BLUE STAR SAMSUNG Haier GENERAL
iPhone
iPhone 16 Starting at ₹66,400* ₹2933 X 24 month
iPhone 13 Starting at ₹44,300* ₹3689 X 12 month
*Starting price inclusive of Store Discount & Cashback
SAMSUNG
Galaxy A56 | A36 5G
Seal the triple zero deal
Galaxy Buds Core ₹1000** Off ₹3999* Limited time offer
Starting at ₹56/day*
vivo
Y400 Pro 5G
It's My Style
Available Now
8GB + 128GB ₹24,999/-*
8GB + 256GB ₹26,999/-*
Own Easily with Exclusive Offers
10% Cashback
10 Months ZERO Down Payment
oppo
Reno14 Series 5G
AI Portrait Camera
Available Now
Starting from ₹37,999/-
Instant Cashback upto ₹4000*
ZERO DOWN PAYMENT
6 EMIS
4K CASHBACK*
OnePlus Nord 5 & CE5
Available Now
Up Your Game
hp
14/15 SERIES, VICTUS, OMEN, OMNIBOOK, ENVY, PAVILION, SPECTRE
• Skybag Play Plus Strolley 55 Worth ₹10,000 @ ₹499* or
• Portronics Power Bank Worth ₹6,999 @₹499*
• HyperX Cloud Stinger 2 Headset Worth ₹11,427 @ ₹499*
• Fossil watch Worth ₹13,495 @ ₹999*
DELL
INSPIRON, XPS, INSPIRON GAMING, ALIENWARE
• Wireless Keyboard and Mouse Combo Worth ₹2,299 @ ₹499* or
• Canon pixma printer @ ₹1,999*
• Get Accessories Worth ₹5,990 @ ₹1,749*
Lenovo
IDEA PAD SLIM 5, YOGA, FLEX, LOQ, LEGION
• GET ACCESSORIES WORTH ₹5,990 @ ₹1,749*
• Accessories Combo worth ₹4,199 with LOQ @ ₹2,499*
• Accessories Combo worth ₹6,999 with Legion @ ₹2,499*
ASUS
VIVO BOOK, VIVO BOOK GO, ZENBOOK, TUF GAMING, ROG STRIX
• ASUS CW101 Keyboard+Mouse Worth ₹1,899 @ ₹999*
• GET ASUS Wireless Silent Mouse MW103 worth ₹1,299 @ ₹99*
• TUF Gaming M3 Gen II Mouse worth ₹3,499 @ ₹1,199*
10% cashback upto 10000*
*0% interest
No Cost EMI Upto 24 Months*
Exchange Bonus Upto 10000*
*conditions apply /Selected Models only
Macbook Air M4
MRP (incl.of all taxes) ₹99,900
Store Discount ₹7,000
Bank Cashback ₹10,000
Student Discount ₹3,000
Offer Price ₹79,900*
SAMSUNG LIMITED PERIOD OFFER
A9 plus (128GB) MOP ₹24,999 EFFECTIVE PRICE ₹16,999*
S9 FE (128GB) MOP ₹44,999 EFFECTIVE PRICE ₹29,999*
Cashback upto ₹5,500*
Cashback upto ₹8,000*
iPad
A16 Starting at ₹31,200* ₹1381 X 24 month
Air M3 Starting at ₹53,900* ₹2371 X 24 month
Cashback upto ₹3000*
విజయవాడ: వినాయక థియేటర్ దగ్గర, బందరు రోడ్, గుణదల | మీనాక్షి టవర్స్, ఏలూరు రోడ్, సూర్యారావు పేట | F101, F102, F115, & F116, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్ నందమూరి నగర్ | 71-2-9, మోహన్ దాస్ థియేటర్ ప్రక్కన, వెంకటేశ్వరపురం, పటమట | D.No 76-8-8/5, క్రాంబ్వే రోడ్డు, శివాలయం, భవానిపురం |
గుడివాడ: Ground, 1st, 2nd Floors, Sy.No. 122/1, వార్డ్ నం.15, ఆంజనేయపేట, | మచిలీపట్నం: ఓల్డ్ D. No. 11/313, సిరి ఎస్టేట్, చెమ్మన్నగిరి పేట
Bajaj Electronics - A Trademark of Electronics Mart India Ltd. CIN No: L52605TG2018PLC126593. Regd. Office: 6-1-91/10, Ground Floor, Next to Telephone Bhavan, Secretariat Road, Saifabad, Hyderabad - 500004. Corporate Office: M. No. 6-3-666/A1 to 7, 3rd Floor, Opp. NIMS Hospital, Punjagutta Main Road, Hyderabad - 500082. Email: communications@bajajelectronics.in
*T&C Apply: *Offer valid on select products only. EMI and approval of EMI is at the sole discretion of the finance company and the decision of the finance company management is final. 0% finance is available on selected models and brands only. Finance offer is not valid for products below Rs.10,000/-. No two offers can be clubbed together. Product images shown here are only for demonstration purpose. Please check the products before purchase. Offer valid till stock last. Bajaj Electronics reserves the right to withdraw or change the offers, prices, terms and conditions at any time without prior intimation. *A minimum transaction value is required for getting cashback which will vary from bank to bank. For instant approvals please walk-in with your id proof, address proof & cheque leaf.


ఈనాడు

అష్టమ వ్యసనం

రాముడు కోదండపాణి. కృష్ణుడు చక్రధారి. మనమంతా సెల్‌ఫోన్ ధారులం. వారి ఆయుధాలకైనా విరామం దొరుకుతుందేమో గానీ, సెల్‌ఫోన్ మాత్రం నిర్విరామంగా పనిచేస్తూనే ఉంటుంది. ముసలితనంలో మనిషికి చేతికర్ర అనే మూడో హస్తం మొలుస్తుందంటారు. ఆధునిక యుగంలో చిన్నతనంలోనే ఫోన్ అరచేతిని ఆక్రమిస్తోంది. ప్రసిద్ధ తమిళకవి వైరముత్తు 'ఆరా విరలాయ్ పేనా కేట్టేన్... నా చేతికి కలాన్ని ఆరో వేలుగా ఇవ్వు' అని అభ్యర్థించారు. కానీ ఇప్పటి పిల్లలు ఆ మూడో హస్తం కోసమే ఇంటింటా 'నానా' యాగీ చేస్తున్నారు. 'పుస్తకం హస్తభూషణం' అనేది పాత మాట. సెల్‌ఫోన్ హస్తవిభూషణం అనేది నేటి పాట. ఏమాటకు ఆమాటే చెప్పుకోవాలి- ఆ భూషణాలన్నీ ఈ విభూషణంలో భాగమైపోయినా, పుస్తకానికి ఆకర్షణ తక్కువగానే ఉంటోంది. భారతం వినేముందు మునులు 'ఏయ్యది హృద్యము...' ఏది మనసును ఆకర్షిస్తుందో... అనేసి ఊరుకోలేదు- ఎద్దాని వినిన సమగ్రమైన ఎరుక(పరిపూర్ణ జ్ఞానం) లభిస్తుందో, దుష్ట చింతన దూరమవుతుందో- అది కావాలని అడిగారు. మనం మాత్రం హృద్యం దగ్గరే ఆగిపోతున్నాం. జిగురుపూసిన అట్టలకు అతుక్కుపోయే ఎలుకల్లా గింజుకుంటున్నాం!

రావణాసురుడి మాదిరి మన హస్తవిభూషణం సైతం మహా బలశాలి. ఆ రాక్షసుడికి మాత్రం పదే తలకాయలు. మన అరచేతిలోని అందాల రాక్షసికి వాట్సప్, ఫేస్‌బుక్, యూట్యూబ్... అబ్బో ఎన్నో తలలు. అవి శాసించేదేమో- దశదిశలను! దాని శక్తి సామర్థ్యాలు, వాటి పరిధులు ఎంత విస్తృతమైనవంటే- దేశంలోని ఓ మూలెక్కడో క్షణాలలో కన్నుగీటిన కన్యాకుమారిని- అత్యున్నత సభలో ఓ ప్రజాప్రతినిధి అనుకరించేంత! కుంభమేళాలో పూసలమ్ముకుంటున్న ఓ అమాయక ప్రాణిని- రాత్రికి రాత్రే వెండితెర తారాతోరణంలో మరో మణిగా చేర్చేంత! సైకాలజీలో 'మిమెటిక్ డిజైర్' అని ఒకటుంది. పలానా చోట ఫలహారాలు బాగుంటాయని ప్రచారం కాగానే ప్రజలు క్యూ కడతారు చూశారా- ఆ తరహా మూక మనస్తత్వానికి చెందినదా మాట. అలా ప్రతిపూటా ఓ పాటకు పాదాలు కదిలిస్తూ ఆ చిత్రాలను సామాజిక మాధ్యమాల్లోకి ఎక్కిస్తూ ప్రియా వారియర్లమో, మోనాలిసాలమో అయిపోవాలనుకోవడమే- మిమెటిక్ డిజైర్. కళాత్మకత ఉన్నంతసేపే దాని విలువ. వెర్రితలలు వేస్తే- భర్తృహరి చెప్పినట్లు 'పెక్కు-భంగుల్ వివేక భ్రష్ట సంపాతముల్' అనిపించుకుంటాయి.

సామాజిక మాధ్యమాల తీరుతెన్నులు చూస్తుంటే 'పీడ పోకినంత సులువుగా ఉన్నట్టుంది!' అనే సామెత నిజమనిపిస్తోంది. పెడధోరణులు పెచ్చుమీరుతున్నాయి. ఆకర్షితులవుతున్న యువత తహతహను విశ్వనాథ మాటల్లో చెప్పాలంటే- 'కోరి, కోరికలు మించి తొలుకొని పోవ్రతుంద దారిపక్కన యున్న పచ్చిగడ్డికై..' ఆశపడే పశువుల అమాయకత్వం లాంటిది. పక్కింటిపై పడేపదే తొంగిచూసే పాడు అలవాటు వంటిది. 'దాన్ని ప్రమాదకరమైన మానసిక రుగ్మతగా గుర్తించాలి. అదొక్కటే కాదు, వీలైనంతవరకు అన్నిరకాల సామాజిక మాధ్యమాల నుంచి దూరంగా ఉండాలి. అప్పుడే సమాజం సక్రమంగా ఉంటుంది' అని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. సోషల్ మీడియా వ్యసనం, భావోద్వేగాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని, భస్మాసుర హస్తంగా పరిణమిస్తోందని వారి అధ్యయనంలో తేలింది. కాబట్టి అరచేతిలోని అరిష్టాన్ని ఆలింగనం చేసుకునే ముందు ఆలోచించడం మేలు. అవసరానికి తగినంత వాడుకుంటే చాలు. అతి చేస్తే గతి చెడుతుంది మరి!



స్వర్గం ఎక్కడో లేదు, మనలోనే ఉంది. సంతోషాన్ని వస్తువుల్లో, దేవుణ్ని బాహ్యంలో... వెతుక్కుంటున్నారు. కోరుకునే ఆనందమైనా, ఆరాధించే దైవమైనా ఎక్కడో లేవు... మన లోపలే ఉన్నాయని గుర్తించాలి.

- స్వామి రామతీర్థ


మానవీయతను మించిన చదువేదీ?

మీ అబ్బాయి జీతమెంతంటే లెక్క చెప్పొచ్చు కానీ, మీ అబ్బాయి మిమ్మల్ని ఎంత ప్రేమిస్తున్నాడంటే చెప్పడానికి లెక్కేం ఉంటుంది? ఇలాంటి మీమాంసే కనిపిస్తుంది చదువుల్లోనూ. శాస్త్రసాంకేతిక పురోగతికి గణితం, భౌతికశాస్త్రం వంటివి చాలా అవసరం. వాటి ఫలితాలను పక్కాగా లెక్కగట్టి చూపించగలుగుతాం. అదే సామాజిక నైతిక తత్వశాస్త్రాలూ, భాషా సాహిత్యాల ఫలితాలను గణాంకాల్లో చూపించలేం. మాటల్లో వివరించలేం. ఇవి ప్రేమ, దయ, అనురాగం, ఆత్మీయత, అభిమానం, ఆదరణ, భక్తి, వాత్సల్యం వంటి అనిర్వచనీయమైన, అమూల్యమైన భావనలు. మానవతా వికాసానికి పునాదులు.

శాస్త్ర సాంకేతికతలు మనిషి సౌకర్యవంతంగా, ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి అవసరమైన ఆవిష్కరణలకు తోడ్పడతాయి. సామాజిక, నైతిక, తత్వ, భాషా శాస్త్రాలేమో మనిషి మానవత్వంతో బతకడానికి దోహదపడతాయి. అందుకనే మానవీయ శాస్త్రాలను(హ్యూమానిటీస్‌ను) జీవితమనే వృక్షానికి వేళ్లుగా చెబుతుంటారు. నేడు కొందరు మరమనుషులు హ్యూమానిటీస్ వల్ల ఉపయోగమేంటని ప్రశ్నిస్తున్నారు. వీటి ప్రయోజనాన్ని ప్రశ్నించే ముందు- మనం ఎటువంటి సమాజంలో బతకాలనుకుంటున్నామనేది ఆలోచిస్తే సమాధానం దానంతటదే వస్తుంది. బహుశా మానవీయ, నైతిక విలువల బోధన తగ్గడం వల్లేనేమో... నేటి సమాజంలో మానవ సంబంధాలు మరుగునపడి, స్వార్థం విపరీతంగా పెరుగుతోంది!

ఆందోళనకర మానసిక స్థితి

టెక్ దిగ్గజ సంస్థ 'గూగుల్' ఆ మధ్య క్రీ.శ.1500వ సంవత్సరం నుంచి కొన్నేళ్ల క్రితం వరకూ ప్రచురితమైన 52లక్షల పుస్తకాల జాబితాను తయారుచేసి విడుదల చేసింది. కొందరు పరిశోధకులు దాన్ని విశ్లేషించి ఒక విషయాన్ని బయటకు తీశారు. 1960-2008 మధ్య వచ్చిన పుస్తకాల్లో సామాజిక ఐక్యతకు సంబంధించిన మాటలకు బదులు వ్యక్తిగత ప్రయోజనాలకు చెందిన పదాలు ఎక్కువగా వాడినట్లు తెలిసింది. దయ, సహాయం అనే మాటల వినియోగం 56శాతం; నిరాడంబరత, వినయం వంటి పదాల ప్రయోగం 52శాతం మేర తగ్గిపోయినట్లు తెలియవచ్చింది. మనం వాడే భాష మన జీవనశైలికి, దృక్పథానికి అద్దం పడుతుంది. నేడు సమాజం, సామాజిక శ్రేయస్సు వంటి మాటలు క్రమంగా ప్రాచుర్యం కోల్పోతున్నాయి. 'మేము, మనది' అనే భావనల నుంచి 'నేను, నాది' అనే స్వార్థంలోకి దిగజారిపోతున్నాం. ముఖ్యంగా బడి పిల్లల మానసిక ఆరోగ్య పరిస్థితి భయాందోళన కలిగిస్తోంది. బెంగళూరులోని మానసిక ఆరోగ్య, నాడీశాస్త్ర అధ్యయన సంస్థ(నిమ్‌హాన్స్) పరిశోధనలో- ప్రతి వంద మంది పాఠశాల విద్యార్థుల్లో 23మంది మానసిక స్థితి సరిగ్గా ఉండటం లేదని తేలింది. వీరు ప్రతి చిన్న విషయానికీ ఆందోళన చెందుతున్నారని, అనవసరంగా ఒత్తిడికి గురవుతున్నారని నిపుణులు గుర్తించారు. ఇలాంటి వారిని రెండు వర్గాలుగా విభజించారు. మొదటి వర్గం- చదువు మీద అంతగా శ్రద్ధ చూపని విద్యార్థులు. వీరు తోటి వారిని నిరుత్సాహపరచడం, అసాంఘిక కార్యకలాపాల్లోకి లాగడం వంటివి చేస్తుంటారు. రెండో వర్గం- తెలివైనవారూ, కష్టపడి చదువుతూ క్రమశిక్షణతో మెలిగే విద్యార్థులు. కానీ, వీరు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిత్యం గుర్తుచేసే లక్ష్యాలను సాధించగలమా అనే భయాందోళనలతో మానసికంగా కుంగిపోతున్నారు. ఈ రెండు వర్గాల పిల్లలనూ దారికి తీసుకురాకపోతే, అనతికాలంలోనే ఆందోళనకరమైన ఫలితాలను చవిచూస్తాం!



తల్లిదండ్రులది కీలక పాత్ర...

చదువూ వృత్తి ఉపాధులపరంగా యువతీ యువకులు ముందుకు వెళ్తున్నప్పటికీ- మానవత్వ ప్రదర్శనలో, మనిషి మనిషిగా బతకడంలో తిరోగమనమే తప్ప పురోగమనం కనిపించట్లేదు. ఇందుకు ప్రధాన కారణం- బాల్యంలోనే వారిలో మానవత్వపు విలువలను పాదుగొల్పే హ్యూమానిటీస్ అభ్యాసం కొరవడటమే. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల దృష్టి అంతా గణిత, భౌతిక, రసాయన, జీవశాస్త్రాల బోధన మీదే ఉంటోంది తప్పితే, మానవ శాస్త్రాల గురించి అవి కనీసం పట్టించుకోవడమే లేదు. ఏపీ, తెలంగాణలోని అనేక పాఠశాలల్లో తెలుగు బోధించడానికి అసలు ఉపాధ్యాయులే ఉండరు. ఎక్కువ మార్కుల కోసం తెలుగును కాదని సంస్కృతాన్ని ఎంపిక చేస్తున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రుల తప్పు కూడా ఉంది. తమ పిల్లలు పరీక్షల్లో ఎక్కువ మార్కులు, మంచి ర్యాంకులు తెచ్చుకుని ఇంజినీరింగ్, డాక్టర్ కావాలని... పెద్దయ్యాక బాగా డబ్బులు సంపాదించాలనే కాంక్ష వారిలో పెరుగుతోంది. ఇలాంటి ఆలోచనా ధోరణి వల్ల పిల్లలు మరమనుషుల్లా తయారై, మానవ సంబంధాలకు దూరమవుతున్నారనే వాస్తవాన్ని చాలామంది గ్రహించట్లేదు.

డబ్బులు వెచ్చిస్తే సరిపోదు...

చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల కోసం డబ్బులు వెచ్చిస్తున్నారే తప్ప, సమయాన్ని వెచ్చించట్లేదు. భారీగా ఫీజులు కట్టి కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివించడం, ఖరీదైన వస్తువులను కొనివ్వడం, విలాసవంతమైన టూర్లు చేయించడం ద్వారా బిడ్డలను బాగా పెంచుతున్నామనే భ్రమలో ఉంటున్నారు. పిల్లలు ఏ సబ్జెక్టును ఎలా చదువుతున్నారు, పాఠ్యాంశాలు ఎంతవరకు అర్థమవుతున్నాయి, ఉపాధ్యాయుల బోధన ఎలా ఉందనే విషయాలను అస్సలు పట్టించుకోరు. ఫీజులు కడుతున్నాం కాబట్టి తమ పిల్లల్ని చదివించే బాధ్యత ఉపాధ్యాయులది, విద్యా సంస్థలదేననే ఆలోచన- ఏమాత్రం సరికాదు! నిజానికి, 90 శాతం తల్లిదండ్రులకు తమ పిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుల పేర్లేమిటో తెలియదు. వారు బోధించే సబ్జెక్టు పేరుతోనే టీచర్లను పిలుస్తుంటారు. దాదాపు 60 శాతం తల్లిదండ్రులు పిల్లల్ని చేర్పించేటప్పుడు తప్ప మరెప్పుడూ బడి మొహం చూడటమే లేదు. ఇటువంటి ధోరణి సరికాదు. పాఠశాలలు క్రమం తప్పకుండా 'పేరెంట్స్ మీటింగ్'లను నిర్వహించాలి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి మాట్లాడుకోవడం ద్వారా విద్యార్థులు ఎలా చదువుతున్నారు, వారి మానసిక స్థితి ఏమిటి, వారికి ఎలాంటి మార్గదర్శనం అవసరం అన్నది అర్థమవుతుంది. వీటన్నింటికంటే ముఖ్యమైనది- మానవీయ శాస్త్రాల బోధన. ఉన్నత విలువలు, భావాలు కలిగిన వ్యక్తులుగా భావిపౌరులను తీర్చిదిద్దడానికి ఇదెంతో అవసరం. కాబట్టి, అన్ని బడుల్లోనూ మానవీయ శాస్త్రాల బోధనకు తగిన సమయాన్నీ, వనరులనూ కేటాయించడం యావద్దేశ శ్రేయస్సుకూ అత్యావశ్యకం.




ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు
మాజీ ఉపకులపతి,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

దూరపు కొండలు

ప్రేమ, పెళ్లి... ఎక్కువగా మాట్లాడుకునే విషయాలే కాదు, ప్రతి వ్యక్తి జీవితంలోనూ ముఖ్యమైనవి కూడా. అవి జీవితాన్ని అంతెత్తున నిలబెట్టగలవు... నిర్దాక్షిణ్యంగా అగాధంలోకి నెట్టేయగలవు. ప్రపంచ సాహిత్యంలోనే అద్భుతమైన నవలగా ప్రశంసలు పొందిన లియో టాల్‌స్టాయ్ 'అన్నా కెరనినా' ప్రధానంగా ఆ రెండు అంశాల చుట్టూనే తిరుగుతుంది. కోరికలకు, సమాజపు కట్టుబాట్లకు మధ్య సంఘర్షణను; అనుబంధాల్లోని సంక్లిష్టతలను చర్చిస్తుంది. వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక బాధ్యతల మధ్య మనుషులెంత ఒత్తిడికి లోనవుతారో చెబుతుంది. దూరపు కొండలు నునుపు అన్న సత్యాన్ని ఎరిగి మసలుకోవాలని, తొందరపాటు నిర్ణయాలు వేదననే మిగుల్చుతాయని బోధిస్తుంది.

సంతోషకరమైన సంసారాలన్నీ ఒకేలా ఉంటాయి. అది లేని సంసారాల్లో మాత్రం దేని బాధలు దానివి... అన్న వాక్యంతో మొదలవుతుంది 880 పేజీల 'అన్నా కెరనినా' నవల. ప్రేమించే భర్త, సంపన్న కుటుంబం, సామాజిక హోదా, ముద్దులు మూటగట్టే బిడ్డతో... సుఖంగా సాగిపోతున్న జీవితం అన్నా కెరనినాది. ఒకసారి ఆమె తమ్ముడి సంసారాన్ని చక్కదిద్దడానికి తాము ఉంటున్న సెయింట్ పీటర్స్‌బర్గ్ నుంచి మాస్కో వెళ్తుంది. వివాహేతర బంధంలో ఇరుక్కున్న తమ్ముడి తప్పును క్షమించమని మరదలికి చాలా విధాలుగా నచ్చజెప్పి వాళ్ల కాపురాన్ని నిలబెడుతుంది. అయితే ఆ ప్రయాణంలో పరిచయమైన వ్రాన్‌స్కీ అన్నాను ఆకర్షిస్తాడు. ప్రేమించిన యువతిని కాదని తన వెంట పడుతున్న ఆ యువకుడికి ఎంతోకాలం దూరంగా ఉండలేకపోతుంది. సంసారాన్ని పణంగా పెట్టి ప్రేమోద్వేగాన్ని ప్రదర్శిస్తుంది. పుకార్లకు తావివ్వద్దని అన్నాని హెచ్చరిస్తాడు భర్త. అవేవీ పట్టించుకునే పరిస్థితిలో లేని ఆమె భర్తనూ కొడుకునూ వదిలి వ్రాన్‌స్కీతో వెళ్లిపోతుంది. ఇద్దరూ కొన్నాళ్లు ప్రేమలోకంలో విహరించాక తిరిగొచ్చి వ్రాన్‌స్కీ ఎప్పటిలాగే తన హై సొసైటీ లైఫ్‌ని కొనసాగిస్తాడు కానీ అన్నాకి మాత్రం బయటికి వెళ్తే అవమానాలే ఎదురవుతుంటాయి. తన బిడ్డకు తల్లయిన అన్నాని వ్రాన్‌స్కీ ఎంతో ప్రేమగా చూసుకుంటున్నా ఆమె మాత్రం అతడెక్కడ తనని వదిలి వెళ్లిపోతాడోనన్న అభద్రతతో, ఒంటరితనంతో సతమతమవుతుంది. అన్నా భర్త వాళ్లిద్దరినీ క్షమిస్తాడు. ఆ మంచితనాన్నీ తట్టుకోలేక చివరికి అంతులేని వేదనతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటుంది.



నవలలోని ఇతివృత్తం ప్రేమ కథకి పరిమితం కాక పొరలుపొరలుగా మరెన్నో విషయాలను స్పృశిస్తుంది. భూస్వామ్య పెత్తందారీ, బానిస వ్యవస్థలను దాటి ఆధునికత దిశగా ప్రయాణిస్తున్న సమాజంలో సామాజిక, ఆర్థిక, ధార్మిక పరిస్థితులను చర్చిస్తుంది. రచయిత పలుకోణాల్లో భవిష్యత్ దర్శనం చేయిస్తారు. అన్నా భర్త కరెనిన్ అన్నదమ్ముల పాత్రల్ని మూడు భిన్న సాంఘిక వైరుధ్యాలతో సృష్టించి వారి మధ్య అంతరాల ద్వారా ఎన్నో విషయాలను పాఠకుల ముందుంచుతారు. అన్యోన్యంగా జీవించే ప్రేమజంట కిట్టీ- లెవిన్‌లది. వ్యవసాయదారుడైన లెవిన్ పాత్రలో రచయిత టాల్‌స్టాయ్ వ్యక్తిత్వ పోలికలు కనిపిస్తాయి. నవల పొడుగునా రైళ్లను ఒక సంకేతంలా వాడుకుంటారు టాల్‌స్టాయ్. కీలక మలుపులన్నీ అయితే రైల్లో, లేకపోతే రైల్వే స్టేషన్లో చోటుచేసుకుంటాయి. దాదాపు 150 ఏళ్ల నాటి ఈ రచన ప్రపంచ భాషలన్నిట్లోకీ అనువాదమైంది. 1911లో మొదలెట్టి 2023 వరకూ ఈ పుస్తకం ఆధారంగా సినిమాలు వస్తూనే ఉన్నాయి.

- మిహిర

ఆనంద సిరుల బోనాలు

ప్రకృతిని ప్రత్యక్ష దైవస్వరూపంగా ఆరాధించడం మన సంప్రదాయం. ప్రకృతి ఆకృతులైన జగన్మాత రూపాల ఆరాధనకు ఆషాఢమాసం తగిన తరుణం. వర్షరుతువులో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, పంటలు బాగా పండాలని, అమ్మతల్లి అనుగ్రహంతో ఆరోగ్య సౌభాగ్యం వెల్లివిరియాలని తెలంగాణలో ఆషాఢ బోనాల వేడుకలు నిర్వహిస్తారు. ఆదిశక్తి నుంచి విస్తరించిన రూపాలే గ్రామదేవతలని దేవీ భాగవతం వివరించింది. వ్యవసాయం, శ్రమశక్తిపై ఆధారపడిన కర్షకులు, కార్మికులు మాతృశక్తిని వివిధ రకాల పేర్లతో తమదైన జానపద రీతులలో ఆరాధించుకుంటారు.

ఆదిశక్తి వైభవ విలాసానికి ఆషాఢమాసం సంకేతమని దేవి మహాతంత్రం పేర్కొంది. సప్తమాతృకలు, దశమహావిద్యలు ఆషాఢంలో మరింత శక్తిమంతంగా వర్ధిల్లుతూ వరదాయక మూర్తులుగా అనుగ్రహిస్తారని కాళికా పురాణం పేర్కొంది. ఆషాఢంలో ప్రకృతిపరంగా అనేక అవరోధాలుంటాయి. వాటిని దైవశక్తితో అధిగమించడానికి పలురకాల అర్చనా సంప్రదాయాలను చేపడతారని పండితారాధ్య చరిత్ర వివరించింది. ఆషాఢంలో త్రిశక్తులను ఏకీకృతంగా ఇంద్రాణీ దేవిగా ఆరాధించాలని మణిమకుట మంజరి సూచించింది. ఆషాఢమాసానికి అధిదేవత చండీమాత కాబట్టి దీన్ని చండికామాసంగా పేర్కొంటారు. కాకతిని తమ ఆరాధ్య దేవతగా పూజించిన కాకతీయులు అమ్మవారికి ఆషాఢ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేవారు. ఆలయాల ముంగిట అన్నాన్ని రాశిగా పోసి దేవీ స్వరూపాలకు నివేదన చేసేవారు.



అంతర్యామి

జీవులకు పోషణ శక్తిని అందించే భోజనాన్ని యజ్ఞ ద్రవ్యంగా భగవద్గీత అభివర్ణించింది. ప్రాణశక్తి కారకమైన అన్నాన్ని బోనంగా ప్రకృతి శక్తులకు సమర్పించడం అమ్మతల్లి పట్ల మన విధేయతను ప్రకటించడం. జానపదుల పలుకుబడులలో భోజనమే బోనమైంది. 'మీ అనుగ్రహం వల్ల లభించిన ఈ భోజనాన్ని బోనంగా మీకు సభక్తికంగా సమర్పిస్తున్నాం నిరంతరం మా సమూహాన్ని ఇలాగే రక్షించండి' అనే వినయపూర్వకమైన వేడుకోళ్లు... ఆషాఢ బోనాలు. జంట నగరాలలో శోభాయమానంగా జరుపుకొనే అతిపెద్ద ఉత్సవం. మొదటగా గోల్కొండ జగదంబ ఆలయంలో బోనాల సంరంభం ఆరంభమవుతుంది. ఆ తర్వాత బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజా సింహవాహిని మాత మహేశ్వరి, అక్కన్న మాదన్న మహంకాళి ఆలయాల్లో ఆషాఢం బోనాల జాతర శోభిల్లుతుంది. ఉజ్జయిని మహంకాళికి నిర్వహించే బోనాల సంబరంతో ఈ వేడుక పతాక స్థాయికి చేరుకుంటుంది.

ఉజ్జయిని ప్రాంతంలో 1864లో సైన్యంలో బాధ్యతలు నిర్వహించిన సురిటి అప్పయ్య అనే భక్తుడు సికింద్రాబాద్‌లో ఉజ్జయిని మహంకాళి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి బోనాల సంప్రదాయాన్ని ప్రారంభించారు. ఘటోత్సవంతో మొదలయ్యే బోనాల జాతర సాగనంపుతో పరిసమాప్తమవుతుంది. బోనం సమర్పించే భాండం మన శరీరానికి సంకేతం. అందులో ఉన్న అన్న పదార్థం ప్రాణశక్తిని ప్రతిఫలిస్తుంది. ఆ ఘటంపై వెలిగే జ్యోతి ఆత్మదీపమై ప్రకాశిస్తుంది. ఆత్మజ్యోతిని, పరంజ్యోతితో అనుసంధానం చేసి, తమస్సు నుంచి ఉషస్సు వైపు పురోగమించడమే బోనాల వేడుకలో పరమార్థం.

- డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్


ఇది కాదా రైతులకు అవమానం?

అన్నం న నిన్ద్యాత్! అన్నం న పరిచక్షీత!

'తైత్తిరీయోపనిషత్'లోని ఈ వాక్యాల భావం ఏంటంటే- అన్నాన్ని ఎప్పుడూ నిందించకూడదు. అవమానించకూడదు. నిరసన భావంతో దాన్ని నిరాకరించకూడదు! మన పెద్దవాళ్లు చెప్పిన దాని ప్రకారం, నోట్లోకి వెళ్లే ప్రతి ఆహార పదార్థమూ అన్నమే. దాన్ని నిందించకపోవడమంటే- తినేదాన్ని పారేయడం, తొక్కుకుంటూ పోవడం లాంటివి చేయకూడదని అర్థం. ఎందుకంటే- 'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్'! అంటే, సృష్టి మొత్తానికీ మూలాధారమైన అన్నం పరబ్రహ్మ స్వరూపమని! ఆకలి తీర్చి, పనిచేయడానికి తగిన శక్తినిచ్చే అన్నమే దైవమని ప్రబోధిస్తోంది భారతీయ సంస్కృతి. అంతటి పవిత్రమైన ఆహార పదార్థాలను విసిరికొట్టడం, కాళ్ల కింద పడేసి తొక్కడం వంటి పనులు చేసేవారిది పూర్తిగా రాక్షస ప్రవృత్తి. అలాంటి రాకాసి మూకలన్నీ కలిసి వైకాపా అనే పేరు పెట్టుకుని ఆంధ్రప్రదేశ్‌లో స్వైరవిహారం చేస్తున్నాయి. రాజకీయాలకు రాచపుండు వంటి జగన్‌మోహన్‌రెడ్డి నయవంచక నాయకత్వంలో అవి ఆంధ్రప్రదేశ్‌లో అల్లకల్లోలం సృష్టించడానికి చిల్లర కుతంత్రాలకు పాల్పడుతున్నాయి. ఆ క్రమంలోనే చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో వైకాపా మూఠాదారులందరూ కలిసి బీభత్స భయానకంగా వీధినాటకాలు ఆడారు. పనిగట్టుకుని నడిరోడ్డు మీద గుట్టలకొద్దీ మామిడికాయలను పారబోయించి, వాటిని తొక్కుకుంటూ వెళ్లిన జగన్, ఆయన అనుచరులు- అసురులకు తాము ఎందులోనూ తీసిపోమని మరోసారి నిరూపించుకున్నారు!

కాకిని ఎంత కడిగినా హంస కాలేదు. ఇత్తడిని ఎంత తోమినా పుత్తడిగా మారదు. జగన్ కూడా అంతే! రాజకీయానికీ రాక్షసత్వానికీ తేడా తెలియని ఆయన- ఎంత నటించినా రైతు పక్షపాతి కాలేరు. తాను ముఖ్యమంత్రిత్వం వెలగబెడుతున్నప్పుడు ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులను మనస్ఫూర్తిగా పలకరించి ధైర్యంచెప్పిన పాపాన పోలేదేనాడూ! పొలాలకు అల్లంత దూరంలో టెంట్‌లో నీడపట్టున నిమ్మళంగా నిలబడి, అధికారులు పట్టుకొచ్చిన వరి పనలను పట్టుకుని చూసి- అదే నా పరామర్శ మీరిక పండుగ చేసుకోవచ్చంటూ అన్నదాతల నోట్లో సున్నంకొట్టిన భ్రష్టచరిత్ర వైకాపా అధినేతది. అందుకే నిరుటి ఎన్నికల్లో జనం కొట్టిన ఓట్ల దెబ్బల ధాటికి 11 సీట్లకు పడిపోయారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం కొన్నాళ్లు శోకండాలు పెట్టిన ఆయన ఇప్పుడు తన రాకాసిగణాలన్నింటినీ వెంటేసుకుని రోడ్డెక్కుతున్నారు. రైతుల మీద తనకేదో ప్రేమ ఉన్నట్లు తెగ నటించేస్తున్నారు. చుట్టూచేరిన వందిమాగధులు, సొంత పార్టీ కార్యకర్తలకే సాగుదారులనే ముసుగు వేసి, మురికి రాజకీయ రంగస్థల ప్రదర్శనలను రక్తికట్టిస్తున్నారు. మొన్నటి బంగారుపాళ్యం పర్యటనలో కూడా ఇదే స్క్రిప్ట్‌ను ఫాలో అయ్యి రైతులను దారుణంగా అవమానించారు!

కష్టానికి తగిన ప్రతిఫలం లభించనప్పుడు రైతన్నలు తమ పంట ఉత్పత్తులను రోడ్డువార కుప్పపోసి నిరసన తెలుపుతారు. అందులో తప్పుకానీ, ఆహారపదార్థాలను అగౌరవపరచడం లాంటివి ఏమీ ఉండవు. కానీ, బంగారుపాళ్యంలో జగన్ ముఠా చేసిందేంటి? ప్రభుత్వాన్ని తిట్టడంకోసమని తమ పార్టీ నేతల తోటల్లోంచి మామిడి కాయలను ట్రాక్టర్లలో తీసుకొచ్చి పారబోశారు. అది చాలదన్నట్లు మామిడి పండ్ల లోడుతో వెళ్తున్న ఓ సామాన్య రైతును అదిలించి



పుణ్యభూమి

బెదిరించి రెండు ట్రాక్టర్లు లాగేసుకుని, వాటిలోని కాయలన్నింటినీ ఆయన కళ్లముందే రోడ్డుమీద వెదజల్లారు. ఆ పండ్లను కసాబిసా తొక్కుకుంటూ వెళ్లిన కారులోంచి దిగిన జగన్- మామిడి రైతులకు న్యాయం చేయరా అంటూ తనకొచ్చిన భాషలో దీర్ఘాలు తీశారు. ఇదంతా చూస్తే- కొరివి దెయ్యాలు కారుణ్య పాఠాలు చెప్పినట్లు, తోడేళ్లు తోడి రాగం పాడినట్లు అనిపించడం లేదూ! ఇవేం పాడుపనులని నలుగురూ చీవాట్లు వేసేసరికి వైకాపా అధినేత కొత్త పిచ్చిపల్లవి అందుకున్నారు. 'మా మీద తప్పుడు మాటలు మాట్లాడతారా' అంటూ తన మురికి మీడియా ద్వారా గురివింద గింజ కబుర్లు చెబుతున్నారు. చెమటోడ్చి పండించుకున్న పండ్లను ఆ రైతు చూస్తుండగానే తొక్కిపారేసిన వారిని సైకోలంటూ చీదరించుకోక సన్మానాలు చేస్తారా మరి? రైతన్న కష్టార్జితాన్ని రాజకీయ కబేళాలో వేలాడదీసి వీరంగాలాడిన వారిని నాయకులంటే- నాయకత్వమనే పదానికి అర్థం అరాచకత్వమవుతుంది!

నిజమే... అసమ్మతి అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదే. భిన్నాభిప్రాయాలను, అసంతృప్తిని వెల్లడించడానికి నిరసన ప్రదర్శనలు నిర్వహించడం ప్రజాతంత్ర వ్యవస్థలో ప్రజల ప్రాథమిక హక్కే. దిల్లీ హైకోర్టు కూడా తాజాగా ఇదే విషయాన్ని స్పష్టంచేసింది. అలాంటి నిరసనలను ఎవరూ అభ్యంతరపెట్టరు. కానీ, తాము కుట్రచేసి శాంతిభద్రతలకు సమాధి కడుతుంటే అందరూ చప్పట్లు కొట్టాలని కోరుకోవడం జగన్ పార్టీ పెత్తందారులకే చెల్లింది. 'రప్పా రప్పా నరుకుతాం' అని బహిరంగంగా బెదిరిస్తూ, తమకు గిట్టని పత్రికలను పచ్చిబూతులు తిడుతూ, భౌతికదాడులు చేస్తూ తిరిగేవారిని నిరసనకారులంటే ప్రజా ఉద్యమాలకే సిగ్గుచేటు! జనం కళ్లకు గంతలు కట్టడంలో, నమ్మించి మోసం చేయడంలో, హామీలిచ్చి తప్పడంలో నంబర్1 అని సీఎంగా ఉన్నప్పుడే నిరూపించుకున్న వైకాపా అధినాయకుడు- ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా మేకవన్నె పులి నైజాన్ని వదులుకోవట్లేదు. రైతులను, వారి తరఫున ప్రశ్నిస్తున్న తమవారిని అసాంఘిక శక్తులంటారా అంటూ కన్నీళ్లు కార్చే మొసలి పాత్రలో ఆయన తెగ జీవించేస్తున్నారు. పర్యటనలో ఎక్కడా నిజమైన రైతులే లేనప్పుడు వారిని తిట్టారంటూ గుండెలు బాదుకోవడంలో అర్థమేమన్నా ఉందా? తన దారిన తాను పోతున్న రైతు దగ్గర నుంచి ట్రాక్టర్లు గుంజేసుకుని, దానికి వైకాపా జెండా కట్టి, పది టన్నుల కాయలను మట్టిపాలు చేసిన వారిని అసాంఘిక శక్తులనక ఆదర్శ పురుషులంటారా? 'రేయ్! పోలీస్ చెయ్యి ఒకటి నరికేయండ్రా' అని వాగినవారిని, ప్రెస్ ఫొటోగ్రాఫర్ మీద పిడిగుద్దులు కురిపించిన వారిని సంఘ విద్రోహశక్తులనక స్వాతంత్ర్య సమరయోధులంటారా? అయిదు నెలల కిందట జగన్ గుంటూరు మిర్చి యార్డుకెళ్లినప్పుడు కూడా వైకాపా కార్యకర్తలు ఇష్టారీతిన శివాలేశారు. మిరప బస్తాలను ఎక్కి తొక్కేస్తూ రైతుల కష్టాన్ని ఘోరంగా అవమానించారు. ఇవెక్కడి రాజకీయాలు? నరుకుతాం, చంపుతామంటూ ప్లకార్డులు పట్టుకుని తిరుగుతూ, స్లోగన్లు ఇస్తూ మీసాలు తిప్పుతుంటే- ప్రభుత్వమెందుకు ఆ హింసాత్మక ప్రదర్శనలను అనుమతిస్తోంది? ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న కర్కోటక మూకలను కటకటాల్లోకి తోయడం ప్రభుత్వ విధి. అందులో మీనమేషాలు లెక్కిస్తే ఏపీ పరువు పూర్తిగా పోవడమే కాదు- రాష్ట్ర భవిష్యత్తే వల్లకాడవుతుంది!

- శైలేష్ నిమ్మగడ్డ

పాకెట్‌లో పుస్తకం!

హాయ్! బుజ్జీ!!

చిన్ని, హనీ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఒకరోజు ఇద్దరూ కలిసి ఊళ్లో ఉన్న లైబ్రరీకి వెళ్లారు. అక్కడికే వాళ్ల క్లాస్‌మేట్స్ కూడా వచ్చారు. 'చిన్నీ.. మీరేంటి ఇక్కడ?' అని అడిగాడు శివ. 'బుక్స్ తీసుకుందామని వచ్చాం' అంది చిన్ని. 'ఇదుగో మేము ఒక పుస్తకం తీసుకున్నాం. అందులో భగత్‌సింగ్ గురించి బోలెడు విశేషాలున్నాయి' అన్నాడు శివ. 'అవునా.. ఏంటా విషయాలు.. మేమూ చదువుతాం ఆ పుస్తకం ఇవ్వవా?' అడిగింది హనీ. 'ఇప్పుడు ఇవ్వడం కుదరదు.. మా అన్నయ్య తీసుకుంటున్నాడు అది.. ఆ విశేషాలేంటో చెప్పనా?' అన్నాడు శివ. 'సరే.. అయితే చెప్పు' అని బదులిచ్చింది చిన్ని. 'భగత్‌సింగ్ అంటే.. స్వాతంత్ర్య సమరయోధుడని, చాలా చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన వ్యక్తి అనీ మనకు తెలుసు కదా! కానీ పెద్దగా ఎవరికీ తెలియని విశేషాలు ఇంకొన్ని ఉన్నాయి ఆయన జీవితంలో. భగత్‌సింగ్‌కు పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. స్వయంగా చాలా పుస్తకాలు రాశారు కూడా. స్వాతంత్ర్యోద్యమ సమయంలో జైలుకు వెళ్లినప్పుడు పుస్తకాలు పంపించమని వాళ్ల నాన్నగారికి ఉత్తరాలు రాసేవారట. ఎలాంటి పరిస్థితిలో ఉన్నా.. భగత్‌సింగ్ పాకెట్‌లో ఒక పుస్తకం ఉండేదట. పుస్తకం వెంట లేకుండా ఒక్కరోజు కూడా ఉండేవారు కాదు తెలుసా! అంత ఎక్కువగా చదివేవారు. అందులోని విషయాలన్నీ మళ్లీ తన స్నేహితులతో పంచుకునేవారు. అంతేకాదు.. ఆయనకు సంగీతమన్నా చాలా ఇష్టమట. అంత పోరాటభావాలున్న వ్యక్తి అయిన భగత్‌సింగ్ ఆయన మిత్రులు సుఖదేవ్, శివరాం రాజ్‌గురులను ఆటపట్టిస్తూ చాలా సరదాగా ఉండేవారు. ఇలా ఇంకా బోలెడు సంగతులున్నాయి' అని చెప్పాడు శివ. 'చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. భగత్‌సింగ్ అనగానే అందరికీ తుపాకీ, ఆయన పెట్టుకున్న టోపీనే గుర్తొస్తాయి.. కానీ ఇప్పుడు చాలా కొత్త విషయాలు తెలిశాయి. మీ అన్నయ్య చదివాక.. ఆ పుస్తకం మాకు ఇవ్వవా మేమూ చదువుతాం' అన్నారు హనీ, చిన్ని. ★



చెప్పుకోండి చూద్దాం!

నేస్తాలూ.. భగత్‌సింగ్ గురించి ఇప్పుడు కొన్ని విషయాలు తెలుసుకున్నారు కదా! ఇక్కడ ఆయనకు సంబంధించి కొన్ని ప్రశ్నలున్నాయి. వాటికి సమాధానాలు చెప్పండి చూద్దాం.

1. భగత్‌సింగ్ పుట్టినరోజు ఎప్పుడు?
2. భగత్‌సింగ్ అమ్మానాన్నల పేర్లు చెప్పండి.
3. బ్రిటిష్ వాళ్లు ఆయనను ఎప్పుడు ఉరితీశారు?

జవాబులు: 1. 28 సెప్టెంబరు 1907 2. కిషన్ సింగ్, విద్యావతి కౌర్ 3. మార్చి 23, 1931

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌పై ఉచిత వెబినార్

ఈఏపీసెట్- 2025 (గతంలో ఎంసెట్) కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల కోసం **ఈనాడు- 'చదువు', గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (GGU)**ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న (ఆదివారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో ఉచిత వెబినార్ జూమ్ ప్లాట్‌ఫామ్‌పై జరగనుంది.

ఏపీ ఈఏపీసెట్ ఛైర్మన్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, కన్వీనర్ ప్రొ. వి.వి. సుబ్బారావు.. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ కీలక అంశాలు, వెబ్ ఆప్షన్ మెలకువలు వివరిస్తారు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు పాల్గొని బ్రాంచి, కళాశాల ఎంపికలో జాగ్రత్తలు, బ్రాంచీల వారీగా కెరియర్ అవకాశాలు తదితర అంశాలపై సూచనలూ, సలహాలూ అందిస్తారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు హాజరవుతున్న అభ్యర్థులు, తల్లిదండ్రులతో పాటు కౌన్సెలింగ్‌పై అవగాహన పెంపొందించుకోవాలనుకునేవారు ఎవరైనా ఈ వెబినార్‌లో ఉచితంగా పాల్గొనవచ్చు. వెబినార్‌లో భాగస్వాములు కావాలంటే..

13-07-2025 (ఆదివారం) నాడు..

- క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

లేదా

https://bit.ly/apengwebinar
వెబ్ లింకు ఓపెన్ చేయండి
(లేదా)
zoom id- 917 6881 2223
Passcode- 478741తో
జాయిన్ కావచ్చు

మద్యం ముడుపులతో దుబాయ్‌లో కంపెనీలు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టినట్లు సిట్ గుర్తించింది. వైకాపా అధికారంలో ఉన్నప్పుడే 2021 నుంచి ఈ హవాలా దందాను మొదలుపెట్టినట్లు తేల్చింది.

నెలకోసారి దుబాయ్‌కి..

హైదరాబాద్‌లోని హవాలా ఏజెంట్ల ద్వారా మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తును వైకాపా ముఠా ఎప్పటికప్పుడు దుబాయ్‌కు చేర్చేది. ఆ సొత్తును అందుకుని అక్కడ పెట్టుబడులు, కంపెనీలు పెట్టించేందుకు కిరణ్‌కుమార్‌రెడ్డిని 2021లో మూడు సార్లు, 2022లో ఐదు సార్లు, 2023లో 13 సార్లు, 2024లో 8సార్లు దుబాయ్‌కు పంపించింది. ఇలా వెళ్లిన ప్రతిసారీ 10-15 రోజులపాటు కిరణ్ అక్కడే ఉండేవాడు. హవాలా మార్గాల్లో దుబాయ్‌కు చేర్చిన సొత్తుతో కంపెనీలు ఏర్పాటు చేసి, వాటి కార్యకలాపాలు పర్యవేక్షించేవాడు. గత ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావటం, మద్యం కుంభకోణంపై దర్యాప్తు ప్రారంభమవటంతో 2024 నవంబరు 30న కిరణ్‌కుమార్‌రెడ్డి దుబాయ్‌కి పారిపోయాడు. మద్యం ముడుపుల వసూళ్లలో కీలకంగా పాల్గొన్న అనేక మందిని దుబాయ్‌కే రప్పించి వారికి ఆశ్రయమిస్తున్నాడు.

కుంభకోణంలో కీలక వ్యక్తులకు యూఏఈ గోల్డెన్ వీసాలు

మద్యం కుంభకోణం కేసు దర్యాప్తు మొదలైన వెంటనే.. దీనిలో కీలకంగా పాల్గొన్న ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, సైఫ్ అహ్మద్, ముప్పిడి అవినాష్‌రెడ్డి, వరుణ్ పురుషోత్తం, బొల్లారం శివకుమార్, ముప్పిడి అనిరుధ్‌రెడ్డి, సైమన్ ప్రసన్, ప్రణోయ్ ప్రకాశ్ తదితరులందర్నీ వైకాపా ముఠా దుబాయ్‌కు పంపించేసింది. మద్యం డబ్బుతో వీరిలో కొందరి పేర్లతో అంతకు ముందే పెట్టుబడులు పెట్టి ఉండటంతో.. కిరణ్‌కుమార్‌రెడ్డి సహా పలువురికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు సంబంధించిన గోల్డెన్ వీసాలను ఇప్పించింది. ఇదంతా ముందస్తు కుట్ర ప్రకారమే జరిగిందని సిట్ దర్యాప్తులో తేల్చింది. దుబాయ్‌లో వారు ఈ కంపెనీలను ఎప్పుడు నెలకొల్పారు? ఎంత పెట్టుబడి పెట్టారు? అందుకు డబ్బు ఎక్కడి నుంచి, ఎలా సమకూర్చుకున్నారు? వాటిలో ఎవరెవరు డైరెక్టర్లు వంటి సమగ్ర వివరాల కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా యూఏఈ ప్రభుత్వానికి లేఖ రాయించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే కేంద్రానికి ఈ మేరకు సమాచారం పంపించారు.

10కి పైగా కంపెనీలు.. స్థిరాస్తిలో పెట్టుబడులు

మద్యం ముడుపులతో కిరణ్‌కుమార్‌రెడ్డితో పెట్టించిన పెట్టుబడులు
- దుబాయ్‌లో కే కార్ట్ లాజిస్టిక్స్ లిమిటెడ్, టెక్కర్ ట్రేడింగ్ ఎల్ఎల్‌సీ, టెక్కర్ ట్రక్ యూఏఈ, ట్రాన్స్‌పోర్ట్ ఎల్ఎల్‌సీ కంపెనీలు
- కిరణ్‌కుమార్ రెడ్డి పేరిట నెదర్లాండ్స్‌కు చెందిన హోమ్ వేవ్స్ ఆన్‌లైన్ ఫర్నిచర్ సంస్థ దుబాయ్ ఫ్రాంఛైజీ
- లండన్‌లో టెక్కర్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్ కంపెనీ
- దుబాయ్‌లో స్థిరాస్తి రంగంలోనూ భారీగా పెట్టుబడులు

సిట్ విచారణకు విజయసాయిరెడ్డి గైర్హాజరు

- 10 రోజుల్లో వస్తానని సమాచారం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన (ఏ-5) వైకాపా మాజీ నేత వి.విజయసాయిరెడ్డి సిట్ విచారణకు గైర్హాజరయ్యారు. శనివారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలంటూ ఈ నెల 10న అధికారులు ఆయనకు నోటీసులిచ్చిన సంగతి తెలిసిందే. అయితే ముందస్తుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలున్నందున తాను ప్రస్తుతం విచారణకు హాజరుకాలేనని, పది రోజుల్లో వస్తానని ఆయన సిట్ అధికారులకు సమాచారమిచ్చారు.

మా దారి.. జాతీయ రహదారి

- రూ.40 వేల కోట్లతో ఎన్‌హెచ్‌ల అభివృద్ధికి ప్రణాళిక
- ఉన్నవి విస్తరణ, కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవేల నిర్మాణంపై దృష్టి
- వేగంగా డీపీఆర్‌ల పూర్తికి కసరత్తు

ఈనాడు, అమరావతి

రాష్ట్రంలో ప్రస్తుతమున్న జాతీయ రహదారుల్లో వాహన రద్దీ అధికంగా ఉన్నవాటి విస్తరణ.. పలు మార్గాల్లో గ్రీన్‌ఫీల్డ్ హైవేల నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం.. హైవేల విస్తరణ ఆవశ్యకతను కేంద్రానికి వివరించి, వాటిని మంజూరు చేయిస్తోంది. దీంతో రూ.40 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టుల సాధ్యాసాధ్యాల అధ్యయనాలతో పాటు వాటి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు కూడా వేగంగా సిద్ధం చేసేలా ఎన్‌హెచ్ అధికారులు చర్యలు చేపట్టారు.



మూలపేట-విశాఖ గ్రీన్‌ఫీల్డ్ కోస్టల్ కారిడార్

శ్రీకాకుళం జిల్లా మూలపేట (భావనపాడు) నుంచి విశాఖపట్నం వరకు 4 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి
- ఒడిశాలోని తంగి నుంచి విశాఖపట్నం వరకు ఉన్న కోల్‌కతా- చెన్నై హైవేకి ప్రత్యామ్నాయం
- **దూరం:** 165 కి.మీ.
- **ప్రాథమిక అంచనా:** రూ.8,300 కోట్లు
- మూలపేట- విశాఖపట్నం కోస్టల్ కారిడార్‌ను ఇందులో కలిపి చేపట్టాలా? వేరుగా చేపట్టాలా అని పరిశీలిస్తున్నారు.
- **డీపీఆర్:** ఎస్ఏ ఇన్‌ఫ్రాకు బాధ్యతలు. 10 నెలల్లో సిద్ధమయ్యే అవకాశం

హైదరాబాద్- బెంగళూరు హైవే విస్తరణ

- హైదరాబాద్- బెంగళూరు మధ్య ఉన్న నాలుగు వరుసల హైవే విస్తరణ
- **దూరం:** రాష్ట్రంలో కర్నూలు నుంచి శ్రీసత్యసాయి జిల్లాలోని కొడికొండ చెక్‌పోస్ట్ వరకు 250 కి.మీ.
- **ప్రాథమిక అంచనా:** రూ.13 వేల కోట్లు
- **డీపీఆర్:** ఆర్వీ అసోసియేట్స్ రూపొందిస్తోంది. వచ్చే ఫిబ్రవరికల్లా సిద్ధం కానుంది.
- హైస్పీడ్ కారిడార్‌గా విస్తరించాలా? సమాంతరంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించాలా అనేదానిపై అధ్యయనం చేస్తున్నారు.

హైదరాబాద్-విజయవాడ హైవే

- హైదరాబాద్- విజయవాడ హైవేను 6 వరుసలుగా, కొన్నిచోట్ల 8 వరుసలుగా విస్తరణ
- **దూరం:** హైదరాబాద్ శివారు మల్కాపూర్ నుంచి విజయవాడ శివార్లలోని గొల్లపూడి వరకు 226 కి.మీ.
- **ప్రాథమిక అంచనా:** రూ.8 వేల కోట్లు
- **డీపీఆర్:** ఏఐసీవోఎన్ఎస్ ఇంజినీర్స్‌కు బాధ్యతలు. అక్టోబరుకల్లా సిద్ధం చేయాలని ఆదేశాలు
- ఇది పూర్తయితే ఈ వార్షిక ప్రణాళికలోనే విస్తరణకు పచ్చజెండా

కుప్పం నుంచి బెంగళూరుకు సులువుగా..

- కుప్పం నుంచి బెంగళూరుకు సరైన మార్గం లేదు. హైవేలో వెళ్లాలంటే కృష్ణగిరి.. అక్కడి నుంచి హోసూరు మీదుగా బెంగళూరుకు చేరుకోవాలి. ప్రత్యామ్నాయంగా కుప్పం నుంచి నేరుగా హోసూరుకు నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం
- **దూరం:** 56 కి.మీ.
- **ప్రాథమిక అంచనా:** రూ.3,100 కోట్లు
- **డీపీఆర్:** వచ్చే ఏడాది మే నాటికి సిద్ధం
- పలమనేరు నుంచి కుప్పం మీదుగా కృష్ణగిరి సమీపం వరకు 97 కి.మీ. మేర ప్రస్తుతమున్న రెండు వరుసల హైవేను నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.1,200 కోట్లు ఖర్చవుతుందని అంచనా.
- వీటితోపాటు మరికొన్ని బైపాస్‌ల నిర్మాణ ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నారు.

విజయవాడ-మచిలీపట్నం హైవే విస్తరణ

- నాలుగు వరుసల నుంచి ఆరు వరుసలుగా విస్తరణ
- **దూరం:** విజయవాడ నుంచి మచిలీపట్నానికి 61 కి.మీ.
- **ప్రాథమిక అంచనా:** రూ.2,200 కోట్లు
- **డీపీఆర్:** చైతన్య ఎంఎస్ పార్క్‌కు బాధ్యతలు. సెప్టెంబరుకల్లా సిద్ధం చేయాలని నిర్దేశం
- అప్పటికి డీపీఆర్ పూర్తయితే ఈ వార్షిక ప్రణాళికలోనే నిధులు కేటాయించి, ప్రాజెక్టును పట్టాలెక్కించే అవకాశం

నిజాంపట్నం-నారాకోడూరు హైవే

- నిజాంపట్నం నుంచి అమరావతి అవుటర్ రింగ్ రోడ్‌లో నారాకోడూరు వరకు కొత్త హైవే నిర్మాణం
- **దూరం:** 47 కి.మీ.
- **ప్రాథమిక అంచనా:** రూ.1,500 కోట్లు
- **డీపీఆర్:** సిద్ధమైంది. మూడు ఎలైన్‌మెంట్లతో ప్రతిపాదనలను ఇటీవల ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులకు పంపారు.

ఆలయాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట: మంత్రి ఆనం



మంత్రి రామనారాయణరెడ్డితో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యుడు నర్సిరెడ్డి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: సామాన్య భక్తులకు పెద్దపీట వేయడమే లక్ష్యంగా రాష్ట్ర దేవాదాయ శాఖ పనిచేస్తోందని ఆ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. '161 ఆలయాల్లో నాణ్యమైన ప్రసాదాలతో పాటు ఓంకార నాదం, మంత్రోచ్చారణలు వినిపించేలా చర్యలు తీసుకున్నాం. కామన్ గుడ్ ఫండ్ నుంచి 200 ఆలయాల పునర్నిర్మాణానికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. 300 ఆలయాలకు ధూపదీప నైవేద్యాల నిధులు విడుదల చేశాం'' అని పేర్కొన్నారు. శనివారం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్న మంత్రి ఆనం.. అనంతరం అన్నమయ్య భవనంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, దేవాదాయ శాఖ కార్యదర్శి వినయ్‌చంద్, కమిషనర్ రామచంద్రమోహన్‌తో సమావేశమయ్యారు.

గ్రహం అనుగ్రహం

13-7-2025 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం
తదియ: రా. 1-02 తదుపరి చవితి
శ్రవణ: ఉ. 7-48 తదుపరి ధనిష్ఠ
వర్జ్యం: ఉ. 11-47 నుంచి 1-22 వరకు
అమృత ఘడియలు: రా. 9-19 నుంచి 10-54 వరకు
దుర్ముహూర్తం: సా. 4-51 నుంచి 5-43 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.5.36; **సూర్యాస్తమయం:** సా.6.35

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	41.5	27.0
విజయనగరం	40.0	27.0
నెల్లూరు	39.4	29.5
ఒంగోలు	38.1	28.4
తిరుపతి	38.1	28.2
తాడేపల్లిగూడెం	37.9	27.8
విజయవాడ	37.4	26.0
విశాఖపట్నం	37.0	29.6
కడప	37.0	27.0
గుంటూరు	36.0	28.0
అనంతపురం	34.2	22.6
కర్నూలు	34.0	25.6
శ్రీకాకుళం	33.0	27.0

15, 16 తేదీల్లో ముఖ్యమంత్రి దిల్లీ పర్యటన

- అమిత్ షా, నిర్మల సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ
- మాజీ ప్రధాని పీవీ సంస్మరణ సభలో పాల్గొననున్న చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 15న దిల్లీ వెళుతున్నారు. 15, 16 తేదీల్లో ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న, ప్రతిపాదిత ప్రాజెక్టులు, వాటికి కేంద్ర ప్రభుత్వ సహకారంపై మంత్రులతో చర్చిస్తారు. 15న ఉదయం అమరావతి నుంచి బయలుదేరి దిల్లీ చేరుకున్నాక, అదేరోజు మధ్యాహ్నం అమిత్ షాతో చంద్రబాబు భేటీ అవుతారు. అనంతరం కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, దిల్లీ మెట్రో రైల్ ఎండీలతో సమావేశమవుతారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొంటారు. 16న కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో సమావేశమవుతారు. అనంతరం నార్త్ బ్లాక్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో ప్రత్యేకంగా భేటీ అవుతారు. సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్స్‌కు హాజరవుతారు. 17న ఉదయం 9.30 గంటలకు దిల్లీ నుంచి అమరావతికి బయలుదేరతారు.

జనసేన శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి అరెస్టు

- హత్యకేసులో వినుత, ఆమె భర్త సహా ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



కోటా చంద్రబాబు, వినుత దంపతులతో శ్రీనివాసులు (మధ్యలో)

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే, ఈనాడు-తిరుపతి: చెన్నైలోని కూవం నది వద్ద ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించిన వ్యవహారంలో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోటా సహా ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నై సెవెన్‌వెల్స్ ఎంఎస్ నగర్ హౌసింగ్ బోర్డు వెనుక వైపు కూవం నది వద్ద ఈ నెల 8న సుమారు 25 ఏళ్ల వయసున్న యువకుడి మృతదేహం వెలుగు చూసింది. మృతదేహంపై గాయాలు ఉండటంతో హత్య చేసి ఉంటారనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. మృతుడు శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు (22) ఎలియాస్ రాయుడిగా తెలిసింది. ఈ కేసులో జనసేన శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి వినుత, భర్త చంద్రబాబు, వారి సహాయకుడు గోపి, కారు డ్రైవరు షేక్ దాసన్, జనసేన ఐటీ వింగ్ నిర్వాహకుడు శివకుమార్‌లను అరెస్టు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు.

సెల్‌ఫోన్‌తో చిత్రీకరించాడని..

వినుత పడక గదిలో దుస్తులు మార్చుకుంటున్నప్పుడు మంచం కింద ఓ సెల్‌ఫోన్ చూశారని, అది శ్రీనివాసులుకు చెందినదిగా గుర్తించడంతో అతన్ని ఆమెతో పాటు భర్త చంద్రబాబు హెచ్చరించారని పోలీసులు పేర్కొన్నారు. వారికి సంబంధించిన ముఖ్య సమాచారాన్ని నగదు కోసం శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ ముఖ్య ప్రతినిధి అనుచరులకు ఇచ్చినట్లు తెలియడంతో జూన్ 21న యువకుడిని హెచ్చరించి పంపారు. మళ్లీ ఇటీవల అతడిని పిలిపించిన చంద్రబాబు, వినుతలు నాలుగు రోజుల పాటు తమ ఇంటిలో నిర్బంధించి కొట్టారు. ఈ నెల 7న ఉదయం 8.30 సమయంలో బాత్రూమ్‌కు వెళ్లిన శ్రీనివాసులు బయటకు రాలేదు. దీంతో తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లిన వినుత దంపతులు.. ఇనుప గొలుసుతో యువకుడి గొంతు నులిమి హత్య చేశారు. విషయం బయటకు రాకుండా అదేరోజు సాయంత్రం మృతదేహాన్ని కారులో ఉంచి, చెన్నై బయల్దేరారు. తమిళనాడు సరిహద్దులో ఆ వాహనం మొరాయించడంతో మరో కారు రప్పించి, అందులో మృతదేహాన్ని తరలించి, కూవం నది వద్ద పడేసి వెళ్లినట్లు పోలీసులు వివరించారు. శ్రీకాళహస్తిలోనూ తాము పలు ఆధారాలను సేకరించినట్లు తెలిపారు.

పదేళ్లుగా పనిచేస్తూ..: అమ్మమ్మ రాజేశ్వరితో కలిసి ఉంటున్న శ్రీనివాసులు పదేళ్లుగా చంద్రబాబు, వినుతల ఇంట్లో సహాయకుడిగా, డ్రైవర్‌గా పనిచేశాడు. జూన్ 21న అతడిని తమ డ్రైవర్‌గా తొలగించినట్లు వారు స్థానిక వాట్సప్ గ్రూపులలో పోస్ట్ చేశారు. ప్రత్యర్థులకు లొంగి, తమకు నష్టం కలిగించాడని అందులో పేర్కొన్నారు. తాజాగా అరెస్టు సందర్భంగా వినుత దంపతులు మాట్లాడుతూ 'అన్ని నిజాలూ త్వరలో వెలుగు చూస్తాయి. ఇందుకు కారణం బొజ్జల సుధీర్‌రెడ్డి' అని వ్యాఖ్యానించారు.

పార్టీ నుంచి బహిష్కరణ: హత్య ఆరోపణలు, తమ పార్టీ విధివిధానాలకు భిన్నంగా వినుత వ్యవహార శైలి ఉన్నందున ఆమెను పార్టీ నుంచి బహిష్కరించినట్లు జనసేన కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ హెడ్ వేములపాటి అజయ్‌కుమార్ ప్రకటించారు.

'జగన్ శవరాజకీయాలు మానుకోవాలి'

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీనివాసులు హత్యకు గురికావడం బాధాకరమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనపై కూడా వైకాపా అధ్యక్షుడు జగన్ శవరాజకీయం చేయాలని చూడటం సరికాదన్నారు. శ్రీనివాసులుకు అంత్యక్రియలు తానే నిర్వహిస్తామని తెలిపారు.

వివేకా హత్య కేసుపై అంతులేని తాత్సారం!

(మొదటి పేజీ తరువాయి)
ఎవరెవరు ఉన్నారో తేల్చేందుకు దర్యాప్తును కొనసాగించాలి' అంటూ తెలంగాణ హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లలో, ట్రయల్ కోర్టులో వేసిన అనుబంధ ఛార్జ్‌షీట్‌లలో పేర్కొన్న సీబీఐ.. ఆ కోణాల్లో దర్యాప్తు చేయకుండా ఆపేసింది.

డాక్యుమెంట్ల పరిశీలన దశలోనే..

■ ఈ కేసులో ఇప్పటివరకూ ఒక ప్రాథమిక ఛార్జ్‌షీట్, రెండు అనుబంధ ఛార్జ్‌షీట్‌లను సీబీఐ దాఖలు చేసింది. రెండో అనుబంధ ఛార్జ్‌షీట్ వేసి రెండేళ్లవుతోంది. ఇంకా డాక్యుమెంట్ల పరిశీలనే పూర్తికాలేదు. అభియోగాల నమోదు, విచారణకు ఇంకెంత సమయం పడుతుందో? కేసు విచారణను 6 నెలల్లోగా పూర్తిచేసేలా హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు(ట్రయల్ కోర్టు)కు ఆదేశాలివ్వాలంటూ వివేకా కుమార్తె సునీత.. తెలంగాణ హైకోర్టులో జనవరిలో పిటిషన్ వేశారు. దానిపై ఒక్కసారే విచారణ జరిగింది. తర్వాత పురోగతి లేదు.

■ కేసులో కీలక సాక్షులు, అనుమానితులు వరుసగా మరణిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షి వాచ్‌మన్ రంగన్న, ఇతర సాక్షులు కల్లూరు గంగాధర్‌రెడ్డి, వై.ఎస్.అభిషేక్‌రెడ్డి, జగన్ వద్ద వ్యక్తిగత డ్రైవర్‌గా పనిచేసిన నారాయణ యాదవ్ సహా ఆరుగురు చనిపోయారు. ఇవి సహజ మరణాలేనని, అనారోగ్య కారణాలతో చనిపోయారని చెబుతున్నప్పటికీ లోతుగా చూస్తే అనుమానాస్పదంగానే కనిపిస్తున్నాయి. ఇవన్నీ కేసుపై ప్రభావం చూపేవే అయినా సీబీఐ పట్టించుకోవట్లేదు.

అవినాష్‌రెడ్డి ఎవరితో మాట్లాడారు?

సీబీఐ తేల్చింది ఇదీ

'వివేకా హత్య జరిగిన 2019 మార్చి 15న అర్ధరాత్రి 12.27 నుంచి 1.10 గంటల వరకూ అవినాష్‌రెడ్డి వాట్సప్‌లో వాయిస్ కాల్స్, చాట్స్ చేసినట్లు అతని ఫోన్ ఐపీడీఆర్ విశ్లేషణలో స్పష్టమైంది. ఎర్ర గంగిరెడ్డి(ఏ-1), సునీల్‌యాదవ్(ఏ-2), ఉమాశంకర్‌రెడ్డి(ఏ-3), దస్తగిరి(ఏ-4) అర్ధరాత్రి 1.30 గంటలకు వివేకా ఇంట్లోకి చొరబడి ఆయన్ను చంపారు. తర్వాత సునీల్‌యాదవ్... అవినాష్‌రెడ్డి ఇంటికి వెళ్లినట్లు, అర్ధరాత్రి 1.58 గంటలప్పుడు అక్కడే ఉన్నట్లు గూగుల్ టేక్‌అవుట్ విశ్లేషణలో వెలుగుచూసింది. వేకువజామున 4.11 గంటల నుంచీ అవినాష్‌రెడ్డి వాట్సప్‌లో యాక్టివ్‌గా ఉంటూ కాల్స్, చాట్స్ చేసినట్లు తేలింది' అని సీబీఐ దర్యాప్తులో గుర్తించింది.

ఛేదించాల్సింది ఇదీ

హత్యకు ముందూ తర్వాతా అవినాష్‌రెడ్డి ఎవరితో వాట్సప్ కాల్స్ మాట్లాడారు? చాట్ చేశారనే అంశాన్ని తేల్చాల్సిన సీబీఐ ఆ దిశగా దర్యాప్తు చేయలేదు. దీనిని తేల్చగలిగితే ప్రధాన కుట్రదారు బయటపడే అవకాశముంది. అవినాష్‌రెడ్డి ఫోన్‌ను స్వాధీనం చేసుకోలేదు. హత్య తర్వాత అవినాష్‌రెడ్డి ఇంట్లో సునీల్‌యాదవ్ ఎందుకున్నాడో కూడా తేల్చలేదు.

రూ.40 కోట్లు వెచ్చించటానికి సిద్ధమైంది ఎవరు?

సీబీఐ తేల్చింది ఇదీ

వివేకా హత్యకు రూ.40 కోట్లు వెచ్చించాలని నిర్ణయించుకున్నట్లు సీబీఐ గుర్తించింది. హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఎర్ర గంగిరెడ్డి, సునీల్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరికి రూ.5 కోట్లు చొప్పున ముట్టజెబుతామని చెప్పి.. అడ్వాన్సు కింద ఒక్కొక్కరికీ రూ.కోటి చొప్పున ఇచ్చినట్లు తేల్చింది. దస్తగిరికి అందిన అడ్వాన్సులో కొంత మొత్తం మున్నా అనే వ్యక్తికి చెందిన బ్యాంకు లాకర్ల నుంచి సీబీఐ స్వాధీనం చేసుకుంది.

ఛేదించాల్సింది ఇదీ

మిగతా ముగ్గురు నిందితులకు అడ్వాన్సుగా చెల్లించిన డబ్బు ఎక్కడుందో వెలికితీసేందుకు మనీ ట్రయల్ చేపట్టాలి. అయినా ఆ పనిని చేయట్లేదు. అడ్వాన్సుగా చెల్లించిన డబ్బును ఎవరు సమకూర్చారు? అనే కోణాన్నీ ఛేదించలేదు. ఒక హత్యకు రూ.40 కోట్లు పెట్టడానికి సిద్ధమయ్యారంటే దీని వెనక ఏ స్థాయి వ్యక్తులుంటారో అర్థం చేసుకోవచ్చు. ఆ మూలాలను వెలికితీయలేదు.

సాక్షుల్ని ప్రభావితం చేస్తున్నా.. బెయిల్ రద్దు ఎందుకు కోరట్లేదు?

■ అవినాష్‌రెడ్డి ప్రస్తుతం ముందస్తు బెయిల్‌పై ఉన్నారు. అత్యంత పలుకుబడి కలిగిన ఆయన.. సాక్షుల్ని ప్రభావితం చేస్తున్నట్లు, బెదిరిస్తున్నట్లు ఇప్పటికే సీబీఐకి ఆధారాలతో అనేక ఫిర్యాదులందాయి. అయినా అతని ముందస్తు బెయిల్ రద్దు కోరుతూ సీబీఐ పిటిషన్ వేయట్లేదు. సునీత పిటిషన్ వేసినా అందులో బలమైన కౌంటర్లు దాఖలు చేయడంలేదు.

■ ఈ కేసులో ఎర్ర గంగిరెడ్డి మినహా భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి సహా ఇతర నిందితులంతా బెయిల్‌పై బయటకొచ్చేశారు. వారు సాక్షుల్ని ప్రభావితం చేస్తున్నా బెయిల్ రద్దు కోరుతూ సీబీఐ పిటిషన్లు వేయట్లేదు.

బృందమే లేదు.. దర్యాప్తు ఎలా? ఈ హత్య కేసు దర్యాప్తునకు సీబీఐ డీఐజీ కేశవరామ్ చౌరాసియా, ఎస్పీ వికాస్‌కుమార్, అదనపు ఎస్పీ ముకేశ్ శర్మ, ఇన్‌స్పెక్టర్లు ఎస్.శ్రీమతి, నవీన్ పునియా, ఎస్సై అంకిత్‌యాదవ్‌లతో సుప్రీంకోర్టు సిట్‌ను నియమించింది. ప్రస్తుతం ఈ బృందంలో ఒక అధికారి మినహా ఎవరూలేరు. ఇక దర్యాప్తు ఎలా కొనసాగుతుంది?



సిద్ధమవుతున్న పాఠశాల భవనం

అంతర్జాతీయ ప్రమాణాలతో 'లీప్' పాఠశాల

మంత్రి లోకేశ్ పర్యవేక్షణలో శరవేగంగా పనులు

అంతర్జాతీయ ప్రమాణాలతో గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం నిడమర్రులో లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఏపీ(లీప్) పాఠశాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరికి ఇది మణిహారం కానుంది. ఇప్పటికే 28 తరగతి గదులతో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలను రూ.11 కోట్లతో ఆధునికీకరిస్తూ... అత్యాధునిక వసతులతో మోడల్ పాఠశాలగా రూపొందిస్తున్నారు. 50 రోజుల్లో పూర్తి చేయాలని సంకల్పించిన పనులు తుదిదశకు చేరుకున్నాయి. మూడు బ్లాకులతో 'యు' ఆకారంలో నిర్మాణం సాగుతుండటంతో మరో 8 గదులు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. బాలబాలికలకు క్రీడా ప్రాంగణాలు, ప్రత్యేక ఆడిటోరియం, వాకింగ్ ట్రాక్, మరుగుదొడ్లను సిద్ధం చేస్తున్నారు. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేసేందుకు డైనింగ్ హాల్‌ను నిర్మిస్తున్నారు. ఇదే తరహాలో ప్రతి నియోజకవర్గంలోనూ లీప్ పాఠశాలలను తేవాలని సంకల్పించారు. నిడమర్రులో 1982లో గ్రామస్థులు, దాతల సహకారంతో 5.2 ఎకరాల్లో జెడ్పీ ఉన్నత పాఠశాల భవనాలను కట్టారు. ఆ భవనాలను కదిలించకుండా వాటిపైనే.. చూడగానే ఆకట్టుకునేలా రెండు అంతస్తులను ప్రస్తుతం కడుతున్నారు. లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పురోగతిని పర్యవేక్షిస్తున్నారు.



రూపుదిద్దుకుంటున్న గ్రంథాలయం

– ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, తాడేపల్లి

పరిశ్రమ పెట్టరు.. పైసలు కట్టరు!

(మొదటి పేజీ తరువాయి)
చెల్లించకుండా నాన్చుతోంది.

విజయగనరం జిల్లా బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఏపీఐఐసీ నిర్ణయించిన ధర చదరపు మీటరుకు రూ.2,025. అంటే ఎకరం రూ.81.93 లక్షలు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో అక్కడ ఎకరం సుమారు రూ.కోటిన్నర పైనే. అంత విలువైన భూమిని వైకాపా ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ కుటుంబానికి అప్పటి సీఎం జగన్ ఎకరం కేవలం రూ.10 లక్షల చొప్పున.. 30 ఎకరాల్ని రూ.3 కోట్లకు రాసిచ్చేశారు. ఏపీఐఐసీ లెక్కల ప్రకారం చూసినా దాని విలువ రూ.24.58 కోట్లు. అంటే రూ.21.58 కోట్ల అనుచిత లబ్ధి చేకూర్చారు. గ్రోత్ సెంటర్‌లో భూముల ధరల్ని ఏటా 10-12 శాతం పెంచుతామని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు. ఆ ప్రకారం చూస్తే బొత్స కుటుంబానికి మరింతగా అనుచిత లబ్ధి చేకూరినట్టు! బహిరంగ మార్కెట్ ప్రకారం చూస్తే ఆ భూమి విలువ రూ.45 కోట్ల పైమాటే. ఇంతా చేస్తే రెండేళ్లయినా బొత్స కుటుంబం అక్కడ పరిశ్రమ పెట్టడం కాదు కదా తట్ట మట్టి కూడా వెయ్యలేదు. సరికదా భూమికి పదో వంతు డబ్బు కూడా చెల్లించలేదు. ఇప్పటి వరకు రూ.29.99 లక్షలు మాత్రమే కట్టింది!

కూటమి ప్రభుత్వంలోనూ మీనమేషాలేనా?

నిబంధనల ప్రకారం భూమి కేటాయించిన 90 రోజుల్లోగా ఆ సంస్థ మొత్తం భూమి ధర చెల్లించాలి. కానీ సత్య బయోఫ్యూయల్స్ సంస్థ రూ.29.99 లక్షలే చెల్లించింది. 90 రోజులు గడువు పొడిగించాలని కోరింది. ఆ గడువు (2024 ఫిబ్రవరి 4తో) ముగిసి కూడా ఏడాదిన్నర అవుతోంది. వడ్డీ, జీఎస్టీ, రోడ్డు ప్రీమియం ఛార్జీలు కలిపి రూ.3.04 కోట్లు చెల్లించాలని ఏపీఐఐసీ నోటీసులిచ్చినా సంస్థ స్పందించడం లేదు. నిబంధనల ప్రకారం గడువులోగా డబ్బు చెల్లించకపోతే కేటాయింపులు రద్దు చేయొచ్చు. అయినా కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. బొత్స కుటుంబానికి భూమి కేటాయింపు అడ్డగోలుగా జరిగినా.. కనీసం ఆ మేరకు డబ్బులు చెల్లించి పరిశ్రమ స్థాపించకపోయినా భూమి ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

లీజు అన్నారు.. అప్పనంగా కట్టబెట్టేశారు

బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఖరీదైన భూములు కారుచౌకగా కొట్టేసేందుకు ఎన్నికలకు ఏడాది ముందు బొత్స పావులు కదిపారు. అక్కడ రూ.235 కోట్ల పెట్టుబడితో ఇథనాల్ బయోఫ్యూయల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, 200 మందికి ఉపాధి కల్పిస్తామని ఆయన సోదరులు బొత్స సతీష్‌కుమార్, బొత్స ఆదినారాయణ డైరెక్టర్లుగా ఉన్న సత్య బయోఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో ప్రభుత్వానికి దరఖాస్తు చేయించారు. జగన్ ఆశీస్సులతో ఆఘమేఘాలపై దస్త్రం కదిలింది. దరఖాస్తు చేసినప్పటి నుంచి నెల రోజుల వ్యవధిలోనే భూమి కేటాయించేశారు. ఆ భూమిని 33 ఏళ్లకు లీజుకు ఇస్తున్నట్లు 2023 జులై 21న జీవో ఇచ్చారు. తర్వాత ఆ భూముల్ని కంపెనీకి పూర్తి హక్కులతో విక్రయిస్తున్నట్టుగా నవంబరు 6న మరో జీవో ఇచ్చారు.

మా జీన్స్ బాగున్నాయా?

(మొదటిపేజీ తరువాయి)
తల్లిదండ్రుల్లోని క్రోమోజోమ్స్‌లో లోపాలు ఉంటే... అవి పుట్టే శిశువులకు బదిలీ అవుతాయి. అలా పుట్టిన పిల్లలు జన్యు వ్యాధుల బారిన పడతారు.

● తలసీమియా, క్లైమ్ సెల్టర్ సిండ్రోమ్, సిస్టిక్ ఫైబ్రోసిస్, సికిల్‌సెల్ ఎనీమియా, హైపో థైరాయిడిజం, ఎడ్రినల్ హైపర్‌క్లేషియా, స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీలాంటి ఎన్నో వ్యాధులకు మూలాలు జన్యువుల్లోనే ఉన్నాయి.

● డౌన్ సిండ్రోమ్ అనేది క్రోమోజోమ్ రుగ్మత. ఈవ్యాధి సోకిన వ్యక్తి 21వ క్రోమోజోమ్ జతలో తేడా ఉంటుంది. వారికి పుట్టిన పిల్లలకు ఈ వ్యాధి సోకే అవకాశం చాలా ఎక్కువ.

● కొందరికి సింగిల్ జీన్‌లో మార్పులు, మరికొందరికి పలు జన్యువుల్లో లోపాలు, ఇంకొందరిలో క్రోమోజోమ్ క్రమరాహిత్యంతో వ్యాధులు దాడి చేస్తాయి.

● కొత్తగా పెళ్లయిన జంటలకు... మేనరికం వంటిదగ్గరి సంబంధాలు చేసుకునే వారికి ముందే పరీక్షలు చేసి కౌన్సెలింగ్ చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు రక్షణ ఉంటుంది.


పుట్టిన శిశువులకు...

● శిశువు పుట్టిన 2 నుంచి 28 రోజుల లోపు రక్త పరీక్షలు చేసి వారికి జన్యు వ్యాధుల ముప్పు ఉందా..లేదా ...ముందే తెలుసుకునే అవకాశం ఉంది.

● చిన్నారి పాదం వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి జన్యువుల్లో ఏదైనా మ్యుటేషన్ కన్పిస్తే అది ఏ సమస్యకు దారి తీస్తుందనేది తెలుసుకోవచ్చు.

● పుట్టిన వెంటనే పరీక్షలు చేయడం వల్ల జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా తర్వాత పుట్టబోయే పిల్లల కోసం పక్కాగా ప్రణాళిక సిద్ధం చేసుకోవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

● రక్తక్యాన్సర్లు లాంటి వాటిని తొలి దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. మెదడు ఎదుగుదల లోపాలను కూడా చిన్నప్పుడే గుర్తిస్తే వారిని సరిదిద్దే వీలుంటుంది.



ఎక్కడెక్కడ..?

● హైదరాబాద్ బేగంపేటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టే పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు.

● నిమ్స్‌లో కూడా కొత్త జంటలకు జన్యు కౌన్సెలింగ్ చేస్తున్నారు. దగ్గర బంధువులను వివాహం చేసుకున్న జంటలు, హైరిస్క్ ఉన్నవారికి ముందే పరీక్షలు చేస్తారు.

● గర్భం దాల్చిన మూడు నెలల తర్వాత అల్ట్రాసౌండ్, ఉమ్మనీరు పరీక్షల ద్వారా పుట్టబోయే పిల్లల్లో ఎలాంటి జన్యు వ్యాధులు ఉన్నాయో గుర్తించేందుకు ఇక్కడ ఏర్పాట్లు ఉన్నాయి.

● కొన్ని రకాల టెస్టులకు నామమాత్రపు రుసుం వసూలు చేస్తారు. రిస్క్ ఉంటే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

● ప్రైవేట్‌లో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని జీనోమ్ ఫౌండేషన్ కూడా లాభాపేక్ష లేకుండా తక్కువ రుసుంతోనే ఈ తరహా సేవలు అందిస్తోంది.

● అమరావతిలోని ఎయిమ్స్‌లో జన్యు పరీక్షలు, విశ్లేషణ చేస్తున్నారు. విశాఖపట్నం ఏయూలోని జెనెటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో కూడా పరీక్షలు జరుగుతున్నాయి.

– ఈనాడు, హైదరాబాద్

స్వచ్ఛందంగానే వస్తున్నారు

మేనరికం, దగ్గర బంధువుల్లో వివాహాలు లాంటి రిస్క్ శాతం ఎక్కువ ఉన్నవారిలో నెక్స్ట్ జనరేషన్ జన్యు సీక్వెన్సీ వల్ల కూడా అన్ని రకాల వ్యాధులను గుర్తించవచ్చు. చాలామంది స్వచ్ఛందంగానే పరీక్షల కోసం ముందుకు వస్తున్నారు. నిమ్స్‌లో ఇటీవల ఈ తరహా పరీక్షలు చేయించుకునే వారి సంఖ్య పెరిగింది.

– డాక్టర్ షాగున్ అగర్వాల్, జెనెటిక్ విభాగం, నిమ్స్ ఆసుపత్రి

భయం వద్దు

పెళ్లికి ముందు, తర్వాత జన్యు పరీక్షలంటే భయం అవసరం లేదు. ఈ రోజుల్లో ఇవి సర్వసాధారణమే. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్‌లో హార్మోన్లు, డీఎన్ఏ, ఆర్ఎన్ఏ, క్రోమోజోములకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రుల జన్యువులో తేడా ఉంటే పుట్టే పిల్లల్లో 25 శాతం సమస్య ఉత్పన్నం కావచ్చు. అందుకే పిండ దశలోనే పరీక్షల వల్ల ముందే అప్రమత్తం కావచ్చు. దీంతో పుట్టిన వెంటనే జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది.

–డాక్టర్ వి.విజయలక్ష్మి, డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్, బేగంపేట

నైపుణ్యానికి విదేశీ విద్య ప్రామాణికం కాదు

(మొదటి పేజీ తరువాయి)
పనిచేయాల్సి ఉంటుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో నైపుణ్యంతో సంబంధం లేకుండా జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి వచ్చేవారికి చిన్న యూనివర్సిటీల నుంచి వచ్చేవారి కంటే మంచి స్థానాలు లభిస్తున్నాయి. ఇది అనుచితమైనప్పటికీ వాస్తవం. న్యాయవాద వృత్తిలో అడ్డదారులుండవు. నిరంతర అధ్యయనంతోనే విజయం సాధ్యమవుతుంది. రాజ్యాంగం, సివిల్ లా, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, కాంట్రాక్ట్ లా వంటి చట్టాల గురించి తెలుసుకోవాలి. కుటుంబం, స్నేహితులు, పుస్తకాలు, కార్యాలయం, ఆరోగ్యం, ఊహ అనే అంశాలను ఎప్పుడూ విస్మరించకూడదు.

కేసుల విచారణలో అసాధారణ జాప్యం..

న్యాయవ్యవస్థలో అనేక సవాళ్లున్నాయి. కేసుల విచారణలో అసాధారణ జాప్యం జరుగుతోంది. పరిష్కారానికి దశాబ్దాలు పడుతున్నాయి. అమాయకులు విచారణ ఖైదీలుగా జైళ్లలో మగ్గిపోతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి నిపుణులు కృషి చేయాలి" అని జస్టిస్ గవాయ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, ఛాన్సలర్ జస్టిస్ సుజయ్‌పాల్, యూనివర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ కార్యదర్శి అమిత్ యాదవ్, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలను సీజేఐ, నల్సార్ లా జర్నల్‌ను సీఎం ఆవిష్కరించారు. ఎల్ఎల్‌బీతోపాటు పలు డిగ్రీల్లో ఉత్తీర్ణులైన సుమారు 450 మందికి స్నాతకోత్సవంలో పట్టాలు ప్రదానం చేశారు.

15 నాటికి జాబితాలు సిద్ధం చేయండి

(మొదటి పేజీ తరువాయి)
చాలావరకు భర్తీచేయాలి. రాష్ట్రంలోని 2028 పీఏసీఎస్‌లకు గాను ఇటీవలే 491 సొసైటీలకు ఛైర్మన్, ఇద్దరు సభ్యులతో కమిటీలను నియమించారు. మిగతా వాటికి త్వరలోనే కమిటీలు వేయనున్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్ర, శనివారాల్లో పలువురు ఎమ్మెల్యేలతో ఇదే విషయమై ఫోన్‌లో చర్చించారు. ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితాలతో పాటు ఐవీఆర్ఎస్ ద్వారా కార్యకర్తల అభిప్రాయం సేకరించాక తుది జాబితాల్ని ఖరారు చేయనున్నారు.



5 నగరాలకు 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డులు

స్వచ్ఛ లీగ్ ప్రత్యేక కేటగిరీలో విజయవాడ, గుంటూరు, తిరుపతి

ప్రత్యేక కేటగిరీ మినిస్టీరియల్ అవార్డుకు విశాఖ

రాష్ట్రస్థాయి మినిస్టీరియల్ కేటగిరీలో రాజమహేంద్రవరం ఎంపిక

ఈనాడు, అమరావతి: కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్-2024 అవార్డుల్లో రాష్ట్రానికి చెందిన ఐదు నగరపాలక సంస్థలు మెరిశాయి. ఈ ఏడాది నుంచి జనాభా ప్రాతిపదికన కొత్తగా అమలుచేస్తున్న సూపర్ స్వచ్ఛ లీగ్ ప్రత్యేక కేటగిరీలో మూడు నగరాలు, జాతీయస్థాయి మినిస్టీరియల్, రాష్ట్రస్థాయి మినిస్టీరియల్ అవార్డులకు మరో రెండు నగరాలు ఎంపికయ్యాయి. సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డుల్లో 10 లక్షల కంటే ఎక్కువ జనాభా కేటగిరీలో విజయవాడ, 3-10 లక్షల్లోపు కేటగిరీలో గుంటూరు, 50వేల నుంచి లక్షలోపు జనాభా కేటగిరీలో తిరుపతి నగరపాలక సంస్థలు అవార్డులకు ఎంపికయ్యాయి. ప్రత్యేక కేటగిరీలో మినిస్టీరియల్ అవార్డుకు మహావిశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ), రాష్ట్రస్థాయి మినిస్టీరియల్ అవార్డుకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎంపికైనట్లు కేంద్రం వెల్లడించింది. కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17న దిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డులను అందిస్తారు. ప్రతిష్ఠాత్మక స్వచ్ఛ అవార్డులకు రాష్ట్రంలో ఐదు నగరపాలక సంస్థలు ఎంపిక కావడంపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.

ఇంధన స్విచ్‌ల వైఫల్యంతోనే ఘోరం

(మొదటి పేజీ తరువాయి)
ఒక పైలట్ ప్రశ్నించగా.. తాను ఆపలేదని మరో పైలట్ సమాధానమివ్వడం కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో నమోదైందని తెలిపింది. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న ఎయిరిండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ జూన్ 12వ తేదీన టేకాఫ్ అయిన వెంటనే కూలిపోయిన సంగతి తెలిసిందే. అందులోని ఒక్కరు మినహా ప్రయాణికులు, సిబ్బంది కలిపి 241 మంది మరణించారు. వారితోపాటు విమానం ఆసుపత్రి హాస్టల్‌పై కూలిపోవడంతో 29 మంది మృతి చెందారు. ఈ ప్రమాదంపై 15 పేజీల ప్రాథమిక నివేదికను విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) శనివారం విడుదల చేసింది. అయితే ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడానికి కారణమైన ఇంధన స్విచ్‌లు ఎందుకు కటాఫ్ మోడ్‌లోకి వచ్చాయన్న వివరాలను నివేదిక వెల్లడించలేదు. దీంతోపాటు బోయింగ్ 787-8 విమానాల ఆపరేటర్లపై ఎటువంటి చర్యలను ఏఏఐబీ సిఫారసు చేయలేదు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

– ఎయిరిండియా

విమాన ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఎయిరిండియా యాజమాన్య సంస్థ టాటా గ్రూపు తెలిపింది. రెగ్యులేటర్లు, భాగస్వాములతో కలిసి పని చేస్తున్నామని, ఏఏఐబీ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామని వెల్లడించింది.

■ విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికులు, సిబ్బంది, హాస్టల్‌లో చనిపోయిన వారి మా మదిలో ఎన్నటికీ ఉంటారని, దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామని బోయింగ్ పేర్కొంది.

అప్పుడే తుది నిర్ధారణకు రాలేం

– రామ్మోహన్ నాయుడు



అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఏఏఐబీ ప్రాథమిక నివేదిక అందించిందని, అయితే అప్పుడే తుది నిర్ధారణకు రావడం అపరిపక్వమవుతుందని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. 'అప్పుడే తుది నిర్ధారణకు రావొద్దు. తుది నివేదిక వచ్చే వరకూ వేచి చూద్దాం. ప్రాథమిక నివేదికలోని అంశాలు సాంకేతికమైనవి. అందుకే మనకు ఇంకా దర్యాప్తు సంస్థలున్నాయి. అవి కూడా క్లియర్ చేస్తే తుది నివేదిక వస్తుంది. అందువల్ల అప్పుడే కామెంట్ చేయలేం' అని ఆయన వివరించారు. విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏఏఐబీ అధికారులు, భారత పైలట్లు, క్యాబిన్ సిబ్బంది.. ప్రపంచంలోనే అత్యుత్తమమైన వారని తెలిపారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిర్దిష్టమైన తుది నివేదిక వచ్చే వరకూ ఏఏఐబీకి సహకరిస్తామని తెలిపారు. తొలిసారిగా బ్లాక్ బాక్సును భారత్‌లోనే, అదీ దిల్లీలోని ఏఏఐబీ ల్యాబ్‌లో తెరిచామని, డేటాను డీకోడ్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు.

నివేదికలోని అంశాలు

(మొదటి పేజీ తరువాయి)
భవనంపై పడిపోయింది.

➤ విమానాన్ని కోపైలట్ టేకాఫ్ చేశారు. పైలట్ పర్యవేక్షించారు. విమానం టేకాఫ్‌కు, కూలిపోవడానికి మధ్య సమయం కేవలం 30 సెకన్లే.

➤ యూటీసీ సమయం 08:08:39కు (భారత కాలమానం ప్రకారం 13:38:39) టేకాఫ్ అయిన విమానం 08:08:42 (13:38:42) గంటలకు 180 నాట్స్ ఐఏఎస్ వేగాన్ని అందుకుంది. ఆ వెంటనే ఒకదాని వెంట ఒకటిగా ఇంజిన్లు విఫలమయ్యాయి. 08:09:05కు (13:39:05 ఐఎస్‌టీ) పైలట్ మేడే కాల్ ఇచ్చారు.

➤ ఇద్దరు పైలట్ల మధ్య సంభాషణలోని స్వల్ప భాగాన్నే నివేదిక ప్రస్తావించింది.

➤ విమానం కూలిపోయిన ప్రాంతంలో రెండు ఇంధన స్విచ్‌లు.. రన్ పొజిషన్‌లోనే లభించాయి. దీనిని బట్టి అతి తక్కువ ఎత్తులో కూలిపోయే సమయానికి రెండు ఇంజిన్లు తిరిగి స్టార్ట్ అయినట్లుగా నివేదిక పేర్కొంది.

➤ విమానం టేకాఫ్ కాగానే ఇంజిన్లు శక్తిని కోల్పోయాయని, ర్యాట్ డిప్లాయ్ అయిందని సీసీటీవీ ఫుటేజ్‌ను బట్టి తెలుస్తోంది.

➤ పక్షులు ఢీకొన్న ఆనవాళ్లు ఏమీ కనిపించలేదు.

గోదారి పోటెత్తింది.. కృష్ణకు రంగేసింది!

(మొదటి పేజీ తరువాయి)
చుట్టూ పచ్చని కొండల మధ్య ప్రవహిస్తున్న ఈ కాలువ ఒంపుసొంపులను చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా పోలవరం కుడి కాలువకు ఈ నెల 3న నీటిని విడుదల చేయగా దాదాపు వారం రోజుల పాటు 177 కి.మీ. ప్రయాణించి ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణానదిలో కలిశాయి.

– ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం



కొండపల్లి ఖిల్లా నుంచి చూస్తే ఒంపుసొంపులతో కనిపిస్తున్న పోలవరం కుడి కాలువ

బొబ్బిలి వీణకు కేంద్రం గుర్తింపు

ఈనాడు, విజయనగరం: కేంద్రం 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి' కింద విజయనగరం జిల్లా నుంచి బొబ్బిలి వీణను ఎంపిక చేసినట్లు శనివారం వెల్లడించింది. సూక్ష్మ రూపంలో తయారు చేస్తున్న వీటిని ప్రముఖులకు జ్ఞాపికలుగా ఇస్తుంటారు. ఈ వీణలను పనస చెట్టు కలపతో తయారు చేస్తున్నారు. దిల్లీలో సోమవారం జరిగే ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ పురస్కారం అందుకోనున్నారు.



'గోకర్ణ' గుహలో రష్యా మహిళ రహస్య జీవనం

(మొదటి పేజీ తరువాయి)
సంఘాలు, ఆదివాసీల సహకారంతో తల్లీ, కుమార్తెల ఆచూకీ తెలుసుకున్నారు. వారితో మాట్లాడి ఒప్పించి బయటకు తీసుకొచ్చారు. వారిని రాయబార కార్యాలయం ద్వారా రష్యా పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ నారాయణ్ తెలిపారు. మోహి నిగూఢ జీవనానికి గల కారణాలను అధికారులు తెలుసుకుంటున్నారు. ఆమె బిజినెస్ వీసాపై 2015లోనే భారత్‌లో వచ్చారని, వీసా గడువు 2017లోనే ముగిసిపోయిందని అధికారులు ప్రాథమికంగా తేల్చారు. ఎక్కువ రోజులు గోవాలోనే గడిపిన ఆమె స్థానిక భాషలపై పట్టు సంపాదించారు. కొన్ని రోజుల కిందటే గోకర్ణకు చేరుకున్నట్లు భావిస్తున్నారు. అయితే.. మోహి భర్త ఎవరు, ఎక్కడున్నారు, ఎందుకు రహస్య జీవనం గడుపుతున్నారో తెలుసుకునేందుకు ఆమెను శనివారం రాత్రి బెంగళూరుకు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.



ఇద్దరు చిన్నారులతో మోహి

రెండు రోజుల్లో నీ తమ్ముడి సంగతి తేలుస్తా

వివేకా హత్య కేసులో నిందితుడు ఉమాశంకర్‌రెడ్డి అన్నకు ఫోన్ చేసి బెదిరింపులు

పులివెందుల, న్యూస్‌టుడే: రెండు రోజుల్లో నీ తమ్ముడి సంగతి తేలుస్తానని వైఎస్సార్ కడప జిల్లా కొండాపురం మండలానికి చెందిన రఘునాథరెడ్డి తన అన్న రమాకాంత్‌కు ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని.. మాజీ మంత్రి వివేకా హత్య కేసులో నిందితుడైన ఉమాశంకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'శనివారం రఘునాథరెడ్డి మా అన్న రమాకాంత్‌కు ఫోన్ చేశాడు. నా కుమార్తె పెళ్లికి పిలవలేదని నీ తమ్ముడు ఉమాశంకర్‌రెడ్డి నన్ను దూషిస్తున్నాడు, పరమేశ్వరరెడ్డితో కలిసి రెండు రోజుల్లో నీ తమ్ముడి సంగతి తేలుస్తానని బెదిరించాడు. గతంలో నేను జైల్లో ఉన్న సమయంలో కసనూరు పరమేశ్వరరెడ్డి నా భార్యపై దాడి చేశాడు. అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరమేశ్వరరెడ్డిని రిమాండ్‌కు కూడా పంపారు. నాపై జరుగుతున్న కుట్రను పరిశీలించి, న్యాయం చేయాలి' అని ఉమాశంకర్‌రెడ్డి పులివెందుల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు వారిద్దరినీ పిలిపించి, విచారించారు.

సూపర్ స్వచ్ఛత లీగ్‌కు విజయవాడ ఎంపిక

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో భాగంగా ఈ ఏడాది ప్రవేశపెట్టిన 'సూపర్ స్వచ్ఛత లీగ్'కు విజయవాడ నగర పాలక సంస్థ ఎంపికైంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అనుసరించే నూతన పద్ధతుల ఆధారంగా పలుమార్లు అత్యుత్తమ ర్యాంకులు సాధించిన నగరాలు, పట్టణాలను ఈ ఏడాది నుంచి 'సూపర్ స్వచ్ఛత లీగ్' పరిధిలోకి తెచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కింద 2024 సంవత్సరానికి గాను పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబర్చిన నగరాల్లో విజయవాడ చేరింది. లీగ్‌లో చేర్చేందుకు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. వాటికి మార్కులు కేటాయించారు. విజయవాడ 85 శాతం మార్కులతో ఎంపికైంది. * 2024లో బుడమేరు వరద కారణంగా నగరంలో 32 డివిజన్లు ముంపునకు గురైంది. ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. చెత్తాచెదారం, మట్టి, మురుగు తిష్ట వేసింది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. దాదాపు 8 వేల మంది కార్మికులు, వందల సంఖ్యలో వాహనాలు తెప్పించి, పేరుకుపోయిన 20 వేలకుపైగా టన్నుల వ్యర్థాలను తొలగించి తరలించేలా చర్యలు తీసుకుంది. కొద్ది రోజుల్లోనే పరిస్థితిని సాధారణ స్థితిలోకి తీసుకురావడంతో పాటు మరింత నగరాన్ని శుభ్రంగా, అందంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం, నగరపాలక సంస్థలు తీసుకున్న చర్యలే ప్రస్తుతం 'సూపర్ స్వచ్ఛత లీగ్'కు ఎంపికయ్యేందుకు కారణమైంది. ఈనెల 17న న్యూదిల్లీలో అధికారులు, ప్రజాప్రతినిధులు అవార్డు అందుకుంటారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ.. 'స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో భాగంగా మొదటిసారి ప్రవేశపెట్టిన సూపర్ స్వచ్ఛతా లీగ్ కింద నగరం ఎంపిక కావడం గర్వంగా ఉంది. నయా ముంబయి, సూరత్ నగరాల జాబితాలో విజయవాడ చేరింది. ఈ పురస్కారం నగరానిదే కాదు రాష్ట్రానిది.' అని అన్నారు. 'పురస్కారానికి నగరపాలక సంస్థ ఎంపిక కావడం సంతోషంగా ఉంది. అందుకు పారిశుద్ధ్య కార్మికులే ప్రధాన కారణం' అని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు.

SWACHH SURVEKSHAN REDUCE, REUSE, RECYCLE 2024

12,335 క్యూసెక్కుల సాగునీరు విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాలువలకు శనివారం 12,335 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 9,328, కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు 3,007 క్యూసెక్కులు ఇచ్చారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 4,717, ఏలూరు 1,404, బందరు 1,755, కేఈబీ (దివిసీమ) కాల్వకు 1,452 క్యూసెక్కుల చొప్పున అందించారు.



ఇంజినీరింగ్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్‌కు 574 మంది హాజరు

కరెన్సీనగర్: ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్ విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో శనివారం ప్రారంభమైంది. ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగాల్లో ఒకటి - 60,000 ర్యాంకుల వారికి ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలవగా.. 574 మంది వచ్చారు. ఎన్‌సీసీ విభాగంలో 464, క్రీడా విభాగంలో 110 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయసారథి తెలిపారు. ఆదివారం ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగంలో మెరిట్ ఆర్డరు 60,001 - 1,00,000 ర్యాంకులు, ఆర్మీ విభాగంలో ఒకటి - 50,000 ర్యాంకుల అభ్యర్థులు రావాల్సి ఉంటుంది. అభ్యర్థులంతా తమ ప్రత్యేక కేటగిరీ ఒరిజినల్ ధ్రువపత్రాలతో రావాలన్నారు.

బండి.. బాగుండాలండి..

★ సాంకేతికతతో వాహన ఫిట్‌నెస్ నిర్ధారణ
★ నున్నలో అధునాతన పరీక్షా కేంద్రం...

ఈనాడు, అమరావతి

"**వా**హనాల ఫిట్‌నెస్‌ను ఎంవీఐ పరీక్షించి ధ్రువీకరించే పద్ధతికి కాలం చెల్లింది. లోటుపాట్లు, అవినీతికి తావు లేకుండా.. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఆధునిక యంత్రాలతో పరీక్షించే విధానం అమల్లోకి వచ్చింది. ఈమేరకు విజయవాడ శివారులో నున్న వద్ద ఏటీఎస్ (ఆటోమేటిక్ ఫిట్‌నెస్ స్టేషన్) ఏర్పాటైంది. పీపీపీ విధానంలోని ఈ కేంద్రంలో సాంకేతికత ఆధారంగా ఇంజిన్లు, బ్రేకులు, సహా వాహన పనితీరు క్షుణ్నంగా పరీక్షిస్తారు. వాహనం పూర్తి కండిషన్‌లో ఉందని యంత్రాలు నిర్ధారిస్తేనే ఫిట్‌నెస్ పత్రం వస్తుంది."

ప్రస్తుతం వాణిజ్య వాహనాలకే

పరీక్షలన్నీ సీసీ కెమెరాల పర్యవేక్షణలో సాగుతున్నాయి. వాహనాన్ని అన్ని కోణాల్లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు. ఈ డేటా ఐదేళ్లు భద్రపరుస్తారు. ఏదైనా ఫిర్యాదు వస్తే రవాణా శాఖ అధికారులు డేటాను పరిశీలిస్తారు. ఫిట్‌నెస్ జారీలో లోపాలు తేలితే ఏటీఎస్ నిర్వాహకుడిపై చర్యలు తప్పవు. వెరసి పారదర్శకంగా పరీక్షించి ధ్రువపత్రాలు ఇస్తున్నారు. ప్రస్తుతానికి వాణిజ్య వాహనాలకే పరిమితం చేశారు.

వాహన్ వెబ్‌సైట్‌కు అనుసంధానం... వాహన పరీక్షల వివరాలను వెంటనే వాహన్ వెబ్‌సైట్ సర్వర్ లోకి పంపుతుంది. ఫిట్‌నెస్ పత్రం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు, విలువలతో పోల్చుతుంది. సరిగా ఉంటే పరీక్షలో పాస్ చేస్తుంది. విలువల్లో తేడా ఉంటే వెంటనే ఫెయిల్ చేస్తుంది. తిరిగి మరమ్మతులు చేసుకుని, ఎలాంటి లోపాలు లేకుండా బండిని మరోసారి తీసుకురావాలని సూచిస్తుంది. అన్ని విషయాల్లో వాహనం ఫిట్‌గా ఉంటే 22 నిమిషాల్లోనే పరీక్ష పాసై ధ్రువపత్రాన్ని తీసుకోవచ్చు.



9 పరీక్షలు

వాహనదారు ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. నిపుణులు వాహనాన్ని పరిశీలించి సవ్యంగా ఉంటే కంప్యూటర్ పరీక్షలకు పంపుతారు.

1 పొల్యూషన్ కాలుష్యం గుర్తించేలా టెస్ట్ నిర్వహిస్తారు.

2 స్లిప్ టెస్ట్ టైర్ల అమరికను నిర్ధారిస్తారు. షాక్ అబ్జర్వర్లు పటిష్ఠంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తారు.

3 బ్రేక్ తనిఖీ సాంకేతిక పరికరాలతో బ్రేక్ తనిఖీ చేపడతారు. ముందు, వెనుక టైర్ల బ్రేకులు సహా హ్యాండ్ బ్రేక్ పనితీరు నిర్ధారిస్తారు.

4 జాయింట్ ప్లే టైరును 45 డిగ్రీల కోణంలో లిఫ్టుల సాయంతో జరిపి ముందు, వెనుక టైర్ల అమరిక తీరును నిర్ధారిస్తారు.



హరన్ టెస్టులో..

5 హారన్ శబ్దం హారన్ వెలువరించే ధ్వని డెసిబుల్స్‌ను లెక్కిస్తారు. అధిక శబ్దం వచ్చినా.. పరీక్ష ఫెయిలే.

6 వేగం నిర్ధారణ వాహనం నిర్దేశిత వేగాన్ని సకాలంలో అందుకుంటుందా లేదా చూస్తారు. ఒకేసారి వేగం పెరగడం, హఠాత్తుగా తగ్గిపోవడమూ గుర్తిస్తారు. సరకు రవాణా వాహనం గంటకు 80 కిమీ వేగం మించకూడదు. పనితీరును కంప్యూటర్లు నిర్ధారించి ధ్రువీకరిస్తాయి.

7 అండర్ పిట్ ఇంజిన్ సహా గేర్ బాక్స్, ఇతర యంత్రాలు పనితీరును గుర్తిస్తారు.

8 స్టీరింగ్ అమరికను పరీక్షిస్తారు

9 హెడ్ లైట్లు నాణ్యత, పనితీరు పరీక్షిస్తారు.






భక్తుల సంతృప్తి స్థాయి పెరగాలి

దుర్గగుడిలో వసతుల నిర్వహణపై 37.7 శాతం అసంతృప్తి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రెండో అతిపెద్ద దేవాలయం అయిన దుర్గగుడిలో భక్తులకు కల్పించే మౌలిక వసతులపై కేవలం 63.7 శాతం మందే సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆలయ అధికారులు అప్రమత్తం అయ్యారు. 37.7 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారంటూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక రావడంతో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు. ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్య ఏర్పాట్లు, భక్తులు వేచి ఉండే ప్రదేశాలు, రవాణా సౌకర్యాలపై ఆలయంలో ఉన్న అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచిస్తూ అదనపు బాధ్యతలు అప్పగించారు. దేవాదాయ శాఖ కమిషనర్ సూచన మేరకు శనివారం ఆలయ ఈవో కె.శీనానాయక్ ఆలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తదుపరి సమావేశం నిర్వహించే లోగా కచ్చితంగా మార్పు రావాలని, భక్తుల సంతృప్తి స్థాయి పెరగాలని ఆదేశాలిచ్చారు. లేకపోతే సంబంధిత విభాగాలు చూసేవారికి శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఆలయంలోని సహాయ కమిషనర్ సీహెచ్ రంగారావు, ఆలయంలోని ఏఈవోలు బి.వెంకటరెడ్డి, ఎం.తిరుమలేశ్వరరావు, పి.చంద్రశేఖర్, ఎన్.రమేష్‌బాబు, ఎంఎస్ఎల్ శ్రీనివాస్, డా.కె.గంగాధర్‌లతో పాటు ఆలయ పర్యవేక్షకులు వై.హేమదుర్గాంబ, పి.భాగ్యజ్యోతిలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారులను సహాయకులుగా కేటాయించారు. వీరంతా ఆలయ పరిధిలోని మహామండపం ఒకటి నుంచి ఆరు అంతస్తుల్లోని వివిధ విభాగాలు, చిన్నరాజగోపురం, లిఫ్టు, కనకదుర్గానగర్, దుర్గాఘాట్ తదితర ప్రాంతాల్లోని మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, కౌంటర్లన్నింటినీ పర్యవేక్షించాలని సూచనలు జారీ చేశారు.





పేట్రేగుతున్న.. పేర్ని

★ రెచ్చగొట్టడమే మాజీ మంత్రి నాని నైజం
★ కూటమి నేతలను కించపరిచేలా వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలు, అక్రమాలతో చెలరేగిపోయిన వైకాపా నేత పేర్ని నాని.. ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తున్నారు. కూటమి కీలక నేతలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం.. అక్రమాలపై విచారణ చేసే పోలీసులపై బెదిరింపులకు దిగడం పరిపాటిగా మారింది. తాము అధికారంలోకి వస్తే.. రప్పా రప్పా అనీ... చీకట్లో పనికానిచ్చేయాలని వైకాపా కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ లాంటి వ్యవహారాల్లో అడ్డంగా దొరికిన నానిపై ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లోతుగా విచారణ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే నాని వరుసగా వైకాపా కార్యకర్తలతో ఒక్కో నియోజకవర్గంలో సమావేశాలు పెట్టడం.. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం.. రెచ్చగొట్టడం.. ఇదే పనిగా పెట్టుకున్నారు. తాజాగా ఆయన... అధికారంలోకి రాగానే చీకట్లో శత్రువులను వేసేయాలని చేసిన వ్యాఖ్యలపై బందరులో రాబర్ట్‌సన్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది.




అధికారులకు తరచూ బెదిరింపులు.. రేషన్ బియ్యం అక్రమ సరఫరా కేసులో నా భార్యను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి విచారిస్తాడా.. అని కొద్దిరోజుల కిందట పేర్ని నాని ఒంటికాలిపై లేచారు. 'ఆ సీఐ గాడు' అని పరుష పదజాలంతో సంబోధిస్తూ బెదిరింపులకు దిగారు. తాము అధికారంలోకి వచ్చాక.. వాతకు పది వాతలు ఆ సీఐకి పెడతామని బెదిరించారు. రేషన్ బియ్యం అక్రమాలకు సంబంధించిన కేసులో గోదాము యజమానిగా ఉన్న పేర్ని నాని భార్యను పోలీసులు విచారించడమే తప్పన్నట్లు ఇటీవల వారిని బెదిరించారు.

★ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కూడా కొద్దిరోజుల కిందట తీవ్రమైన పదజాలంతో పేర్ని నాని బెదిరించారు. వైకాపా నేత వల్లభనేని వంశీని ఆసుపత్రికి తీసుకొచ్చిన సమయంలో పేర్ని నాని వచ్చి నానా రభసా చేశారు. వంశీని ఇన్‌పేషెంట్‌గా చేర్చమంటే అంగీకరించలేదనే కారణంతో.. నేరుగా మత్తు వైద్యుడైన సూపరింటెండెంట్‌పై బెదిరింపులకు దిగారు. 'ఈ మత్తోడు ఎంత మందికి చెంచాగిరి చేసి, ఏమేం చేసి ఇక్కడున్నాడో? చంద్రబాబు, లోకేశ్‌కు చెంచాగిరీ చేస్తున్నాడు. దగుల్బాజీ పనులు చేయబట్టే ఉన్నాడు. ఈ మత్తోడు ఇంతకింతా అనుభవించే రోజు వచ్చి తీరుతుందని' దారుణంగా కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు.

ప్రజాప్రతినిధులను కించపరుస్తూ.. నకిలీ పట్టాల పంపిణీకి సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా తన దగ్గరికి అరెస్టు చేయడానికి వచ్చే ధైర్యం ఎవడికుంది? ఎవడొస్తాడు? వాళ్లు శునకానందం పొందడం తప్ప ఏమీ చేయలేరని.. . ప్రజాప్రతినిధులు, అధికారులను రెచ్చగొట్టేలా ఇటీవల మాట్లాడారు. తనను అరెస్టు చేస్తే కొల్లు రవీంద్ర కళ్లలో ఆనందం కనిపిస్తుందంట.. అతను ఎంత శాడిస్టో అర్థమవుతోందని.. కించపరిచారు. 'కొల్లు రవీంద్రా.. నువ్వు ఎన్ని ఆబోతు రంకెలేసినా.. నీకు జడిసేదే లేదు. కేసు పెట్టి.. ఎన్నాళ్లు లోపల ఉంచుతావ్, నెల.. ఐదారు నెల్లా..?, మరోసారి చెబుతున్నా.. ఏయ్ కొల్లు రవీంద్రా.. పేర్ని నాని వెయిటింగ్ ఇక్కడ.' అని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ★ తాజాగా పామర్రు సమావేశంలో మంత్రి లోకేశ్‌ను ఏకవచనంతో సంబోధిస్తూ.. పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేశారు.

★ మరో మంత్రి అచ్చెన్నాయుడిని సైతం కించపరిచేలా పేర్ని నాని తాజాగా పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'తాము అధికారంలో ఉండగా మాజీ మంత్రి ఒకడిని అరెస్టు చేసి తీసుకొస్తే, వాడికి ఏముందో తెలియదు. కానీ.. ఫైల్స్‌కు ఆపరేషన్ జరిగింది, ప్రాణాలు పోతున్నాయని చంద్రబాబు నుంచి అందరూ లబలబలాడిపోయారు.' అని పేర్ని ఎగతాళి చేశారు.





డిపార్చర్ బ్లాక్‌వైపు ఇలా కుర్చీలు అడ్డుపెట్టి..


మరుగుదొడ్ల నుంచి సైతం వాడిన నీరు లీకవుతూ ఇలా..


నలుగురు నడిచే బాట.. ముక్కు మూసుకోవాల్సిందేనట

46 ఫ్లాట్‌ఫాంలతో ఆసియాలోనే రెండో అతి పెద్దది విజయవాడ పండిట్ నెహ్రూ ఆర్టీసీ బస్టాండ్. నిత్యం లక్షల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సుల ద్వారా అక్కడికి చేరుకునే ప్రయాణికులకు ఆగమనం, వెళ్లేవారికి నిర్గమనం అని రెండు బ్లాక్‌లు ఉన్నాయి. ఈ రెండింటిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు బస్సుల మధ్య నుంచి ప్రమాదకరంగా వెళ్లకుండా వీటిని అనుసంధానిస్తూ భూగర్భ మార్గం ఏర్పాటుచేశారు. అయితే ఈ దారిలోకి పైన ఉన్న మూత్రశాలల నుంచి లీకవుతున్న నీరు చేరడంతో దీనిని మూసివేసి సుమారు నెలరోజులు కావస్తోంది. అయినా కూడా దీనిని పరిష్కరించడంలో అధికారుల అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఆర్టీసీ ఛైర్మన్, ఎండీ మొదలు అందరు ఉన్నతాధికారులు కొలువుదీరిన పీఎన్‌బీఎస్ బస్టాండ్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. -ఈనాడు, అమరావతి

కట్టేరులో మునిగి రైతు దుర్మరణం


శ్రీనివాసరావు (పాతచిత్రం)

అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని అమ్మిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పులిబండ్ల శ్రీనివాసరావు(54) అనే రైతు శనివారం సాయంత్రం కట్టేరు నీటిలో మునిగి దుర్మరణం చెందారు. తెదేపా నాయకులు టి.నాగేశ్వరరావు, సీహెచ్.బసవయ్య తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసరావుకు కట్టేరు అవతల మాగాణి భూమి ఉంది. నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన నారుకు మందు చల్లేందుకు గాలి ట్యూబ్ సాయంతో కట్టేరులో నీటిని దాటి పొలానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గంగదేవిపాడు డ్యామ్ సమీపంలో కట్టేరులో దిగి తిరిగి ఇంటికి వచ్చే ప్రయత్నంలో నీటి మధ్యలో ట్యూబ్ జారిపోయి మునిగిపోయి గల్లంతయ్యారు. సమాచారం తెలియగానే గ్రామస్థులు కట్టేరు వద్దకు చేరుకుని గాలించి అతడి మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీసి ఇంటికి తీసుకువచ్చారు. భార్య అంజమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. పలువురు తెదేపా నాయకులు శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



జిల్లా జైలు సందర్శన


దుస్తులు పరిశీలిస్తున్న న్యాయమూర్తులు గోపి, సత్యానంద్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: విజయవాడ జిల్లా జైలును శనివారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ గోపి, సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, విజయవాడ మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ ఎ.సత్యానంద్ తదితరులు సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వారికి అందిస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. ఖైదీలు నిర్వహిస్తున్న బట్టి కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య, నాల్గో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రిషిక్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో 28.6 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. జగ్గయ్యపేట 28.6 మి.మీ., రెడ్డిగూడెం 22.4, మైలవరం 16.4, గంపలగూడెం 12, వత్సవాయి 10.8, పెనుగంచిప్రోలు 7.8, కంచికచర్ల 6.4, ఇబ్రహీంపట్నం, ఎ.కొండూరు 6.2, విస్సన్నపేట 5, వీరులపాడు, జి.కొండూరు 4, చందర్లపాడు 2.4, నందిగామలో 0.4 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది. సగటు వర్షపాతం 6.63 మి.మీ.గా ఉంది.

మాటలతో మోసగించి.. నగదుతో ఉడాయించి..


యశ్వంత్ తమ్ముడు దీపక్ (పాత చిత్రం)

కృష్ణలంక, న్యూస్‌టుడే

కార్లు తాకట్టు పెట్టి నగదు తీసుకుని మోసానికి పాల్పడ్డ ఘటనలో కృష్ణలంక పోలీసులకు చిక్కిన యశ్వంత్.. మరికొంతమందిని మోసగించి పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసినట్లు తేలింది. నెల్లూరు జిల్లా ఉలవపాడుకు చెందిన యశ్వంత్, అతడి తమ్ముడు దీపక్, తండ్రి శ్రీనివాసరావు.. వివిధ మోసపూరిత విధానాలతో హైదరాబాద్, విజయవాడ, రేపల్లె, హనుమాన్‌జంక్షన్, తాడేపల్లి, మంగళగిరి తదితర ప్రాంతాల్లో రూ.కోట్లు వసూలుకు పాల్పడ్డారు. వారిని మీడియాకు చెందిన వ్యక్తిగా చెప్పుకునే దేవ్ నడిపిస్తున్నట్లు తెలుస్తుండగా.. అతడితో సుమారు 90కి పైగా యూపీఐ లావాదేవీలు జరిపి సుమారు రూ.31,93,500 చెల్లించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కొందరు బాధితులు శనివారం కృష్ణలంక పీఎస్‌కు రాగా.. వారిని తమ పరిధిల్లోని స్టేషన్లకు పంపించారు.

రూ.30 లక్షలతో పరారీ



దీపక్, యశ్వంత్‌ల తండ్రి శ్రీనివాసరావు 2019లో హనుమాన్‌జంక్షన్‌లో ఆన్‌లైన్ స్టోర్ ప్రారంభించాడు. మార్కెట్ కంటే తక్కువకు వస్తువులు ఇస్తారన్న ఆశతో 2022లో వారి వద్దకు వెళ్లాను. దీపక్ నా దగ్గర రూ.30 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు ఇవ్వలేదు. - ముప్పాళ్ల తిలక్, హనుమాన్‌జంక్షన్

చాలామంది మోసపోయారు



2022లో సరకుల నిమిత్తం వారి వద్దకు వెళ్లాను. దీపక్‌కు రూ.6 లక్షలిచ్చాను. తిరిగి ఇవ్వకపోవడంతో అతని తండ్రి శ్రీనివాసరావును అడిగితే తనకు సంబంధం లేదన్నాడు. తరువాత ఊరు విడిచి వెళ్లిపోయారు. నాలా సుమారు 10 మంది మోసపోయారు. - రమేష్, హనుమాన్‌జంక్షన్

ఒకరికి తెలియకుండా ఒకరు..




పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లిస్తే తక్కువకు సరకు వస్తుందని నమ్మించారు. నమ్మి రూ.3.50 లక్షలు ఇచ్చాను. రూ.50 వేల సరకులు ఇచ్చారు. డబ్బుల గురించి అడిగితే ఇవాళ.. రేపు అని తిప్పారు. ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద డబ్బులు తీసుకున్నారు. - కొత్త శ్రీనివాసరావు, హనుమాన్‌జంక్షన్

రూ.30 లక్షలు తీసుకున్నారు

నేను కార్లను అద్దెకు ఇస్తుంటాను. అన్నదమ్ములిద్దరూ కారు అద్దెకు తీసుకుని మరునాడు వచ్చి అద్దె చెల్లించారు. అలా వారితో పరిచయం పెరిగింది. ఇద్దరు రూ.30 లక్షలు నా వద్ద తీసుకున్నారు. దొంగతాళాలతో నా కార్లను తీసుకెళ్లిపోయారు. వారిపై పటమట పీఎస్‌లో ఫిర్యాదు చేశాను. డబ్బులివ్వమని గట్టిగా మందలిస్తే యశ్వంత్ నా ఇంటికి వచ్చి నాపై చేయిచేసుకున్నాడు. - రవళి, న్యూఆర్టీసీ కాలనీ, విజయవాడ

బంగారంతో పారిపోయాడు



రవళి ద్వారా నాకు యశ్వంత్ పరిచయం అయ్యాడు. గత జనవరిలో నా దగ్గరికొచ్చి బంగారం తాకట్టులో ఉందని స్లిప్ చూపించాడు. బతిమలాడితే రూ.3 లక్షలు చెల్లించి బంగారాన్ని విడిపించాను. తరువాత నాకు తెలియకుండా బంగారంతో పరారయ్యాడు. -వి.శివరామకృష్ణ, న్యూఆర్టీసీ కాలనీ, విజయవాడ

రాజధాని భూ సమీకరణపై విమర్శలు అర్థరహితం

మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు


మాట్లాడుతున్న వసంత నాగేశ్వరరావు

ఐతవరం (నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: రాజధాని కోసం తాజాగా చేస్తున్న భూ సమీకరణపై విమర్శలు అర్థరహితమని మాజీ హోం మంత్రి, తెదేపా సీనియర్ నాయకుడు వసంత నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరంలోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజధానికి వేల ఎకరాల భూమి ఎందుకని ఓ సీనియర్ నాయకుడు అడుగుతున్నారని, విజన్-2047 లక్ష్యంతో రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి భూమి అవసరమని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావును ఉద్దేశించి పరోక్షంగా అన్నారు. భూములిచ్చిన రైతులకు [illegible] చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు 35 వేల ఎకరాలు సమీకరించాలని నిర్ణయించారని, రాజధాని ప్రాంతంలో విమానాశ్రయం, విశ్వవిద్యాలయాలు, క్రీడా వసతులు, ఐటీ తదితర పరిశ్రమలు ఏర్పాటు చేస్తేనే యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఉమ్మడి ఏపీ సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడు హైదరాబాద్‌లో వేల ఎకరాల భూములను అందుబాటులో ఉంచడం వల్లే ఆ తరువాత వచ్చిన ముఖ్యమంత్రులు పరిశ్రమలు, సంస్థలు, విద్యాలయాలు ఏర్పాటు చేయగలిగారని అన్నారు. [illegible] ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులు నిర్మించాలని అన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందని, జగన్ వైఖరి వల్ల రాష్ట్రానికి [illegible]. వైకాపా అయిదేళ్ల పాలనలో జగన్ ప్రజల వద్దకు వెళ్లకుండా చరిత్రలో నిలిచారని, ప్రస్తుతం ఎక్కడికెళ్లినా అరాచకం సృష్టిస్తున్నారని విమర్శించారు. వైకాపాకు చెందిన మాజీ ఎంపీ అనుచరులు రాజధాని ప్రాంతంలో ఇనుము, కంకర, తూములు దోచుకున్నారని ఆరోపించారు.

'నాతో సన్నిహితంగా ఉండకపోతే చచ్చిపోతా'

కృష్ణలంక, న్యూస్‌టుడే: తనతో సన్నిహితంగా ఉండకపోతే చచ్చిపోతానంటూ యువకుడిని వివాహిత బెదిరించిన ఘటన కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... కృష్ణలంక ప్రాంతానికి చెందిన సుమారు 40 ఏళ్ల వివాహితకు భర్త, సంతానం ఉన్నారు. అదే ప్రాంతానికి చెందిన యువకులతో ఆమెకు పరిచయం ఉంది. వారితో చనువుగా ఉంటూ పార్టీల్లో పాల్గొంటుంది. కనకదుర్గ నగర్‌కు చెందిన 28 ఏళ్ల యువకుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. ఇటీవల అతడు కృష్ణలంక ప్రాంతానికి చెందిన స్నేహితులతో కలిసి పార్టీలో పాల్గొన్నాడు. అదే పార్టీకి వివాహిత హాజరై యువకుడిని పరిచయం చేసుకుంది. ఎక్కడ ఉంటున్నావని అడిగింది. తాను కనకదుర్గ నగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నట్లు చెప్పాడు. అనంతరం వివాహిత అతడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుంది. అప్పటి నుంచి యువకుడికి ఫోన్లు చేస్తూ.. మాట్లాడుతోంది. కొన్ని ఇబ్బంది కలిగించే సందేశాలను పంపిస్తూ ఉండేది. ఆమె ఫోన్లు, సందేశాలతో విసిగిపోయిన యువకుడు.. ఆమె కాల్ చేస్తే లిఫ్ట్ చేయడం మానేశాడు. దాంతో ఆమె తనతో సన్నిహితంగా ఉండకపోతే చచ్చిపోతానని బెదిరించింది. ఆందోళన చెందిన యువకుడు శనివారం కృష్ణలంక పోలీసులను ఆశ్రయించి విషయాన్ని వివరించాడు. ఇద్దరినీ స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరూ పరస్పరం ఫోన్లు చేసుకున్నా.. సందేశాలు పంపించుకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రకాశం పంతులు విగ్రహం కూడలి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని ఓ మహిళ (50) మృతి చెందినట్లు సత్యనారాయణపురం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సాయంత్రం 4 గంటల సమయంలో బస్ స్టేషన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సు.. ప్రకాశం పంతులు కూడలిలో మలుపు తిరుగుతూ ఒక మహిళను ఢీ కొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు సత్యనారాయణపురం స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.


ధ్వంసమైన గోడ వద్ద చిన్నచిన్న రాళ్లు అడ్డుపెట్టి..


కొండరాళ్లు దొర్లుకుంటూ రోడ్డుపైకి వస్తున్నాయిలా

జారుతున్న బండలు అదురుతున్న గుండెలు

ఇటీవల కురిసిన వర్షాలకు కొండపల్లి ఖిల్లా ఘాట్ రోడ్డులో కొండ రాళ్లు విరిగి పడుతున్నాయి. పడిన రాళ్లు ఘాట్ రక్షణ గోడలను ఢీకొనడంతో అక్కడక్కడా అవి ధ్వంసమైపోయాయి. ఖిల్లా కొండపైకి వెళ్లే వాహనచోదకులు వేగంగా కొండను ఎక్కే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. రెండు చోట్ల ధ్వంసమైన చోట రాళ్లు అడ్డు పెట్టినా చోదకులకు కనిపించడంలేదు. మరోచోట దెబ్బతిన్న గోడలను అలాగే వదిలేశారు. రాళ్లు దొర్లుకుంటూ రోడ్డుపైకి వస్తుండడంతో కొండపైకి వెళ్లే చోదకులు, సందర్శకులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. -ఈనాడు, అమరావతి

ఉపాధ్యాయులకు ప్రయోజనాలు అందిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్. వేదికపై హైమారావు, శ్రీనివాసరాజు, డాక్టర్ రామకృష్ణ, అశోక్‌బాబు తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శనివారం గవర్నర్‌పేటలోని స్వాతంత్య్ర సమరయోధుల భవనంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు అధ్యక్షత వహించారు. ఆలపాటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఉపాధ్యాయులను ఎంతో మానసికంగా వేధించిందని, వారి ఆర్థిక సౌలభ్యాలను చాలా తగ్గించిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు అన్ని రకాల ప్రయోజనాలు వస్తాయని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు మాట్లాడుతూ.. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నిర్మాణాత్మకంగా అన్ని జిల్లాల్లో శాఖలు ఏర్పాటు చేసి.. ఒక బలమైన సంఘంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా 100 శాతం పూర్తి చేశామని వివరించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ.. మినిమం టైం స్కేల్, ఉపాధ్యాయులు వారి సొంత మండలాల్లో పనిచేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. పీఆర్సీ కమిటీ వేయాలని సూచించారు. విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా చేసి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు.. విద్యా, ఆర్థిక, సామాజిక అంశాలపై పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. కార్యక్రమంలో 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు


ఈగల్ డైరెక్టర్ రవికృష్ణకు బుద్ధుని ప్రతిమ అందిస్తున్న ప్రిన్సిపల్ సునీత, చిత్రంలో డీసీపీ సరిత, రమణ

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఎంతో ఉజ్వల భవిష్యత్తు, దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యే యువత మత్తు పదార్థాలకు బానిసగా మారొద్దని, అనుకున్న లక్ష్యాల సాధనకు శ్రమించాలని ఈగల్ డైరెక్టర్ ఆకే రవికృష్ణ అన్నారు. విజయవాడ పాలిక్లినిక్‌రోడ్డులోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో 'మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువతలో వచ్చే దుష్ఫలితాలు' అనే అంశంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల శారీరకంగా, మానసికంగా ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా శ్రద్ధగా చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. అడ్మిన్ డీసీపీ సరిత మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రమశిక్షణ, సేవా భావం కలిగి సమాజానికి విద్యార్థి ఆదర్శంగా నిలవాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచంటి సునీత, కార్యక్రమ సమన్వయకర్త జి.రమణ తదితరులు పాల్గొన్నారు. ☛ సిద్ధార్థ ఫార్మసీ, నలంద విద్యానికేతన్ సమీపంలోని పాన్ దుకాణాలను రవికృష్ణ, సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయాలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న నాలుగు దుకాణాల యజమానులకు జరిమానా విధించారు. మళ్లీ విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ధర వరలు

వంకాయలు-28, టమాటా-32, బెండ-22, పచ్చిమిర్చి-65, కాకర-42, బీర-32/40, క్యాబేజి-22, క్యారెట్-32/44, దొండ-28, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుళ్లు-36, దోస-20, సొర-12/15, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-32, అల్లం-60, మునగ-7/8, ఆకు కూరలు (కట్ట)-3, బీట్ రూట్-30, కీరదోస-50, బీన్స్-90/105, క్యాప్సికమ్-85, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/15, పుదీనా-5/15, ముల్లంగి-10, (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

కుక్క తెచ్చిన వివాదం

నడి రోడ్డుపై రెండు వర్గాల కొట్లాట
ఓ వర్గంలో వైకాపా నేత, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు


ఘర్షణ పడుతున్న ఇరు వర్గాలు

పటమట, న్యూస్‌టుడే: తన మనవరాలని కళాశాల బస్సు ఎక్కించేందుకు తాత వెళ్తుండగా.. ఓ యువకుడు జాగింగ్‌కు తీసుకువచ్చిన కుక్క వారి మీదకు వెళ్లడంతో వివాదం చోటుచేసుకున్న ఘటన విజయవాడలోని రామలింగేశ్వరనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఈ నెల 11వ తేదీ ఉదయం రామారావు తన మనవరాలిని కళాశాల బస్సు ఎక్కించడానికి తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో వారి ఇంటి సమీపంలో నివసించే అభి అనే యువకుడు జాగింగ్ కోసం తీసుకువచ్చిన కుక్క యువతి మీదకు వచ్చింది. దాంతో వారి మధ్య వివాదం చెలరేగింది. అప్పటికే వారి మధ్య పాత గొడవలు ఉండడంతో ఇరువర్గాలకు చెందిన సుమారు 20 మంది అక్కడికి చేరుకుని నడి రోడ్డుపై పరస్పరం చేతులతో దాడి చేసుకున్నారు. తన కుమార్తెను ఏడిపించి, తన తండ్రిపై దాడి చేశారని శ్రీనివాసరావు.. తనపై అకారణంగా దాడి చేశారని అభి పటమట పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పటమట సీఐ పవన్ కిషోర్ తెలిపారు. ఒక వర్గం వైపు వైకాపా నేత, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, మరోపక్క జనసేన సానుభూతిపరులు ఉన్నారు.

ఇన్నింగ్ ఆధిక్యంతో కృష్ణా జట్టు విజయం


ఎం.ధావిన్ (4/24)

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ సెంట్రల్ జోన్ అండర్-16 మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో భాగంగా మంగళగిరి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కృష్ణా జట్టు.. పశ్చిమ గోదావరి జట్టుపై ఇన్నింగ్ ఆధిక్యం కనబరిచి ఏడు పాయింట్లు తన ఖాతాలో జమ చేసుకుంది. పశ్చిమ గోదావరి జట్టు 67 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో మూడో రోజైన శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించి 50.4 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటైంది. ప్రత్యర్థి బౌలర్లు వై.లలిత్ (3/18), జి.గౌతమ్ (3/40) మెరిశారు. ఫాలోఆన్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు 59.1 ఓవర్లలో 150 పరుగులకు కుప్పకూలింది. ప్రత్యర్థి బౌలర్ ఎం.ధావిన్ (4/24) మెరిశాడు. కృష్ణా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 540 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దాంతో కృష్ణా జట్టు 235 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

☛ పేరేచర్లలో జరిగిన మరో మ్యాచ్‌లో గుంటూరు జట్టు 288 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో శనివారం తొలి ఇన్నింగ్ బ్యాటింగ్ కొనసాగించి 115.3 ఓవర్లలో 406 పరుగులకు ఆలౌటైంది. ప్రత్యర్థి బౌలర్ డి.గణేష్ (5/108) మెరిశాడు. రెండో ఇన్నింగ్ బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. జట్టులో టి.శశాంత్ (71) రాణించాడు. ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్‌లో 474 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్ ఆధిక్యం సాధించడంతో మూడు పాయింట్లు, గుంటూరు జట్టు ఒక పాయింటు తమ ఖాతాల్లో జమ చేసుకున్నాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో ||కి రూ.లలో)


వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -97 రిటైల్ ధర 119 చికెన్ విత్ స్కిన్ - 173, చికెన్ స్కిన్‌లెస్ - 196.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 103, 111, 122 చికెన్ విత్ స్కిన్ - 196 చికెన్ స్కిన్‌లెస్ - 206.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 515 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

నిప్పులు చెరిగిన బౌలర్లు

విజయవాడ (మధురానగర్), న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి విజయవాడకు మెథాంపెటమిన్ (మెత్) అనే మాదకద్రవ్యాన్ని తీసుకువచ్చిన ముగ్గురు యువకులను అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి 5.2 గ్రాముల సరకు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇక్కడి న్యూరాజరాజేశ్వరిపేట వారధికి 9వ లైనులో అనుమానాస్పదంగా తిరుగుతున్న అంబాపురానికి చెందిన శివకుమార్ కౌశిక్ (21), హైదరాబాద్‌కు చెందిన దేశబోయిన ఆకాష్ (23), కోనసీమ జిల్లా కపిలేశ్వరపురానికి చెందిన గొర శ్రీరాం వెంకట మణికంఠ (24)లను అదుపులోకి తీసుకుని విచారించడంతో అది వెలుగుచూసింది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న 'మెత్'

ఇంజినీరింగ్ చదివి..

ఆకాష్, వెంకట మణికంఠలు 2023-24లో ఇంజినీరింగ్ చదివారు. ఆకాష్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మణికంఠ కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అవ్వడంతో.. విజయవాడలో ఉంటూ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో అతడు అప్పుడప్పుడు బెంగళూరు వెళ్లేవాడని పోలీసులు గుర్తించారు. అక్కడ పబ్‌లో పరిచయమైన వ్యక్తి నుంచి మెత్ తెచ్చి విజయవాడలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇలా 5.2 గ్రాముల తీసుకొచ్చారు. ఇందులో అర గ్రాము ఆకాష్ కొనుగోలు చేశాడు. వీరిద్దరికి పరిచయమున్న కౌశిక్ కూడా మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డాడు. వీరంతా కలిసి ఇతరులకు మెత్‌ను విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్, అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి సరకు స్వాధీనం చేసుకున్నారు.

బెంగళూరు ముఠాపై ఆరా

మణికంఠ బెంగళూరు నుంచి మెత్ తెస్తున్నట్లు గుర్తించిన పోలీసులు.. ఎక్కడి నుంచి తీసుకువస్తాడో వివరాలు సేకరిస్తున్నారు. అతడి చరవాణిలో కీలకమైన సమాచారం దొరికింది. దీని ప్రకారం బెంగళూరు కేంద్రంగా ఒక పెద్ద ముఠానే మాదకద్రవ్యాల దందా కొనసాగిస్తున్నట్లు గుర్తించారు. ఆ ముఠా గురించి ఆరా తీశారు. బెంగళూరులో పబ్‌ల కేంద్రంగా పెద్ద ఎత్తున మాదకద్రవ్యాల విక్రయం సాగుతుంటుంది. అక్కడి ముఠాతో మణికంఠకు ఏమైనా సంబంధం ఉందా? అనే దానిపై విచారణ చేస్తున్నారు. ఇప్పటికే గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న ఎన్టీఆర్ జిల్లా పోలీసులు.. తాజాగా మాదకద్రవ్యాల ముఠాల గుట్టు రట్టు చేస్తున్నారు.

సొమ్మంతా... ఎక్కడికి తరలింది?!

- అద్విక కుంభకోణంలో బ్యాంకు ఖాతాల పరిశీలన
- కీలక వ్యక్తుల ఆస్తుల చిట్టా తీస్తున్న పోలీసులు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - పటమట: అధిక వడ్డీ ఆశచూపి అద్విక ట్రేడింగ్ పేరుతో రూ.కోట్లలో వసూలు చేసిన సొమ్ము ఎక్కడికి తరలిపోయిందనే కోణంలో పోలీసులు దృష్టి సారించారు. ఇప్పటికే సంస్థతోపాటు ఏజెంట్ల బ్యాంకు ఖాతాలు, వారి లాకర్లను కూడా ఫ్రీజ్ చేశారు. ఖాతాల్లోని ప్రతి లావాదేవీని క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు. ఎప్పుడు ఎంత బదిలీ అయింది ఎంత? అనే లెక్కలు తీస్తున్నారు. పలువురు ఏజెంట్లు దక్కిన దాని కంటే పెద్ద మొత్తంలో కమీషన్ పొందేవారని గుర్తించారు. ఇలాంటి వారిని పిలిపించి ఆరా తీసి ఆ మొత్తాన్ని రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ సొమ్మును బాధితులకు ఇప్పించనున్నట్లు తెలిసింది. బాధితులకు న్యాయం చేసేలా అడుగులు వేస్తున్నారు. డిపాజిటర్ల నుంచి రూ.328 కోట్ల వరకు వసూలు చేసినట్లు ప్రాథమికంగా పోలీసులు అంచనా వచ్చారు. ఇందులో రూ.210 కోట్లు డిపాజిటర్లకు చెల్లించినట్లు తేలింది.

ఖజానా బ్యాంకులో చిక్కుకుపోయిన సొమ్ము

దుబాయ్‌లోని ఖజానా బ్యాంకులో ట్రేడింగ్ పేరిట ఖాతాలు తెరిచారు.. ఆదిత్య.. ప్రారంభంలో రూ.45 కోట్లు పెట్టుబడి పెట్టాడు. రూ. 20 కోట్ల మేర నష్టం వచ్చిందని విచారణలో పోలీసులకు చెప్పాడు. మిగిలిన సొమ్ము బ్యాంకులో చిక్కుకుపోయింది. ఈ బ్యాంకు ఆరోపణలతో బ్యాంకుగా మారింది. ఖాతాలను రెన్యువల్ చేయకపోవడంతో.. అవి నిరర్థకంగా మారాయి. ఈ నేపథ్యంలో పోలీసులు అక్కడి బ్యాంకుకు లేఖలు రాశారు. ఖాతాలను క్రియాశీలకంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మరో బ్యాంకులో రూ.25 కోట్లు పెట్టుబడికి రూ. 20 కోట్ల వరకు లాభం వచ్చింది.

ఆస్తుల గుర్తింపునకు చర్యలు...

అద్విక కుంభకోణంలో నిందితులు, ఏజెంట్ల ఆస్తులను జప్తు చేసేందుకు పోలీసులు నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారికి లేఖలు రాశారు. ఆదిత్య, అతని భార్య, సంస్థలో కీలక పాత్ర పోషించిన సలహాదారులు, ఉద్యోగులు, ఏజెంట్లు.. దాదాపు 30 మందిని గుర్తించారు. వీరి పేర్లతో కూడిన జాబితాను రిజిస్ట్రేషన్ శాఖకు పంపించారు. ఈ పేర్లతో ఎక్కడైనా ఆస్తులు ఉంటే గుర్తించి వివరాలు అందజేయాలని, అవి రిజిస్ట్రేషన్ కాకుండా చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. త్వరలో వీరి ఆస్తుల జాబితా పోలీసులకు చేరనుంది.

అంబేడ్కర్ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీ

14న వీరపనేనిగూడెంలో తక్షణ ప్రవేశాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరడానికి ప్రవేశ పరీక్ష రాసి, ఇంకా సీట్లు రాని విద్యార్థులకు మరో అవకాశం కల్పించారు. ఈ నెల 14వ తేదీ సోమవారం కృష్ణా జిల్లా గన్నవరం మండలం వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చల్లపల్లి, వీరపనేనిగూడెం (గన్నవరం), బల్లిపర్రు (పెడన), మోటూరు (గుడివాడ గ్రామీణ మండలం)లలోని బాలికల గురుకుల పాఠశాలలు, రుద్రవరం (మచిలీపట్నం), పామర్రులోని బాలుర పాఠశాలల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్వేషాలు రెచ్చగొట్టే వారిని ప్రజలు గుర్తుపెట్టుకుంటారు

భవానీపురం: ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే వారిని తెలుగు ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజల మధ్య బంధాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచంద్రరావును ఏపీ భాజపా అధ్యక్షుడు మాధవ్ హైదరాబాద్‌లో శనివారం కలిశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. తాను ఒక జాతీయ వాదినని.. తెలుగు రాష్ట్రాల్లో భాష, సంస్కృతి, గౌరవం కోసం శాసనమండలిలో చురుగ్గా పనిచేశానని వెల్లడించారు. తెలంగాణ సంస్కృతిపై తనకు ఉన్న ప్రేమ, గౌరవం ఎనలేనిదన్నారు. రామచంద్రరావుకు భారతీయ సాంస్కృతిక వైభవానికి సంబంధించిన చిత్రాన్ని ఆయన బహూకరించారు.

వేషధారణ మార్చి... సిమ్ కొంటూ చిక్కి...

శ్రీకాళహస్తిలో దొరికిన కేర్ టేకర్ గంగ, ఉపేంద్ర

గుణదల(పటమట), న్యూస్‌టుడే: కేర్ టేకర్‌గా చేరి ఇంటి యజమానిని హతమార్చినట్లు అనుమానిస్తున్న మహిళ, సహకరించిన ఆమె భర్తను మాచవరం పోలీసులు శ్రీకాళహస్తిలో శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకొని, వేషధారణ మార్చుకుని తిరిగిన.. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు వారిని పట్టుకున్నారు. ఘటన జరిగిన తర్వాత 4 బృందాలు హైదరాబాద్, సిద్దిపేట, ఖమ్మం, చెన్నై తదితర ప్రాంతాల్లో గాలించి చివరికి శ్రీకాళహస్తిలో పట్టుకున్నారు.



చెన్నై హోటల్‌లో కేర్ టేకర్ గంగ, ఉపేంద్ర

దొరికినట్టే దొరికి తప్పించుకొని..

గురువారం అర్ధరాత్రి విజయవాడ ఎస్టీఆర్ కాలనీలోని మృతుడు రామారావు నివాసం నుంచి పరారైన గంగ సుజాతపేట వెళ్లి అక్కడి నుంచి విజయవాడ బస్టాండ్ చేరుకుని భర్తతో కలిసి తిరుపతి బస్సు ఎక్కింది. తిరుపతి నుంచి చెన్నై వెళ్లారు. చెన్నైలో ఓ హోటల్‌లో దిగారు. అక్కడ వైఫై ద్వారా తమకు పరిచయస్థులకు ఫోన్ చేశారు. అప్పటికే వారి ఫోన్లపై నిఘా ఉన్నందున ఆచూకీ కనిపెట్టి వారు ఉంటున్న హోటల్‌కు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు పోలీసులు చేరుకోగా.. వారు ఉదయం 10 గంటలకే హోటల్ ఖాళీ చేసి వెళ్లిపోయారు.

ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొని..

పోలీసులు చెన్నై రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించారు. గతంలో ఉపేంద్ర శ్రీకాళహస్తిలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో సిమ్ కొన్నాడు. అక్కడికి వెళ్లి ఉంటారని దుకాణ నిర్వాహకులను పోలీసులు సంప్రదించగా... రాలేదని తెలిపారు. వస్తే సమాచారం ఇవ్వాలని... వారి వివరాలు, వేషధారణ గురించి చెప్పారు. వారు చెన్నై నుంచి శ్రీకాళహస్తి చేరుకుని కొత్త సిమ్ కొనుగోలుకు దుకాణానికి వెళ్లారు. పోలీసులకు సమాచారం వచ్చింది. స్థానిక పోలీసుల సహకారంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి విజయవాడ తీసుకొస్తున్నారు.

☛ పోలీసులు తమ కోసం గాలిస్తున్నారనే విషయాన్ని న్యూస్ ఛానళ్ల ద్వారా తెలుసుకున్నారు. తమ ఫొటోలు బయటకు రావడంతో గుర్తుపట్టకుండా 'హెయిర్ స్టైల్' మార్చి, మాస్కులు ధరించి టోపీలు పెట్టుకుని తిరిగారు. అనూష అసలు పేరు పల్లపు మంగ. సొంతూరు ఖమ్మం. హైదరాబాద్‌కు చెందిన మొదటి భర్తతో ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతడితో పాటు పిల్లలను వదిలేసి సిద్దిపేటకు చెందిన వ్యక్తిని రెండో పెళ్లి చేసుకుంది. తరువాత ఖమ్మంకు చెందిన ఉపేంద్రతో మూడో వివాహమైంది. ఆమె ఆచూకీ కోసం హైదరాబాద్, సిద్దిపేట, ఖమ్మం వెళ్లి వివరాలు సేకరించారు.

రైతునేస్తం పురస్కారాలు-25కు దరఖాస్తుల ఆహ్వానం

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాలలో (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) వ్యవసాయ కుటుంబ మాసపత్రిక 'రైతునేస్తం పురస్కారాలు-2025' పురస్కారాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోందని ఆ ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. రైతునేస్తం మాస పత్రిక 21వ వార్షికోత్సవంలో ప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ డాక్టర్ ఐవీ సుబ్బారావు పేరిట ఏటా సెప్టెంబర్‌లో ఆ రంగంలో కృషి చేస్తున్న శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తరణ అధికారులతోపాటు సాగులో నూతన ఆవిష్కరణలు చేసిన వారికి ఈ పురస్కారాలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులను రైతు నేస్తం వెబ్‌సైట్ https//rythunestham.in/awards నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, దానికి పరిశోధన వ్యాసాలు, సాగు అనుభవాలను జోడించి ఆగస్టు 31 లోగా ఎడిటర్, రైతునేస్తం 6-2-959 దక్షిణ భారత హిందీ ప్రచార సభ కాంప్లెక్సు, ఖైరతాబాద్, హైదరాబాద్-500 004కు (లేదా) రైతునేస్తం ఫౌండేషన్, డోర్ నంబర్: 8-198, కొర్నెపాడు గ్రామం, వట్టిచెరుకూరు మండలం, గుంటూరు జిల్లా- 522 017 చిరునామాకు (లేదా) editor@rythunestham.in కు మెయిల్ చేయవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 97053 83666(ఆంధ్రా), 96767 97777 నంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు.

ఆక్రమించి.. పొలంలో కలిపేసుకుని!

రూ.1.50 కోట్ల విలువైన ప్రభుత్వ డొంక భూమి కబ్జా

గండిగుంట (ఉయ్యూరు (గ్రామీణం), న్యూస్‌టుడే

ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామ పంచాయతీ పరిధిలో రూ. 1.50 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది. డొంకను ఆక్రమించి.. ఓ రైతు తన పొలంలో కలిపేసుకున్నాడు. ఉయ్యూరు-కాటూరు రోడ్డులో కాకానినగర్ సమీపంలో ఉన్న వడ్డిచెరువు డొంక దారిని రైతులు తమ పంట ఉత్పత్తుల రవాణా, రాకపోకలకు వినియోగిస్తున్నారు. అందులో సుమారు 30 సెంట్లను ఓ రైతు ఆక్రమించి పక్కనే ఉన్న తన పొలంలో కలిపేసుకొని సాగు చేస్తున్నాడు. దీంతో దారి కుంచించుకుపోయి.. రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. దీనిపై తహసీల్దార్‌కు ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రెవెన్యూ అధికారులు సర్వే చేసి గ్రామపంచాయతీ భూమి ఆక్రమణకు గురైనట్లు తేల్చారు. దీనిపై తహసీల్దార్ సురేశ్‌కుమార్ స్పందిస్తూ.. 30 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు తేలిందన్నారు. డొంకరోడ్డులోనే తహసీల్దార్ కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్ ఉన్నాయి. దీంతో అటుగా రద్దీ పెరిగింది. అలాంటిది.. దారిని సగానికి కోసేసి.. పొలంలో కలిపేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



డొంక రహదారిని పొలంలో కలిపి దున్నిన రైతు

EENADU Classifieds

ఛాంపియన్

248/3.. రాహుల్, పంత్ ఇద్దరూ నిలకడగా ఆడుతున్నారు. శతకాల వైపు సాగుతున్నారు.. భారీ స్కోరు ఖాయమని, ఆధిక్యం 150కి మించుతుందని అనిపించిన దశ అది. కానీ చకచకా రెండు వికెట్లు పడ్డాయి. పట్టు జారింది.

376/6.. జడేజా క్రీజులో కుదురుకున్నాడు.. సుందర్ కూడా నిలకడగా ఆడుతున్నాడు. ఇప్పటికీ పెద్ద స్కోరే సాధ్యమని, ఆధిక్యం 100 గ్యారెంటీ అనిపించిన స్థితి అది. కానీ మళ్లీ వికెట్లు పడ్డాయి. ఆధిక్యంపై ఆశలు ఆవిరిపోయాయి.

బాగా ఆడి కూడా.. పైచేయి సాధించబోతున్న దశలో పట్టు కోల్పోయిన టీమ్ఇండియా.. ఇంగ్లాండ్ స్కోరును అధిగమించలేకపోయింది. సరిగ్గా 387 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. మూడో రోజు ఆట చివరికి ఇరు జట్లూ సమాన స్థితిలో నిలిచాయి.

ఇక సిరీస్‌లో ఎవరిది పైచేయి అన్నది నాలుగో రోజు ఆటే నిర్ణయించనుంది.



వెంగీ తర్వాత రాహులే

దిగ్గజ ఆటగాడు దిలీప్ వెంగ్‌సర్కార్ తర్వాత ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో రెండు శతకాలు సాధించిన భారత బ్యాటర్‌గా రాహుల్ రికార్డులకెక్కాడు. లార్డ్స్‌లో అతను 2021లో తొలి శతకం సాధించాడు. వెంగ్‌సర్కార్ లార్డ్స్‌లో మూడు శతకాలు (1979, 1982, 1986) సాధించడం విశేషం. లార్డ్స్‌లో మొత్తంగా పదిమంది భారత బ్యాటర్లు సెంచరీలు కొట్టారు.

రాహుల్ 100

- తొలి ఇన్నింగ్స్‌లో స్కోర్లు సమం
- భారత్ 387 ఆలౌట్

వాళ్లెంతో మనమూ అంతే

- రాహుల్ శతకం
- రాణించిన జడేజా, పంత్

లండన్

ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో ఆధిక్యం కోసం టీమ్ఇండియా గట్టిగానే ప్రయత్నించినా ఆశ నెరవేర లేదు. తొలి ఇన్నింగ్స్‌లో సరిగ్గా ప్రత్యర్థి స్కోరు వద్దే భారత్ కూడా ఆలౌటైపోయింది. 145/3తో మూడో రోజు, శనివారం ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీమ్ఇండియా.. 387 పరుగులు చేసింది. నిలకడను కొనసాగిస్తూ ఓపెనర్ కేఎల్ రాహుల్ (100; 177 బంతుల్లో 13×4) సెంచరీ సాధించాడు. రిషబ్ పంత్ (74; 112 బంతుల్లో 8×4, 2×6), రవీంద్ర జడేజా (72; 131 బంతుల్లో 8×4, 1×6) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. ఇంగ్లిష్ బౌలర్లలో క్రిస్ వోక్స్ (3/84), జోఫ్రా ఆర్చర్ (2/52), బెన్ స్టోక్స్ (2/63) రాణించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్ ఒక ఓవర్లో వికెట్ నష్టపోకుండా 2 పరుగులు చేసింది. క్రాలీ (2), డకెట్ (0) క్రీజులో ఉన్నారు. ఆదివారం ఇంగ్లాండ్‌ను ఎంత త్వరగా భారత్ ఆలౌట్ చేస్తుందన్న దానిపై విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి.

పట్టు చిక్కినట్లే చిక్కి..: శనివారం 145/3తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్.. తొలి సెషన్లో తిరుగులేని ఆధిపత్యం చలాయించింది. లంచ్ లోపు ఆట చూస్తే భారత్‌కు మ్యాచ్‌పై పట్టు చిక్కినట్లే కనిపించింది. మ్యాచ్ ఫలితాన్ని శాసించే స్థాయిలో ఆధిక్యం సంపాదించడం ఖాయమనించింది. కానీ తొలి టెస్టులో మాదిరే కీలక దశలో చకచకా వికెట్లు కోల్పోయి మంచి అవకాశాన్ని కోల్పోయింది భారత్. ఉదయం రాహుల్, పంత్.. తర్వాత జడేజా, సుందర్ కీలక భాగస్వామ్యాలతో జట్టును మంచి స్థితికి చేర్చినా.. ఈ రెండు దశల్లో వికెట్లు కోల్పోయిన భారత్ పట్టు కోల్పోయింది. ఉదయం రాహుల్ (ఓవర్‌నైట్ 53), పంత్ (ఓవర్‌నైట్ 19) నిలకడగా ఆడుతూ జట్టును పటిష్ట స్థితికి చేర్చారు. ఓ ఎండ్‌లో రాహుల్ ఆచితూచి ఆడుతుంటే.. మరో ఎండ్‌లో పంత్ తనదైన శైలిలో షాట్లు కొట్టాడు. కొన్ని ఓవర్ల తర్వాత రాహుల్ సైతం జోరు పెంచాడు. దీంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. 22 ఓవర్లలోనే వందకు పైగా పరుగులు సాధించింది భారత్. తొలి సెషన్ చివరికి రాహుల్ 98 పరుగులపై నిలవగా.. పంత్ 74 పరుగులకు చేరుకున్నాడు. కొన్ని నిమిషాల్లో లంచ్ అనగా.. భారత్ 248/3తో పటిష్ట స్థితికి చేరుకుంది. కానీ సెషన్ చివర్లో పంత్ అనవసరంగా రనౌటై పోవడంతో భారత్‌కు ఒకింత నిరాశ తప్పలేదు. విరామానంతరం సెంచరీ పూర్తి చేసిన వెంటనే రాహుల్ ఔటైపోవడం మరో షాక్. ఈ స్థితిలో జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి (30) ఓపిగ్గా బ్యాటింగ్ చేసి మళ్లీ ఇన్నింగ్స్‌ను గాడిన పెట్టే ప్రయత్నం చేశారు. ఈ జోడీ ఆరో వికెట్‌కు 72 పరుగులు జోడించడంతో భారత్ తిరిగి మెరుగైన స్థితికి చేరుకుంది. నితీశ్‌ను స్టోక్స్ ఔట్ చేసినా.. సుందర్ (23)తో కలిసి జడేజా మరో విలువైన భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ 376/6తో ఆధిక్యం దిశగా అడుగులేసింది. ఆ దశలో ఆధిక్యం కనీసం 70-80 ఖాయమనే అనిపించింది. కానీ ఈ స్థితి నుంచి భారత్ అనూహ్యంగా కుప్పకూలింది. జడేజా వికెట్ పడిందో లేదో.. ఇన్నింగ్స్ పేకమేడను తలపించింది. రెండుసార్లు అంపైర్ ఎల్బీ ఇచ్చినా సమీక్షలో బతికిపోయిన ఆకాశ్ దీప్ (7) తర్వాత ఎంతోసేపు నిలవలేదు. 2 వికెట్లు చేతిలో ఉండగా, ఇంగ్లాండ్ స్కోరును భారత్ సమం చేయగా.. స్వల్ప ఆధిక్యమైనా దక్కుతుందనిపించింది. కానీ ఇంగ్లాండ్ బౌలర్లు అదే స్కోరు వద్ద బుమ్రా (0), సుందర్‌లను ఔట్ చేసి ఇన్నింగ్స్‌కు తెరదించారు.



పంత్ 74

పంత్ రికార్డు

ఇంగ్లాండ్‌లో ఓ టెస్టు సిరీస్‌లో 400కు పైగా పరుగులు సాధించిన తొలి విదేశీ వికెట్‌కీపర్‌గా రిషబ్ పంత్ రికార్డు నెలకొల్పాడు. శనివారం నాటి 74 పరుగుల ఇన్నింగ్స్‌తో ఈ సిరీస్‌లో అతడి పరుగులు 416కు చేరుకున్నాయి. ఈ సిరీస్ తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలు బాదిన పంత్. . రెండో టెస్టులో అర్ధసెంచరీ నమోదు చేశాడు. మూడో టెస్టులోనూ అతను 50+ స్కోరు సాధించాడు.

పంత్.. నొప్పిని బిగబట్టి

కఠిన పరిస్థితులుండే విదేశీ టెస్టుల్లో, జట్టు కష్టాల్లో ఉండగా వచ్చి మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌లను మలుపు తిప్పడం అలవాటుగా మార్చుకున్న రిషబ్ పంత్.. మరోసారి విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తొలి రోజు బుమ్రా బంతి తగిలి ఎడమ చేతి చూపుడు వేలికి గాయం కావడంతో అతను వికెట్ కీపింగ్ చేయని సంగతి తెలిసిందే. అయినా సరే.. రెండో రోజు అతను బ్యాటింగ్‌కు వచ్చాడు. భారత్ 107/3తో ఇబ్బందుల్లో పడ్డ స్థితిలో క్రీజులోకి వచ్చిన పంత్.. రాహుల్‌తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. పెయిన్ కిల్లర్లు వేసుకుని వచ్చినా వేలి గాయం అతణ్ని ఇబ్బంది పెట్టింది. నొప్పిని భరిస్తూనే బ్యాటింగ్ కొనసాగించాడు. కానీ దూకుడు మాత్రం తగ్గించలేదు. పలుమార్లు అతను ఆ చేతిని ఉపయోగించకుండా, ఒంటి చేత్తో షాట్లు కొట్టాడు. తనదైన శైలిలో కిందికి పడుతూ వికెట్ వెనక్కి, ఫైన్‌లెగ్‌లో షాట్లు ఆడాడు. ఇంగ్లాండ్ బౌలర్లెవ్వరినీ పంత్ కుదురుకోనివ్వలేదు. అతనున్నంతసేపూ వాళ్లు ఆత్మరక్షణలోనే కనిపించారు. ఒక ఎండ్‌లో పంత్ ధాటిగా ఆడుతుండడంతో రాహుల్ మీద కూడా ఒత్తిడి తొలగిపోయింది. అతను కూడా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశాడు. వీరి శతక భాగస్వామ్యంతో జట్టు పటిష్ఠ స్థితికి చేరుకుంది. ఈ జోడీ ఇలాగే కొనసాగి ఉంటే.. మూడో రోజు మ్యాచ్‌ను శాసించే స్థాయికి చేరేది భారత్. కానీ లేని పరుగుకు ప్రయత్నించి పంత్ రనౌటైపోయాడు. పంత్ షార్ట్ లెగ్‌లోకి బంతిని డిఫెన్స్ ఆడగా.. బంతి ఫీల్డర్ వద్దకు వెళ్తున్న విషయం గమనించకుండా అవతలి ఎండ్ నుంచి రాహుల్ పరుగు కోసం వచ్చేశాడు. దీంతో పంత్ కూడా ముందుకు వెళ్లక తప్పలేదు. అతను క్రీజులోకి చేరేలోపే ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ సూపర్ త్రోతో స్టంప్స్‌ను లేపేశాడు.

88 టెస్టుల్లో రిషబ్ పంత్ సిక్సర్లు. ఈ ఫార్మాట్లో అత్యధిక సిక్సులు కొట్టిన భారత బ్యాటర్లలో రెండో స్థానంలో ఉన్న రోహిత్ శర్మను అతను సమం చేశాడు. అతను ఇంకో మూడు సిక్సర్లు బాదితే అగ్ర స్థానంలో ఉన్న సెహ్వాగ్ (104 టెస్టుల్లో 90)ను దాటేస్తాడు. పంత్‌కు ఇది 46వ టెస్టు మాత్రమే కావడం విశేషం.

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 387; భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 13; రాహుల్ (సి) బ్రూక్ (బి) బషీర్ 100; కరుణ్ నాయర్ (సి) రూట్ (బి) స్టోక్స్ 40; శుభ్‌మన్ (సి) స్మిత్ (బి) వోక్స్ 16; పంత్ రనౌట్ 74; జడేజా (సి) స్మిత్ (బి) వోక్స్ 72; నితీశ్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 30; సుందర్ (సి) బ్రూక్ (బి) ఆర్చర్ 23; ఆకాశ్ దీప్ (సి) బ్రూక్ (బి) కార్స్ 7; బుమ్రా (సి) స్మిత్ (బి) వోక్స్ 0; సిరాజ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 12 **మొత్తం:** (119.2 ఓవర్లలో ఆలౌట్) **387; వికెట్ల పతనం:** 1-13, 2-74, 3-107, 4-248, 5-254, 6-326, 7-376, 8-385, 9-387; **బౌలింగ్:** వోక్స్ 27-5-84-3; ఆర్చర్ 23.2-6-52-2; కార్స్ 24-5-88-1; స్టోక్స్ 20-4-63-2; బషీర్ 14.5-2-59-1; రూట్ 10.1-0-35-0



జ్యోతి సురేఖ

జ్యోతి గురి అదుర్స్

మూడు పతకాలు సొంతం ● ఆర్చరీ ప్రపంచకప్

మాడ్రిడ్: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4లో తెలుగమ్మాయి జ్యోతి సురేఖ సత్తా చాటింది. బరిలో దిగిన అన్ని విభాగాల్లో పతకం సొంతం చేసుకుంది. మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో రజతం, వ్యక్తిగత విభాగంలో రజతం నెగ్గిన జ్యోతి.. మిక్స్‌డ్ విభాగంలో కాంస్యం సొంతం చేసుకుంది. జ్యోతి, పర్ణీత్ కౌర్, 16 ఏళ్ల అరంగేట్ర ఆర్చర్ ప్రీతిక ప్రదీప్‌లతో కూడిన భారత బృందం.. స్వర్ణానికి అత్యంత చేరువగా వెళ్లినా, ఆఖర్లో తడబడి రజతానికి పరిమితం అయింది. ఈ త్రయం అర్హత రౌండ్లో 2116 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. చైనీస్ తైపీతో ఫైనల్లోనూ ఒక దశలో 170-169తో భారత బృందం ఆధిక్యంలో నిలిచింది. కానీ ఆఖర్లో తడబడి 225-227తో ఓటమి చవిచూసింది. వ్యక్తిగత విభాగంలో నువ్వానేనా అన్నట్టుగా సాగిన ఫైనల్లో జ్యోతి 147-148తో బ్రిటన్ ఆర్చర్ ఎల్లా గిబ్సన్ చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. మరోవైపు మిక్స్‌డ్ టీమ్‌లో జ్యోతి-రిషబ్ యాదవ్ ద్వయం కాంస్యం గెలుచుకుంది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో ఈ జోడీ 156-153తో పవోలా కరాడో-డగ్లస్ వ్లాదిమిర్ జంటపై విజయం సాధించింది.



స్వైటెక్

57 నిమిషాల్లోనే..

- వింబుల్డన్ ట్రోఫీ స్వైటెక్ సొంతం
- ఫైనల్లో చిత్తుగా ఓడిన అనిసిమోవా

ఇటువైపు తొలి వింబుల్డన్ టైటిల్ కోసం ఉవ్విళ్లూరుతున్న స్వైటెక్.. అటువైపు ప్రపంచ నంబర్‌వన్ సబలెంకాకు షాకిచ్చి రాకెట్ దూస్తున్న అనిసిమోవా! వీళ్లిద్దరి మధ్య ఫైనల్ అంటే హోరాహోరీ తప్పదనుకున్నారంతా. కానీ కేవలం 57 నిమిషాల్లోనే మహిళల సింగిల్స్ ఫైనల్లో ఫలితం తేలిపోయింది. మ్యాచ్ అత్యంత ఏకపక్షంగా ముగిసిపోయింది. పోటీ లేదు.. పోరాటం లేదు. ఆటంతా ఒకరిదే. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయిన స్వైటెక్.. తొలిసారి వింబుల్డన్ ట్రోఫీని కైవసం చేసుకుంది.

లండన్: ఇగా స్వైటెక్‌దే వింబుల్డన్ కిరీటం! ఆధిపత్యం, దూకుడు, క్లాస్ అన్ని కలబోసి అదరగొట్టేసిన ఈ పోలెండ్ స్టార్.. టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. శనివారం ఏకపక్షంగా సాగిన పోరులో ఎనిమిదో సీడ్ స్వైటెక్ 6-0, 6-0తో 13వ సీడ్ అమండా అనిసిమోవా (అమెరికా)ను చిత్తు చిత్తుగా ఓడించింది. ఫైనల్లో ఆటంతా స్వైటెక్‌దే. తొలి గేమ్‌లోనే అనిసిమోవా సర్వీస్ బ్రేక్ అయిపోయింది. బలమైన సర్వీసులు, ప్లేస్‌మెంట్లతో చూస్తుండగానే 4-0తో ఆధిక్యంలోకి వెళ్లింది స్వైటెక్. గేమ్ గేమ్‌కూ దూకుడు పెంచిన ఇగా.. ప్రత్యర్థి కోలుకునే అవకాశమే ఇవ్వలేదు. 24 నిమిషాల్లోనే తొలి సెట్‌ను కైవసం చేసుకుంది. రెండో సెట్లోనూ అనిసిమోవా కోలుకోలేకపోయింది. బలహీనమైన సర్వీసులు, అనవసర తప్పిదాలతో స్వైటెక్ మరింత చెలరేగే అవకాశాన్ని ఇచ్చింది. దీంతో 3-0తో ఆధిక్యంలోకి వెళ్లింది పోలెండ్ స్టార్. రిటర్న్ చేసే క్రమంలో పదే పదే బంతిని నెట్‌కు కొట్టిన అనిసిమోవా అసహనానికి గురైంది. ఒత్తిడికి గురై తప్పిదాలు చేసింది. దీంతో ఆధిక్యాన్ని 5-0కు పెంచుకున్న స్వైటెక్.. సర్వీస్ నిలబెట్టుకుని తేలిగ్గా సెట్‌ను, ట్రోఫీని కైవసం చేసుకుంది. ఒక మెరుపు విన్నర్‌తో ఆమె మ్యాచ్‌ను ముగించింది. స్వైటెక్ 3 ఏస్‌లు, 10 విన్నర్లు కొట్టింది. ఆరుసార్లు అనిసిమోవా సర్వీస్ బ్రేక్ చేసింది. 5 డబుల్‌ఫాల్ట్స్, 28 అనవసర తప్పిదాలు చేసిన అనిసిమోవా ఓటమిని కొనితెచ్చుకుంది.

క్యాష్ జంటకు టైటిల్: పురుషుల డబుల్స్ టైటిల్‌ను జులియన్ క్యాష్-గ్లాస్‌పోల్ (బ్రిటన్) జంట కైవసం చేసుకుంది. ఫైనల్లో క్యాష్ ద్వయం 6-2, 7-6 (7-3)తో హిజికిటా (ఆస్ట్రేలియా)-డేవిడ్ పెల్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 1936 తర్వాత ఒక బ్రిటన్ డబుల్స్ జంట వింబుల్డన్‌లో టైటిల్ సాధించడం ఇదే తొలిసారి.



అనిసిమోవా

6 స్వైటెక్ నెగ్గిన గ్రాండ్ స్లామ్ సింగిల్స్ టైటిళ్లు. నాలుగుసార్లు ఫ్రెంచ్ ఓపెన్, ఒక్కోసారి వింబుల్డన్, యుఎస్ ఓపెన్ గెలిచింది.

8 వింబుల్డన్‌లో వరుసగా ఎనిమిదో సంవత్సరం కొత్త ఛాంపియన్ అవతరించింది.

- ఓపెన్ శకంలో ఒక గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో 6-0, 6-0తో గెలవడం ఇది రెండోసారి మాత్రమే. 1988 ఫ్రెంచ్ ఓపెన్లో నటాషా జ్వెరెవాను స్టెఫీగ్రాఫ్ ఇంతే తేడాతో ఓడించింది.
- 114 ఏళ్ల తర్వాత వింబుల్డన్ టోర్నీలో మహిళల సింగిల్స్ ఫైనల్లో 6-0, 6-0తో నెగ్గడం ఇదే తొలిసారి.
- గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆరుసార్లు తుదిపోరు చేరిన స్వైటెక్ అన్నిసార్లూ నెగ్గింది. ఇలా వరుసగా ఆరు ఫైనల్స్‌లో గెలిచిన మార్గరెట్ కోర్ట్, మోనికా సెలెస్‌ను సమం చేసింది.

పోలెండ్‌లో నీరజ్ × నదీమ్

సిలెసియా (పోలెండ్): క్రీడల్లో భారత్, పాకిస్థాన్ మధ్య పోరు ఏదైనా అభిమానులను ఆకర్షించడం ఖాయం. అథ్లెటిక్స్‌లోనూ అలాంటి సమరానికి రంగం సిద్ధమైంది. ఆగస్టు 16న పోలెండ్‌లో జరిగే డైమండ్ లీగ్‌లో.. పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ, రజత పతక విజేతలు అర్షద్ నదీమ్, నీరజ్ చోప్రా బరిలో దిగనున్నారు. ఒలింపిక్స్ తర్వాత ఈ ఇద్దరు ఆటగాళ్లు ఒకే పోటీలో ఆడనుండటం ఇదే తొలిసారి. టోక్యోలో స్వర్ణం సాధించిన నీరజ్.. పారిస్‌లో 89.45 మీటర్లు దూరం జావెలిన్‌ను విసిరినా రజతానికి పరిమితం కావాల్సి వచ్చింది. నదీమ్ 92.97 మీటర్ల త్రోతో అగ్రస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. ఈసారి నదీమ్‌ను ఓడించాలన్న పట్టుదలతో నీరజ్ ఉన్నాడు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత నీరజ్ త్రో ఎంతో మెరుగైంది. 90 మీటర్ల మార్క్‌ను అధిగమించిన భారత స్టార్ త్రోయర్.. రెట్టించిన ఉత్సాహంతో ఉన్నాడు. ఇప్పటికే నాలుగు డైమండ్ లీగ్‌లలో పోటీపడిన అతడు మెరుగైన ప్రదర్శన చేశాడు. మరోవైపు 2024 ఒలింపిక్స్ తర్వాత ఒకే టోర్నీలో పోటీపడిన నదీమ్ 86.40 మీటర్ల ప్రదర్శన నమోదు చేశాడు. స్వదేశంలో తాను నిర్వహించిన ఎన్‌సీ క్లాసిక్ టోర్నీకి నీరజ్.. అర్షద్ నదీమ్‌ను ఆహ్వానించాడు. అయితే ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో పోటీపడేందుకు ఆసక్తి ప్రదర్శించిన అతడు భారత్‌లో పర్యటించేందుకు నిరాకరించాడు.



లోకేశ్

'లక్ష్య' లోకేశ్‌కు కాంస్యం

ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 'ఈనాడు' సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' అథ్లెట్ మంత్ర లోకేశ్ సత్తా చాటాడు. బెంగళూరులో జరుగుతున్న ఈ పోటీల్లో పురుషుల టీ-42 హైజంప్‌లో లోకేశ్ 1.60 మీటర్ల జంప్‌తో కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఇదే టోర్నీలో 'లక్ష్య' అథ్లెట్లు జీవాంజి దీప్తి, అకీరా నందన్ ఇప్పటికే స్వర్ణాలు గెలిచారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ అమ్మాయి భవాని వలసంగారి రజతం సాధించింది. మహిళల టీ-46, 200 మీటర్ల పరుగులో భవాని (29.30 సె) రెండో స్థానంలో నిలిచింది. జయంత బెహరా (ఒడిశా, 27.90 సె) స్వర్ణం, మఫీ (హరియాణా, 31.10 సె) కాంస్యం గెలుచుకున్నారు.



అల్కరాస్ సినర్

పచ్చికలో ప్రతాపమెవరిదో!

నేడే సినర్‌తో అల్కరాస్ ఫైనల్ పోరు

● వింబుల్డన్ ● రాత్రి 8.30 నుంచి

లండన్: ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో రికార్డు స్థాయిలో అయిదున్నర గంటలపాటు పోరాడారు యానిక్ సినర్ (ఇటలీ)-కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్). నెల వ్యవధిలోనే మరో ఆసక్తికర పోరాటానికి సిద్ధమయ్యారీ కుర్రాళ్లు. ఆదివారమే వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్ పోరు. ఎర్రమట్టిలో ఓటమి పాలైనా.. పచ్చికలో అదరగొట్టాలని సినర్.. వింబుల్డన్‌లో హ్యాట్రిక్ సాధించాలని అల్కరాస్ పట్టుదలతో ఉన్నారు.

అల్కరాస్ జోరు: వింబుల్డన్‌లో గత కొన్నేళ్లుగా అల్కరాస్‌దే హవా. 2023, 2024 ట్రోఫీలు సాధించిన అతడు.. హ్యాట్రిక్ టైటిల్‌కు అడుగు దూరంలో ఉన్నాడు. **పన్నెండులో తొమ్మిది:** గత ఆరు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లను సినర్, అల్కరాసే పంచుకున్నారు. గత 11లో ఎనిమిది వాళ్లవే. అల్కరాస్ 5 గెలిస్తే.. సినర్ 3 నెగ్గాడు.

హెచ్‌సీఏ తాత్కాలిక అధ్యక్షుడిగా దల్జీత్

హైదరాబాద్, ఈనాడు: హైదరాబాద్ క్రికెట్ సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా దల్జీత్ సింగ్ నియమితుడయ్యారు. ఈ మేరకు శనివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. దల్జీత్ ఇప్పటిదాకా హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఆయనతో పాటు సంయుక్త కార్యదర్శి బసవరాజ్, కౌన్సిలర్ సునీల్ అగర్వాల్, అకౌంటెంట్ జనరల్ రాజశేఖర్ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. ఐపీఎల్ టికెట్ల కోసం సన్‌రైజర్స్ ఫ్రాంఛైజీ ప్రతినిధులను బెదిరించిన కేసులో ప్రస్తుత హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావును సీఐడీ అరెస్ట్ చేయగా.. మల్కాజ్‌గిరి కోర్టు ఆయనకు 12 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే.

భారత్-ఎ హ్యాట్రిక్

ఎండోవెన్ (నెదర్లాండ్స్): ఐరోపా పర్యటనలో భారత్-ఎ హాకీ జట్టు హ్యాట్రిక్ సాధించింది. వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. శనివారం భారత్-ఎ 3-2తో ఫ్రాన్స్‌ను ఓడించింది. ఆదిత్య అర్జున్ జట్టు తరఫున రెండు గోల్స్ చేయగా.. మరో గోల్‌ను బాబీ సింగ్ ధామి కొట్టాడు. ఫ్రాన్స్ తరఫున రెండు గోల్స్ క్లెమెంట్ చేశాడు.

ఫైనల్లో న్యూయార్క్ × వాషింగ్టన్

డలాస్: మేజర్ క్రికెట్ లీగ్‌లో ఎంఐ న్యూయార్క్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వాలిఫయర్-2లో 7 వికెట్ల తేడాతో టెక్సాస్‌ను ఓడించింది. మొదట టెక్సాస్ 5 వికెట్లకు 166 పరుగులు చేసింది. డుప్లెసిస్ (59), అకీల్ హొసీన్ (55 నాటౌట్) రాణించారు. పూరన్ (52 నాటౌట్), మోనాంక్ (49), పొలార్డ్ (47 నాటౌట్) మెరుపులతో న్యూయార్క్ 19 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. సోమవారం ఫైనల్లో వాషింగ్టన్‌తో న్యూయార్క్ తలపడనుంది.


ఆయుష్ సెంచరీ; భారత్ 450/7

బెకెన్‌హామ్: కెప్టెన్ ఆయుష్ మాత్రే (102) సెంచరీ సాధించడంతో ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో తొలి యూత్ టెస్టులో భారత్ అండర్-19 జట్టు మెరుగైన స్కోరు చేసింది. తొలి రోజు, శనివారం ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లకు 450 పరుగులు సాధించింది. విహాన్ (67), అభిజ్ఞాన్ కుందు (90), రాహుల్ కుమార్ (85) రాణించారు. ఆట చివరికి అంబ్రిష్ (31 బ్యాటింగ్), హెనిల్ పటేల్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (14) విఫలమయ్యాడు.

విజేత శ్రీశంకర్

పుణె: సుదీర్ఘ విరామం తర్వాత పోటీపడిన భారత స్టార్ లాంగ్ జంపర్ శ్రీశంకర్.. స్వర్ణంతో మెరిశాడు. శనివారం ఇండియా ఓపెన్ అథ్లెటిక్స్ మీట్‌లో 8.05 మీటర్లు దూకిన శ్రీశంకర్ అగ్రస్థానంలో నిలిచాడు. నిరుడు ఏప్రిల్‌లో మోకాలి గాయానికి గురైన అతడు వెంటనే శస్త్రచికిత్స చేయించుకున్నాడు. 21 నెలల విరామం తర్వాత ఓ టోర్నీలో పాల్గొన్న అతడు ఎనిమిది మీటర్లకు పైగా దూకడం విశేషం. శ్రీశంకర్ చివరగా 2023 అక్టోబరులో ఆసియా క్రీడల్లో పోటీపడ్డాడు.

71 ఏళ్ల వయసులో సీఏ ఉత్తీర్ణత


తారాచంద్ అగర్వాల్

జైపుర్: చాలా మంది విద్యార్థులు కష్టంగా భావించే ఛార్టెడ్ ఎకౌంటెంట్ (సీఏ) పరీక్షను 71 ఏళ్ల వ్యక్తి పాసై ఔరా అనిపించారు. ఆయనే జైపుర్‌కు చెందిన బ్యాంకు విశ్రాంత ఉద్యోగి తారాచంద్ అగర్వాల్. వ్యాపార కుటుంబంలో జన్మించిన ఆయన.. 1974లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ బీకానేర్, జైపుర్ (ప్రస్తుతం ఎస్‌బీఐ)లో క్లర్క్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 38 ఏళ్ల సర్వీసు అనంతరం 2014లో అసిస్టెంట్ జనరల్ మేనేజరు హోదాలో పదవీ విరమణ చేశారు. రిటైర్డ్ జీవితాన్ని ఆనందంగా గడుపుతున్న సమయంలో ఎంతో ప్రాణంగా ప్రేమించిన భార్య 2020లో మరణించారు. “నా పిల్లలు, మనుమలు నాతోనే ఉన్నా ఏదో శూన్యం ఆవరించింది. దేనిమీదా దృష్టి ఉండేది కాదు. భగవద్గీత చదవడంతో నేర్చుకునే ప్రక్రియపై ప్రేమ మొదలైంది. అప్పుడే పీహెచ్‌డీ చేద్దామని నిర్ణయించుకున్నా. కానీ నా పిల్లలు అంతకన్నా కష్టమైన సీఏను ప్రయత్నించాలని సూచించారు” అని అగర్వాల్ చెప్పుకొచ్చారు. అగర్వాల్ పెద్ద కుమారుడు దిల్లీలో సీఏగా పని చేస్తుండగా చిన్న కుమారుడు ట్యాక్స్ ప్రాక్టీస్ రంగంలో ఉన్నారు.

ఆ చేప కోసం.. 300 డ్యామ్‌లు కూల్చేసిన చైనా..!



ఇంటర్నెట్‌డెస్క్: అంతరించిపోతున్న ఓ చేపను కాపాడేందుకు యాంగ్జీ నది ఉప నది చిషుయ్ హేపై నిర్మించిన 300కు పైగా చిన్న చిన్న డ్యామ్‌లను చైనా కూల్చివేసింది. అంతే కాదు.. పలు జల విద్యుతుత్పత్తి కేంద్రాలనూ మూసివేసింది. చిషుయ్ హేలో నదిలో కనిపించే అరుదైన చేప ‘యాంగ్జీ స్టర్జన్’ను 2022లో అంతరించిపోతున్న జాతిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ చేపను రక్షించేందుకు యుద్ధ ప్రాతిపాదికన చైనా అధికారులు రంగంలోకి దిగారు. నదిపై ఉన్న 357 డ్యామ్‌లలో 300 ఆనకట్టలను కూల్చివేశారు. 342 చిన్న తరహా జల విద్యుత్ కేంద్రాలనూ మూసివేశారు. దీంతో పరిస్థితులు మెరుగయ్యాయి. రెండు బ్యాచ్‌ల యాంగ్జీ స్టర్జన్‌లను నదిలోకి వదలగా.. అవి విజయవంతంగా నదిలో మనుగడ సాగిస్తున్నాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

శవపేటికలో సజీవంగా తల్లి ఊరేగింపు!



బీజింగ్: చైనాలోని హునాన్ ప్రావిన్సుకు చెందిన ఓ వ్యక్తి సజీవంగా ఉన్న తన తల్లి (70)ని శవపేటికలో ఊరేగించాడు. మోయడానికి 16 మంది కూలీలను నియమించుకొని.. తల్లిని శవపేటికలో కూర్చోబెట్టి డప్పు చప్పుళ్లతో ఊరంతా తిప్పాడు. అనంతరం ఆమెను ఇంటికి తీసుకువెళ్లి అందరికీ విందుభోజనం పెట్టాడు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇంతకూ విషయం ఏమిటంటే.. చైనాలోని కొన్ని ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా ఈ వింత ఆచారం ఉంది. వృద్ధులను ఈ విధంగా శవపేటికల్లో ఊరేగించడాన్ని పిల్లలు తమ తల్లిదండ్రులపై చూపే ప్రేమకు చిహ్నంగా భావిస్తారు. ఇలా ఊరేగించడం వల్ల వృద్ధులు దీర్ఘాయుష్షుతో జీవిస్తారని వారి విశ్వాసం. చైనా ఆచారం మాటెలా ఉన్నా.. నానాటికీ వృద్ధాశ్రమాలు పెరుగుతున్న దేశాలకు ఇది వింత వార్తే!

ఉపాధి కల్పనపై
ప్రభుత్వ దృష్టి: మోదీ



దిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి కల్పనకు తమ ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. గత 11 ఏళ్లలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందన్నారు. శనివారం నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో అధికారులు 51 వేల నియామక పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. “సంకల్ప పత్ర కాల ద్వారా మా ప్రభుత్వం పేదలకు 4 కోట్లకు పైగా ఇళ్లు నిర్మించింది. 10 కోట్లకు పైగా కొత్త ఎల్పీజీ కనెక్షన్లు అందించింది. రూఫ్‌టాప్ సోలార్ వంటి కార్యక్రమాలతో లక్షల మందికి కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించింది. 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. భారతదేశానికి తయారీ రంగం అతిపెద్ద బలం. గత 11 ఏళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 5 రెట్లు పెరిగింది. మొబైల్ తయారీ యూనిట్లు దాదాపు 300కు చేరుకున్నాయి” అని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ రంగ ఉత్పత్తులపై అనేక మంది గర్వంగా చర్చించుకుంటున్నారని అన్నారు. ఇటీవల తన 5 దేశాల పర్యటన గురించి మోదీ ప్రస్తావిస్తూ.. భారతదేశ ప్రజాస్వామ్య బలాన్ని ప్రపంచం మొత్తం గుర్తించిందన్నారు.



వీటితో మెదడు ఆరోగ్యానికి చేటు

1. చక్కెర శాతం అధికంగా ఉండే పానీయాలు.
2. శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు కలిగిన పదార్థాలు.
3. కృత్రిమ తీపి పదార్థాలు.
4. వేపుళ్లు. 5. మద్యం.

– క్రిస్టీ లియాంగ్, ఫిజీషియన్

సెకను సెకనుకూ ముంచుకొచ్చిన ప్రమాదం

- ఎయిరిండియా విమానం కూలిన ఘటనలో ఎప్పుడేం జరిగిందంటే..



దిల్లీ: దేశంలో జరిగిన అత్యంత దారుణమైన విమాన ప్రమాదాల్లో అహ్మదాబాద్ దుర్ఘటన ఒకటి. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను శనివారం ఏఏఐబీ విడుదల చేసింది. అందులో సెకను సెకనుకూ ముంచుకొచ్చిన ప్రమాదాన్ని వివరించింది. అసలు జూన్ 12వ తేదీన ఏం జరిగిందో పూసగుచ్చినట్లు వెల్లడించింది.

11.17: ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ వీటీ-ఏఎన్‌బీ విమానం ఏఐ423 నంబరుతో దిల్లీ నుంచి వచ్చి అహ్మదాబాద్‌లో దిగింది.
13.13.00: పుష్‌బ్యాక్, స్టార్టప్ కోసం విమానం విజ్ఞప్తి చేసింది.
13.13.13: పుష్‌బ్యాక్‌కు ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) అనుమతించింది.
13.16.59: స్టార్టప్‌ను ఏటీసీ ఆమోదించింది.
13.18.38: విమానాశ్రయ 34వ గేట్ నుంచి విమానం బయలుదేరింది.
13.19.12: టేకాఫ్‌కు మొత్తం రన్‌వే కావాలా అని ఏటీసీ అడిగింది. రన్‌వే 23 మొత్తం కావాలని విమాన సిబ్బంది చెప్పారు.
13.25.15: ట్యాక్సీ క్లియరెన్సును సిబ్బంది అడిగారు. ఏటీసీ మంజూరు చేసింది.
13.26.00: టేకాఫ్ లైన్ క్లియర్ చేసేందుకు ఆర్4 ట్యాక్సీవే నుంచి ట్యాక్సీలు వెళ్లిపోయాయి.
13.32.03: విమాన నియంత్రణ (గ్రౌండ్ నుంచి టవర్ కంట్రోల్‌లోకి వెళ్లిపోయింది.
13.33.45: 23 నంబరు రన్‌వేపైకి వెళ్లాలని విమానానికి ఆదేశం.
13.37.37: 23వ నంబరు రన్‌వేపై టేకాఫ్‌కు ఏటీసీ అనుమతి.
13.38.39: రన్‌వే నుంచి టేకాఫ్.
13.38.42: 180 నాట్స్ వేగం అందుకున్న విమానం. ఇంధన స్విచ్‌లు రన్ నుంచి కటాఫ్ దశ.
13.38.47: ఎన్1, ఎన్2 ఇంజిన్లు కనీస వేగానికి దిగువకు పడిపోయాయి.
13.38.52: కటాఫ్ నుంచి రన్ మోడ్‌లోకి ఎన్1 ఇంజిన్ ఇంధన స్విచ్.
13.38.56: కటాఫ్ నుంచి రన్ మోడ్‌లోకి ఎన్2 ఇంజిన్ ఇంధన స్విచ్.
13.39.05: పైలట్లలో ఒకరు మేడే కాల్ పిలుపు.
13.39.11: ఇంధన స్విచ్‌లు ఆగిపోయిన డేటా రికార్డింగ్.
13.44.44: విమానాశ్రయం నుంచి సహాయక సిబ్బంది ఘటనా స్థలికి చేరిక.

ఏఏఐబీ నివేదికలో ఇంకా ఏముందంటే..

■ టేకాఫ్ చేసేందుకు ఫ్లాప్ సెట్టింగ్, గేర్ సాధారణంగానే పని చేశాయి.
■ వాతావరణ పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయి. ఆకాశం స్పష్టంగా ఉంది. గాలులు తేలిగ్గానే ఉన్నాయి.
■ ఎయిరిండియా విమాన పైలట్లు ఇద్దరూ మెడికల్‌గా ఫిట్‌గానే ఉన్నారు. అనుభవం బాగానే ఉంది.
■ గతంలో ఈ విమానంలోని ఇంధన కంట్రోల్ స్విచ్‌లలో ఏ సమస్యా వచ్చినట్లు లేదు.

కోల్‌కతాలో
మరో అత్యాచార ఘటన
ఐఐఎం బాయ్స్ హాస్టల్‌లో విద్యార్థినిపై ఘాతుకం

కోల్‌కతా: వరుస అత్యాచార ఘటనలతో ఆందోళనలు కొనసాగుతున్న పశ్చిమబెంగాల్లో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లో చదువుతున్న ఓ విద్యార్థినిపై, మరో విద్యార్థి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి కౌన్సిలింగ్ ఇస్తానని చెప్పి శుక్రవారం బాధితురాలిని బాయ్స్ హాస్టల్‌కు పిలిపించుకున్నాడు. ఆమెకు మత్తు పదార్థాలు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చాడు. అది తాగిన విద్యార్థిని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్పృహలోకి వచ్చిన తర్వాత తనపై అత్యాచారం జరిగినట్లు గ్రహించిన బాధితురాలు దీనిపై అతడిని ప్రశ్నించింది. అత్యాచారం గురించి ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని నిందితుడు ఆమెను బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.



బ్యాక్ బెంచర్స్.. ఇక నిన్నటి మాట!

- కేరళ పాఠశాలల్లో ‘సినీ’మాయ

కొల్లం: ‘సినిమాలు చూసి జనం మారుతారా!’ అని కొందరు పెదవి విరుస్తుంటారు. మంచి సందేశాన్ని చెప్పాల్సిన తీరులో చెబితే కచ్చితంగా మారుతారని కేరళ పాఠశాలలు రుజువు చేస్తున్నాయి. మలయాళంలో ఇటీవల విడుదలై విద్యార్థుల సమస్యలపై చర్చకు తెర లేపిన “స్థానార్థి శ్రీకుట్టన్” చిత్రం రాష్ట్రంలోని చాలా పాఠశాలల తరగతి గదుల్లో మార్పు తీసుకొచ్చింది. దక్షిణ కేరళ జిల్లా వలకోంలో ఉన్న ఆర్‌వీహెచ్‌ఎస్ స్కూలుకు ఓ ప్రత్యేకత ఉంది. సివిల్ సర్వీస్ పరీక్షల్లో దేశంలో 47వ స్థానం, కేరళలో రెండో స్థానం సాధించిన జి.పి.నందన ఇక్కడే చదివారు. ‘శ్రీకుట్టన్’ చిత్ర స్ఫూర్తితో ఈ పాఠశాలలో బ్యాక్ బెంచీలు మాయం అయ్యాయి. విద్యార్థులందరూ ఇప్పుడు వలయాకార వరుసలో కూర్చొంటున్నారు. దీన్ని చూసి కేరళలోని మరో 8 పాఠశాలలు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నాయి. రాష్ట్రంలో మరిన్ని పాఠశాలలు సైతం ఇదే తరహా ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నమై ఉన్నట్లు ఆర్‌వీహెచ్ఎస్ స్కూలు నడుపుతున్న కేరళ మంత్రి కె.బి. గణేశ్ కుమార్ తెలిపారు.

దిల్లీలో కూలిన
4 అంతస్తుల భవనం
ఒకే కుటుంబంలో ఆరుగురి మృతి

దిల్లీ: ఈశాన్య దిల్లీలోని వెల్‌కమ్ ప్రాంతంలో శనివారం నాలుగు అంతస్తుల భవనం కూలి రెండేళ్ల చిన్నారి సహా ఆరుగురు మరణించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు. ఏడాది వయసున్న చిన్నారితో పాటు ఈ కుటుంబానికి చెందిన మరో ఎనిమిది మంది గాయపడ్డారు. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. గాయపడినవారిని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో భవన యజమాని మత్లూబ్(50), భార్య రబియా(46), ఆయన ఇద్దరు కుమారులు, మరో ఇద్దరు మృతి చెందారని పోలీసులు వెల్లడించారు.

మెక్సికో, ఈయూ దేశాలపై 30 శాతం సుంకం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన



బ్రిడ్జివాటర్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై మళ్లీ సుంకాల మోత మోగించారు. మెక్సికోతో పాటు ఐరోపా సమాజం (ఈయూ) దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 30 శాతం సుంకాలు విధించారు. ఆగస్టు 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయెన్, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌లకు లేఖలు రాశారు. దీంతో ఇప్పటివరకూ 24 దేశాలకు, ఈయూ(సభ్య దేశాలు 27)కు ట్రంప్ సుంకాలను ఖరారు చేసినట్లయ్యింది. పరస్పర సంప్రదింపుల ద్వారా సమస్యను అధిగమిస్తామన్న ఆశాభావాన్ని ఈయూ అధ్యక్షురాలు వ్యక్తం చేశారు. ట్రంప్ తాజా నిర్ణయంతో అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులు, సరకులపై ఆ దేశాలు కూడా ఎంతోకొంత ప్రతీకార సుంకాలు విధించే అవకాశం ఉంది. మెక్సికో నుంచి వచ్చే సరకులపై ఇప్పటి వరకూ అమెరికా విధిస్తున్న సుంకాలు 25 శాతం నుంచి 30 శాతానికి పెరగనున్నాయి. అమెరికా-మెక్సికో-కెనడాల మధ్య ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పరిధిలోని వస్తువులపై దీని ప్రభావం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. అయితే, ఈ విషయాన్ని ట్రంప్ తన తాజా లేఖలో స్పష్టం చేయకపోవడంతో ఆ మూడు దేశాల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

అస్సాంలో పోలీసు కేసు ఎరుగని గ్రామం



ఈటీవీ భారత్: ఊరన్నాక ఎప్పుడో ఒకప్పుడు గొడవలు, నేరాలు జరుగుతుంటాయి. పొలాల దగ్గర గట్ల పంచాయతీలు, స్థానిక ఎన్నికల్లో వివాదాల వంటివి ఎరుగని గ్రామం ఉండదు. అస్సాంలోని నాగావ్ జిల్లా దింగ్ ప్రాంతంలో గల సహారియా గ్రామం మాత్రం వీటన్నిటికీ అతీతం. ఈ గ్రామం ఏర్పడిన నాటి నుంచీ ఒక్క క్రిమినల్ కేసు నమోదు కాలేదు. అసలు పోలీసు వాహనం సహారియా దరిదాపుల్లోకి వచ్చిన దాఖలాలు కూడా లేవు. గ్రామస్థుల మధ్య ఎలాంటి సమస్యలు వచ్చినా అంతా ఒకచోట చేరి గ్రామపెద్దల సమక్షంలో పరిష్కరించుకుంటామని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సునీల్ మహేలా తెలిపారు. ఒకప్పుడు ఇదంతా అటవీప్రాంతం. నాలుగు ఇళ్లతో మొదలై క్రమంగా కుటుంబాల సంఖ్య పెరిగింది. గ్రామస్థుల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఈ గ్రామ యువత మాదకద్రవ్యాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా.. క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాల్లో చురుగ్గా ఉంటారు. సమస్యలు ఎదురైతే పౌర కమిటీలతో కలిసి సామరస్యంగా పరిష్కరించుకొనే ఇలాంటి గ్రామాన్ని తాను ఇప్పటివరకూ చూడలేదని నాగావ్ జిల్లా ఎస్పీ స్వప్ననీల్ తెలిపారు.

మునీర్‌కు అధ్యక్ష పదవి
వదంతి మాత్రమే
షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్య

ఇస్లామాబాద్: పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీని బలవంతంగా గద్దెదించి దేశ సైనిక దళాల ప్రధానాధికారి అసిం మునీర్ ఆ స్థానాన్ని ఆక్రమించనున్నారంటూ వినవస్తున్న వార్తలు వదంతులు మాత్రమేనని ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్పష్టంచేశారు. “ఫీల్డ్ మార్షల్ అసిం మునీర్ దేశాధ్యక్షుడు కావాలన్న ఆకాంక్షను ఏనాడూ వ్యక్తీకరించలేదు. ఆయనను అలా చేయాలన్న ఆలోచనా లేదు” అని షరీఫ్ ఒక వార్తాసంస్థకు తెలియజేశారు. జర్దారీకీ, మునీర్‌కీ, తనకూ మధ్య పరస్పర గౌరవం, పాకిస్థాన్ ప్రగతి సాధించాలన్న ఏకైక లక్ష్యంతో కూడుకున్న బలమైన అనుబంధం ఉన్నాయని షరీఫ్ అన్నారు. జర్దారీ, షరీఫ్, మునీర్‌లపై ‘దురుద్దేశ పూరిత ప్రచారం’’ జరుగుతోందంటూ పాకిస్థాన్ అంతరంగిక మంత్రి మొహ్సిన్ నక్వీ సోషల్ మీడియా వేదికగా చేసిన ప్రకటన నేపథ్యంలో ప్రధాని ప్రకటన వెలువడింది.

ఇజ్రాయెల్ దాడుల్లో 52 మంది పాలస్తీనీయుల మృతి


గాజాలో స్వచ్ఛంద సంస్థలు పంపిణీ చేసే ఆహార సామగ్రి కోసం భారీ సంఖ్యలో తరలివచ్చిన పాలస్తీనియన్లు

డెయిర్ అల్ బలా: గాజాలో సామాన్యులపై ఇజ్రాయెల్ దాడులు నిరాఘాటంగా కొనసాగుతున్నాయి. తాజాగా ఇజ్రాయెలీ దళాలు జరిపిన వైమానిక దాడుల్లో 28 మంది, ఆహారం కోసం సహాయక కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న వారిపై జరిపిన కాల్పుల్లో 24 మంది, మొత్తంగా 52 మంది మరణించారని శనివారం స్థానిక అధికారులు తెలిపారు. మధ్య గాజాలోని డెయిర్ అల్ బలాలో శుక్రవారం రాత్రి ఇజ్రాయెలీ బలగాలు జరిపిన వైమానిక దాడుల్లో 13 మంది మరణించారని.. ఇందులో ఇద్దరు మహిళలు, పిల్లలు ఉన్నారని అల్ అక్సా ఆస్పత్రి అధికారులు వెల్లడించారు. ఖాన్ యూనిస్ ప్రాంతంలో జరిగిన మరో ఇజ్రాయెలీ వైమానిక దాడిలో 15 మంది మృతి చెందారు. రఫా సహాయక కేంద్రం నుంచి ఆహారం తెచ్చుకునేందుకు వెళ్తున్న అన్నార్తులపై జరిపిన కాల్పుల్లో కనీసం 24 మంది మరణించారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గడచిన 48 గంటల్లో గాజాలోని దాదాపు 250 లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం ధ్రువీకరించింది. మిలిటెంట్ల ఆయుధ నిల్వ స్థలాలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు, సొరంగ మార్గాలు తదితరాలపై దాడులు జరిపామన్న సైన్యం.. సాధారణ పౌరులపై దాడుల గురించి ప్రస్తావించలేదు.

రాజకీయాలు
చాలా ఖరీదైనవి: కంగన



మండీ: రాజకీయాలు చాలా ఖరీదైనవని భాజపా ఎంపీ కంగనా రనౌత్ అభిప్రాయపడ్డారు. నిజాయతీతో ఉండే వ్యక్తులు రాజకీయాలను వృత్తిగా తీసుకొని మనుగడ సాగించడం కష్టమని అన్నారు. పార్లమెంటు సభ్యురాలిగా తన ఖర్చుల గురించి రనౌత్ మాట్లాడుతూ “మీరు ఎంపీ అయితే దాన్ని వృత్తిగా చేసుకోలేరు. తనతో ఉండే సిబ్బందికి జీతాలిచ్చిన తర్వాత ఎంపీకి మిగిలేది అంతంత మాత్రమే. ప్రజా ప్రతినిధులు, పీఏలతో తమ నియోజకవర్గాలకు వాహనాల్లో వెళ్లేందుకు రూ.లక్షల్లో ఖర్చవుతుంది. ఒక్కో ప్రదేశం 300-400 కి.మీ.ల దూరం ఉండటమే కారణం. ఎంపీలకు ఉద్యోగమూ ఉండాలి. ఇప్పటికే చాలా మంది ఎంపీలకు వ్యాపారాలు ఉన్నాయి” అని ఆమె పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఆమె మాట్లాడుతూ..“అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతా తానే చేశానని చెప్పుకొంటున్నారు. గతంలో ట్రంప్‌నకు నేను పెద్ద మద్దతుదారుని. ప్రస్తుతం ఆయన వైఖరి నచ్చడం లేదు” అని కంగన బదులిచ్చారు.

ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ దొందూ దొందే

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా


తిరువనంతపురం సభలో పూలతో అలంకరించిన ఖడ్గంతో కేంద్ర మంత్రి అమిత్ షా

తిరువనంతపురం: కేరళలో సీపీఎం నేతృత్వంలోని అధికార ఎల్‌డీఎఫ్, కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రతిపక్ష యూడీఎఫ్ కూటములు రెండూ అవినీతిని పెంచి పోషించాయని, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతూ కేరళను ‘పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా’ (పీఎఫ్ఐ) వంటి జాతి వ్యతిరేక శక్తులకు నెలవుగా మార్చాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. భాజపా నేతృత్వంలోని ఎన్‌డీయే మాత్రమే కేరళ ప్రగతికి బాటలు వేయగలదని చెప్పారు. శనివారం తిరువనంతపురంలో భాజపా రాష్ట్ర కమిటీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి, కార్యకర్తల్ని ఉద్దేశించి మాట్లాడారు. దక్షిణాదిని బలోపేతం చేయకుండా వికసిత భారతాన్ని సాధించడం సాధ్యం కాదని, దానిలో కేరళ అభివృద్ధి ముఖ్యమైనదని అన్నారు. ముఖ్యమంత్రిని కలిగి ఉండటానికే కాకుండా వికసిత కేరళానికి కేంద్రంగా భాజపా రాష్ట్ర కార్యాలయం ఉండేలా చూడటం ముఖ్యమని చెప్పారు. కేంద్రం 2022లోనే పీఎఫ్ఐని, దాని అనుబంధ సంస్థల్ని నిషేధించినా కేరళ అలా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సీపీఎంకు దాని కార్యకర్తల అభివృద్ధే తప్ప రాష్ట్ర అభివృద్ధి ముఖ్యం కాదన్నారు. ప్రతిపక్షాలు బలంగా ఉన్న అస్సాం, త్రిపుర వంటి రాష్ట్రాల్లో కూడా భాజపా ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని, తమిళనాడులో కూడా అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు.

గగన్‌యాన్
సర్వీస్ మాడ్యూల్ చోదక వ్యవస్థ సిద్ధం

బెంగళూరు: భారత్ చేపట్టబోయే మానవసహిత అంతరిక్ష యాత్ర ‘గగన్‌యాన్’కు సంబంధించిన సర్వీసు మాడ్యూల్ చోదక వ్యవస్థ (ఎస్ఎంపీఎస్) అభివృద్ధి పూర్తయింది. తాజాగా దీని అర్హత పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. పూర్తిస్థాయిలో 350 సెకన్లపాటు దీన్ని పరీక్షించినట్లు వివరించింది. ఇదంతా సాఫీగా సాగినట్లు తెలిపింది. ఎస్ఎంపీఎస్‌లో రెండు ఇంధనాలతో పనిచేసే చోదక వ్యవస్థ ఉంటుంది. వ్యోమగాములు కూర్చొనే ఆర్బిటల్ మాడ్యూల్‌ను వృత్తాకార కక్ష్యలో నిలపడానికి, కక్ష్య తగ్గించుకోవడానికి, భూమి నుంచి బయల్దేరే ముందు ప్రయోగాన్ని నిలిపివేసే అబార్ట్ మిషన్‌కు ఇది ఉపయోగపడుతుంది.

ఉక్రెయిన్‌పై రష్యా దాడి.. ఆరుగురు మృతి



కీవ్‌లోని ఓ మెట్రో స్టేషన్‌లో తలదాచుకున్న పౌరులు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. 597 డ్రోన్లు, 26 క్షిపణులతో శుక్రవారం రాత్రి దాడి చేసింది. దీనిలో కనీసం ఆరుగురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు డ్రోన్ శకలాల వల్ల ప్రాణాలు కోల్పోయారు. రష్యాకు చెందినవాటిలో 319 డ్రోన్లు, 25 క్షిపణులను కూల్చివేశామని ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. ఉక్రెయిన్ నగరాలపై దాడులను ముమ్మరం చేసిన రష్యా.. పోలండ్ సరిహద్దులో ఉన్న లుట్స్క్‌పై దృష్టిపెట్టింది. విదేశాల నుంచి ఉక్రెయిన్‌కు సైనిక సాయం ఈ ప్రాంతానికే ముందుగా వస్తుంది. అందుకే రెండువారాల వ్యవధిలో లుట్స్క్‌పై మూడుసార్లు రష్యా దాడి చేసింది. కీవ్‌లోని ఆయుధ పరిశ్రమలపై 600 డ్రోన్లు, క్షిపణులతో వైమానిక దాడులకు రష్యా పాల్పడింది. ఉక్రెయిన్ సైనిక, వైమానిక స్థావరాలపైనా దాడులు నిర్వహించినట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా.. నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు, విశ్వవిద్యాలయాలు దెబ్బతిన్నాయి. రష్యా ప్రయోగించిన 319 డ్రోన్లు, 25 క్షిపణులను నేలకూల్చినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది.

కశ్మీర్‌లో
అమర్‌నాథ్ యాత్రికుడి అదృశ్యం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని గాందర్‌బల్ జిల్లాలో అమర్‌నాథ్ యాత్రికుడొకరు అదృశ్యమయ్యారు. లుధియానాకు చెందిన సురీందర్‌పాల్ అరోరా బ్రారిమార్గ్ నుంచి రైల్ పత్రికి ఏడుగురు బృందంతో వెళుతుండగా అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యారు “సురీందర్ పాల్ ప్రవర్తన వింతగా ఉంది. పైకి కిందకు పరుగెత్తడం, చన్నీటితో స్నానం చేయడం లాంటి పనులు చేశారు. తర్వాత జెడ్-మోడ్ సొరంగం సమీపంలో రక్షణగా నిర్మించిన కంచెపై నుంచి దూకారు” అని సహ యాత్రికులు తెలిపారు.

మోదీ హయాంలో విద్యావ్యవస్థ పరిస్థితి దారుణం: ఖర్గే



దిల్లీ: మోదీ ప్రభుత్వ హయాంలో భారత విద్యావ్యవస్థ దారుణంగా తయారైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. పరీక్షా పే చర్చా.. ఎగ్జామ్ వారియర్స్ లాంటి ప్రచార కార్యక్రమాలతో అసలు వాస్తవాన్ని ప్రధాని దాస్తున్నారని విమర్శించారు. తాజాగా వెలువడిన ప్రభుత్వ సర్వేలోని అంశాలతో ఓ వీడియోను ‘ఎక్స్’లో ఖర్గే పోస్టు చేశారు. విద్యార్థుల ప్రదర్శన కోవిడ్‌కు ముందు కంటే దారుణంగా ఉందన్న విషయం సర్వేలో తేటతెల్లమైందని ఖర్గే పేర్కొన్నారు. మూడో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో కేవలం 55 శాతం మంది మాత్రమే 99 వరకు అంకెలను క్రమపద్ధతిలో చెప్పగలుగుతున్నారని.. రెండంకెల కూడికలు, తీసివేతలు కూడా చేయలేకపోతున్నారని సర్వే తెలిపింది. సర్వేలో అంశాలను చూస్తే.. విద్యార్థుల భవిష్యత్తు పట్ల మోదీ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్న విషయం అర్థమవుతుందని ఖర్గే అన్నారు.

దాడి చేయబోమని హామీ ఇస్తే
అమెరికాతో చర్చలకు సిద్ధం: ఇరాన్

టెహ్రాన్: తమపై ఇక ముందు దాడులు జరగబోవని హామీ ఇస్తే అమెరికాతో అణు చర్చలు పునరుద్ధరించేందుకు సిద్ధమేనని ఇరాన్ విదేశాంగ మంత్రి శనివారం చెప్పినట్లు ఇక్కడి ప్రభుత్వ మీడియా వెల్లడించింది. “ఇరాన్ తన అణు కార్యక్రమంపై చర్చలకు గతంలోనూ సిద్ధంగా ఉంది, భవిష్యత్తులోనూ ఉంటుంది” అని విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ టెహ్రాన్‌లో జరిగిన విదేశీ దౌత్యవేత్తల సమావేశంలో పేర్కొన్నారు. అమెరికా తదితర దేశాలు మాతో చర్చలు కొనసాగించాలని భావిస్తే ముందుగా మాపై మళ్లీ దాడులు ఉండవని హామీ ఇవ్వాలి అని అరాగ్చీ స్పష్టం చేశారు.

గ్రామానికి రోడ్డు కావాలన్న గర్భిణి ప్రసవం తారీఖు చెప్పమన్న ఎంపీ



సీధీ: మధ్యప్రదేశ్‌లోని సీధీ జిల్లాకు చెందిన ఓ గర్భిణి తమ గ్రామానికి బస్సులు తిరిగే రోడ్డు కావాలని కోరగా.. “నీ డెలివరీ డేటు చెప్పమ్మా” అంటూ స్థానిక భాజపా ఎంపీ రాజేశ్ మిశ్ర విభిన్నంగా స్పందించారు. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే లీలా సాహు (25) అనే మహిళ ఈ మేరకు ఎంపీని నిలదీస్తూ ఏడాది కిందట ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారని ఓ వీడియోలో విమర్శించారు. గ్రామంలో తనతోపాటు అయిదుగురు మహిళలు గర్భంతో ఉన్నారని, పది కిలోమీటర్ల దూరంలోని ఆసుపత్రికి వెళ్లేందుకు సరైన రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతున్నట్లుగా ఆమె పేర్కొన్నారు. తన ప్రసవం జరిగాక నేరుగా దిల్లీకి వెళ్లి కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఫిర్యాదు చేస్తానని కూడా చెప్పారు. దీనిపై ఎంపీ రాజేశ్ మిశ్ర స్పందిస్తూ.. “అంబులెన్సులు అందుబాటులో ఉన్నందున ఆ గ్రామానికి ఇబ్బందేమీ లేదు. ఆమె ప్రసవం తేదీ చెబితే వారం రోజులు ముందే ఆసుపత్రికి తరలిస్తాం. కొంతమంది సోషల్ మీడియా ద్వారా ప్రచారం కోరుకొంటున్నారు” అని వ్యాఖ్యానించారు.

ఆర్పీఎఫ్‌కు
తొలిసారి మహిళా సారథి



దిల్లీ: సీనియర్ ఐపీఎస్ అధికారి సోనాలీ మిశ్ర రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. ఆర్పీఎఫ్‌కు ఒక మహిళా అధికారి సారథ్యం వహించడం ఇదే తొలిసారి. సోనాలీ మిశ్ర 1993 ఐపీఎస్ బ్యాచ్ మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందినవారు. 2026 అక్టోబరు 31 వరకు ఆమె ఆర్పీఎఫ్ డీజీ పదవిలో ఉంటారని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

పిలిస్తే...పలుకుతా!



జోరు వానలో హైవేపై వస్తున్నాం.. సడన్‌గా కారు బ్రేక్ డౌన్ అయింది.. ఎవరైనా సాయం చేస్తారా?

రాత్రి హైవేకి అడ్డంగా లారీ ఆగిపోయింది... చాలా సేపటి నుంచి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ పరిస్థితిని సరిచేయమని ఎవరిని అడగాలి?

వీటన్నిటికీ ఒకటే సమాధానం డయల్...1033

ఏం చేయాలి?

- హైవేలో ప్రయాణిస్తున్నప్పుడు ఏదైనా సమస్య వచ్చినప్పుడు 1033కి కాల్‌చేస్తే అది ఎన్‌హెచ్ఏఐ సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు వెళ్తుంది.
- వెంటనే సంబంధిత హైవేలోని టోల్‌ప్లాజా నిర్వాహకులను అప్రమత్తం చేస్తారు. అక్కడుండే సిబ్బంది సాయం అందించేందుకు వస్తారు.

చాలా సదుపాయాలు...



- ప్రతి టోల్‌ప్లాజా పరిధిలో అంబులెన్స్‌లు, పెట్రోలింగ్ వాహనాలు, ఆధునిక యంత్రసామగ్రితో ఉండే క్రేన్స్ అందుబాటులో ఉంటాయి.
- హైవేలపై ట్రాఫిక్ సమస్య తలెత్తినా, ఎవరైనా గొడవ చేస్తున్నా, రహదారిపై వాహనాలు నిలిపేసినా 1033కి కాల్‌చేస్తే.. హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి చర్యలు చేపడతారు.
- ఏపీలోని కాజా, బొల్లాపల్లి టోల్‌ప్లాజాల పరిధిలో ఐసీయూతో కూడిన అత్యాధునిక అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. ఐసీయూ ఆన్ వీల్స్ పేరిట వీటిని ప్రవేశపెట్టారు.
- వాహనాలు అడ్డంగా నిలిచిపోయిన సందర్భాల్లో వాటిని పక్కకు తీసేందుకు క్రేన్స్ సదుపాయం ఎన్‌హెచ్ఏఐ ప్రతి హైవేపై ఏర్పాటుచేసింది. వీటిలో హైడ్రాలిక్ రెస్క్యూ టూల్స్, గ్యాస్‌కట్టర్లు, హైవే క్లీనింగ్ పరికరాలు ఉంటాయి.

ఎన్‌హెచ్ 16... ప్రత్యేకం!

- ఏపీలోని ఇచ్ఛాపురం నుంచి తడ వరకు ఉన్న ఎన్‌ఎచ్-16పై ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే నగదు రహిత చికిత్స అందించే ఏర్పాట్లుచేశారు.
- ఈ మేరకు బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఎన్‌హెచ్ఏఐ ఒప్పందం చేసుకుంది.
- ఈ హైవేపై ప్రమాదం జరిగి, క్షతగాత్రులైతే ఒక్కొక్కరికి రూ.30 వేల వరకు నగదు రహిత వైద్యం పొందేందుకు వీలు కల్పించింది. ప్రమాదం జరిగిన 48 గంటల్లో ఇది చెల్లుబాటు అవుతుంది.
- తెలంగాణలోని ముఖ్యమైన హైవేల్లో కూడా ఇలాంటి సదుపాయం కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

- ఈనాడు, అమరావతి

కదిలే ఇల్లుతో... ప్రకృతి ఒడిలోకి!

- కారవాన్‌తో అద్భుత ప్రయాణం
- తెలుగు రాష్ట్రాల్లో కొత్తరకం పర్యాటకం

ప్రోత్సహిస్తున్న తెలంగాణ, ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థలు

ఈనాడు, హైదరాబాద్

కారవాన్... సకల సౌకర్యాలతో రోడ్లపై పరుగులు తీసే ఆధునిక పొదరిల్లు. అభిరుచి ఉన్న పర్యాటకులను ఆకర్షిస్తూ పర్యాటకరంగాన్ని కొత్తదారుల్లో పరుగులు తీయించడంలో ఇవి కీలకంగా మారుతున్నాయి. కేరళ, కర్ణాటక, మహారాష్ట్రల్లో ఆదరణ పొందుతున్న ఈ వాహనాలు ఇటీవల తెలుగు రాష్ట్రాల్లోనూ విరివిగా కనిపిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థలు సైతం కారవాన్‌లను అందుబాటులోకి తెచ్చాయి. హైదరాబాద్, విజయవాడ నగరాల్లో కొన్ని ప్రైవేటు సంస్థలూ అద్దెకిస్తున్నాయి. కొన్నింట్లో ఎనిమిది మంది, మరికొన్నింట్లో 10-12 మంది ప్రయాణించొచ్చు.

ఎక్కడెక్కడికి వెళ్లొచ్చంటే...

తెలంగాణలోని లక్నవరం, సోమశిల, నల్లమల అడవులు, నాగార్జునసాగర్, కాళేశ్వరం, బొగత జలపాతం... ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, అరకు, సూర్యలంక బీచ్... కర్ణాటకలోని బెంగళూరు, మైసూర్, మడికెరి... తమిళనాడులో మదురై, ఊటీ, కొడైకెనాల్... కేంద్ర పాలిత ప్రాంతం పాండిచ్చేరి... కేరళలోని మున్నార్, టెక్కెడి, అలెప్పి... వంటి అనేక ప్రదేశాలకు వెళ్లొచ్చు. జలపాతాల సమీపంలో, ఎత్తైన కొండల దగ్గర కారవాన్‌లో బసచేసి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించొచ్చు. కొందరు వారణాసి, ప్రయాగ్‌రాజ్, అయోధ్యలకు వెళ్లివస్తున్నారు.



స్నానాల గది



థియేటర్ గది



కమోడ్..

ట్రిప్ ప్లాన్ కీలకం

ఎక్కడికి వెళుతున్నామో అక్కడి వాతావరణం, భద్రత చూసుకోవాలి. మొబైల్ సిగ్నల్స్ తప్పనిసరిగా చెక్ చేసుకోవాలి. వాతావరణానికి అనుకూలమైన వస్తువుల్ని తీసుకెళ్లాలి. రాత్రివేళ వాహన పార్కింగ్ ప్రదేశం కీలకమైంది. జనరేటర్ తప్పనిసరి ఉండాలి. దూరప్రయాణమైతే ఇద్దరు డ్రైవర్లు ఉండటం మేలు.

ఇలా బుక్ చేసుకోవచ్చు...

ఏపీటీడీసీ... ఒక ప్రైవేటు సంస్థతో కలిసి ఇటీవల రెండు కారవాన్‌లను అందుబాటులోకి తెచ్చింది. గండికోట-హైదరాబాద్, సూర్యలంక-హైదరాబాద్ మార్గాల్లో నడపనుంది. వీటిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్లతోపాటు ప్రైవేటు సంస్థల వెబ్‌సైట్‌ల ద్వారా బుక్ చేసుకోవచ్చు. కిలోమీటర్లు, రోజుల వారీగా అద్దెలు ఉంటాయి.



తెలంగాణ టూరిజం అభివృద్ధి సంస్థ సిద్ధం చేసిన కారవాన్

ఇదీ ఛార్జీల విధానం (సుమారుగా)

- తెలంగాణ టూరిజం కార్పొరేషన్ కారవాన్‌లో 9 సీట్లు, 4 బెర్తులు ఉంటాయి. ఇందులో దూర ప్రాంతాలకు కి.మీ. ఛార్జి రూ.70. రోజుకు 350 కి.మీ. కనీస దూరం లెక్కిస్తారు. అదనంగా మోటారు వెహికిల్ ట్యాక్స్ రోజుకు రూ.500. హైదరాబాద్ నుంచి లక్నవరం(రానూపోను 450 కి.మీ.) ఒక రోజులో వెళ్లి వస్తే రూ.32 వేలు అవుతుంది. అదే బెంగళూరుకు(రానూపోను 1,150 కి.మీ.) రెండు రోజుల్లో వెళ్లి వస్తే రూ.81,500 ఛార్జి అవుతుంది. ఒకవేళ లోకల్ ట్రిప్ చేస్తే 8 గంటలు 80 కి.మీ.కు రూ.14,000 అవుతుంది.
- ప్రైవేటు ఆపరేటర్ల కారవాన్‌లో... 4 రిక్లయినర్ సీట్లు, 4 బెర్తులుంటాయి. ఒక రోజుకు రూ.25 వేలు అవుతుంది. వీటిల్లో డీజిల్ ఖర్చు పర్యాటకులే భరించాలి. కి.మీ.కు రూ.20-25 అవుతుంది.



పరుపు

అబ్బో... ఫైవ్‌స్టార్ వసతులు

లోపలంతా చల్లటి ఏసీ. సౌకర్యవంతమైన రిక్లయినర్ సీట్లు. నచ్చింది వండుకునేందుకు చక్కని వంటశాల. అందుబాటులో ఫ్రిడ్జ్. అలసట తీర్చుకునేందుకు మసాజ్ ఛైర్. అత్యాధునిక స్నానాల గది... అక్కడే ఎలక్ట్రానిక్ కమోడ్. నిద్రించేందుకు మెత్తటి పరుపులు. బయటి ప్రపంచంతో నిత్యం అనుసంధానమై ఉండేందుకు వైఫై. సమావేశాలను నిర్వహించుకునేందుకు ఆడియో, వీడియో సౌకర్యాలు. సినిమాలు చూసేందుకు పెద్ద టీవీ... అబ్బో ఒక్క మాటలో చెప్పాలంటే కారవాన్‌లు రోడ్లపై పరుగులు తీసే ఆధునిక ఇల్లు/చిన్నపాటి ఫైవ్‌స్టార్ హోటల్ మాదిరి ఉంటున్నాయి.

వల నిండుగా.. జేబు నిండగా!



కాకినాడ సముద్ర తీరంలో ఉప్పాడకు చెందిన 20 మంది మత్స్యకారులకు భారీగా చేపలు చిక్కాయి. సుమారు 1,000 కిలోల వరకు దొరకడంతో కష్టానికి ఫలితం దక్కిందంటూ వారు ఆనందం వ్యక్తం చేశారు. వీటిలో ఎక్కువగా బొంతలు, టైగర్ రొయ్యలు, కారలు, నెత్తళ్లు ఉన్నాయని, ఈ వేటతో తమకు జేబులు నిండినట్లేనని మురిసిపోయారు. - ఈనాడు, కాకినాడ



గోవులపల్లె.. ఈ గాయిద్‌పల్లి

ఇంటి ముందుకు ఆవు వస్తే.. శుభమని భావించి దండం పెట్టేందుకే ఈ రోజుల్లో ఆసక్తి చూపిస్తారు. వాటిని సాకేవారు మాత్రం తగ్గిపోతున్నారు. గ్రామాల్లోనూ ఒకటి అర తప్ప గోవుల మందలు కానరాని రోజులివి. తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లా మామడ మండలం గాయిద్‌పల్లి మాత్రం.. తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తున్న ఆవుల పోషణను వదిలిపెట్టలేదు. ఇప్పటికీ అక్కడ వంద గోవులున్న మందలు ఆరేడు కనిపిస్తాయి. 150 ఇళ్లున్న ఆ ఊరిలో జనాభా 756 కాగా.. ఆవులు 1,076 ఉండడం అక్కడి ప్రత్యేకతను చాటుతోంది. వాటి పోషణతో మంచి ఆదాయమే వస్తుందని పలువురు రైతులు తెలిపారు. - న్యూస్‌టుడే, మామడ



ఆకుకూరల వివరాలను ట్యాబ్‌లో పొందుపరుస్తున్న ఉదయ్‌కుమార్, సల్మా ★ కొబ్బరిపొట్టు ఉన్న సంచిలో తోటకూర

పచ్చని ఆలోచన.. ఉపాధికి ఆలంబన

యువత వినూత్న ఆలోచనలతో ముందుకెళితే.. ఉపాధికి ఢోకా ఉండదని నిరూపించారు తిరుపతి జిల్లా వరదయ్యపాలేనికి చెందిన ఉదయ్‌కుమార్. బీకాం చదివిన ఆయన చంద్రగిరి మండలం తొండవాడ నుంచి శానంబట్లకు వెళ్లే మార్గంలో 2019-22 మధ్య రెండెకరాలు కౌలుకు తీసుకుని ఆకుకూరలు సాగు చేశారు. పంటను వినూత్న పద్ధతిలో మార్కెటింగ్ చేసి నిలదొక్కుకున్నారు. అనంతరం ఆయనకు మోహన్‌రాజ్, పరంధామ్, సల్మా, చెంచయ్యలు తోడయ్యారు. ప్రస్తుతం వీరంతా 'అలైవ్ లీఫ్స్' పేరుతో తొమ్మిదెకరాల్లో తొమ్మిది రకాల ఆకుకూరలు పండిస్తున్నారు. వాటిని పొలం నుంచి వినియోగదారులకు చేర్చే క్రమంలో 2, 3 రోజులు నిల్వ ఉండేలా కొబ్బరి పొట్టులో ఉంచి ప్రత్యేకంగా ప్యాక్ చేస్తున్నారు. ఆకుకూర కొంటే కొబ్బరి పొట్టు ఎరువు ఉచితంగా వస్తుందని, దాన్ని ఇళ్లలో పెంచుకునే మొక్కలకు వినియోగించవచ్చని చెబుతూ మార్కెట్ చేస్తున్నారు. ప్రస్తుతం వీరు తిరుపతి, చిత్తూరు, చెన్నై, బెంగళూరుకు ఆకుకూరలు సరఫరా చేస్తున్నారు. వీరి వద్ద 32 మంది ఉపాధి పొందుతున్నారు. - ఈనాడు, తిరుపతి

భార్యకు విడాకులు.. పాలతో స్నానం!



భార్య నుంచి విడాకులు మంజూరైన సందర్భాన్ని అస్సాంకు చెందిన మాణిక్ అలీ ఓ వింత వేడుకలా జరుపుకొన్నాడు. 40 లీటర్ల పాలతో స్నానం చేసి.. ఇక నుంచీ తాను స్వేచ్ఛాజీవినంటూ సంబరంగా చాటాడు. నల్బాడీ జిల్లాలోని ముకల్మువా ఠాణా పరిధికి చెందిన ఇతడికి భార్య నుంచి విడాకులు మంజూరయ్యాయి. "ఆమె తన ప్రియుడితో రెండుసార్లు పారిపోయి మళ్లీ వచ్చింది. నా బిడ్డ కోసం వివాహ బంధాన్ని కొనసాగించడానికి నేను నిజాయతీగా ప్రయత్నించా. ఆమె అదే తప్పును పదే పదే చేస్తుంటే.. ఇక భరించలేక విడాకులు తీసుకున్నా" అని మాణిక్ అలీ తెలిపాడు. చట్టబద్ధంగా విడాకులు పొందాక కొత్త జన్మ ఎత్తినట్లుగా ఉందని, కొత్త జీవితం ప్రారంభానికి గుర్తుగా పాలతో స్నానం చేసినట్లు వివరించాడు. - ఈటీవీ భారత్

సెల్ఫీ అంటూ భర్తను నదిలోకి తోసేసిన భార్య!



భర్తతో కలిసి సెల్ఫీకి పోజిచ్చిన ఆ మహిళ ఉన్నట్టుండి అతడిని నదిలోకి తోసేసింది. కర్ణాటక-తెలంగాణ సరిహద్దులో రాయచూరు తాలూకా గుర్జాపూర్ వంతెన వద్ద ఈ ఘటన చోటు చేసుకొంది. కర్ణాటకలోని రాయచూరు జిల్లా శక్తినగర్‌కు చెందిన తాతప్పకు స్థానికురాలైన సుమంగళితో మూడు నెలల క్రితం వివాహమైంది. పెళ్లయినప్పటి నుంచీ వారి మధ్య గొడవలు జరుగుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రం తాతప్ప తన భార్యతో కలిసి పడిగేరి గ్రామం నుంచి వెళ్తూ గుర్జాపూర్ వంతెన వద్దకు చేరుకున్నారు. ఇక్కడ సెల్ఫీ దిగుదామని సుమంగళి అడిగింది. దీంతో బ్రిడ్జి అంచున నిలబడి ఇద్దరూ కవర్ అయ్యేలా ఫొటో తీయడానికి ఆయన ప్రయత్నించారు. అంతలోనే నదిలోకి పడిపోయారు. ఈత రావడంతో ప్రవాహాన్ని దాటుకొని ఓ బండపైకి చేరుకున్నారు. అటుగా వెళ్తున్న వాహనదారులు అతడిని గమనించి తాళ్ల సాయంతో రక్షించారు. వంతెనపైకి చేరుకున్న తాతప్ప 'నువ్వే నన్ను తోసేశావు' అని భార్యపై ఆగ్రహం వ్యక్తం చేయగా, 'నేను తోయలేదు, ప్రమాదవశాత్తు నువ్వే పడిపోయావు' అని ఆమె చెప్పడం గమనార్హం. -న్యూస్‌టుడే, రాయచూరు, కృష్ణా

జామెట్రీ బాక్సే ఆయుధం..

కిడ్నాప్ నుంచి తప్పించుకొన్న బాలిక

ఠాణె: ఆపద ముంచుకొచ్చినపుడు బెంబేలు పడిపోకుండా.. కాస్త తెగించి బుద్ధికి పని చెబితే పరిష్కారం దొరక్కపోదు. మహారాష్ట్రలోని ఠాణె జిల్లా భివండీకి చెందిన విద్యార్థిని (16) ఇదే పని చేసి.. పెద్ద ఉపద్రవం నుంచి తప్పించుకొంది. జులై 9న (బుధవారం) ఆ విద్యార్థిని స్కూలుకు వెళ్లేందుకు ఓ ఆటో ఎక్కింది. అప్పటికే అందులో గుర్తుతెలియని మరో వ్యక్తి ఉన్నాడు. ఆటో పాఠశాలను సమీపించగానే ఆపమని ఆమె కోరింది. డ్రైవరు మరింత వేగం పెంచి ముందుకు పోనిచ్చాడు. నిర్ఘాంతపోయిన బాలిక వెంటనే తేరుకొని తన బ్యాగులో నుంచి జామెట్రీ బాక్సు పరికరాలను బయటకు తీసి డ్రైవరుపై దాడి చేసింది. పక్కనున్న వ్యక్తి మీదకు వస్తుండగా బలంగా అతణ్ని తోసివేసి, కదులుతున్న ఆటోలో నుంచి కిందికి దూకేసింది. ఆటో అలాగే ముందుకు వెళ్లిపోగా, స్వల్పగాయాలతో బాలిక పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వెళ్లాక జరిగినదంతా తల్లికి చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ తదితర నేరాల కింద కేసు నమోదుచేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈఏపీసెట్ వెబ్‌ఐచ్ఛికాలపై సందిగ్ధత

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్ ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీసెట్ కౌన్సెలింగ్ వెబ్ ఐచ్ఛికాలపై సందిగ్ధత నెలకొంది. సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆదివారం నుంచి బ్రాంచీలు, కళాశాలల ఎంపికకు వెబ్‌ఐచ్ఛికాలు ప్రారంభం కావాలి. కానీ, శనివారం అర్ధరాత్రి వరకూ కళాశాలల అనుమతులు, సీట్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు విడుదల కాలేదు. ఒకవేళ జీవోలు ఆదివారం ఉదయం ఇస్తే వెబ్‌ఐచ్ఛికాల నమోదు సాయంత్రం నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మొదట ప్రకటించిన కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకారం వెబ్‌ఐచ్ఛికాలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. అయితే కళాశాలల అనుమతుల కోసమంటూ దీన్ని 13వ తేదీకి మార్చారు. ఇప్పుడు ఇందులోనూ జాప్యం జరుగుతోంది.



మానసిక ఒత్తిడిని తగ్గించుకొనే మార్గాలు

1. ప్రతికూల విషయాలకు స్పందించకపోవడం.
2. ఇతరులకు సాయం చేయడం.
3. ఇతరుల నుంచి ఏదీ ఆశించకపోవడం.
4. నిజాయతీగా ఉండటం.
5. చెడు చేసినవారినీ క్షమించడం.
6. ఫిర్యాదులు చేయకపోవడం.
7. కృతజ్ఞత చూపడం.
8. సజ్జనులతో స్నేహాన్ని కొనసాగించడం.

- ఛార్లెస్ క్యాంప్‌బెల్, ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్

ఉత్తరాంధ్రకు పగడాల హారం!

- జడ్ఎస్ఐ అధ్యయనంలో పగడపు దిబ్బల గుర్తింపు
- అరుదైన జీవవైవిధ్యానికి ఆవాసంగా మారుతోందని వెల్లడి
- అంతర్జాతీయ జర్నల్‌లో తాజాగా ప్రచురణ

ఈనాడు - విశాఖపట్నం



రాష్ట్ర పరిధిలో విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని తీరం అద్భుతమైన సముద్ర జీవవైవిధ్యానికి నెలవుగా మారింది. ఈ ప్రాంతాల్లోని సముద్రంలో అరుదైన పగడపు దిబ్బలు వృద్ధి చెందుతున్నాయి. పూడిమడక, రుషికొండ, మంగమారిపేట, చింతపల్లి తీరాల్లో అధిక సంఖ్యలో ఉన్నట్లు జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జడ్ఎస్ఐ) గుర్తించింది. ఈ అధ్యయన వివరాలు అంతర్జాతీయ జర్నల్ 'ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఆర్కైవ్స్'లో తాజాగా ప్రచురితమయ్యాయి. దేశ సముద్ర జీవ వైవిధ్యంలో ఇదో కీలక మైలురాయని పేర్కొంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని పగడపు దిబ్బలు, నాచు గొప్ప వైవిధ్యాన్ని కలిగి ఉంటాయి. ఇటీవల వాతావరణ మార్పులు, సముద్ర కాలుష్యం, అధికంగా చేపలు పట్టడం వంటి చర్యలు వీటికి ముప్పుగా పరిణమించాయి. దీంతో ఈ అరుదైన సంపద మన రాష్ట్ర తీరంలో ఉందా..? ఉంటే వాటి పరిస్థితి ఏంటని జడ్ఎస్ఐ 2019 నుంచి 2023 వరకు పరిశోధన సాగించింది. అనేక ప్రదేశాల్లో స్కూబా డైవింగ్, డిజిటల్ ఫొటోగ్రఫీ ఆధారంగా వివరాలు సేకరించింది. శాస్త్రవేత్తలు డా.రఘునాథన్, యోగేష్‌కుమార్, మరిముత్తు, తమల్ మండల్, ఆర్య సేన్, ప్రదీప్ పండా, స్కూబా డైవింగ్ నిపుణుడు బలరాంనాయుడు సాయంతో పరిశోధన చేపట్టారు. తీరానికి దగ్గరగా ఉండటంతో మంగమారిపేట, పూడిమడకలోని దెబ్బతింటున్నట్లు పేర్కొన్నారు.

అధ్యయనంలో గుర్తించిన అరుదైన సంపద

- అనకాపల్లి, విశాఖ, విజయనగరం తీరాల్లోని 4 ప్రాంతాల్లో 15 నమూనాల ఆధారంగా అధ్యయనం చేశారు.
- విజయనగరం జిల్లా చింతపల్లిలో 12, రుషికొండలో 6, అనకాపల్లి జిల్లా పూడిమడకలో 5, విశాఖ జిల్లా మంగమారిపేట వద్ద 3 అరుదైన ప్రదేశాలను గుర్తించారు.
- ఆ దిబ్బలు చింతపల్లిలో 23 %, రుషికొండ వద్ద 20, పూడిమడకలో 15, మంగమారిపేట వద్ద 5% మేర విస్తరించినట్లు తేల్చారు. అధ్యయనంలో కొత్తగా 13 రకాల సీ స్లగ్స్, 11 రకాల చేప జాతులు, 2 పీతల రకాలు గుర్తించారు.
- మన దేశ సముద్రంలో ఇప్పటి వరకూ కనిపించని 'వింటో మార్కెడెన్ తలాస్‌నెస్' అనే చేప రాష్ట్ర పగడపు దీవుల్లో పెరుగుతున్నట్లు కనుగొన్నారు.







ఉత్తరాంధ్ర సాగర తీరం లోపల అందాలు ★ ఉత్తరాంధ్ర తీరంలో గుర్తించిన అరుదైన చేప

కరెంటు సమస్యకు ఫోన్‌తో చెక్!

వెబ్‌సైట్, టోల్ ఫ్రీ, వాట్సప్‌లతో ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయొచ్చు

ఈనాడు, అమరావతి: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి గతంలో మాదిరిగా సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఒక్క బటన్ క్లిక్ చేస్తే చాలు దానిపై అధికారులు అప్రమత్తం అవుతారు. ఒక్క ఫోన్‌కాల్ చేస్తే ఇట్టే పరిష్కరిస్తారు. ఇంటి నుంచి కాలు బయట పెట్టకుండానే సమస్య పరిష్కరించుకోవచ్చు. దీనికోసం డిస్కంలు వివిధ సాంకేతిక మార్గాలను అందుబాటులోకి తెచ్చాయి.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదుకూ అవకాశం

ఒకవేళ మీ ఇల్లు మరో డిస్కం పరిధిలో ఉన్నా, మీరు ఇతర రాష్ట్రాల్లో ఉన్నా.. అప్పుడు సంబంధిత డిస్కం వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో సమస్య ఉంటే సీపీడీసీఎల్ వెబ్‌సైట్‌కు, ఉమ్మడి ఉభయ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధి అయితే ఈపీడీసీఎల్‌కు, నెల్లూరు, రాయలసీమ జిల్లాలైతే ఎస్‌పీడీసీఎల్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు.

- ఆన్‌లైన్‌లో ఫిర్యాదుకు ఇబ్బంది ఉంటే వాట్సప్ నంబర్లలోనూ ఫిర్యాదుకు వెసులుబాటు ఉంది. వీటి ద్వారా ఎక్కడి నుంచైనా ఫిర్యాదు చేయవచ్చు.
- ఇవి కాకుండా 3 డిస్కంలకు యాప్‌లున్నాయి. గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని అందులోనూ సమస్య పేర్కొనొచ్చు.

డిస్కం పరిధిలో ఉంటే.. 1912

విద్యుత్తు సమస్యల పరిష్కారం కోసం 24 గంటలూ పనిచేసే ఫిర్యాదు కేంద్రాన్ని డిస్కంలు ఏర్పాటు చేశాయి. టోల్ ఫ్రీ నం:1912కు ఫోన్ చేస్తే.. టవర్ లొకేషన్ ఆధారంగా ఆ కాల్ సంబంధిత డిస్కంకు వెళ్తుంది. అక్కడి సిబ్బంది ఫిర్యాదు తీసుకుంటారు. ఫిర్యాదు మొత్తం ఐవీఆర్ఎస్‌లో రికార్డ్ అవుతుంది.



వెబ్‌సైట్‌లో ఫిర్యాదు ఇలా..

- వెబ్‌సైట్‌లో వినియోగదారుల ఆప్షన్‌పై క్లిక్ చేసి.. కంప్లైంట్ రిలేటెడ్‌లో 'కంప్లైంట్'పై క్లిక్ చేయాలి.
- 16 అంకెల సర్వీసు నంబరును నమోదు చేసి, సబ్‌మిట్ చేయాలి.
- కంప్లైంట్ రిజిస్టర్‌లో.. మీకు దగ్గరలోని ల్యాండ్ మార్క్, ఈ-మెయిల్, మొబైల్ నంబరు నమోదు చేయాలి.
- మీ విద్యుత్తు సమస్యను ఎంచుకోవాలి.
- కంప్లైంట్ సబ్ టైప్స్‌లో.. ఏ విధమైన సమస్య ఉందనేది ఎంపిక చేసి, చిరునామా నమోదు చేయాలి.
- మొబైల్‌కు కంప్లైంట్ నంబరు వస్తుంది. దీంతో ఫిర్యాదుపై చర్యలు ఏ దశలో ఉన్నాయో తెలుసుకోవచ్చు.

3 డిస్కంల టోల్ ఫ్రీ, వాట్సప్ నంబర్లు, వెబ్‌సైట్లు	డిస్కం	టోల్ ఫ్రీ	వాట్సప్	వెబ్‌సైట్
	ఈపీడీసీఎల్	1800 425 55333	94936 81912	www.apeasternpower.com
	సీపీడీసీఎల్	1800 425 5058	---	www.apcpdcl.in
	ఎస్‌పీడీసీఎల్	1800 425 155333	83744 51912, 83743 31912	www.apspdcl.in

గిరిజనుల రాజ్మా 'లీవి'!


రాజ్మా విత్తనాలు

- నాడు గంజాయి సాగుతో కేసుల భయం..
- నేడు స్వేచ్ఛగా పొలం పనులు
- గతేడాది ఖర్చులన్నీ పోను ఎకరాకు రూ.25 వేల నికర ఆదాయం

ఈనాడు, అమరావతి: ఏడాదిన్నర కిందటి వరకు గంజాయి పండించిన వేల ఎకరాల్లో.. 2024 నుంచి రాజ్మా (ఫ్రెంచి చిక్కుడు) వికసించింది. అప్పట్లో పోలీసుల తనిఖీలు, నిర్బంధాలతో క్షణక్షణం భయం భయంగా జీవించిన అల్లూరి జిల్లా పాడేరులోని 11 మండలాల గిరిజన రైతులు.. కూటమి ప్రభుత్వంలో ఏడాది నుంచి స్వేచ్ఛగా పొలం పనులు చేసుకుంటున్నారు. 90% రాయితీపై విత్తనాలు అందిస్తుండడంతో 22,500 ఎకరాల్లో రాజ్మా పండించారు. గతేడాది రూ.56.25 కోట్లు ఆర్జించారు. రైతుల్లో వచ్చిన మార్పు చూసి ఈ ఏడాది సాగును మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. పాడేరు డివిజన్‌లో గతంలో భారీగా గంజాయి సాగయ్యేది. సంఘవిద్రోహ శక్తులు గిరిజన రైతులకు డబ్బు ఆశ చూపి.. కొండ ప్రాంతాల్లో గంజాయి సాగు చేయించారు. వారి కుటుంబాలను ప్రమాదంలోకి నెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయ శాఖ రైతుల్లో అవగాహన తెచ్చే చర్యలు ప్రారంభించింది. గంజాయి సాగు దుష్పరిణామాలను వివరించింది. రాజ్మా సాగుతో ఎలాంటి ఆందోళన లేకుండా గౌరవంగా జీవించే అవకాశం ఉంటుందని.. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చింది.


అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో గిరిజనుల పొలంలో రాజ్మా పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

దీంతో రైతులు క్రమంగా రాజ్మా సాగుకు మళ్లారు.

90% రాయితీపై 4,500 క్వింటాళ్ల విత్తనాలు

గతేడాది 22,500 ఎకరాల్లో రాజ్మా సాగుకు వ్యవసాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. 35,618 మంది రైతులకు 4,500 క్వింటాళ్ల విత్తనాలను 90% రాయితీపై ఇచ్చింది. 100 నుంచి 110 రోజుల్లో పంట చేతికొచ్చే చింతపల్లి రెడ్, వైట్ విత్తనాలు ఇచ్చారు. దీంతో రైతులకు ఎకరాకు రూ.2,700 వరకు పెట్టుబడి ఆదా అయింది. సెప్టెంబరు మొదటి పక్షంలో వర్షాధారంగా సాగు చేస్తే.. డిసెంబరులో పంట చేతికొస్తుంది. ఏజెన్సీలోని రైతులు ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో రబీ పంటగా వేస్తారు.

ఎకరాకు పెట్టుబడి : రూ.10వేలు
దిగుబడి సగటున : 3.50 క్వింటాళ్లు
అమ్మకం ద్వారా వచ్చింది: రూ.35 వేలు (క్వింటాలు రూ.10 వేల చొప్పున)
ఖర్చులు పోను నికర ఆదాయం: రూ.25 వేలు
22,500 ఎకరాలకు వచ్చింది: రూ.56.25 కోట్లు

గిరిజన రైతులకు.. ఆర్థిక భరోసా

గంజాయి సాగులో కేసులు, కఠిన శిక్షలను వ్యవసాయశాఖ సిబ్బంది ద్వారా గిరిజన రైతులకు వివరించాం. కరపత్రాల ద్వారా ప్రచారం చేశాం. నీటి వసతి, వాతావరణ పరిస్థితులు, పంటల సరళిపై వ్యవసాయ అధికారులతో చర్చించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు గిరిజన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే చర్యలు చేపట్టాం. 90% రాయితీపై రాజ్మా విత్తనాలిచ్చాం. దీంతో గంజాయి సాగు తగ్గిపోయింది. ఈ ఏడాది జులై చివరి వారం నుంచి ఆగస్టు మొదటి వారంలోపు 4,900 క్వింటాళ్ల రాజ్మా విత్తనాలు అందిస్తాం.
– ఢిల్లీరావు, డైరెక్టర్, వ్యవసాయశాఖ

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో జస్టిస్ కృష్ణమోహన్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం చేయించి, ప్రసాదం అందజేశారు.

భగవద్గీత శ్లోకాలను నిత్యం వినాలి: గజల్ శ్రీనివాస్

శ్రీమద్భగవద్గీత శ్లోకాలను ఆవిష్కరించిన జస్టిస్ కృష్ణమోహన్

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: గజల్ శ్రీనివాస్ తెలుగు, సంస్కృతంలో ఆలపించిన శ్రీమద్భగవద్గీత శ్లోకాల పెన్ డ్రైవ్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ శనివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఆవిష్కరించారు. జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ గజల్ శ్రీనివాస్ మూడుసార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటుసంపాదించారని కొనియాడారు. అనంతరం గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ భగవద్గీత అనగానే ముందుగా గుర్తుకొచ్చే మహోన్నతుడు దివంగత ఘంటసాల వెంకటేశ్వరరావు అని, ఆయన 108 శ్లోకాలను అతిమధురంగా పాడారన్నారు. శ్రీమద్భగవద్గీత శ్లోకాలను వందభాషల్లో పూర్తిచేయాలన్న సంకల్పంతో ఏడాదిగా పనిచేస్తున్నానని, ప్రస్తుతం 25 భాషల్లో 18 భగవద్గీత అధ్యాయాలు 701 శ్లోకాలతోపాటు సవివరంగా అర్థాలు తెలిపేలా సిద్ధం చేసినట్లు చెప్పారు. త్వరలో ప్రధాని మోదీ చేతుల మీదుగా వాటిని ఆవిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం తెలుగులో స్వరపరిచిన శ్లోకాలను శ్రీవారికి సమర్పిస్తున్నట్లు చెప్పారు. భగవద్గీత శ్లోకాలను అందరూ నిత్యం వినాలని, అందులోని భావాన్ని అర్థం చేసుకొని జీవించాలని ఆయన కోరారు.


గజల్ శ్రీనివాస్ ఆలపించిన 'శ్రీమద్భగవద్గీత' పెన్‌డ్రైవ్ ఆవిష్కరిస్తున్న జస్టిస్ వి.కృష్ణమోహన్ దంపతులు, చదలవాడ కృష్ణమూర్తి, ఆర్కే మహర్, రాములు, సురేంద్రనాయుడు, పి.హరిప్రసాద్, భానుప్రకాశ్‌రెడ్డి, విభీషణశర్మ



పిల్లలతో కలిసి పుస్తకాలు చదవండి

మీ పిల్లలకు మీరు నేర్పాల్సిన ముఖ్యమైన అలవాటు పుస్తక పఠనం. మీ పిల్లలతో కలిసి పుస్తకాలు చదవడం మొదలుపెడితే వారికి కూడా దానిపై అభిరుచి ఏర్పడుతుంది. కథలను మామూలుగా చదివి వినిపిస్తే పిల్లలకు ఆసక్తి కలగకపోవచ్చు. వాటిలోని పాత్రలను అభినయిస్తూ చదవడం, పిల్లలను కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేస్తే వారిలో ఉత్సాహం కలుగుతుంది. దీనివల్ల మీకు, మీ పిల్లలకు మధ్య అనుబంధం కూడా బలపడుతుంది.
– జెఫ్, పేరెంటింగ్ కోచ్

ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రవేశాలు నిరాకరించకూడదు: ఎస్ఎస్ఏ

ఈనాడు, అమరావతి: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల(సీడబ్ల్యూఎస్ఎన్)కు ప్రవేశాలు కల్పించేందుకు నిరాకరించకూడదని, సమీప పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారిని చేర్చుకోవాలని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల ప్రవేశాలకు సంబంధించిన మార్గదర్శకాలను ఆయన విడుదల చేశారు. "ఎలాంటి వివక్ష లేకుండా 6-18 ఏళ్ల పిల్లలకు ప్రవేశాలు కల్పించాలి. వారి వయసు ఆధారంగా తరగతిలో చేర్చుకోవాలి. పత్రాలు లేవనే కారణంతో ప్రవేశాలను తిరస్కరించకూడదు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు భవిత కేంద్రాల్లో.. లేదంటే ఇంటి వద్దనే విద్య అందిస్తున్నట్లు అయితే హాజరు రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఇంటి వద్ద బోధన పొందే విద్యార్థుల కోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి. వీరికి హాజరు మినహాయింపు ఇవ్వాలి" అని సూచించారు.

విశాఖలో రెండో 'బిమ్స్‌టెక్' పోర్టుల సదస్సు

జులై 14, 15 తేదీల్లో వీపీఏ ఆధ్వర్యంలో నిర్వహణ

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా మరో అంతర్జాతీయ సదస్సు జరగనుంది. జులై 14, 15 తేదీల్లో రెండో బిమ్స్‌టెక్ (బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్) పోర్టుల సదస్సుకు విశాఖ ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్ సహా ఏడు దేశాలు పాల్గొనే ఈ సదస్సును విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. 'బ్లూ ఎకానమీ, ఇన్నోవేషన్ అండ్ సస్టైనబుల్ పార్ట్‌నర్‌షిప్స్' అనే ఇతివృత్తంతో రెండో ఎడిషన్ జరగనుంది. రెండు రోజులు జరిగే ఈ సదస్సులో బంగ్లాదేశ్, భూటాన్, భారత్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాల ప్రతినిధులు, పోర్టు అథారిటీల అధికారులు, నౌకాశ్రయ నిపుణులు, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొంటారు. బంగాళాఖాతం తీరప్రాంతంలో ప్రాంతీయ నౌకాశ్రయాలు, ఓడల రవాణా, పర్యాటకం, పెట్టుబడులు తదితర రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడంలో బిమ్స్‌టెక్ కీలక పాత్ర పోషించనుంది. బిమ్స్‌టెక్ పోర్టుల తొలి సదస్సు 2019లో విశాఖపట్నంలోనే నిర్వహించడం విశేషం.

గురుకులాలతో లక్షల మంది తలరాతలు మార్చిన పీవీ

- మాజీ ప్రధాని విగ్రహావిష్కరణలో తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు, పీవీ కుమార్తె వాణీదేవి

హిందూపురం, పరిగి, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గురుకుల పాఠశాలలు ప్రారంభించి లక్షల మంది తలరాతలు మార్చారని తెలంగాణ సీఎస్, కొడిగెనహళ్లి గురుకుల ప్రతిభా పాఠశాల పూర్వవిద్యార్థి రామకృష్ణారావు కొనియాడారు. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం కొడిగెనహళ్లి గురుకుల ప్రతిభా పాఠశాలలో పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పీవీ కాంస్య విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు, పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు పాల్గొన్నారు. రామకృష్ణారావు మాట్లాడుతూ "మేము ఈ స్థాయికి చేరడానికి 50 ఏళ్ల క్రితం పీవీ ఏర్పాటుచేసిన గురుకులాలే కారణం. మారుమూల ప్రాంతాల్లో ఉన్న మాకు అత్యున్నత విద్య అందించటంతో ఇలా ఎదిగాం. గురుకుల విద్యాలయాల స్ఫూర్తితో జవహర్ నవోదయ విద్యాలయాలు తీసుకొచ్చి లక్షల మందికి నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తుండటంతో వారు దేశానికి సేవలు చేస్తున్నారు. పీవీ నరసింహారావు రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా పనిచేసి తన చతురతతో దేశ దశ, దిశలనే మార్చారు. నేడు దేశం ఆర్థికాభివృద్ధి సాధించిందంటే ఆనాడు ప్రధానిగా పీవీ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలే కారణం" అని గుర్తుచేశారు.


మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణలో శ్రీనివాసరాజు, సురభి వాణీదేవి, తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు తదితరులు

విద్యకు మించిన బలం మరోటి లేదు

విద్యకు మించిన బలం మరోటి లేదని నమ్మిన మహోన్నత వ్యక్తి పీవీ నరసింహారావు అని పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. తన తండ్రి చదువుకోవడానికి అనేక ఇబ్బందులు పడ్డారని, అలాంటి కష్టం మరెవరూ పడకూడదని గురుకుల, నవోదయ విద్యాలయాలను ప్రారంభించారన్నారు. తెలుగు భాషాభివృద్ధికి తెలుగు అకాడమీ ఏర్పాటుచేశారని పేర్కొన్నారు. ప్రధానిగా ఆయన ఏ దేశానికి వెళితే అక్కడి భాషలో మాట్లాడుతూ వారిని ఆకట్టుకొనేవారన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే.. పీవీ తనకు జీవితాన్ని అందించారని శ్రీనివాసరాజు అన్నారు. ఆయనకు నివాళిగా విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గురుకుల ప్రతిభా పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పెరుగు సురేశ్, కార్యదర్శి మస్తానయ్య, పాఠశాల ప్రిన్సిపల్ మత్స్యరాజ్, సంఘం ప్రతినిధులు సాల్మన్‌రాజ్, అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

పలు రాష్ట్రాల్లో తగ్గిన కొబ్బరి దిగుబడి

- తెల్లదోమ, నల్లముట్టి పురుగు ప్రభావం
- మిత్రపురుగులు అందించిన అంబాజీపేట శాస్త్రవేత్తలు

న్యూస్‌టుడే, అంబాజీపేట: కొబ్బరిని ఎక్కువగా సాగుచేసే తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో తెల్లదోమ, నల్లముట్టిపురుగు ఆశించడంతో దిగుబడులు పడిపోయాయి. ఇప్పుడు కొత్తగా రూట్‌విల్ట్ అనే తెగులు రావడంతో 20-25% కొబ్బరితోటలకు నష్టం వచ్చింది. ఈ తెగులు సోకిన కొబ్బరిమొక్కలను తొలగించడం తప్ప ప్రత్యామ్నాయం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తెల్లదోమ, నల్లముట్టిపురుగు నివారణకు ఉద్యానశాఖ, కొబ్బరి అభివృద్ధి బోర్డు సహకారంతో అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు గతంలో మిత్రపురుగులను పంపారు. వారు తోటల్లో వినియోగించకపోవడంతో పురుగులు దిగుబడిని దెబ్బతీశాయి. కోనసీమలో వాటిని వినియోగించడంతో పురుగు బారిన పడకుండా రైతులు కొబ్బరి తోటలను రక్షించుకున్నారు.

ల్యాబ్‌లో అభివృద్ధి చేసేందుకు శిక్షణ

2016-17లో కోనసీమలో కొబ్బరికి తెల్లదోమ వ్యాపించింది. 2023లో చింతలపూడి మండలం అల్లిపల్లిలో 300 హెక్టార్లలో కొబ్బరికి నల్లముట్టిపురుగు ఆశించి నష్టాన్ని తెచ్చింది. అప్పట్లో అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు నల్లముట్టిపురుగు నివారణకు మిత్రపురుగులను తోటల్లో వదిలారు. ఏడాదిన్నర క్రితం నల్లముట్టిపురుగు, తెల్లదోమ ఆశించిన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు మిత్రపురుగుల 'న్యూక్లియస్ కల్చర్'ను అంబాజీపేట పరిశోధన కేంద్రం నుంచి సరఫరా చేశారు. కర్ణాటకలోని అర్సికెరే ల్యాబ్‌లో అభివృద్ధి చేసేందుకు ఈ కల్చర్‌ను తాజాగా మరోసారి అందించారు. అర్సికెరే నుంచి వచ్చిన మహిళా ఉద్యోగులకు దీనిపై శిక్షణ ఇచ్చారు. కొబ్బరికి వ్యాపించే తెగుళ్లు, పురుగుల నివారణకు వినియోగించే మిత్రపురుగులను గతంలో తాము తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్రలకు అందించామని అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం కీటకశాస్త్ర విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.అనూష తెలిపారు.


కర్ణాటక అర్సికెరే ల్యాబ్ సిబ్బందికి న్యూక్లియస్ కల్చర్ అందజేస్తున్న అంబాజీపేట శాస్త్రవేత్తలు

నీట్ యూజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి దేశంలోని వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల ఆల్ ఇండియా, డీమ్డ్, సెంట్రల్, స్టేట్ కోటా సీట్ల భర్తీకి జాతీయ వైద్య మండలి.. కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసింది. మొదటి విడత కౌన్సెలింగ్ ఆల్ ఇండియా కోటా/డీమ్డ్/ కేంద్ర విశ్వవిద్యాలయాల్లో జులై 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించి, కళాశాలల్లో చేరడానికి ఆగస్టు 6ను చివరి తేదీగా నిర్ణయించింది. రెండో విడత కౌన్సెలింగ్ ఆగస్టు 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తారు. సీట్లు పొందిన వారు ఆగస్టు 29వ తేదీలోగా ఆయా వైద్య కళాశాలల్లో చేరాలి. మూడో విడత కౌన్సెలింగ్ సెప్టెంబరు 3 నుంచి 10వ తేదీ వరకు కొనసాగుతుంది. సీట్లు పొందిన విద్యార్థులు సెప్టెంబరు 18వ తేదీలోగా చేరాలి. స్ట్రే కౌన్సెలింగ్ సెప్టెంబరు 22 నుంచి 26 వరకు ఉంటుంది. రాష్ట్రాలకు సంబంధించి విశ్వవిద్యాలయాలు జులై 30 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించి, 12న కళాశాలల్లో చేరేందుకు చివరి తేదీగా ఎంసీసీ నిర్ణయించింది. రెండో విడత కౌన్సెలింగ్ ఆగస్టు 19 నుంచి 29 వరకు నిర్వహిస్తారు. మూడో విడత కౌన్సెలింగ్ అక్టోబరు 9 నుంచి 18వ తేదీ వరకు ఉంటుంది. స్ట్రే కౌన్సెలింగ్ సెప్టెంబరు 25 నుంచి 29 వరకు కొనసాగుతుంది. అక్టోబరు 3న కళాశాలల్లో చేరడానికి చివరి తేదీగా నిర్ణయించారు.

వైద్యారోగ్యశాఖ వాహనాల ఖర్చు ఎంత?

నివేదిక కోరిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్యశాఖలో ప్రభుత్వ వాహనాల లభ్యత, వినియోగంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. పలుచోట్ల అవసరాలకు వాహనాలు అందుబాటులో ఉండడం లేదని, మరికొన్నిచోట్ల వాహన సేవలను దుర్వినియోగం చేస్తున్నారని తనకందిన సమాచారంపై మంత్రి స్పందించారు. వాహనాల వినియోగంలో నిబంధనలు ఏమిటి? దుర్వినియోగంపై తీసుకున్న చర్యలేంటి? 2023-24, 2024-25 సంవత్సరాల్లో వాహన ఖర్చులు ఎంత? తదితర వివరాలు మంత్రి కోరారు. అధికారిక వాహనాల వినియోగాన్ని సమగ్రంగా పరిశీలించి, చేపట్టాల్సిన సంస్కరణలపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారు

కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు

ఈనాడు, అమరావతి: ప్రజలు, ప్రతిపక్షాల హక్కులను చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అణచివేస్తోందని వైకాపా అధ్యక్షుడు జగన్ శనివారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 'హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించకూడదు.. వాటిపై ఎవరూ మాట్లాడకూడదు.. అన్నట్లుగా ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోంది. ప్రజలు తమ సమస్యలు లేవనెత్తినా, వారికి మద్దతుగా విపక్షం గళం విప్పినా సహించడం లేదు. ఒక పద్ధతి ప్రకారం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించడంతో పాటు ప్రతిపక్షం అనేది లేకుండా చేయాలని చూస్తోంది. ప్రశ్నించే ఏ గొంతుకా ఉండొద్దనేది ప్రభుత్వ ఉద్దేశంగా స్పష్టమవుతోంది. గుంటూరు మిర్చియార్డు, రామగిరి, పొదిలి, సత్తెనపల్లి, బంగారుపాళ్యంలో నేను పర్యటించిన పుడు కేసులు నమోదు చేశారు. వైకాపా నాయకులు, రైతులపైనా కేసులు బనాయించారు. నా పర్యటనలకు ప్రజలు రాకుండా తీవ్ర నిర్బంధం విధిస్తున్నారు. వైకాపా నాయకులు, కార్యకర్తలకు నోటీసులు జారీ చేయడమే కాకుండా వారిని గృహనిర్బంధం చేస్తున్నారు' అని జగన్ ఆరోపించారు.

త్రీడీ చిత్రం.. బోధన వినూత్నం!

పుస్తకంలోని బొమ్మను త్రీడీ, వీడియోలోకి మార్చే యాప్



పేపర్‌పై ఉన్న గుండె చిత్రాన్ని 3డీలో చూపుతున్న మొబైల్ యాప్
★ అధ్యాపకులు డాక్టర్ కె.అరవింద శిల్ప, ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.పద్మశ్రీలతో విద్యార్థినులు బి.లోకేశ్వరి, ఎస్.ఝాన్సీ, ఆర్.యక్షిత

విశాఖపట్నం (ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు త్రీడీ విధానంలో సైన్స్ పాఠ్యాంశాలను బోధించే యాప్‌ను ఆవిష్కరించారు. పుస్తకంలో ఒక చిత్రాన్ని త్రీడీ నమూనా, వీడియోగా మార్పు చేసి వాస్తవ దృశ్యంగా ఈ 'యాప్' చూపిస్తుంది. దీని వల్ల పాఠం సులభంగా అర్థమవుతుందని విద్యార్థినులు చెబుతున్నారు. ఈ మేరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఎస్.ఝాన్సీ, బి.లోకేశ్వరి, ఆర్.యక్షితలు.. 'ఏఆర్ బేస్డ్ ఎడ్యుకేషన్ విజువలైజేషన్' అనే యాప్ రూపొందించారు. ఎటువంటి ఖర్చు లేకుండా కేవలం 45 రోజుల్లో దీన్ని పూర్తి చేశారు. సెల్‌ఫోన్‌లో ఈ యాప్ ఓపెన్ చేస్తే కెమెరా ఆన్ అవుతుంది. పుస్తకంలోని బొమ్మ(ఇమేజ్)పై కెమెరా పెట్టగానే 3డి నమూనాలో ఆ చిత్రాలు ప్రదర్శితమవుతాయి. వాటిని జూమ్ చేయవచ్చు. ఎడమ లేదా కుడివైపు తిప్పడం లాంటి ప్రక్రియలు చేయవచ్చు. ఇది ఇంటర్నెట్ లేకుండా పనిచేస్తుంది. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.పద్మశ్రీ ప్రోత్సాహం, అధ్యాపకులు డాక్టర్ కె.అరవింద శిల్ప సహకారంతో ఈ ఆవిష్కరణ చేసినట్లు విద్యార్థినులు తెలిపారు.

ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లపై సానుకూల నిర్ణయం

త్వరలో అధికారిక ప్రకటన: మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: పురపాలక పౌరుగు సేవల ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'కార్మికుల డిమాండ్లను సాధ్యమైనంత వరకు పరిష్కరించాలని మంత్రివర్గ ఉప సంఘాన్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటికే దీనిపై మంత్రుల కమిటీ పలుమార్లు చర్చించి కార్మికులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఆర్థిక శాఖతో చర్చించి ప్రభుత్వ నిర్ణయాన్ని త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తాం' అని వివరించారు.

వారికి కూలింగ్ పీరియడ్ అక్కర్లేదు

27 ఏళ్లుగా విడిగా ఉంటున్న జంటకు.. విడాకులు మంజూరు చేస్తూ హైకోర్టు తీర్పు

ఈనాడు, అమరావతి: వివాహమైన రెండేళ్ల తర్వాత విడిపోయి 27 సంవత్సరాలుగా వేర్వేరుగా జీవిస్తూ... తమకు విడాకులు ఇవ్వాలని ఓ జంట చేసిన అభ్యర్థనను హైకోర్టు అంగీకరించింది. పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకోవడానికి కనీసం ఆరు నెలలు వేచి ఉండాలనే కూలింగ్ పీరియడ్‌ను వీరి విషయంలో మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. '1998 నుంచి ఇరువురు వేర్వేరుగా జీవిస్తున్నారు. పరస్పర అంగీకారంతో విడాకులు కోరారు. ఇలాంటి వారు మరో ఆరు నెలలు (కూలింగ్ పీరియడ్) వేచి ఉండాల్సిన అవసరం లేదు. వీరికి విడాకులు మంజూరు చేస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ ఎం.కిరణ్మయితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

★ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఓ యువతితో 1996 ఆగస్టులో వివాహమైంది. 1997లో ఆ యువతి పుట్టింటికెళ్లింది. ఆమె భర్త 2000లో విజయవాడ కుటుంబ న్యాయస్థానంలో పిటిషన్ వేసి విడాకులు మంజూరు చేయాలని కోరారు. న్యాయస్థానం నిరాకరిస్తూ 2007లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై ఆయన హైకోర్టులో అప్పీల్ వేశారు. ఈ అప్పీల్‌లో ఇరువురూ తాజాగా అనుబంధ పిటిషన్ దాఖలు చేస్తూ పరస్పర అంగీకారానికి వచ్చామని, విడాకులు మంజూరు చేయాలని కోరారు.

ఈనాడు సినిమా

తండ్రిగా.. కొడుకుగా..!


అల్లు అర్జున్

కథానాయకుడు అల్లు అర్జున్.. దర్శకుడు అట్లీ కలయికలో ఓ బహుభాషా చిత్రం రూపొందుతోంది. సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మిస్తున్నారు. దీపికా పదుకొణె కథానాయిక. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో అల్లు అర్జున్ నాలుగు పాత్రల్లో కనిపించనున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం ప్రకారం.. దీంట్లో ఆయన తండ్రీ కొడుకుగా రెండు పాత్రల్లో కనువిందు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ రెండు పాత్రల కోసం లుక్స్ కూడా ఫైనల్ అయ్యాయి. ఇది సమాంతర ప్రపంచం, పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉన్న ఆసక్తికర కథతో రూపొందుతున్నట్లు వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా కోసం ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తోంది చిత్ర బృందం. దీని కోసం హాలీవుడ్‌కు చెందిన ఓ ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థ రంగంలోకి దిగింది. దీంట్లో దీపికతో పాటు మృణాల్ ఠాకూర్, రష్మిక కూడా నాయికలుగా కనిపించనున్నట్లు ప్రచారం సాగుతోంది.

ప్రేమ యుద్ధానికి ఏర్పాట్లు


అలియా భట్

గతేడాది 'జిగ్రా' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ అందాల తార అలియా భట్. ఇప్పుడామె ఓ ప్రేమికురాలిగా తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది. ఆమె, రణ్‌బీర్ కపూర్ జంటగా 'లవ్ అండ్ వార్' సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్నారు. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇందులో భాగంగా ఈ చిత్రానికి కీలకమైన యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 'ఈ ఏడాది చివరి నాటికి చిత్రీకరణను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు దర్శకుడు. ఇందులో భాగంగానే విక్కీ, రణ్‌బీర్‌ల మధ్య కొన్ని ముఖాముఖి సన్నివేశాలను చిత్రీకరించడానికి ప్లాన్ చేస్తున్నారు. దీని కోసం భారీ సెట్‌ను ఏర్పాటు చేశారు. ఆగస్టులో మొదలు కానుంది ఈ షెడ్యూల్. ప్రేమ కోసం జరిగే ఈ యుద్ధంలో అలియా కూడా పాల్గొంటుంద'ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

ప్రత్యేక గీతం కోసం సన్నద్ధం


చిరంజీవి


కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు వశిష్ఠ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. ఇది ఓ పాట మినహా ఇప్పటికే చిత్రీకరణ ముగించుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడా మిగిలి ఉన్న ఒక్క ప్రత్యేక గీతాన్ని తెరకెక్కించేందుకు సినీ వర్గాలు సిద్ధమవుతున్నాయి. దీని కోసం బాలీవుడ్ భామ మౌని రాయ్‌తో కలిసి చిరు ఈనెలాఖరు నుంచి రంగంలోకి దిగనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ పాట కోసం హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేస్తోంది చిత్ర బృందం. ఇప్పుడీ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిసింది. ఈ ఒక్క పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలందించగా.. ఈ చిత్రంలోని మిగిలిన అన్ని గీతాలకు ఎం.ఎం.కీరవాణి సంగీతమందించారు. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన ఈ సోషియో ఫాంటసీ థ్రిల్లర్ సెప్టెంబరు లేదా అక్టోబరులో తెరపైకి వచ్చే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఇక ప్రస్తుతం చిరంజీవి - అనిల్ రావిపూడి కలయికలో రూపొందుతున్న కొత్త సినిమా శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. ఇది వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

రాష్ట్రపతి చప్పట్లు కొట్టడం చూసి నా కల నిజమైందనుకున్నా - అనుపమ్ ఖేర్


అనుపమ్ ఖేర్, ద్రౌపదీ ముర్ము, బొమన్ ఇరానీ, శుభాంగి

భారత సాయుధ దళాల ధైర్యం, త్యాగాలకు నివాళిగా రూపొందిన చిత్రం 'తన్వి ది గ్రేట్'. ఈ సినిమాలో అనుపమ్ ఖేర్ నటిస్తూ, దర్శకత్వం వహించారు. తాజాగా ఈ చిత్రాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వీక్షించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆమె కోసం ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. "ద్రౌపదీ ముర్ము మా సినిమా చూడటం మాకు గర్వంగా ఉంది. చిత్రం పూర్తయ్యాక చివర్లో ఆమె చప్పట్లు కొట్టడం చూసి నా కల నిజమైందని అనుకున్నాన"ని ఆనందం వ్యక్తం చేస్తూ ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకున్నారు అనుపమ్. ఈ చిత్రం ఈ నెల 18న రానుంది. శుభాంగి దత్ ప్రధాన పాత్ర పోషించింది. ఈ చిత్రంలో జాకీ ష్రాఫ్, అరవింద్ స్వామి, బొమన్ ఇరానీ తదితరులు నటించారు.

పెద్ది నుంచి గౌర్నాయుడు వచ్చారు!


శివ రాజ్‌కుమార్

'పెద్ది'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. దీంట్లో శివ రాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. శనివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి తన పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఆయన ఇందులో గౌర్నాయుడు అనే శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నట్లు ఆ ప్రచార చిత్రంతో స్పష్టత ఇచ్చారు. ఇది ఆటలతో ముడిపడిన బలమైన భావోద్వేగాలు నిండిన కథతో ముస్తాబవుతోంది. చరణ్ దీంట్లో ఆట కూలీగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, ఛాయాగ్రహణం: ఆర్.రత్నవేలు.

ఏఐతో భగవద్గీతపై షార్ట్‌ఫిల్మ్!

● 5 నిమిషాల నిడివిలో 18 అధ్యాయాలు

చిత్రసీమలో ప్రస్తుతం పురాణాలు, ఇతిహాసాలపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ తరహాలోనే పలు సినిమాలు తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే దర్శకుడు రామ్ మధ్వాని ఏఐ సాంకేతికతను ఉపయోగించి భగవద్గీతపై షార్ట్‌ఫిల్మ్ రూపొందించినట్లు చెప్పారు. రెండేళ్లు కష్టపడి దీన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. దీని కోసం వీఆర్(వర్చువల్ రియాలిటీ), ఏఐ (కృత్రిమ మేధ)లను వినియోగించినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ షార్ట్ ఫిల్మ్‌ను ప్రైవేట్ ప్రివ్యూలలో ప్రదర్శించినట్లు వెల్లడించారు. ఇది కేవలం ఐదు నిమిషాల నిడివి ఉన్నప్పటికీ ఇందులో భగవద్గీతలోని 18 అధ్యాయాలను చూపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామ్ మధ్వాని మాట్లాడుతూ.."వీఆర్‌తో కథలోని పవిత్రతను పునరుద్ధరించడానికి మనకు అవకాశం ఉంది. కొన్ని శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఇతిహాసాలు, గ్రంథాలకు మించిన కథలు ఏం ఉంటాయి" అని అన్నారు. కేవలం పౌరాణిక కంటెంట్‌ను చూపించడం మాత్రమే కాదు.. ప్రేక్షకులను ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లడమే తన లక్ష్యమని చెప్పారు. 'లెట్స్ టాక్' చిత్రంతో దర్శకుడిగా మారిన రామ్ మధ్వాని ఆ తర్వాత 'నీర్జా', 'ధమాకా' లాంటి చిత్రాలతో పాటు 'ఆర్య', 'ది వాకింగ్ ఆఫ్ ఏ నేషన్' లాంటి వెబ్‌సిరీస్‌లను రూపొందించారు.

బలమైన కథ లేకపోతే ఎన్ని హంగులు ఉన్నా వృథానే!

ఛాయాగ్రాహకుడిగా కె.కె.సెంథిల్ కుమార్ ప్రతిభ గురించి.. తన శక్తి, సామర్థ్యాల గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పని లేదు. రాజమౌళి ఆస్థాన టెక్నీషియన్‌గా 'సై', 'ఛత్రపతి' నుంచి మొదలు 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్'ల వరకు ఎన్నో విజయవంతమైన సినిమాలకు పని చేశారు. ఇప్పుడాయన కిరీటి హీరోగా పరిచయమవుతున్న 'జూనియర్'కు ఛాయాగ్రహణం అందించారు. రాధాకృష్ణ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు సెంథిల్.



'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' లాంటి భారీ సినిమాల తర్వాత 'జూనియర్' లాంటి సినిమా చేయడానికి కారణమేంటి?

"పెద్ద కాన్వాస్ ఉన్న చిత్రాలే బాగుంటాయి.. చిన్నవి బాగుండవని ఏం లేదు. ప్రతి సినిమా దేనికదే ప్రత్యేకం. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' లాంటి భారీ విజువల్ ఎఫెక్ట్స్ సినిమాల తర్వాత ఇలాంటి చిత్రం చేయడం నాకూ రిఫ్రెష్‌గా అనిపిస్తుందని చేశాను. పైగా దీంట్లోని భావోద్వేగాలు నాకు బాగా నచ్చాయి. ఈమధ్య ఇలాంటి ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాలు పెద్దగా రావడం లేదు. కాబట్టి ఈతరుణంలో ఈ సినిమా చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. నిజానికి దీన్ని మేము 9నెలల్లో పూర్తి చేయాలనుకున్నాం. కానీ, రకరకాల కారణాల వల్ల ఇది పూర్తయ్యే సరికి మూడేళ్లు పట్టింది".

'బాహుబలి' సినిమాల తర్వాత నుంచి వరల్డ్ బిల్డింగ్, విజువల్ గ్రాండీయర్ అనే దానికి ప్రాధాన్యత పెరిగింది. దీన్ని మీరెలా చూస్తారు?

"'బాహుబలి' చిత్రాలు పరిశ్రమలో కొత్త మార్పులు తీసుకొచ్చాయి. భారీ బడ్జెట్ సినిమాలు చేయొచ్చనే నమ్మకాన్నిచ్చింది. నిజానికి మేము ఆ చిత్రం ప్రారంభించే నాటికి బిగ్గెస్ట్ హిట్ అంటే 'మగధీర'. కానీ, 'బాహుబలి' చిత్రాలు ఆ రికార్డును బద్దలు కొట్టాయి. ఆ తర్వాత చాలా మంది ఇలాంటి ప్రయత్నాలు చేశారు. అందులో కొన్ని హిట్టయ్యాయి. మరికొన్ని ఫ్లాప్ అయ్యాయి. అయితే ఈ పరాజయాలకు కారణమేంటో తెలుసుకోవాలి. అన్ని చిత్రాలు 'బాహుబలి' కాలేవు. ఏ సినిమాని ఎలా తీయాలో అలా తీయగలిగితేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. బలమైన కథ, ఎమోషన్ లేనప్పుడు ఎంత పెద్ద వరల్డ్ బిల్డింగ్ ఉన్నా ఏం లాభం. కథ బలంగా ఉన్నప్పుడు ఎలాంటి వరల్డ్ బిల్డ్ చేసినా ప్రేక్షకులకు నచ్చేస్తుంది".

ఈ 'జూనియర్' కథలో మిమ్మల్ని బాగా ఆకర్షించిన అంశాలేంటి?

"కొత్త హీరో సినిమాలనగానే కమర్షియల్ హంగులతో సాగుతుంటాయి. నటనకు అంతగా ప్రాధాన్యత ఇవ్వరు. డ్యాన్సులు, ఫైట్లు ఉంటే చాలన్నట్లుగా ఉంటాయి. వాళ్ల చిత్రాల్లో ఫ్యామిలీ డ్రామాను సెటప్ చేయడం చాలా కష్టం. కానీ, ఈ సినిమా వాటికి పూర్తి భిన్నంగా ఉంటుంది. బలమైన కుటుంబ భావోద్వేగాలతో నిండి ఉంటుంది. ఓ కొత్త హీరో ఇలాంటి సవాల్‌ను స్వీకరించి చేయడమన్నది నన్ను బాగా ఆకర్షించింది. కిరీటిని చూసినప్పుడే తను బాగా కష్టపడే వ్యక్తని అర్థమైంది. ఓ పెద్ద స్టార్ అయ్యే లక్షణాలన్నీ తనలో ఉన్నాయి. నాకు తెలిసి ఈమధ్య వచ్చిన కొత్త హీరోల్లో తను బెస్ట్ అని చెప్పొచ్చు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్, ట్రైలర్లకు మంచి ఆదరణ లభించింది. పాటలు కూడా బాగా జనాల్లోకి వెళ్లాయి. అలాగే ఈ చిత్రంలో జెనీలియా పాత్ర చాలా విభిన్నంగా ఉంటుంది. తన పాత్ర చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు".

సినిమాల ఎంపిక విషయంలో మీ ఆలోచనలు ఎలా ఉంటాయి?

"కథ భావోద్వేగాలతో కలిసి ప్రయాణిస్తుందా లేదా చూస్తాను. ఏ జానర్ కథ ఎంచుకున్నా నాకిదే చాలా ముఖ్యం. కథలోని ఎమోషన్ మనల్ని కదిలించలేకపోతే ఎలాంటి హంగులున్నా.. ఎంత గ్రాండ్ సెటప్ ఉన్నా ఏ ప్రయోజనం ఉండదు".

మీరు ఈ చిత్రం కోసమే మహేశ్ - రాజమౌళిల సినిమాని వదులుకున్నారా?

"అలా ఏమీ లేదు. ఇది మేమిద్దరం అనుకున్నదే. రాజమౌళి ఈసారి కొత్తగా ప్రయత్నించాలనుకున్నారు. గతంలోనూ ఇది జరిగింది. నేను ఆయనతో 'సై' నుంచి కలిసి ప్రయాణిస్తున్నా.. మధ్యలో 'విక్రమార్కుడు', 'మర్యాద రామన్న' సినిమాలు చేయలేదు. ప్రతి ప్రయాణంలోనూ ఇలాంటి గ్యాప్‌లు సాధారణమే. మాకిదే తొలిసారైతే కాదు. దీనికి ఎవరూ షాక్ అవ్వాల్సిన అవసరం లేదు (నవ్వుతూ). మహేశ్ సినిమా తర్వాత మరో కథ కుదిరితే మళ్లీ కలిసి పని చేస్తాం".

మీ తదుపరి చిత్రాలు 'స్వయం భూ', 'ది ఇండియన్ హౌస్' ఎంత వరకు వచ్చాయి? మీరు దర్శకత్వం వైపు వెళ్లే అవకాశముందా?

"'బాహుబలి' లాంటి జానర్‌లో సాగే సినిమా 'స్వయంభూ'. వేల ఏళ్ల క్రితం నాటి రాజుల కథతో ఫిక్షనల్ చిత్రంగా ముస్తాబు చేశాం. కొంత ప్యాచ్ వర్క్ మినహా మిగిలిన చిత్రీకరణంతా పూర్తయింది. ఈ ఏడాది చివర్లో థియేటర్లలోకి వచ్చే అవకాశముంది. 'ది ఇండియన్ హౌస్' స్వాతంత్ర్యం పూర్వం జరిగే కథతో రూపొందుతోంది. వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. ఇది ప్రస్తుతం చిత్రీకరణ దశలోనే ఉంది. భవిష్యత్తులో దర్శకత్వం వైపు వెళ్లాలనే ఆలోచన ఉంది. కాకపోతే అన్నీ కుదరాలి. నేనైతే కొన్ని కథలపై పని చేస్తున్నా".

క్యాన్సర్ పోరాటంపై డాక్యుమెంటరీ

కన్నడ నటుడు శివరాజ్ కుమార్ క్యాన్సర్ బారిన పడి దాని నుంచి కోలుకున్నారు. ఆ సమయంలో తాను క్యాన్సర్‌పై చేసిన పోరాటాన్ని తెలియజేసేలా ఓ డాక్యుమెంటరీని తీసుకురావాలనుకుంటున్నట్లు కూడా వెల్లడించారు. తాజాగా దానిని 'సర్వైవర్' అనే టైటిల్‌తో అధికారికంగా ప్రకటించారు. ఈ డాక్యుమెంటరీకి ప్రదీప్ కె శాస్త్రి దర్శకత్వం వహిస్తున్నారు. గీతా శివరాజ్ కుమార్ నిర్మిస్తున్నారు. మిగిలిన వివరాలతో దీనిని ఆగస్టులో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించడం, ఆ వ్యాధితో బాధపడుతున్న వారిలో ధైర్యం నింపాలనే ఉద్దేశంతో ఇది రూపొందుతోందని శివ రాజ్‌కుమార్ గతంలోనే తెలిపారు.

ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోతుంది


మిషా, ఆర్కే సాగర్


'ది 100' చిత్రంతో థియేటర్లలో సందడి చేస్తున్నారు ఆర్కే సాగర్. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని రాఘవ్ ఓంకార్ శశిధర్ తెరకెక్కించారు. రమేశ్ కరుటూరి, వెంకీ పుషడపు నిర్మించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో ఆర్కే సాగర్ మాట్లాడుతూ.. "ఈ చిత్రాన్ని కచ్చితంగా థియేటర్లలో చూడండి. ఇది ఏమాత్రం నిరుత్సాహపరచదు. ఆర్కే నాయుడు లాగే విక్రాంత్ ఐపీఎస్ పాత్ర కూడా ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోతుంది. ఈ సినిమా నచ్చలేదని ఒక్కరు చెప్పినా సరే నేనేం చేయడానికైనా సిద్ధమే" అన్నారు. "సమాజంలో ఉన్న సవాళ్ల గురించి తీసిన చిత్రమిది. ఈ చిత్రం చూసి ప్రేక్షకులు ప్రతి ఇంట్లో ఒక విక్రాంత్ లాంటి పాత్ర ఉండాలని కోరుకుంటున్నారు" అన్నారు దర్శకుడు శశిధర్. ఈ కార్యక్రమంలో రాజా రవీంద్ర, మిషా నారంగ్, రమేశ్, రాంబాబు గోసాల తదితరులు పాల్గొన్నారు.

2014లో ఓ ఆర్కిటెక్ట్ జీవితంలో ఏమైంది?


నిమిష, అథర్వ

ఆస్పత్రుల్లో పిల్లల్ని మార్చడం.. అపహరించడం లాంటి అంశాలతో సమాజంలో మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో చూపించింది 'డీఎన్ఏ' చిత్రం. అథర్వ మురళీ, నిమిషా సజయన్ జంటగా నెల్సన్ వెంకటేశన్ తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ఈ తమిళ చిత్రాన్ని నిర్మాత సురేశ్ కొండేటి 'మై బేబీ' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఈ నెల 18న థియేటర్లలోకి రాబోతున్నట్లు తెలిపింది చిత్రబృందం. 2014లో ఓ సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా దీన్ని తీర్చిదిద్దారు.

బ్యాంక్ దోపిడీకెళితే.. రూ.67 వేలే దొరికితే..!


దీక్షిత్, బృంద

దీక్షిత్ శెట్టి హీరోగా అభిషేక్ ఎమ్ తెరకెక్కించిన తెలుగు - కన్నడ ద్విభాషా చిత్రం 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి'. హెచ్‌కే ప్రకాశ్ నిర్మించారు. బృందా ఆచార్య కథానాయిక. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. హీరో తన గ్యాంగ్‌తో కలిసి బ్యాంక్ దోపిడీకి వెళ్లడం.. అక్కడ తనకు కేవలం రూ.67వేలు మాత్రమే దొరకడం.. ఆ తర్వాత తనకు ఎదురైన పరిస్థితుల్ని టీజర్‌లో వినోదాత్మకంగా చూపించారు.

ఆలస్యమైనా.. మూల్యం చెల్లించాల్సిందే!


ఓటీటీ బొమ్మ
వాణీ కపూర్

ప్రశాంతంగా ఉండే చరణ్‌దాస్ పూర్ అనే గ్రామంలో వరుస హత్యలు జరుగుతుంటాయి. ఈ మరణాల వెనుక రహస్యాలను ఛేదించడానికి ఓ డిటెక్టివ్ రంగంలోకి దిగింది. మరి ఎవరా డిటెక్టివ్? ఈ హత్యల వెనుక మిస్టరీని ఆమె ఎలా ఛేదించింది? అనేదే 'మండలా మర్డర్స్' వెబ్‌సిరీస్. బాలీవుడ్ నాయిక వాణీ కపూర్ ప్రధాన పాత్రలో నటించిన సిరీస్ ఇది. ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు గోపి పుత్రన్ దర్శకత్వం వహించారు. ఈ సిరీస్ ఈ నెల 25న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఈ సిరీస్ నుంచి మరో వీడియోను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్. "నేను నిందితుణ్ని వెతుక్కుంటూ తెలియకుండానే ఇందులో చిక్కుకుపోయాను.. కానీ ఆలస్యమైన కచ్చితంగా మూల్యం చెల్లించాల్సిందే" అంటూ వాణీ చెప్తున్న సంభాషణలతో సాగుతున్న ఈ వీడియో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఈ సిరీస్‌లో ఆమె రియా అనే డిటెక్టివ్‌గా కనిపించనుంది. యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మించింది.

ఆదరణ ఆనందాన్నిస్తోంది


గీతానంద్, రాజా, దయానంద్

మిత్ర శర్మ, గీతానంద్, శ్రీహాన్ ప్రధాన పాత్రధారులుగా దయానంద్ తెరకెక్కించిన చిత్రం 'వర్జిన్‌బాయ్స్'. రాజా దారపునేని నిర్మించారు. రోనిత్, అన్షుల, బబ్లూ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ.. "ఈ చిత్ర టైటిల్ చూసి ఎలా ఉంటుందోనని అనుకున్న వాళ్లంతా థియేటర్లో సినిమా చూసి ఎంతో ఆదరిస్తున్నారు" అన్నారు. "మేము హైదరాబాద్‌లోని వేర్వేరు థియేటర్లలో జనాలతో కలిసి సినిమా చూశాం. అక్కడ వాళ్ల ఆదరణ చూసి ఎంతో ఆనందంగా అనిపించింది. అయితే కొంతమంది ఈ చిత్రంపై నెగటివ్ రివ్యూలిచ్చి ప్రేక్షకుల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. అలాంటి వాళ్లపై ఇప్పటికే పోలీసులతో పాటు ఫిల్మ్ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశాం" అన్నారు.

సమాజానికి సందేశంతో..


సర్వాణీ, రమేశ్

రమేశ్ ఉప్పు హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'వీడే మన వారసుడు'. లావణ్య రెడ్డి, సర్వాణి మోహన్ కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. రమేశ్ మాట్లాడుతూ.. "రైతుల కష్టాల్ని కళ్లకు కడుతూనే.. డ్రగ్స్ వల్ల విద్యార్థుల జీవితాలు ఎలా నాశనమవుతున్నాయో దీంట్లో చూపించనున్నాం. సమాజానికి మంచి సందేశమందించే చిత్రమిద"ని అన్నారు.

సంతోశ్ శోభన్.. 'కపుల్ ఫ్రెండ్లీ'


సంతోశ్ శోభన్

సంతోశ్ శోభన్ హీరోగా అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో పి.అజయ్ కుమార్ రాజు నిర్మిస్తున్నారు. మానస వారణాసి కథానాయిక. ఈ చిత్రానికి 'కపుల్ ఫ్రెండ్లీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శనివారం సంతోశ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. "ఇది చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ప్రేమ కథా చిత్రం. ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించేలా ఉంటుంది. నిర్మాణానంతర పనులు పూర్తి చేసి త్వరలోనే తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయనున్నాం" అని సినీ వర్గాలు తెలిపాయి.




నాగవరప్పాడు సెంటర్‌లో మోహరించిన పోలీసులు ★ లింగవరం రోడ్డులో కె-కన్వెన్షన్ సమీపంలో దూసుకొస్తున్న వైకాపా కార్యకర్తలను అదుపుచేస్తున్న పోలీసులు

గుడివాడలో ఉద్రిక్తం

- రప్పా రప్పా కాదు... చీకట్లో పనైపోవాలంటూ... పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై కూటమి నేతల ఆగ్రహం
- నిరసన కార్యక్రమానికి వస్తున్న పేర్నిని అడ్డుకునే ప్రయత్నం
- కూటమి, వైకాపా కార్యకర్తల మధ్య తోపులాటలు
- రాళ్లదాడిలో పలువురు తెదేపా మహిళలకు గాయాలు

ఈనాడు అమరావతి, ఈనాడు డిజిటల్, మచిలీపట్నం న్యూస్‌టుడే, గుడివాడ: 'రప్పా రప్పా అనడం కాదు.. చీకట్లో కన్ను కొడితే పనైపోవాలి.. రెండో కంటికి చెప్పకుండా చేసేసి, తెల్లారి మీరే వెళ్లి పలకరించండి' అని వైకాపా కార్యకర్తలను రెచ్చగొడుతూ పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. గుడివాడలో జరిగే కార్యక్రమానికి రానున్న పేర్ని నానిని అడ్డుకునేందుకు కూటమి శ్రేణులు ప్రయత్నించాయి. ఈ నేపథ్యంలో వైకాపా, కూటమి కార్యకర్తల మధ్య తోపులాటలు చోటు చేసుకుని, పరిస్థితి రాళ్ల దాడికి దారితీసింది.

పేర్ని నాని ఏమన్నారంటే...

పామర్రులో ఇటీవల నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న పేర్ని నాని మాటలు వివాదాస్పదంగా మారాయి. 'రప్పా రప్పా అనొద్దు.. చీకట్లో కన్నుకొడితే పనైపోవాలి. చీకట్లో చేయాల్సిన పనులను పట్టపగలు ఎన్నిసార్లు అంటారు. రప్పా రప్పా అనేది చీకట్లో జరిగిపోవాలి. ముల్లును ముల్లుతోనే తీయాలి. శత్రువుకు ఎప్పుడు.. ఎక్కడ చెప్పాలో అక్కడే చెప్పాలి. అంతే తప్ప రోజూ అదే పనా? కరిచే కుక్క మొరగదు.. మొరిగే కుక్క కరవదు. ఊరికే ఎందుకు అరుస్తారు. మీకు చేతనైతే రేపు మన ప్రభుత్వం వచ్చాక ఎవడెవడిని కరవాలో.. వాడిని కరిసేయండి. రెండో కంటికి చెప్పకుండా చేసేయండి. తరువాత మీరే వెళ్లి ఎవరు చేశారని పలకరించండి. జగన్ ప్రభుత్వం వచ్చాక నిజంగా ఎవరినైనా వేయండ్రా అంటే.. ఎవరు వేసేది? ఇప్పటిదాకా ఎవడినైనా వేశావా? సొల్లు కబుర్లొద్దు' అని వైకాపా నేత పేర్ని నాని తమ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు.

కేసు నమోదు..

పేర్ని వ్యాఖ్యలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడిన ఆయనను వెంటనే అరెస్టు చేయాలంటూ తెదేపా, జనసేన, భాజపా నేతలు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. మచిలీపట్నంలోని రాబర్ట్‌సన్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.

రాజుకున్న రచ్చ...

పేర్ని నాని వ్యాఖ్యలతో గుడివాడలో రచ్చ రాజుకుంది. లింగవరంలోని కొడాలి నానికి చెందిన కె-కన్వెన్షన్‌లో వైకాపా ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' పేరిట శనివారం నిరసన కార్యక్రమం తలపెట్టారు. దీనికి పేర్ని నాని, కొడాలి నాని హాజరుకానున్నట్లు ముందే ప్రకటించారు. పేర్ని నానిని అడ్డుకుని నిరసన తెలిపేందుకు కూటమి నాయకులు నాగవరప్పాడు సెంటర్ వద్దకు భారీగా చేరుకున్నారు. ఆ సమయంలో అటుగా వచ్చిన వైకాపా కార్యకర్తలకు, కూటమి కార్యకర్తలకు వాగ్వాదాలు, తోపులాటలు జరిగాయి. ఇరు వర్గీయులూ రాళ్లు రువ్వుకున్నారు. గొడవ విషయం కన్వెన్షన్ సెంటర్‌లో ఉన్న వైకాపా కార్యకర్తలకు తెలిసింది. వారు భారీ సంఖ్యలో నాగవరప్పాడు సెంటర్‌కు బయలు దేరగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు హెచ్చరించడంతో పేర్ని నాని వడ్లమన్నాడు వరకు వచ్చి వెనుదిరిగారు.



పగిలిన జడ్పీ ఛైర్‌పర్సన్ కారు అద్దం



గాయపడిన తెదేపా కార్యకర్త సునీత



పేర్ని నానిని అరెస్టు చేయాలని మచిలీపట్నంలోని ఆర్‌పేట ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

పోలీసులు చెప్పినా వినకుండా..

ఇదే మార్గంలో సమావేశానికి వస్తున్న జడ్పీ ఛైర్మన్ ఉప్పాల హారికను పోలీసులు వెళ్లవద్దని, పరిస్థితి ఉద్రిక్తంగా ఉందని హెచ్చరించారు. మొదట వెనుదిరిగి వెళ్లిన ఆమె.. మరో మార్గంలో సమావేశానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కూటమి శ్రేణులు ఆమె కారును అడ్డుకున్నాయి. రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. కొందరు ఆమె కారు అద్దాలను ధ్వంసం చేశారు. తిరిగి వెళ్లాలని పోలీసులు చెప్పినా ఆమె వినలేదు. దాదాపు రెండు గంటల పాటు వాగ్వాదం, తోపులాట జరిగి పలువురు తెదేపా మహిళలు గాయపడ్డారు.

కుప్పంలో చంద్రబాబు విజయం సాధిస్తే తాను రాజకీయ సన్యాసం చేసి.. చంద్రబాబు బూట్లు తుడుస్తానంటూ.. ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాన్ని కొడాలి నాని నిలబెట్టుకోవాలని నెహ్రూ చౌక్ వద్ద తెదేపా శ్రేణులు ఫ్లెక్సీలు కట్టారు. మరోపక్క తమ నిరసన కార్యక్రమానికి సంబంధించి వైకాపా వారు ఫ్లెక్సీలు కట్టారు. ఇరు పార్టీల మధ్య వివాదం నెలకొనడంతో పరస్పరం ఫ్లెక్సీలను చింపుకొన్నారు. గొడవ విషయం తెలుసుకున్న కొడాలి నాని.. మధ్యాహ్నమే హైదరాబాద్ వెళ్లిపోయారు.

ఉప్పాల రాము, హారిక బూతు పురాణం

ఉప్పాల హారిక, ఆమె భర్త రాము కలిసి పోలీసులు, కూటమి శ్రేణులపై బూతులతో రెచ్చిపోయారు. ఒక్కొక్క డీసీ చంపేస్తా, ఒళ్లు బలిసిందా, రేయ్... అని బూతులు తిట్టారు. హారిక పోలీసులపై పరుష పదజాలంతో ఊగిపోయారు. తర్వాత ఏమీ తెలియనట్లుగా పోలీస్‌స్టేషన్ ఎదుట హారిక ఏడుస్తుంటే, ఆమె భర్త రాము సౌమ్యవదనంతో.. ఎవరినైనా మేం ఒక్కమాట అన్నామా అంటూ మాట్లాడుతున్న వీడియోలు వైరల్ అయ్యాయి.

బీసీ మహిళపై దాడి అని గోలచేద్దాం

- లోకేశ్ చేయించాడని చెబుదాం
- గుడివాడ గొడవపై పేర్ని నాని ఫోన్ సంభాషణ లీక్



వీడియోలో మాట్లాడుతున్న పేర్ని నాని

ఈనాడు, అమరావతి: 'గుడివాడలో జడ్పీ ఛైర్‌పర్సన్ కారుపై దాడి చేసిన ఘటనను.. ఓ బీసీ మహిళపై దాడి అంటూ రాష్ట్రవ్యాప్తంగా మనవాళ్లందరితో కలిసి గోల చేయించాలి. బీసీ గౌడ మహిళ అని అందరూ బయటకొచ్చి చెప్పాలి. పైనుంచి లోకేశ్ చెప్పడంతో గుడివాడ తెదేపా ఎమ్మెల్యే, అతని అనుచరులు చేశారని ప్రచారం చేద్దాం' అని వైకాపా నేత పేర్ని నాని కుట్ర చేస్తున్న ఫోన్ సంభాషణ తాజాగా బయటకొచ్చింది. కూటమి, వైకాపా మధ్య జరిగిన గొడవకు.. కులం రంగు పులిమి వివాదం చేయాలని నాని ప్రయత్నించిన విషయం బయటపడింది. 'మన వాళ్లందరికీ మన నాయకుడి(జగన్)తో చెప్పిస్తేనే అందరూ గట్టిగా చేస్తారు. మన నాయకుడు చెబితేనే వింటారు. రాష్ట్ర వ్యాప్తంగా గట్టిగా కులం పేరుతో ఆందోళనలు చేద్దాం' అంటూ వైకాపా అధిష్ఠానంతో పేర్ని మాట్లాడిన ఫోన్ కాల్ వీడియో బయటకొచ్చింది. లోకేశ్‌పై బురద చల్లాలనే పన్నాగం బయటపడింది.

జడ్పీ ఛైర్‌పర్సన్ హారికతో ఫోన్‌లో మాట్లాడిన జగన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రజాస్వామ్య హననం జరుగుతోందని, ఆటవిక పాలన సాగుతోందని వైకాపా అధినేత జగన్ ఆరోపించారు. కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికతో శనివారం ఆయన ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. "తెదేపా, జనసేన మూకలు దాడి చేసిన విషయం పార్టీ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారు. ఒక బీసీ మహిళ, జిల్లా ప్రజాప్రతినిధి భయంతో వణికిపోయే పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయంటే ఇంతకంటే దారుణం ఉంటుందా" అని 'ఎక్స్'లో జగన్ ప్రశ్నించారు.

అసభ్య పదజాలంతో హింసను ప్రేరేపిస్తే ఊరుకోం: మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: 'రప్పా రప్పా...' అంటూ అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేస్తూ హింసను ప్రోత్సహిస్తే చూస్తూ ఊరుకోబోమని పేర్ని నానీని మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. శనివారం బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురంలోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మాజీ మంత్రి పేర్ని నాని విద్యాశాఖ మంత్రి లోకేశ్‌పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలనూ సుభాష్ ఖండించారు. రేబిస్ సోకినట్లు పేర్ని వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

నిలకడగా గోదారి ప్రవాహం అప్రమత్తమైన యంత్రాంగం

ముంపు గ్రామాల్లో గర్భిణులు, బాలింతలను తరలించిన అధికారులు



వేలేరుపాడు మండలంలోని ముంపు గ్రామాల నుంచి పడవపై వచ్చి ఒడ్డుకు చేరిన బాలింతలు

ఈనాడు, ఏలూరు; న్యూస్‌టుడే, కుక్కునూరు, పోలవరం, తూర్పుగోదావరి(ధవళేశ్వరం): గోదావరిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక(43 అడుగులు)కు చేరువగా వచ్చింది. శనివారం మధ్యాహ్నం నుంచి 41.30 అడుగుల వద్ద కొనసాగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటి మట్టం 31.50 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల నుంచి 7.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పోలవరం వద్ద వరద అఖండ గోదావరి కుడి, ఎడమ గట్లను తాకుతోంది. రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి 5,18,000 క్యూసెక్కుల వరద వస్తుండగా, 5,29,209 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద 10.60 అడుగుల నీటిమట్టం నమోదైంది.

ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో రహదారులు నీటమునిగాయి. వేలేరుపాడు మండలంలో ఎద్దువాగు వంతెన మునగడంతో 16 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. యడవల్లి-బోలపల్లికి మధ్యలో ఉన్న వంతెన మునిగింది. ముంపు గ్రామాలపై ముందుగానే దృష్టి సారించిన జిల్లా అధికారులు గర్భిణులు, బాలింతలను పడవల్లో బయటకు తీసుకొచ్చి, అవసరమైన వారిని ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఆ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి దీర్ఘకాలిక రోగులకు ఔషధాలు అందజేశారు. జనరేటర్లూ తరలించారు. నిత్యావసరాల కిట్లను సిద్ధం చేసినట్లు వేలేరుపాడు మండల వరద సహాయక చర్యల ప్రత్యేకాధికారి విజయరాజు తెలిపారు.

ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ

సున్నిపెంట సర్కిల్: ఒక రేడియల్ క్రస్ట్ గేటును 10 అడుగులు పైకెత్తి శ్రీశైలం జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే నుంచి 27,157 క్యూసెక్కులు, కుడి, ఎడమ గట్టు విద్యుత్తు కేంద్రాలకు 68,377 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. ఎగువన నుంచి 1,39,297 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి వస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు జలాశయ నీటిమట్టం 883.00 అడుగులు ఉంది. నీటినిల్వ 204.3520 టీఎంసీలుగా నమోదైంది.

కర్ణాటకలో పులి, రెండు కూనల మృతి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: బెంగళూరు నగర శివార్ల నుంచి తమిళనాడు సరిహద్దు వరకు విస్తరించిన బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనంలో హిమదాస్ అనే ఆడపులి, దాని రెండు పులిపిల్లలు అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మరణించాయి. ఆరేళ్ల వయసున్న హిమదాస్ ఇటీవలే నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. వాటిల్లో రెండు కూనలు మొదటే అనారోగ్యంతో మరణించాయి. తాజాగా హిమదాస్, మిగిలిన పిల్లలూ మరణించాయని అధికారులు శనివారం వెల్లడించారు. పోస్టుమార్టంలో వాటి మరణాలకు కారణాలు తెలుస్తాయని తెలిపారు.

పోలవరాన్ని పక్కదారి పట్టించేందుకే బనకచర్ల

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



ఈనాడు, అమరావతి: 'పోలవరం ఎత్తును 45 మీటర్ల నుంచి 41 మీటర్లకు తగ్గించిన అంశాన్ని పక్కదారి పట్టించేందుకే సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టును తెరమీదకు తెచ్చారు. 2019లో పోలవరం అంచనా రూ.55 వేల కోట్లు, 2024లో సవరించిన అంచనాలతో రూ.30 వేల కోట్లకు తగ్గింది. కేంద్రం రూ.25 వేల కోట్లు మిగుల్చుకునేందుకు ప్రాజెక్టును ముంచేసింది' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం లైసెన్స్ సమస్యలపై ఆమె విజయవాడలో సీవోఏ రాష్ట్ర అధికారులను కలిసి వినతిపత్రం అందించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'బనకచర్ల ప్రాజెక్టుకు అవసరమైన 50 వేల ఎకరాల్లో 20 వేల ఎకరాలు అటవీశాఖ పరిధిలో ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.80 వేల కోట్లు కావాలి. రాష్ట్రంలో 30 జలయజ్ఞం ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి రూ.30 వేల కోట్లు పెడితే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుంది. వీటికే డబ్బుల్లేవని అంటున్నారు.. మరి బనకచర్లకు డబ్బులు ఎలా తెస్తారు?' అని షర్మిల ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ హిందీపై స్పందించడం చూస్తుంటే ఆయన పార్టీ జనసేనో భాజపానో అర్థం కావడం లేదన్నారు.

అనుమతుల్లేకుండా అడ్మిషన్లు: వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీకి సీవోఏ అనుమతులు లేకుండానే గత ప్రభుత్వం ప్రవేశాలు నిర్వహించింది. వారు చేసిన పాపం కారణంగా ప్రస్తుతం విద్యార్థులకు సర్టిఫికెట్లు రావడం లేదు. రెండేళ్లుగా వారు పోరాడుతున్నా ఫలితం లేదు. అందుకే వారి పక్షాన నిలిచాం. తప్పు సరిదిద్దాల్సిన బాధ్యత అధికారులపై ఉంది' అని షర్మిల అన్నారు.



ప్రతి ప్రయత్నం ఓ ప్రయోగం

ప్రతి ప్రయత్నాన్ని ఓ కొత్త విషయం కనుగొనడానికి చేసే ప్రయోగంగా భావించండి. ప్రయత్నం విఫలమైనప్పుడు దాన్ని ఓటమిలా కాకుండా, లక్ష్యసాధన కోసం ఉపయోగపడే విలువైన సమాచారాన్ని ఇచ్చిన వనరుగా చూడండి. వైఫల్యాలను అధిగమించి ముందుకెళ్లడానికి చేసే శ్రమను కష్టంలా కాకుండా మిమ్మల్ని మీరు మెరుగుపర్చుకొనే ప్రక్రియగా పరిగణించండి. అప్పుడు ఫలితం ఎలా ఉన్నా మీరు పురోగతి సాధించినట్లే.

– జేమ్స్ క్లియర్, రచయిత

14న ఏపీఎల్ సీజన్-4 క్రీడాకారుల వేలం

- ఆగస్టు 8 నుంచి మ్యాచ్‌ల ప్రారంభం
- ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్‌కృష్ణ రంగారావు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న సుజయ్ కృష్ణరంగారావు. చిత్రంలో సానా సతీష్‌బాబు, ఇతర ప్రతినిధులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-4 టోర్నీ నిర్వహణతో కొత్త క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆర్.వి.సుజయ్‌కృష్ణ రంగారావు తెలిపారు. విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఐపీఎల్ తరహాలోనే విశాఖలో ఏపీఎల్ నిర్వహణ ఉంటుంది. సీజన్-4కు సంబంధించి ఈ నెల 14న విశాఖ బీచ్‌రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్‌లో క్రీడాకారుల వేలం నిర్వహిస్తాం. గతంలో ఫ్రాంఛైజీల ఫీజు రూ.75 లక్షలు ఉండగా.. ఇప్పుడు రూ.2 కోట్లకు పెరిగింది. గత సీజన్‌లో 430 మంది క్రీడాకారులు వేలంలో పాల్గొనగా.. ఈసారి 520 మందికి అవకాశం ఉంది. దేశవాళీ, ఐపీఎల్ మ్యాచ్‌లలో ఆడిన తొమ్మిది మంది క్రీడాకారులు ఏపీఎల్ వేలంలో టాప్ సీడ్‌లో ఉన్నారు. సీజన్-4లో 21 లీగ్‌లు, 4 ప్లేఆఫ్స్‌తో కలిపి మొత్తం 25 మ్యాచ్‌లు ఉంటాయి" అని పేర్కొన్నారు. ఏసీఏ కార్యదర్శి ఎంపీ సానా సతీష్‌బాబు మాట్లాడుతూ.. "ఆగస్టు 8 నుంచి మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. మ్యాచ్‌లన్నీ విశాఖలోనే జరుగుతాయి. వచ్చే ఏడాది మంగళగిరి, విశాఖ, కడప స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తాం. టోర్నీలో ప్రతిభ చూపిన వారికి ఆంధ్ర రంజీ మ్యాచ్‌లలో అవకాశం కల్పిస్తాం. మహిళా క్రికెటర్లను ప్రోత్సహించేలా ఏసీఏ సొంత నిధులతో ఆంధ్ర క్రికెట్ ఉమెన్ టీ-20 లీగ్ మ్యాచ్‌లు త్వరలో నిర్వహిస్తాం" అని చెప్పారు. సమావేశంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.వెంకటరామప్రశాంత్, కోశాధికారి దండమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు తొక్కిసలాట ఘటనలో తీవ్ర భద్రతా వైఫల్యం

- మైదానం లోపల ఉన్నది కేవలం 79 మంది పోలీసులు.. బయట ఎవరూ లేరు
- కేఎస్‌సీఏ, ఆర్‌సీబీ, డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్‌లదే పూర్తి బాధ్యత
- జ్యుడీషియల్ కమిషన్ నివేదికలో వెల్లడి

బెంగళూరు(హలసూరు), న్యూస్‌టుడే: ఆర్‌సీబీ విజయోత్సవాల వేళ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్ర భద్రతా వైఫల్యం కనిపించినట్లు జ్యుడీషియల్ కమిషన్ నివేదిక వెల్లడించింది. దీనికి కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్(కేఎస్‌సీఏ), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్, బెంగళూరు పోలీసులదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేసింది. జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది మృతి చెందగా 53 మంది గాయపడ్డారు. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చిన నేపథ్యంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖెల్ డి.కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ వేసింది. ఈ కమిషన్ ఘటనతో సంబంధం ఉన్న ప్రాంతాల్లో పర్యటించింది. ప్రత్యక్ష సాక్షులు, క్రికెట్ సంఘం అధికారులు, పోలీసుల వాంగ్మూలాలు రికార్డు చేసింది. ఈ సందర్భంగా కమిషన్ పలు లోపాలను గుర్తించింది. మైదానం లోపల భద్రతకు కేవలం 79 మంది పోలీసులనే మోహరించారని, బయట పోలీసు సిబ్బంది ఎవరూ లేరని పేర్కొంది. ఘటనా స్థలం వద్ద అంబులెన్స్‌లు లేవని, పోలీసు యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా ఉందని వెల్లడించింది. ఆ రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు ఘటన జరిగితే జాయింట్ కమిషనర్ సాయంత్రం నాలుగు గంటలకు వచ్చారని, 5.30 తర్వాతే పోలీస్ కమిషనర్‌కు ఈ విషయంపై సమాచారం ఇచ్చారంది. ఈ మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు జస్టిస్ కున్హా శుక్రవారం నివేదిక అందించారు. ఈ నెల 17న నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చిస్తామని సీఎం చెప్పారు.

ప్రజల తరఫున పోరాడితే నోరు నొక్కేస్తారా?: బొత్స

కిర్లంపూడి, విశాఖపట్నం(పెదవాల్తేరు), న్యూస్‌టుడే: ప్రజల తరఫున పోరాడుతుంటే ప్రభుత్వం తమ నోరు నొక్కేస్తుందని మాజీ మంత్రి, వైకాపా నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విశాఖపట్నంలో, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ వైకాపా కార్యకర్తల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉందన్నారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మాజీ సీఎం జగన్ మాట్లాడితేనే ప్రభుత్వానికి రైతులు గుర్తుకొస్తున్నారని ఎద్దేవా చేశారు.

EENADU Vol: 51, Issue: 334 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

GGU
GODAVARI GLOBAL UNIVERSITY

27 YEARS OF EXCELLENCE | A++ NAAC 3rd CYCLE | nirf Rank Band 201-300 6 Consecutive Years | OUTLOOK No.1 Private University in A.P. | TIMES BUSINESS AWARDS | ASSOCHAM | NITI Aayog | AIM

ADMISSIONS OPEN 2025

GIET IS NOW A UNIVERSITY

COUNSELING CODE: **GGURPU**

99499 93483, 89777 80866

Be the Demand.

1st Time in AP and TS

GGU INDUSTRY EDGE

Co-created
Co-delivered
Internships

- Industry-focused curriculum.
- Global exposure
- Endless inspiration
- Everything you need to become what the world is looking for

B.Tech Programme in CYBER SECURITY

IN COLLABORATION WITH

KPMG IN INDIA | MACQUARIE University SYDNEY, AUSTRALIA

B.Tech Programmes in CSE - AI & ML | DATA SCIENCE

IN COLLABORATION WITH

IBM

100% Real Placements & 100% Real Numbers

2000+ STUDENTS PLACED | **45+** CAMPUS DRIVES | **35 LPA** HIGHEST PACKAGE

Our Academic Partners

aws academy | Google Cloud | CompTIA AUTHORIZED ACADEMY | RED HAT ACADEMY | CISCO Networking Academy



Inspiration all around

- 24+ Student Clubs and Communities
- Library with 400+ Journals
- 24x7 Security
- Advanced Sporting Facilities
- University-owned Bus Facility from East & West Godavari Districts

On-campus Hostels

- 8 AC & Non-AC Hostels
- Spacious boarding, well-ventilated
- Dining options catering to South Indian, North Indian and international students
- Entertainment, workout and working spaces

The right place for you and your career

300 Acre State-of-the-art Campus

Industry Ready Curriculum

Live Projects & Internships in Top MNCs

50+ MOUs & foreign collaborations

15 COEs for Expertise & Industry Exposure

200 Patents Testament to Research Excellence

35K+ Alumni Across the Globe


SCHOOL OF COMPUTING
CSE, CSE-AI & ML, CSE-Data Science, CSE-Cyber Security

SCHOOL OF ENGINEERING
ECE, EEE, Civil, Mining, Automobile, Mechanical (Robotics & Automation) Agriculture Engineering

SCHOOL OF PHARMACY
B.Pharm, Pharm D., M.Pharm., Pharm D. (P.B.)

SCHOOL OF SCIENCES
B.Sc. (Hon): Artificial Intelligence Data Sciences, Agriculture Animation, Forensic Science Cyber Forensic, Computer Science
B.Com (Hon): Computers | BBA, MBA

SCHOOL OF HEALTH SCIENCES
B.Sc. (Honours)
B.P.T. (Bachelor of Physiotherapy)



Sri KVV Satyanarayana Raju
Chancellor, GGU | Chairman, Chaitanya Group
Chairman, KIMS Medical College, Amalapuram

ADMISSIONS OPEN


NH16, Chaitanya Knowledge City, Rajamahendravaram – 533 296
Contact: 99499 93483 / 89777 80866 | www.ggu.edu.in

Contact: East Godavari: 8977780873, Kakinada: 8977780864 | Konaseema: 8977780875 | West Godavari: 8977780870 | Visakhapatnam: 8977780867
Vizianagaram: 8977780871, Srikakulam: 8977780872 | Vijayawada, Guntur & Nellore: 8977780868, Prakasam: 8977736371 | Rayalaseema: 8977736376

KALYANI ADS-AP & TS

పెను 'గాలి'లో చిరు ఆసరా..

విమాన ప్రయాణికుల ప్రాణాలు కాపాడే అత్యవసర సాధనం



పెను ఇబ్బందుల్లో చిక్కుకొని.. అన్ని దారులూ మూసుకుపోయిన తరుణంలో ఒక్కసారి చిన్న గడ్డిపోచ కూడా పెద్ద ఆసరా కావొచ్చు! వందల టన్నుల బరువుండి, అత్యంత శక్తిమంతమైన విమానానికీ ఇది వర్తిస్తుంది. నింగిలో రేపాక లోహ విహంగంలోని ఇంజిన్లన్నీ విఫలమై, కీలక వ్యవస్థలు పనిచేయని దశలో.. ప్రయాణికుల ప్రాణాలు గాల్లో దీపంలా ఉన్నప్పుడు ఓ అభయ హస్తం అందుకునే ప్రయత్నం చేస్తుంది. అదే ర్యామ్ ఎయిర్ టర్బైన్ (ర్యాట్)! గత నెలలో అహ్మదాబాద్‌లో కూలిన ఎయిరిండియా విమానంలో ఈ అద్భుత సాధనం విచ్చుకొని.. ప్రయాణికులను రక్షించే ప్రయత్నం చేసింది. ఆ దుర్ఘటనపై ఏర్పాటైన దర్యాప్తు బృందం తన తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. కానీ ఆ విమానం పెద్ద ఎత్తులో లేకపోవడం వల్ల అది ఫలించలేదు.

ఎయిరిండియా విమానం టేకాఫ్ అయ్యాక దాని ర్యాట్ విచ్చుకోవడాన్ని సీసీటీవీ దృశ్యాల ఆధారంగా కొందరు విశ్లేషకులు అప్పట్లోనే గుర్తించారు.

ఏమిటీ ర్యాట్?

ర్యాట్ అనేది విమానం రెక్క లేదా ప్రధాన బాడీలో ఉండే చిన్నపాటి పరికరం. సాధారణ పరిస్థితుల్లో ఇది.. విమానంలోపల ముడుచుకుపోయి ఉంటుంది. ఇంజిన్ వైఫల్యం, విద్యుదుత్పత్తి నిలిచిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అది తెరుచుకొని, వెలుపలికి వస్తుంది. ఇది బయటకు వచ్చిందంటే.. విమానం పెను ఇబ్బందుల్లో ఉన్నట్లే!

ఎందుకు అవసరం?

విమానానికి ఇంజిన్లే ప్రధాన శక్తి. లోహవిహంగాన్ని ముందుకు నడపడంతో పాటు లోపల పరికరాలు, నియంత్రణ వ్యవస్థలు, ఉపకరణాలు పనిచేయడానికి అవసరమైన విద్యుదుత్పత్తికి ఇవే ఆధారం. ఇంజిన్‌లోని కదిలే భాగాన్ని సెంట్రల్ డ్రైవ్ షాఫ్ట్.. విద్యుత్ జనరేటర్‌తో అనుసంధానమై ఉంటుంది. ఫలితంగా ఇంజిన్ పనిచేసే క్రమంలో వెలువడే యాంత్రిక శక్తి.. విద్యుత్ శక్తిగా మారుతుంది. ఇది వివిధ పరికరాలు, నియంత్రణ వ్యవస్థలు, కమ్యూనికేషన్ సాధనాలు, విద్యుద్దీపాల కోసం సరఫరా అవుతుంది.

● విమానం ప్రయాణంలో ఉండగా ఇంజిన్లు మొరాయిస్తే విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోతుంది. అలాంటి పరిస్థితుల్లో ఆ లోహవిహంగాన్ని నియంత్రించడానికి అవసరమైన హైడ్రాలిక్ వ్యవస్థలు, ప్రధాన సాధనాలూ మొరాయిస్తాయి. అప్పుడు అత్యవసరంగా విద్యుదుత్పత్తి చేసి.. ప్రధాన సాధనాలను నడిపించడం ర్యాట్ విధి.

ఎలా పనిచేస్తుంది?

విమానం గాల్లో ఉన్నప్పుడు దాని ప్రధాన ఇంజిన్లు విఫలమైనప్పటికీ.. అప్పటివరకూ అవి అందించిన శక్తి వల్ల లోహవిహంగం కొంతదూరం ప్రయాణిస్తూనే ఉంటుంది. అయితే క్రమంగా కిందికి దిగుతూ ఉంటుంది. పూర్తిగా అది నేలకు దిగివారడానికి కొంత సమయం పడుతుంది. అలోగా విమానాన్ని నియంత్రించగలిగితే.. ఏదో ఒక విమానాశ్రయం లేదా మైదాన ప్రదేశంలో అత్యవసరంగా దించడానికి వీలవుతుంది.

● ఇంజిన్లు మొరాయించినప్పుడు, వాటి విద్యుత్, హైడ్రాలిక్ వ్యవస్థల్లో ఇబ్బందులు తలెత్తినప్పుడు ర్యాట్ దానంతట అదే తెరుచుకొని, పని మొదలుపెడుతుంది. అవసరమైతే పైలట్లు మాన్యువల్‌గా కూడా దీనిని వినియోగంలోకి తీసుకురావొచ్చు.

● ర్యాట్‌లో గాలిమరలా రెండు రెక్కలు ఉంటాయి. విమానం ముందుకు కదిలే క్రమంలో ఎదురయ్యే గాలి వల్ల అవి వేగంగా తిరుగుతాయి. ఈ క్రమంలో అవి విద్యుత్ జనరేటర్ లేదా హైడ్రాలిక్ పంప్‌ను పనిచేయిస్తాయి. ఫలితంగా విద్యుత్ లేదా హైడ్రాలిక్ శక్తి వెలువడుతుంది. ఇది ఒకరకంగా సైకిల్‌కు అమర్చే డైనమో లాంటిది.

ఇంజిన్లకు ప్రత్యామ్నాయం కాదు..

ర్యాట్ పరిమిత శక్తిని మాత్రమే ఉత్పత్తి చేస్తుంది. విమానానికి సంబంధించిన అన్ని వ్యవస్థలూ పనిచేయడానికి దీని శక్తి సరిపోదు. ప్రధాన ఇంజిన్లకు ఇది ప్రత్యామ్నాయం కాదు. అత్యవసరంగా ల్యాండ్ అయ్యేవరకు విమానాన్ని సురక్షితంగా ఉంచడానికి అవసరమైన శక్తిని మాత్రమే ఇస్తుంది. లోహవిహంగం ఎంత వేగంగా పయనిస్తే ర్యాట్ నుంచి అంత ఎక్కువగా శక్తి ఉత్పత్తి చేస్తుంది. కిందికి దిగేటప్పుడు తక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది.

● 400 లేదా 500 అడుగుల ఎత్తులో విమానం విహరిస్తున్నప్పుడు ర్యాట్‌తో పెద్దగా ప్రయోజనం ఉండదు. కూలడానికి ముందు ఎయిరిండియా విమానం 625 అడుగుల ఎత్తుకు చేరుకుంది. ఆ తర్వాత వేగంగా కిందికి దిగుతూ భవనాలను ఢీ కొట్టింది. ఎక్కువ ఎత్తులో ఉండి ఉంటే.. ర్యాట్ సాయంతో అత్యవసరంగా దిగడానికి అవకాశం ఉండేది.

నిలిచిన ప్రాణాలు..

అనేక సందర్భాల్లో ర్యాట్ వల్ల ప్రయాణికుల ప్రాణాలు నిలిచాయి. ఉదాహరణకు 2001లో ఎయిర్ ట్రాన్సాట్ సంస్థకు చెందిన విమానం.. అట్లాంటిక్ మహాసముద్రంపై ప్రయాణిస్తుండగా అందులో ఇంధనం ఖాళీ అయింది. ఈ సమయంలో ర్యాట్ విచ్చుకొని ముఖ్య వ్యవస్థలను నడిపించింది. దీంతో పైలట్లు విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయగలిగారు. మొత్తంమీద గత కొన్ని దశాబ్దాల్లో ర్యాట్ వల్ల 2,400 మందికిపైగా ప్రాణాలు కాపాడటానికి వీలైంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం



ముంబయిలో శనివారం జరిగిన అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతుల సంస్మరణ కార్యక్రమంలో కంటతడి పెడుతున్న ఎయిరిండియా కోపైలట్ కుందర్ కుటుంబసభ్యులు

పారదర్శక, వాస్తవ ఆధారిత దర్యాప్తు జరగాలి: పైలట్ల సంఘం

ముంబయి: అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై పూర్తి పారదర్శక, వాస్తవ ఆధారిత దర్యాప్తు జరగాలని ఎయిర్‌లైన్స్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్‌పీఏ) కోరింది. ఏఏఐబీ దర్యాప్తు పైలట్లను తప్పుబట్టేలా పక్షపాతంగా ఉందని అభిప్రాయపడింది. శనివారం ఏఏఐబీ విడుదల చేసిన నివేదికను తప్పుబట్టింది. దర్యాప్తు ప్రక్రియను పరిశీలించడానికి తమ ప్రతినిధులకు అవకాశం ఇవ్వాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఏఎల్‌పీఏ డిమాండ్ చేసింది. 'దర్యాప్తు చుట్టూ అలముకున్న రహస్యంపై ఆశ్చర్యపడుతున్నాం. దర్యాప్తులో సరైన, అర్హులైన అధికారులను నియమించలేదన్న వాస్తవాన్ని గుర్తు చేస్తున్నాం. పైలట్ల తప్పిదం ఉందని దీనిని దర్యాప్తు కొనసాగుతోంది. ఇలాంటి ఆలోచనపై ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నాం' అని పేర్కొంది.

అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయంలో భారత్‌కు త్వరలో ప్రముఖ స్థానం

● సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వెల్లడి

దిల్లీ: మధ్యవర్తిత్వ, రాజీ విధానాల్లో వివాదాల సామరస్య పరిష్కారానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం పెరుగుతోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. స్వతంత్ర, ప్రత్యామ్నాయ విధానంగా ఇది రూపాంతరం చెందుతుందని తెలిపారు. ఈ రంగంలో జటిలమైన ప్రయాణాన్ని ప్రారంభించిన భారత దేశం త్వరలోనే అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయానికి ప్రముఖ కేంద్రంగా నిలుస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. 'అంతర్జాతీయ మధ్యవర్తిత్వం: గమ్యస్థానంగా భారత్ ఉద్భవం' అనే అంశంపై స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జస్టిస్ సూర్యకాంత్ ప్రసంగించారు. మధ్యవర్తిత్వ న్యాయంలో అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడంతో పాటు తనకంటూ ఒక విశిష్టమైన ఆర్థిక, న్యాయ ప్రమాణాలను సంకల్పిత నమూనాలో భారత దేశం నెలకొల్పుతోందని తెలిపారు. ఇందుకుగాను ప్రత్యేకంగా మధ్యవర్తిత్వ కేంద్రాలను నెలకొల్పడంతో పాటు చురుకైన, బహుళ న్యాయ వ్యవస్థలను ప్రతిబింబించే వ్యవస్థలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యాచరణలో ప్రభుత్వంతో పాటు మధ్యవర్తిత్వ సంస్థలు, విద్యావేత్తలు, న్యాయనిపుణుల సమష్టి కృషి అవసరమని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడిదారుల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షిస్తామని భరోసా కల్పించాల్సి ఉంటుందని తెలిపారు.

జమిలిపై నివేదికకు తొందరేం లేదు

● జేపీసీ ఛైర్మన్ చౌధరి

దిల్లీ: జమిలి ఎన్నికలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ తదుపరి సమావేశం ఈనెల 30న నిర్వహించే అవకాశం ఉందని కమిటీ ఛైర్మన్ పి.పి.చౌధరి వెల్లడించారు. వచ్చే సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా కోరుతూ జస్టిస్ రాజేంద్ర మాల్ లోథ్రా, జస్టిస్ శరద్ అరవింద్ బోబ్డేలను ఆహ్వానించవచ్చని ఆయన ఒక వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. జమిలి ఎన్నికల బిల్లుపై సిఫార్సులు తీసుకునే క్రమంలో కమిటీ పలువురు న్యాయ కోవిదులు, నిపుణుల అభిప్రాయాలు స్వీకరించింది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ జె.ఎస్.ఖేహర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లు శుక్రవారం కమిటీ ముందు హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించిన విషయం విదితమే. కమిటీ ఎప్పుడు నివేదిక సమర్పిస్తుందన్న ప్రశ్నకు బదులిస్తూ "అందుకు తొందరేం లేదు. ఎందుకంటే బిల్లు వల్ల ప్రభావితులయ్యే ప్రతి ఒక్కరి అభిప్రాయం సేకరించాలి కాబట్టి" అని చౌధరి అన్నారు. మరి కొందరి అభిప్రాయాలు తీసుకోవాలని నివేదిక సమర్పణకు ముందు సభ్యులు భావిస్తే పార్లమెంటు నుంచి మరింత సమయం కోరుతామని తెలిపారు.

దేశీయంగా తొలిసారి

బ్లాక్‌బాక్స్ డీకోడింగ్

● దిల్లీలో చేస్తున్న ఏఏఐబీ

దిల్లీ: విమాన ప్రమాదాలపై అత్యంత కీలకమైన ఆధారాలను అందించే బ్లాక్‌బాక్స్ డీకోడింగ్‌ను మన దేశంలో తొలిసారిగా విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) చేపట్టింది. ఇప్పటిదాకా విదేశాలకు పంపించి చేసే ఈ ప్రక్రియను ఇప్పుడు దిల్లీలోని ల్యాబ్‌లో చేస్తోంది. అహ్మదాబాద్ విమానానికి సంబంధించిన బ్లాక్‌బాక్సులను డీకోడ్ చేసే ప్రక్రియను దిల్లీలోనే చేస్తున్నట్లు పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శనివారం విశాఖపట్నంలో వెల్లడించారు. దీంతోపాటు ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలివీ..

✦ ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో 54,200 కిలోగ్రాముల ఇంధనం ఉంది. దీంతో కలిపి విమానం మొత్తం బరువు.. 2,13,401 కిలోలుగా ఉంది. ఇది అనుమతించిన పరిమితిలోనే ఉంది. విమానంలో ప్రమాదకరమైన పదార్థాలేవీ లేవు.

✦ విమాన శకలాలను దర్యాప్తు బృందం భద్రమైన ప్రదేశంలో ఉంచింది. ఘటనా స్థలి నుంచి స్వాధీనం చేసుకున్న రెండు ఇంజిన్లను విమానాశ్రయ హ్యాంగర్‌లో భద్రపరిచారు.

✦ ప్రమాద స్థలిలో లభించిన అతి స్వల్ప ఇంధన శాంపిల్‌ను తీసుకుని డీజీసీఏ ల్యాబ్‌లో పరీక్షించగా.. సంతృప్తికర ఫలితాలొచ్చాయి. ఇంధనంలో ఎటువంటి లోపం లేదని తేలింది.

✦ దర్యాప్తులో మరింత సమాచారం సేకరించేందుకు ఎన్‌హాన్స్‌డ్ ఎయిర్‌బోర్న్ ఫ్లైట్ రికార్డర్ (ఈఏఎఫ్ఆర్) నుంచి డేటాను డౌన్‌లోడ్ చేసి ఏఏఐబీ పరిశీలిస్తోంది.

✦ ప్రమాదం జరిగిన విమానానికి జీఈఎన్ఎక్స్-1బీ ఇంజిన్లున్నాయి.

✦ కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్), ఫ్లైట్ డేటా రికార్డర్‌లను (ఎఫ్‌డీఆర్) దర్యాప్తు బృందం స్వాధీనం చేసుకుంది. ఒకటి జూన్ 13న భవనం పైకప్పులో.. రెండోది జూన్ 16న శకలాల్లో లభ్యమయ్యాయి.

✦ జూన్ 24న బ్లాక్‌బాక్సును అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ వైమానికదళ విమానంలో దిల్లీకి తరలించారు. ఆ రోజు నుంచి వాటిని డీకోడ్ చేయడం ప్రారంభించారు.

✦ జూన్ 25న ముందు భాగంలోని బ్లాక్‌బాక్స్ నుంచి క్రాష్ ప్రొటెక్షన్ మాడ్యూల్‌ను (సీపీఎం) విజయవంతంగా అధికారులు సేకరించగలిగారు. మెమరీ మాడ్యూల్‌ను డీకోడ్ చేసి డౌన్‌లోడ్ చేశారు.

✦ అహ్మదాబాద్ విమానానికి సంబంధించిన 49 గంటల డేటాను బ్లాక్‌బాక్స్ నుంచి డీకోడ్ చేయడంలో అమెరికాకు చెందిన గోల్డెన్ ఛాసిస్ సహకరిస్తోంది.

ఇదీ ఇంధన స్విచ్ కథ!

దిల్లీ: ఇంధన సరఫరా స్విచ్‌ల వైఫల్యంవల్లే అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగిందని విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) తన ప్రాథమిక నివేదికలో వెల్లడించింది. విమానంలోని ఇంజిన్ల ఇంధన స్విచ్‌లు రన్ నుంచి కటాఫ్ మోడ్‌లోకి మారడమే ఇందుకు కారణమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అసలీ ఇంధన స్విచ్‌లు ఎలా పనిచేస్తాయనే ఆసక్తి నెలకొంది.

◆ ఇంధన స్విచ్‌లు.. విమాన ఇంజిన్ల ఇంధన సరఫరాను నియంత్రిస్తాయి. అవి రన్, కటాఫ్ మోడ్‌లో ఉంటాయి. వీటిని విమానం స్టార్ట్ చేయడానికి, ఆపడానికి వినియోగిస్తారు.

◆ ఒక సీనియర్ పైలట్ అభిప్రాయం ప్రకారం.. ఇంధన స్విచ్‌లను పైలట్లు యథాలాపంగా మార్చడానికి అవకాశముండదు. దానికి ఒక ప్రొసీజర్ ఉంటుంది. వాటిని మార్చాలంటే తొలుత ముందుకు లాగాల్సి ఉంటుంది.

◆ డ్రీమ్‌లైనర్ విమానాల్లో ఇంధన స్విచ్‌లు.. థ్రస్ట్ లీవర్లకు కింద ఉంటాయి.

◆ ప్రమాదం జరిగిన ఎయిరిండియా విమానంలో రెండు ఇంజిన్ల ఇంధన స్విచ్‌లు సెకను వ్యవధిలో ఆగిపోయి (కటాఫ్) మళ్లీ ఆ తర్వాత ప్రారంభమయ్యాయి.

◆ థ్రస్ట్ లీవర్ కారు యాక్సిలరేటర్ పెడల్ మాదిరిగా ఉంటుంది. దానిని ఎంతగా కాలుతో కిందకు నొక్కితే అంత శక్తి వస్తుంది. ఇందులో ఫుల్ పవర్, ఐడిల్ పవర్ అనే రెండు అతి స్థాయిలుంటాయి. దీనికి అనుగుణంగా ఇంధన స్విచ్‌లలో రన్, కటాఫ్ స్థాయిలుంటాయి. అంటే ఇంజిన్‌ను ఆపేస్తే ఇంధన స్విచ్ కటాఫ్ మోడ్‌లోకి వెళ్తుంది. ఇంజిన్‌ను ఆన్ చేస్తే రన్ మోడ్‌లోకి వెళ్తుంది.

◆ 'విమాన ఇంజిన్లలోపల ఆటోమేటిక్‌గా అనేకం జరుగుతాయి. ఇంజిన్ స్టార్ట్ అయిందంటే ఇంధనం దానిలోకి ప్రవహిస్తుందని అర్థం. థ్రస్ట్ స్థాయి ఐడిల్‌గా ఉంటే ఇంజిన్ ఐడిల్‌గా ఉన్నట్లు లెక్క. ఇంధన నియంత్రణ కటాఫ్ నుంచి రన్‌లోకి మారడానికి ఎలక్ట్రానిక్ గేట్ ఉంటుంది. ఒకవేళ కటాఫ్ నుంచి రన్‌కు, రన్ నుంచి కటాఫ్‌కు ఉద్దేశపూర్వకంగా మార్చినా.. ఈ గేట్ విమానానికి అనుగుణంగా ఆటోమేటిక్‌గా మార్చుకుంటుంది. ఇది ఇందులో ఉండే భద్రతాపరమైన ఫీచర్' అని సీనియర్ పైలట్ తెలిపారు.

◆ ఇంధన స్విచ్‌ల పొజిషన్ మారడానికి మెకానికల్, ఎలక్ట్రికల్ అంశాలూ కారణమై ఉండొచ్చని విమానయాన నిపుణులు అభిప్రాయపడ్డారు. మానవ ప్రమేయంతోనే ఇంధన స్విచ్‌లు మార్చే అవకాశముందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్‌పీఐ) అధ్యక్షుడు, మాజీ పైలట్ సీఎస్ రణ్‌ధావా పేర్కొన్నారు. అవి లాక్ మోడ్‌లో ఉంటాయని, ముందుకులాగి మాత్రమే మార్చగలమని తెలిపారు.

ప్రాచీన వైద్య విధానాల డిజిటలీకరణలో భారత్ భేష్

● డబ్ల్యూహెచ్‌వో ప్రశంస

ఇంటర్నెట్ డెస్క్: ప్రాచీన వైద్య పద్ధతుల సమాచారాన్ని కృత్రిమ మేధతో అనుసంధానించిన తొలి దేశంగా భారత్ అవతరించింది. ఈ విషయాన్ని స్వయంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించింది. ఆయుష్ చికిత్సా పద్ధతుల వివరాలను కూడా భారత్ కృత్రిమ మేధతో అనుసంధానించిందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే తాము "మ్యాపింగ్ ది అప్లికేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ ట్రెడిషనల్ మెడిసిన్" శీర్షికన సంప్రదాయ వైద్య విధానాలపై ఏఐ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించామని వెల్లడించింది. ఆయుర్వేద, సిద్ధ, యునాని, సోవా రిగ్పా వంటి ప్రాచీన వైద్య విధానాలను "ట్రెడిషనల్ నాలెడ్జ్ డిజిటల్ లైబ్రరీ" ద్వారా డిజిటల్ రూపంలోకి తెచ్చిన తొలి దేశం భారత్ అని ప్రపంచ ఆరోగ్య సంస్థ కొనియాడింది. ఇందులోని విలువైన ప్రాచీన సమాచారాన్ని ప్రతీ వైద్య నిపుణుడు అవగతం చేసుకునేందుకు ప్రత్యేక కృత్రిమ మేధ సాధనాలు ఉన్నాయని తెలిపింది.

ఉత్తర కొరియాపై కూటమి కట్టొద్దు: రష్యా

సియోల్: ఉత్తర కొరియాను లక్ష్యంగా చేసుకుని రక్షణాత్మక కూటమిగా ఏర్పడవద్దని అమెరికా, దక్షిణకొరియా, జపాన్‌లను రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ హెచ్చరించారు. సైనిక, ఇతర సహకారాలను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా మిత్రదేశమైన ఉత్తరకొరియాలో పర్యటనకు ఆయన వచ్చారు. శనివారం ఉ.కొరియా విదేశాంగ మంత్రి చో సన్‌హుయితో సమావేశమయ్యారు. ఈ దేశం చుట్టూ ఆ మూడు దేశాలు సైనిక బలగాలను మోహరిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రష్యా, ఉత్తర కొరియాలకు వ్యతిరేకంగా పొత్తులు కుదుర్చుకునే సాహసం చేయొద్దన్నారు. కొంత కాలంగా రష్యా- ఉత్తర కొరియా మధ్య సంబంధాలు బలపడుతున్నాయి. సైనిక, ఆర్థిక సాయానికి ప్రతిగా, ఉక్రెయిన్‌పై యుద్ధానికి ఉత్తర కొరియా మద్దతుగా నిలుస్తోంది. తమ సైన్యాన్ని, మందుగుండు సామగ్రిని రష్యాకు సరఫరా చేస్తోంది. అమెరికా, దక్షిణకొరియా, జపాన్‌లు ఉత్తరకొరియా సమీపంలో అణ్వాయుధ సామర్థ్యం కలిగిన అమెరికా బాంబర్లతో సైనిక విన్యాసాలు నిర్వహించాయి. ఆ సందర్భంగా సియోల్‌లో సమావేశమైన ఈ దేశాల ఉన్నతాధికారులు.. ప్రాంతీయ భద్రతకు ముప్పు కలిగించే చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిలిపివేయాలని ఉత్తరకొరియాను కోరారు.



కిమ్‌తో సెర్గీ లవ్రోవ్

భూమికి తిరిగొచ్చాక 7 రోజుల పునరావాసానికి శుభాంశు

● 15న కాలిఫోర్నియా తీరానికి చేరువలో ల్యాండింగ్



దిల్లీ: యాక్సియం-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు ఈనెల 15న భూమికి తిరిగి రానున్నారు. భారత కాలమానం ప్రకారం వీరు ఈ నెల 14న మధ్యాహ్నం 2.25 గంటలకు.. అంతరిక్ష కేంద్రానికి అనుసంధానమై ఉన్న డ్రాగన్ వ్యోమనౌకలోకి ప్రవేశిస్తారు. స్పేస్ సూట్‌లు ధరించి, అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారు. సాయంత్రం 4.35 నిమిషాలకు ఈ వ్యోమనౌక.. అంతరిక్ష కేంద్రంతో విడిపోతుంది. క్రమంగా వేగాన్ని తగ్గించుకొని భూవాతావరణంలోకి ప్రవేశిస్తుంది. మరుసటి రోజు మధ్యాహ్నం 3 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో సాగర జలాల్లో దిగుతుంది. అనంతరం వ్యోమగాములు ఏడు రోజుల పాటు ప్రత్యేక పునరావాస కేంద్రంలో ఉంటారు. దాదాపు 18 రోజుల పాటు రోదసిలోని భారరహిత స్థితిలో గడిపిన వ్యోమగాములు తిరిగి భూమి గురుత్వాకర్షణ శక్తికి అలవాటుపడేలా చూడటం దీని ఉద్దేశం. ఆ సమయంలో వారు ఫ్లైట్ సర్జన్ పర్యవేక్షణలో ఉంటారు. తిరుగు ప్రయాణంలో డ్రాగన్ వ్యోమనౌక 265 కిలోల సాధన సంపత్తిని కూడా భూమికి తీసుకొస్తుంది. అందులో అమెరికా అంతరిక్ష సంస్థ-నాసాకు సంబంధించిన హార్డ్‌వేర్, తాజా మిషన్ ద్వారా నిర్వహించిన 60 ప్రయోగాలకు సంబంధించిన అంశాలు ఉంటాయి. మరోవైపు శుభాంశు ఆరోగ్యాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు సంబంధించిన ఫ్లైట్ సర్జన్లు కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

యంగ్ ఇండియన్‌కు విరాళాలు.. దాతలకు కాంగ్రెస్ టికెట్లు

● నగదు అక్రమ చలామణి జరిగిన తీరిది

● నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ వాదనలు

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు భాగస్వాములుగా ఉన్న 'యంగ్ ఇండియన్' కంపెనీ నగదు అక్రమ చలామణి (మనీలాండరింగ్)కి పాల్పడిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. నేషనల్ హెరాల్డ్ కేసులో శనివారం ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్వీ రాజు దిల్లీలోని ప్రత్యేక కోర్టులో వాదనలు వినిపించారు. యంగ్ ఇండియన్‌కు విరాళాలు ఇచ్చిన వ్యక్తులకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా కాంగ్రెస్ పార్టీ టికెట్లు వచ్చేవని తెలిపారు. అలా నిధులు సమకూర్చిన వ్యక్తి చేసిన ఫిర్యాదును ఈ సందర్భంగా ఏఎస్‌జీ ప్రస్తావించారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో రూ.50 లక్షలు యంగ్ ఇండియన్ బ్యాంకు ఖాతాలో జమ చేయమని చెప్పారని, ఆ తర్వాత అదే మొత్తాన్ని నగదు రూపంలో తిరిగి ఇచ్చారని ఆ వ్యక్తి తెలిపినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల సూచన మేరకు యంగ్ ఇండియన్‌కు విరాళం ఇచ్చిన వ్యక్తులకు ఎన్నికల్లో పోటీ చేసేలా ఆ పార్టీ టికెట్లు వచ్చేవని ఆరోపించారు. యంగ్ ఇండియన్‌కు ఉన్న ఛారిటబుల్ ట్రస్ట్ హోదాను ఆదాయపు పన్ను శాఖ రద్దు చేసిందని తెలిపారు. నష్టాల్లో నడుస్తున్న యంగ్ ఇండియన్‌కు కోటి రూపాయాలను డాటెక్స్ మర్చెండైజ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎలా అప్పుగా ఇచ్చిందని ప్రశ్నించారు. ఆస్తులేని, ఇచ్చిన రుణం తిరిగి వస్తుందన్న నమ్మకంలేని సంస్థకు, తాకట్టు కానీ, తగిన హామీ కానీ లేకుండానే డాటెక్స్ ఎందుకు నిధులు సమకూర్చిందంటూ సందేహాలు లేవనెత్తారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రచురణ సంస్థ అయిన ఏజేఎల్‌కు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) రహస్యంగా బదిలీ చేసిన రూ.90 కోట్ల రుణం తప్పుదోవ పట్టించే చర్యగా అదనపు సొలిసిటర్ జనరల్ అభివర్ణించారు.

కాలిఫోర్నియాలో 200 మంది అక్రమ వలసదారుల అరెస్టు

● అధికారులపై నిరసనకారుల దాడులు

కామరిల్లో (అమెరికా): అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కార్పింటేరియా, కామరిల్లో తదితర ప్రాంతాల్లో అక్రమ వలసదారులు ఉన్నారనే సమాచారంతో ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అధికారులు క్రిమినల్ సెర్చ్ వారంట్‌తో గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమతి ఉన్న రెండు గంజాయి సాగు క్షేత్రాల్లో దాదాపు 200 మంది అక్రమ వలసదారులను అరెస్టుచేశారు. ఈ విషయం తెలుసుకున్న వారి సంబంధీకులతో పాటు మరి కొందరు అక్కడ గుమిగూడి నిరసనలు తెలపడంతో పాటు ఇమ్మిగ్రేషన్ అధికారులపై దాడులకు దిగారు. దాంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో మొత్తం 12 మంది గాయపడినట్లు స్థానిక అగ్నిమాపక అధికారి ఒకరు తెలిపారు. దీనికి బాధ్యులుగా నలుగురు అమెరికా పౌరులను అధికారులు అరెస్టు చేశారని, ఫెడరల్ అధికారులపై కాల్పులు జరిపి తప్పించుకున్న వ్యక్తిని అరెస్టు చేసేందుకు రూ.42 లక్షల రివార్డునూ ప్రకటించారని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. గంజాయి సాగు క్షేత్రాల్లో అధికారుల తనిఖీలప్పుడు అక్రమ వలసదారులకు సంబంధించిన 10 మంది దాకా పిల్లలు కూడా అక్కడ ఉన్నట్లు పేర్కొంది.



ఇమ్మిగ్రేషన్ అధికారులతో నిరసనకారుల వాగ్వాదం

వీసా వస్తే సరిపోదు..

● 'బహిష్కరణ ముప్పు'పై అమెరికా హెచ్చరిక

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండో సారి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తున్నారు. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. అయితే, వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అగ్రరాజ్యం తాజాగా హెచ్చరించింది. భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. 'వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ ఆగిపోదు. వారి ప్రతి కదలికను నిశితంగా గమనిస్తూనే ఉంటాం. అమెరికా చట్టాలు, వలస నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందే. అతిక్రమిస్తే తక్షణం వీసాలను రద్దు చేసి దేశం నుంచి వెళ్లగొడతాం' అని తెలిపింది. వీసా దరఖాస్తుదారులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల సోషల్ మీడియా ఖాతాలను సమర్పించాల్సి ఉంటుందని ఇటీవల అమెరికా స్పష్టం చేసింది. ఈ వివరాలను ఇవ్వకపోతే వీసా తిరస్కరిస్తారు.

బిహార్‌లో 'ఇండియా' కూటమి సీట్ల సర్దుబాటు చర్చలు ప్రారంభం

పట్నా: ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులు శనివారం నాడిక్కడ సుదీర్ఘ మేధోమథన సమాలోచనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక ఇతర విషయాలతో పాటు రానున్న బిహార్ శాసనసభ ఎన్నికల్లో భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు సైతం చర్చకు వచ్చింది. బిహార్ శాసనసభలో ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ నివాసంలో జరిగిన ఈ సమావేశం దాదాపు ఆరు గంటల పాటు కొనసాగింది. కూటమి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న తేజస్వీ యాదవ్ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. "అవును సీట్ల సర్దుబాటు చర్చలు మొదలయ్యాయి. అయితే ఇప్పుడే నేను వివరాలేవీ బయటపెట్టలేను. అంతా ఖరారు అయ్యాక బహిర్గతం చేస్తాం" అని ఆయన తెలిపారు. ఆయనను ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తారన్న ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. జేడీయూ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ తన ఆలోచనల్ని కాపీ కొడుతున్నారని, ఆలోచనా చౌర్యానికి పాల్పడుతున్నారని తేజస్వి ఆరోపించారు.

చిత్రహింసల కేంద్రాలకు యునెస్కో వారసత్వ స్థలాల్లో చోటు

నాంఫెన్: కంబోడియాలో 50 ఏళ్ల క్రితం కమ్యూనిస్టు ఖ్మేర్ రూజ్ ప్రభుత్వం జనహత్యలకు, చిత్ర హింసలకు ఉపయోగించిన మూడు స్థలాలను శుక్రవారం యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలాల్లో చేర్చారు. వాటిలో ఒక ఊచకోత స్థలం 'ది కిల్లింగ్ ఫీల్డ్స్' అనే హాలీవుడ్ చిత్రం ద్వారా ప్రపంచానికి పరిచయమైంది. మిగతా రెండూ కారాగారాలే. అంగ్‌కోర్‌వట్‌తోపాటు మరి మూడు కంబోడియా పురావస్తు కట్టడాలు ఇప్పటికే యునెస్కో వారసత్వ స్థలాల జాబితాలో ఉన్నాయి. కొత్తగా చేర్చిన మూడు స్థలాలు హింసా దౌర్జన్యాల వినాశకర ప్రభావం గురించి కొత్త తరానికి తెలియజెబుతాయని కంబోడియా నిపుణుడు యూక్ ఛాంగ్ వివరించారు. నిరంతరం శాంతిని కాపాడాల్సిన అవసరాన్ని చాటిచెబుతూ ఆదివారం ఉదయం కంబోడియా ప్రజలు డప్పులు మోగించాలని దేశాధ్యక్షుడు హన్ మానే పిలుపు ఇచ్చారు.



టెక్సాస్ రాష్ట్రం కేర్‌విల్లేలో వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. చిత్రంలో ఆయన సతీమణి మెలనియా

వసుంధర

vasundhara@eenadu.in



కృత్రిమ మేధ (ఏఐ)... ఎక్కడ చూసినా ఏ రంగంలోనైనా దీని జపమే. నిద్రలేస్తూనే చూసే ఫోన్‌తో మొదలు... నిద్రించే బెడ్ వరకూ ప్రతిదీ ఏఐతోనే పని చేస్తున్నాయి. ఇప్పుడు ఇంటి, వంటింటి పనుల్లోనూ ఇది కీలకంగా మారనుంది. మరి ఈ డొమెస్టిక్ ఏఐ మహిళలకు ఎంతవరకూ ప్రయోజనం..?

వంటింటి మహారాణి ఏఐ!

రమ్య సీరియస్‌గా వంట చేస్తోంది. అక్కడికి ఉత్సాహంగా వచ్చిన మోహన్ 'మన పనులన్నీ ఇక నుంచి ఏఐ చేసేస్తుంది' అంటూ ఫోన్‌లో కొన్ని ఫీచర్లు చూపిస్తుంటాడు. 'అయితే ఆ ఏఐ వంట చేస్తుందేమో అడగండి' అంటుందామె. ఈ రీల్ చేసింది సరదా కోసమైనా, అదే నిజమై మహిళలు వంటింట్లో గడిపే సమయాన్ని ఏఐ తగ్గించగలిగితే దేశ జీడీపీ గ్రాఫ్ అమాంతం పెరగడం ఖాయం. పిల్లలకీ భర్తకీ అత్తమామలకీ అందరికీ బ్రేక్‌ఫాస్ట్, లంచ్‌తో సహా అన్నీ రెడీ చేసి ఆఫీసుకు పరుగులు. వచ్చాక మళ్లీ వంట, హోమ్‌వర్క్‌లు, పెద్దవాళ్ల బాగోగులు చూడటంతో నేటి మహిళ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ పరిస్థితిలో ఆమె తన శక్తిసామర్థ్యాలను ఉత్పాదకత వైపునకు మళ్లించాలంటే వంటింట్లో గడిపే సమయం తగ్గాల్సిందే. ఎందుకంటే సమానత్వం, సాధికారత అంటూ ఎంతగా పోరాడినా... ఆడవాళ్లకు ఇంటి పని, వంట పని ఎటూ తప్పడం లేదు. పిల్లల బాధ్యత సరేసరి. ఏఐ సహకారంతో ఆ పనుల్ని కొంతైనా తగ్గించుకుంటే ఆర్థిక దిశగా అడుగులేయొచ్చు అంటున్నారు నిపుణులు.

నిజానికి పదేళ్ల క్రితమే లండన్‌కు చెందిన మోలీ రోబోటిక్స్ ఇంటి కోసం రోబో కిచెన్‌లను రూపొందించింది. ఈ రకమైన రోబో షెఫ్‌లనీ, రోబోటిక్ వ్యాక్యూమ్ క్లీనర్లనీ అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికే వాడుతున్నారు. ఇవన్నీ కొంతమేర పనుల్ని సులభతరం చేస్తున్నాయి. కానీ మనిషి ప్రమేయం పూర్తిగా ఉండదని చెప్పలేం. వంటకు కావాల్సినవి సిద్ధం చేయడం, శుభ్రం చేయడం... వంటివి మనమే చేయాలి. సాంకేతికత పనుల్ని సులభతరం చేస్తుందే తప్ప, పూర్తిగా చేయలేదు. అలాగని ఏఐ అప్లయెన్సెస్‌ని పక్కన పెట్టలేం. అందుకే గ్లోబల్ బ్రాండ్లైన ఎల్‌జీ, శామ్‌సంగ్, హెయర్... వంటి కంపెనీలు సైతం ఏఐ ఉపకరణాల బాట పడుతున్నాయి. ప్రస్తుతం ఈ రకమైన స్మార్ట్ కిచెన్‌లు లగ్జరీ ఇళ్లకే పరిమితం. కానీ నోష్, అప్లయన్స్... వంటి దేశీ స్టార్టప్‌లూ వీటిని రూపొందించడంతో ధరలు అందుబాటులోకి రావచ్చు. అలా వంటింట్లోకి వచ్చిన, వస్తోన్న కొన్ని ఏఐ ఉపకరణాలు...

కుకింగ్ అసిస్టెంట్స్



మిక్సర్, ప్రెషర్ కుక్కర్లతో పనిలేకుండా చేస్తాయివి. 'అప్లయన్స్' సంస్థ రూపొందించిన ఏఐ అసిస్టెంట్... దాని రెసిపీ లైబ్రరీ నుంచి 500 రకాలను కోరిన రుచుల్లో వండేస్తుందట. కావాల్సిన వంటను ఎంపిక చేసుకుని అవసరమైన పదార్థాలను వేస్తే చాలు. వంటకాన్ని బట్టి కోయడం, కలపడం, గ్రైండ్ చేసుకోవడం, ఉడికించడం... దాదాపు 16రకాల పనుల్ని చేస్తుందీ పరికరం. దీన్ని శుభ్రం చేయడమూ తేలికేనట. ఇదొక్కటే కాదు, వండర్‌షెఫ్, షావోమీ, నోష్... ఇలా వంట చేసే లేదా తోడ్పడే అసిస్టెంట్స్ చాలానే వస్తున్నాయి.

సౌలభ్యమే ఈ ఏఐ రోబోల విజయం. వంట మొదలుపెట్టి అక్కడే ఉండాల్సిన పని లేదు. ఇతర పనులూ చేసుకోవచ్చు. కూర మాడుతుందనో గ్యాస్ కట్టాలనో టెన్షన్ ఉండదు. కొన్నాళ్లకు వీటిల్లోని కృత్రిమ మేధ మీ రుచుల్నీ ఇష్టాల్నీ గమనించి వంట పూర్తి చేస్తుంది. అప్పుడు అచ్చం మీరు చేసినట్లే అవీ చేస్తాయట. ఈ ఆల్ ఇన్ వన్ మెషీన్లతో సమయంతోపాటు స్థలం, ఇంధనం అన్నీ ఆదానే.



అవెన్లు, ఇండక్షన్ కుక్‌టాప్‌లు: ఏం వండుతున్నామో సెన్సర్ల ద్వారా గుర్తించి వాటికవే ఉష్ణోగ్రతనీ వంట సమయాన్నీ సర్దుబాటు చేసుకుంటాయి. మన జోక్యాన్ని తగ్గిస్తాయి.



స్మార్ట్ రిఫ్రిజిరేటర్లు: ఏఐ విజన్ ఇన్‌సైడ్ ద్వారా పని చేసే ఈ రకం ఫ్రిజ్‌ల్ని ఆప్ ద్వారా ఫోన్‌కి కనెక్ట్ చేసుకుంటే గడువు తేదీలను చెక్ చేసి ఏవి ఎప్పుడు వండాలో చెబుతాయి. అయిపోయేవాటి గురించీ హెచ్చరిస్తాయి. తలుపు తెరవడం, మూయడం చేసినప్పుడు వాటంతటవే కూలింగ్‌ను సరిచేసుకుని ఆహార వృథానీ కరెంట్ బిల్లునీ తగ్గిస్తాయి.



ఎయిర్ ఫ్రయర్లు: ఇందులోని ఏఐ సెన్సర్లు పదార్థం, బరువుని బట్టి దానంతటదే ఉష్ణోగ్రతను సెట్ చేసుకుని వడియాలు, చిప్స్, టిక్కీలు... వంటివి నూనె లేకుండానే తయారుచేసి ఆరోగ్యాన్ని రక్షిస్తాయి.



ఇవే కాదు, ఆటోమేటిక్ మల్టీ కుక్కర్లు, కాఫీ మేకర్లు, లాండ్రీ ఫోల్డింగ్స్ మెషీన్లు, ఫ్యాబ్రిక్‌ను గుర్తించి ఉతికే వాషింగ్ మెషీన్లు, సెల్ఫ్ క్లీనింగ్ అవెన్లు, వాయిస్ కమాండ్‌తోనే తెరచుకునే డిష్ వాషర్లు... ఇలా ఏఐ సాయంతో పనిచేసే ఉపకరణాలెన్నో వస్తున్నాయి. చేతికి పని లేకుండా మోషన్ సెన్సర్ల ద్వారా లైట్లు, అవెన్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ అయ్యేవీ ఉన్నాయి. అంతేనా, ముమ్మందు మనకెలాంటి శ్రమా లేకుండా వంటకు కావాల్సిన వస్తువుల్ని సైతం వాటంతటవే యాప్‌లో కొనుగోలు చేసే డిజిటలైజ్డ్ స్మార్ట్ కిచెన్‌లూ రావొచ్చు. 'ఏమో, గుర్రం ఎగరావచ్చు' అన్నట్లు అప్పుడు కృత్రిమ మేధే వంటింటి మహారాణి... ఏది పెడితే అది తినాల్సిందేనేమో!

కెరియర్ మారాలంటే భయమా..!



చేస్తోన్న ఉద్యోగం నచ్చడం లేదు. జీతం సరిపోవడం లేదు. రోజుకి పది కిలోమీటర్ల ప్రయాణం చేయలేకపోతున్నా. కొత్తగా, భిన్నంగా ఏదైనా ప్రయత్నించాలి' ఇలా వేరే ఉద్యోగం వెతుక్కోవడానికి కారణాలెన్నో. కానీ మారాలంటేనే భయం. రక్షణ, పనివేళలు, కొత్త బాధ్యతలు, వర్క్ లైఫ్ బ్యాలెన్స్ లాంటి విషయాల్ని ఆలోచిస్తూ ఆగిపోతున్నారు మహిళలు. 'హ్యాపియెస్ట్ ప్లేస్ టు వర్క్' ఆర్గనైజేషన్ 2024లో విడుదల చేసిన నివేదికల ప్రకారం... మనదేశంలో దాదాపు 70శాతం మంది మహిళలు చేస్తున్న పనిమీద, ఆఫీస్ వాతావరణం మీద ఆసక్తి లేకుండానే కార్యాలయాలకు వెళ్తున్నారట. వీరిలో 54శాతం మంది ఉద్యోగాలు వదిలేయాలని కూడా అనుకుంటున్నారట. కానీ ఆది నుంచి మొదలుపెట్టాలంటే ఎవరికైనా కష్టమే. అందుకే చాలామంది ఉద్యోగినులు రాజీనామా చేయడానికి సంకోచిస్తున్నారట. అయితే, ఈ ఆలోచనలు ఇచ్చే ఒత్తిడి కన్నా వేరే దానికి వెళ్లడమే మంచిది అంటున్నారు కెరియర్ నిపుణులు. కాకపోతే, పక్కా ప్రణాళికతో ముందడుగు వేయమంటున్నారు.

చీర మన సంస్కృతిలో భాగం. ప్రతి అమ్మాయీ ఏరికోరి ఎంచుకునే వస్త్రాల్లో దీనిదీ ప్రత్యేక స్థానమే. అందుకే ఎన్ని ఉన్నా... మరోటి కావాలనుకుంటారు, కొనేస్తుంటారు. కొన్నాళ్లకి బోర్‌కొట్టి, ట్రెండ్ కాదనీ పక్కన పడేస్తుంటారు. ఎంత వృథా? అందుకే వాటికో రూపునివ్వడమే కాదు, వాటి ద్వారా మహిళలకూ ఉపాధి కల్పిస్తోంది 'ఏ వజ్ ఎ శారీ'!



నేనో చీరని!

రోజుకో కొత్త ఫ్యాషన్ పుట్టుకొస్తోంది. దాని వల్ల భూమ్మీద పోగవుతున్న వస్త్ర వృథా ఎంతో తెలుసా? 7800 కిలో టన్నులట. అదీ కేవలం దేశంలోనే! వీటిల్లో బోర్ కొట్టి పడేసేవీ ఎక్కువే. అలాంటి చీరలకు ఓ కొత్తరూపు ఇవ్వాలని 2013లో ప్రారంభమైన సంస్థే 'ఐ వజ్ ఎ శారీ'. దీనివెనక మహిళలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశమూ ఉంది. స్టెఫానో ఫునారీ అనే ఇటాలియన్ వ్యాపారవేత్త దీన్ని ముంబయిలో ప్రారంభించారు. పేద మహిళలను ఎంచుకుని శిక్షణిప్పించారు. వద్దనుకున్న చీరలతో దుస్తులు, యాక్సెసరీలు, గృహాలంకరణ వస్తువులు, టెక్స్‌టైల్ క్రాఫ్ట్స్ వంటివెన్నో రూపొందిస్తున్నారు. ఫలితంగా 17 లక్షల స్క్వేర్ మీటర్ల వస్త్రం చెత్తపాలు కాకుండా ఉండటమే కాదు, వందల మంది మహిళలకూ ఉపాధి దక్కింది.

ఈ చీరలను వీళ్లు స్థానిక సెకండ్ హ్యాండ్ మార్కెట్ల నుంచి కొనుగోలు చేస్తారు. తరవాత అందమైన దుస్తులు, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులుగా తీర్చిదిద్దుతారు. 'దీనిద్వారా వృథాని అడ్డుకోవడమే కాదు, ఫ్యాషన్‌కి ప్రత్యామ్నాయాలు చూపిస్తున్నాం. దీంతో వస్త్ర తయారీకి అవసరమయ్యే నీళ్లు, డైయింగ్ రసాయనాలు, వాటి ద్వారా ఉత్పన్నమయ్యే కాలుష్యాన్నీ నివారిస్తున్నా'మని గర్వంగా చెబుతారిక్కడి మహిళలు. వీరి ఉత్పత్తులు దేశీయంగా అమ్ముడవ్వడమే కాదు, విదేశాలకూ వెళుతున్నాయి. ఫ్యాషన్ వీక్‌ల్లో మెరవడమే కాదు, లాక్మే ఫ్యాషన్ వీక్‌లో సర్క్యులర్ డిజైన్ ఛాలెంజ్‌లో విజేతగానూ నిలిచింది. మరెన్నో అవార్డులూ గెలుచుకుందీ సంస్థ. ఫాస్ట్ ఫ్యాషన్‌కి వ్యతిరేకంగా, సస్టెయినబిలిటీని ప్రోత్సహిస్తున్నందుకు ప్రముఖ లగ్జరీ సంస్థ 'గూచి' కూడా వీరికి అండగా నిలిచింది.

'ఒకప్పుడు ఇంటి, కూలీ పనులకే పరిమితం అయ్యేవాళ్లం. ఇప్పుడు మా కాళ్ల మీద మేం నిలబడుతున్నాం. ముఖ్యంగా పర్యావరణానికి మేలు చేస్తున్నాం. ఈ ఆలోచన మరింత ఆనందాన్నిస్తోంది' అంటోన్న ఈ మహిళల్నీ... సంస్థ ఆలోచననీ అభినందించాల్సిందే కదూ!

అమ్మాయిలూ... ఒంటరిగా ఏదైనా కొత్త ప్రదేశానికి లేదా ప్రకృతిలోకి పర్యటకానికి వెళ్లిరండి. ఎన్నో విషయాలు తెలుస్తాయి. తెలుసుకునే క్రమంలో కలిగే ఉత్సాహం, థ్రిల్ తెలియకుండానే ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి. కెరియర్‌ని ముందుకు నడిపేదీ ఆ ఉత్సుకత, కొత్తవి తెలుసుకోవాలన్న ఆసక్తే! కాబట్టి, భయపడుతూ కాదు, నేర్చుకోవాలన్న ఆసక్తి, ధైర్యంతో ముందడుగు వేయండి. వ్యాపారమనే కాదు, దేనిలోనైనా రాణించగలుగుతారు. అయితే ఈ క్రమంలో మీ నిర్ణయంపై మీరు నమ్మకం ఉంచాలి. అవసరమైతే అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవడానికీ సిద్ధంగా ఉండాలి.



- చిత్ర గుర్నానీ డాగా, సీఈఓ, థ్రిలోఫీలియా

మీకు తెలుసా?

అంటార్కిటికాలో అడుగుపెట్టిన తొలి మహిళ మెహర్ మూస్. ఇరవై ఏళ్ల వయసులో ప్రపంచాన్ని చుట్టాలన్న కోరికతో ప్రయాణం మొదలుపెట్టారు. అయిదు దశాబ్దాల్లో ఒంటరిగా 180 దేశాలు తిరిగారామె.



ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

బంగారం - వెండి



12న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,00,900	91,800	1,15,313
విజయవాడ	97,960	91,400	1,15,600
ప్రొద్దుటూరు	98,000	90,160	1,12,800
రాజమహేంద్రవరం	99,710	91,400	1,25,000
విశాఖపట్నం	99,350	91,400	1,18,000
తమిళనాడు	-----	91,400	1,25,000

భారత నాణ్యత మండలి దేశంలో సర్పంచులు అందరినీ వేదికపైకి తీసుకొచ్చేందుకు 'సర్పంచ్ సంవాద్' పేరిట మొబైల్ అప్లికేషన్ ప్రవేశపెట్టింది. అది నిర్వహించే పోటీల్లో గెలిచారు చేబ్రోలు గ్రామ సర్పంచ్ రాంధే లక్ష్మీ సునీత. ఆమె తన ఆలోచనలతో కేంద్రాన్ని మెప్పించి దేశంలోనే మొదటిస్థానంలో నిలిచారు. ఆ వివరాలు మనతో పంచుకున్నారిలా...

కేంద్రం మెచ్చిన గ్రామ సర్పంచ్





ఏలూరు జిల్లాలోని చేబ్రోలు గ్రామం మాది. నాన్న వెంకట్రావు టైలర్. అమ్మ చెల్లమ్మ గృహిణి. ఇదే గ్రామానికి చెందిన రాజారావుకిచ్చి ఇంటర్ చదువుతుండగానే పెళ్లి చేశారు. చదువు అంటే ఇష్టంతో వివాహమైన 15ఏళ్ల తర్వాత దూరవిద్యలో బీఏ పూర్తి చేశాను. పుట్టినిల్లు, మెట్టినిల్లు ఒక చోటే ఉండటం నేను చేసుకున్న అదృష్టం. చిన్నప్పటి నుంచి మా ఊరుకి ఏదైనా చేయాలనిపించేది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పదవులు చేపడితే భర్తలే పెత్తనం చెలాయిస్తారు అనే నానుడి ఉంది. దీన్ని నేను మార్చాలనుకున్నా. ఊరుని బాగుచేయాలి. సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో 2021లో సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచాను. మొదట్లో స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇస్తూ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రచారం చేశాను. అది ప్రజల్లో బాగా చైతన్యాన్ని తీసుకొచ్చింది. దీంతో మా ఊరిని జిల్లా స్థాయి శిక్షణా కేంద్రం(సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్)గా ఎంపిక చేశారు. తాజాగా 'సర్పంచ్ సంవాద్' పోటీల్లో జాతీయ స్థాయిలో మొదటి స్థానం గెలుపొందాను. భారత నాణ్యత మండలి (క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో దేశంలోని సర్పంచులను ఒక వేదిక పైకి తెచ్చేందుకు 'సర్పంచ్ సంవాద్' పేరిట మొబైల్ అప్లికేషన్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. మెరుగైన పాలన, గ్రామాభివృద్ధి, సమన్వయం, సాంకేతికత, సమస్యల పరిష్కార మార్గాలను సృష్టించడం దీని ముఖ్య ఉద్దేశం. ప్రతినెలా ఆన్‌లైన్ విధానంలో పోటీలు నిర్వహించింది కేంద్ర ప్రభుత్వం. ఇందులో భాగంగానే జూన్‌లో స్వచ్ఛత, తాగునీటిపై పోటీలు జరిగాయి. చెత్త నుంచి సంపద తయారీ, మెరుగైన పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన, జలజీవన్ మిషన్ నిధులతో తాగునీరు సరఫరా మొదలైన అంశాలను 80సెకన్ల నిడివితో వీడియోని చేసి యాప్‌లో షేర్ చేశాను. మొదటి ప్రయత్నంలోనే దేశంలోనే మొదటి స్థానం పొందడం ఆనందంగా ఉంది.

అయిదేళ్లు...అయిదు థీమ్స్‌తో...

ఈ ఫలితం అంత సులువుగా రాలేదు. 2021లో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒక్కో థీమ్‌తో గ్రామంలోని మహిళలను ప్రోత్సహించాను. తొలిఏడాది వివిధ రంగాల్లో పనిచేసే మహిళల్ని సత్కరించాను. రెండో సంవత్సరం కిశోర బాలికలకు అవగాహన, మూడో ఏడాది భర్త మరణించిన తర్వాత కుటుంబాలను నెట్టుకొస్తున్న భార్యలకు సన్మానం. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలతో కుటుంబానికి బాసటగా నిలుస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలనూ సత్కరించాం. 2025లో 'ఇల్లాలి ఆరోగ్యం-ఇంటికి రక్ష' కార్యక్రమం నిర్వహించి గృహిణులు శారీరకంగా, మానసికంగా ఎంత దృఢంగా ఉండాలో అవగాహన కల్పించాం. ఇల్లాలు బాగుంటేనే గ్రామం బాగుంటుంది.

- పెండ్యాల రవి శంకర్, ఉంగుటూరు

ఆవిష్కరణతో పరిష్కారం..!

రోడ్డు ప్రమాదాలను తగ్గించేలా రహదారి భద్రత కోసం కృషి చేస్తోంది వనీషా ఖేటర్‌పాల్. ఇందుకోసం ఈ 16 ఏళ్లమ్మాయి స్టార్టప్‌నీ ప్రారంభించింది. ఈ క్రమంలో ఎన్నో పురస్కారాలనూ అందుకుంది. ఆమె గురించి తెలియాలంటే...



వనీషా



జైపుర్‌కు చెందిన వనీషా తండ్రి గౌరవ్, తల్లి జ్యోతి ఖేటర్‌పాల్... ఇద్దరూ కంప్యూటర్ సైంటిస్టులు. జైపుర్ మహారాజా సవాయ్‌మాన్‌సింగ్ విద్యాలయాలో వనీషా ఇంటర్ చదువుతోంది. ఓరోజు రాత్రి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తున్నప్పుడు టీవీలో చూసిన ఓ వార్త వనీషాను రోడ్డుప్రమాదాల గురించి ఆలోచించేలా చేసింది. 'నెట్‌వర్క్ సెక్యూరిటీలో పీహెచ్‌డీ చేసి, ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అమ్మ నాకు ఎప్పుడూ కొత్త టెక్నాలజీల గురించి చెబుతుంటుంది. అలా చాలా విషయాలు తెలుసుకుంటుంటా. మనదేశంలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షన్నరమందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారనే వార్త చూసినప్పుడు మనసు చాలా వేదనకు గురైంది. రహదారులను సురక్షితంగా మార్చితే ఈ ప్రమాదాలు తగ్గుతాయని అనిపించింది. దీనికి ఏదైనా పరిష్కారాన్ని కనిపెట్టాలనిపించి 2022లో పరిశోధన ప్రారంభించి రహదారి భద్రతను మెరుగుపరిచేలా 'సురక్ష ఏఐ' అనే స్టార్టప్ ప్రారంభించా. బ్లైండ్ స్పాట్‌లవల్ల సంభవించే ప్రమాదాలను నివారించడంలో ఇది సాయపడుతుంది. ఇందులో మెషీన్ లర్నింగ్, అల్గారిథమ్‌లు, కెమెరా, ఎల్‌ఈడీ డిస్‌ప్లే వంటివి ఉంటాయి. ఇదొక విజన్‌గార్డ్‌గా పనిచేసి సరైన సమయంలో ప్రమాదాన్ని గుర్తించి రెడ్ సిగ్నల్‌తో డ్రైవర్‌ను హెచ్చరిస్తుంది. దీంతో ప్రమాదాలను నివారించొచ్చు' అని చెబుతున్న వనీషా స్టార్టప్ ఐఐటీ గువాహటి టెక్ ఎక్స్‌పో- 2024లో పీపుల్స్ ఛాయిస్ అవార్డును గెలుచుకుంది. అలాగే జార్జియాలో జరిగిన రైజ్ సమ్మిట్‌లో వనీషా తన ఆవిష్కరణపై ప్రసంగించే అవకాశాన్ని అందుకుంది. అంతేకాదు, 'సురక్ష ఏఐ మొబైల్ యాప్‌నూ త్వరలో అభివృద్ధి చేసి ప్రజలు కూడా రోడ్డు ప్రమాదాలు లేదా ఉల్లంఘనలను దీనిద్వారా నివేదించేలా చేయనుందీమె. దేశవ్యాప్తంగా ఉన్న బ్లైండ్ స్పాట్స్‌లో విజన్‌గార్డ్‌ను అమలుచేయడానికి ట్రాఫిక్ అధికారులు, భద్రతాసంస్థలతో కలిసి పనిచేయడానికి కృషి చేస్తోంది.

చిట్టి ఏనుగు... చిన్న పాండా!

కిడ్స్ కార్నర్







అమ్మా నాకు స్పైడర్ మ్యాన్ టీషర్ట్ కొను... అవెంజర్స్ బ్యాగ్ కావాలి... బాటిల్ మీద బార్బీ డాల్ ఉంటేనే నేను నీళ్లు తాగుతా... బెన్‌టెన్ వాచీ రేపటికల్లా నాకు ఇవ్వాల్సిందే... లేదంటే నేను స్కూల్‌కి వెళ్లను అంటూ పిల్లలు చేసే మారాం అంతాఇంతా కాదు. వాళ్లకి సర్దిచెప్పి స్కూల్‌కి పంపాలంటే ఇంట్లో అమ్మలకి పెద్ద టాస్కే మరి. అందుకే చిట్టి ఏనుగు... చిన్న కప్ప... క్యూట్ అమ్మాయి... బుల్లి పాండా... టెడ్డీ... అంటూ వారి మనసుకు నచ్చే ఆకారాల్లో రకరకాల రంగుల్లో బ్యాక్ ప్యాక్‌లు మార్కెట్‌లోకి వచ్చేశాయి. అచ్చంగా వాటి రూపంలో ఉండే ఈ బ్యాక్ ప్యాక్స్‌ను వారికి ఇచ్చి చూడండి. వారి ఆనందానికి హద్దులుండవు. పైగా వాళ్ల కలల ప్రపంచం వారి కళ్ల ముందే ఉన్నట్లు మురిసిపోతుంటారు. ఈ బ్యాక్ ప్యాక్‌లో నోట్‌బుక్స్ మాత్రమే కాదు, టిఫిన్ బాక్స్, వాటర్ బాటిల్ అంటూ చాలానే పెట్టుకోవచ్చు. స్కూల్లో ఎక్స్‌కర్షన్‌కి వెళ్లాలన్నా, ఫ్యామిలీతో కలిసి ట్రిప్ ప్లాన్ చేసినా వారికి సంబంధించిన వస్తువులను తీసుకెళ్లడానికి ఓ బ్యాగ్ కావాలి కదా. అందుకే ప్రతి వస్తువులోనూ ఆట బొమ్మల్ని కోరుకునే చిన్నారులకి ఇవి ఇచ్చి చూడండి తప్పక నచ్చేస్తాయి. అంతేకాదు, ఎక్కడికైనా వెళ్లాల్సివస్తే వారి వస్తువులను అందులో సర్దుకోమనండి. దీంతో వారికి వస్తువులపై జాగ్రత్త కూడా పెరుగుతుంది. కొనిచ్చేయండి మరి, ఆలస్యమెందుకు?







పాప రంగు తగ్గింది

మా పాపకి అయిదేళ్లు. హైదరాబాద్‌లో ఉన్నంతకాలం మంచి రంగే ఉండేది. ఉద్యోగరీత్యా సముద్ర తీర ప్రాంతానికి మారాం. అప్పట్నుంచీ ఛాయ తగ్గింది. ఇదే కొనసాగుతుందా? తనకి ఏ ఉత్పత్తులు వాడాలి? సన్‌స్క్రీన్ రాయొచ్చా?

- ఓ సోదరి

డియర్ వసుంధర



డా. శైలజ సూరపనేని, కాస్మెటాలజిస్టు

సముద్ర తీరాల్లో ఉండేవారిలో వేడికి మెలనిన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఉప్పు నీరూ ప్రభావం చూపేదే. కాబట్టే, రంగు తగ్గుతారు. నిజానికి మనకి మెలనిన్ ఉత్పత్తి ఎక్కువ అవడం వల్లే చర్మ క్యాన్సర్లు రావు. అది ఒకరకంగా వరమే. అయితే ఎక్కువ వేడితో కొన్ని ఇబ్బందులూ కనిపిస్తాయి. పాప ఇంకా చిన్నదే. స్కూలుకు వెళ్లే వయసు కాబట్టి, వీరిని ఎండ సోకకుండా ఆపలేం. కాబట్టి, మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ తప్పక రాయాలి. బ్రాడ్ స్పెక్ట్రమ్ ఎక్కువ, వాటర్ రెసిస్టెన్స్ ఉన్నవి తీసుకోవాలి. మినరల్ సన్‌స్క్రీన్ అయితే మరీ మంచిది. లేబుల్ మీద పాబా, ఆక్సీబెంజాన్ వంటివి ఉంటే తీసుకోవద్దు. అలాగే బయట ఉన్నప్పుడు ప్రతి రెండు గంటలకోసారి రాయాలి. అయితే స్ప్రేలను మాత్రం వాడొద్దు. శ్వాస సంబంధ సమస్యలొస్తాయి. దీంతోపాటు జెంటిల్ క్లెన్సర్, పాప చర్మతత్వాన్ని బట్టి, మాయిశ్చరైజర్‌ని వాడండి. అయితే ఫ్రాగ్రన్స్, ప్రిజర్వేటివ్స్, సల్ఫేట్స్ లేనివే ఎంచుకోవాలి. పాపకి ఏం వాడినా చెవి వెనక టెస్ట్ చేయండి. తన చర్మతీరుకు సరిపడితేనే ముఖానికి వాడండి. అన్నింటికంటే ముఖ్యంగా ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించేలా చూడండి. నీళ్లు ఎక్కువగా తాగేలా చూడండి. విటమిన్లు, ఫైబర్, మినరల్స్ అందే సమతులాహారాన్ని ఇవ్వండి. వ్యాయామమూ తప్పనిసరి. వీటన్నింటితో ఆరోగ్యకరమైన చర్మం దక్కుతుంది. నిజానికి రంగుకు కాదు, ఆరోగ్యమైన చర్మానికే ప్రాధాన్యం ఇవ్వాలి. కాబట్టి, లోపల్నుంచి పోషణపైనే ఎక్కువ దృష్టిపెట్టండి. కలబంద గుజ్జును కానీ శనగపిండిలో పెరుగు, నిమ్మరసం కలిపి... వారానికోసారి నలుగులా పెట్టినా గానీ మంచిదే. అయితే మృదువుగానే రాయాలి.

ఈనాడు బిజినెస్ వారాంతం

ఊబకాయం తగ్గిస్తాం



ఈనాడు, హైదరాబాద్: డెన్మార్క్‌కు చెందిన బహుళ జాతి ఔషధ సంస్థ నొవో నార్డిస్క్ మనదేశంలో 'వెగోవీ' అనే బ్రాండెడ్ ఔషధాన్ని విడుదల చేసింది. ఈ మందును ఊబకాయ చికిత్సలో వినియోగిస్తున్నారు. ఎంతో ఆదరణ పొందిన ఈ ఔషధాన్ని 5 రకాల డోసుల్లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు నొవో నార్డిస్క్ ఇండియా వెల్లడించింది. వారానికి ఒకసారి తీసుకునే ఈ మందు 0.25 ఎంజీతో పాటు 0.5 ఎంజీ, 1 ఎంజీ, 1.7 ఎంజీ, 2.4 ఎంజీ డోసుల్లో లభిస్తుంది. ఒక నెలకు సరిపడా మందు ధర రూ.17,345- 26,050 వరకూ ఉంటుంది. మధుమేహం (షుగర్) వ్యాధి చికిత్సలో వినియోగించే 'ఒజెంపిక్' అనే బ్రాండెడ్ మందు కూడా ఈ సంస్థదే. 'సెమాగ్లుటైడ్' అనే ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రేడియంట్)ని ఈ రెండు బ్రాండెడ్ మందుల్లో వినియోగిస్తున్నారు. కానీ 'ఒజెంపిక్'ను ఇంకా మనదేశంలో విడుదల చేయలేదు.

వెగోవీ విడుదల ఎందుకంటే..

మనదేశంలో ఊబకాయం, మధుమేహం వ్యాధి గ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు అధిక బరువు, ఊబకాయంతో బాధపడుతున్నారని అంచనా. అందువల్ల 'వెగోవీ' ఔషధానికి పెద్ద మార్కెట్ లభిస్తుందని, అధిక అమ్మకాలు నమోదు చేసే అవకాశం ఉందని నొవో నార్డిస్క్ భావిస్తోంది. ఇప్పటికే ఈ విపణిలో ఈ మందుతో దేశీయంగా ఊబకాయం ఔషధాల మార్కెట్లో గట్టి పోటీ నెలకొన్నట్లు అవుతోంది. ఈ విభాగానికి చెందిన 'మౌంజారో' అనే బ్రాండెడ్ మందును ఎలీ లిల్లీ అనే మరొక బహుళ జాతి ఫార్మా కంపెనీ గత మార్చిలో మనదేశంలో విడుదల చేసింది. 'టిర్జెపటైడ్' అనే మాలిక్యూల్‌తో కూడిన 'మౌంజారో' బ్రాండు ఔషధ అమ్మకాలు ఎక్కువగా ఉన్నాయని ఎలీ లిల్లీ స్పష్టం చేస్తోంది.



● 'వెగోవీ' బ్రాండు మాత్రం 'సెమాగ్లుటైడ్' మాలిక్యూల్‌తో తయారైంది. ఈ మందు వాడితే బరువు తగ్గడంతో పాటు గుండెకూ ప్రయోజనాలు ఉంటాయని నొవో నార్డిస్క్ కంపెనీ వివరిస్తోంది. దీనికి సంబంధించిన క్లినికల్ సమాచారం విస్తృతంగా, వివరంగా అందుబాటులో ఉంది కూడా. ఈ ఔషధాలతో మనదేశంలో ఊబకాయం, మధుమేహం వ్యాధి ఔషధాల మార్కెట్ వేడెక్కినట్లు అవుతోంది. రెండు అగ్రశ్రేణి బహుళ జాతి ఫార్మా కంపెనీల మధ్య పోటీతో పాటు జనరిక్ ఔషధాలను ఆవిష్కరించడానికి దేశీయ ఫార్మా కంపెనీలు సిద్ధపడుతుండటమే ఇందుకు కారణం.

ధరలు విదేశాల్లో కంటే తక్కువ

నొవో నార్డిస్క్, ఎలీ లిల్లీ ఔషధాల ధరలు ఇతర దేశాలతో పోల్చితే మనదేశంలో తక్కువే. అయినా ఇక్కడి ప్రజల ఆదాయాల ప్రకారం చూస్తే, అధిక ధరల కిందే లెక్క. ధర ఇంకా తగ్గితేనే ఎక్కువ మంది ప్రజలు వాడే సానుకూలత ఏర్పడుతుంది. జనరిక్ ఔషధాల లభ్యత వల్ల ధరలు దిగివస్తాయని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మనదేశంలో 'సెమాగ్లుటైడ్' పేటెంట్ గడువు వచ్చే ఏడాదిలో తీరిపోతోంది. దీంతో జనరిక్ ఔషధాన్ని తీసుకువచ్చేందుకు డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా, లుపిన్, బయోకాన్, నాట్కో ఫార్మా సిద్ధమవుతున్నాయి. వీటిని అడ్డుకునేందుకు బహుళ జాతి కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. డాక్టర్ రెడ్డీస్‌పై ఇప్పటికే నొవో నార్డిస్క్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది.



● 'మౌంజారో' బ్రాండు పేటెంట్ గడువు తీరడానికి ఇంకా రెండేళ్లు ఉంది. అందువల్ల అధిక ధరకు ఈ బ్రాండును నొవో నార్డిస్క్ విక్రయించగలుగుతోంది. ప్రస్తుతం మనదేశంలో దాదాపు 8 కోట్ల మంది మధుమేహం వ్యాధి బాధితులున్నారని.. 2045 నాటికి ఈ సంఖ్య 12 కోట్లకు మించుతుందని అంచనా. దీన్ని బట్టి ఈ మందులకు ఎంత పెద్ద మార్కెట్ ఉంటుందో స్పష్టమవుతోంది. ఎంత వీలయితే అంత ఎక్కువ వాటా దక్కించుకోవడానికి ఫార్మా కంపెనీలు పోటీపడతాయి.

అప్పు తీరిపోయింది

రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: దీర్ఘకాలిక రుణభారం పూర్తిగా తొలగిపోయిందని మౌలిక సదుపాయాల రంగ సంస్థ రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వెల్లడించింది. ఈ మేరకు రుణదాతలైన బ్యాంకులతో ఈ నెల 11న రీస్ట్రక్చరింగ్ ఎగ్జిట్ అగ్రిమెంట్(ఆర్‌ఈఏ) కుదుర్చుకున్నట్లు తెలిపింది. కంపెనీకి ప్రస్తుతం దీర్ఘకాలిక అప్పులు లేవు. అంతేగాక వర్కింగ్ కేపిటల్ రుణ ఖాతాలను 'రెగ్యులర్ అండ్ స్టాండర్డ్'గా బ్యాంకులు పరిగణిస్తాయని కంపెనీ పేర్కొంది. 2015 నాటికి ఈ సంస్థకు రూ.3,852 కోట్ల అప్పు ఉంది. దీనిపై బ్యాంకులతో పునర్ వ్యవస్థీకరణ ఒప్పందం(ఆర్‌పీ) కుదుర్చుకొని, ఆ తర్వాత నెమ్మదిగా మొత్తం అప్పు తీర్చేసింది.

రూ.1.6 లక్షల కోట్ల సమీకరణకు 120 కంపెనీలు!

ముంబయి: ఐపీఓ మార్కెట్ మళ్లీ కళకళలాడబోతోంది. ఈ ఏడాది తొలి అర్ధ భాగంలో ఏకంగా 120 కంపెనీలు ఐపీఓకి వచ్చేందుకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి. వీటి ప్రకారం ఏకంగా రూ.1.6 లక్షల కోట్లను సమీకరించాలనే ఉద్దేశంలో ఆయా కంపెనీలు ఉండటం గమనార్హం. 2024 ఇదే సమయంలో రూ.లక్ష కోట్ల సమీకరణకు పలు కంపెనీలు ఐపీఓలకు వచ్చేందుకు ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి. అంటే 60% వృద్ధి నమోదైనట్లు లెక్క.

● ఐపీఓలకు వచ్చేందుకు ముసాయిదా పత్రాలు దాఖలు చేస్తున్న కంపెనీలు అధికంగానే ఉన్నా, 2025 తొలి అర్ధ భాగంలో 24 ప్రధాన(మెయిన్‌బోర్డ్) ఐపీఓలు మాత్రమే వచ్చాయి. గత ఏడాది ఇదే సమయంలో 36 కంపెనీల ఐపీఓలు రావడం గమనార్హం.

నిమిషాల్లో సరకుల డెలివరీ ఎంత మూల్యానికి?

● సౌలభ్యం మాటున ఛార్జీల మోత

● వినియోగదారులకు పెరుగుతున్న ఖర్చులు



ఈనాడు, హైదరాబాద్: రాత్రి 10 గంటలు.. ఇంటి నుంచి పని చేస్తున్న కుమార్‌కు ఆఫీసు పని ఇంకా పూర్తి కాలేదు. కాఫీ తాగుదాం అనిపించింది. తీరా చూస్తే చక్కెర లేదు. వెంటనే ఫోన్ తీసి, ఓ క్విక్ కామర్స్ యాప్‌లో ఆర్డరు పెట్టాడు. 10 నిమిషాల్లో ఆర్డరు డెలివరీ అయింది. ఇది చూడ్డానికి ఎంతో సౌలభ్యంగానే కనిపిస్తోంది. కానీ, ఎంత మూల్యానికి అనేదే ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది.

దేశంలో క్విక్ కామర్స్ ఒక విప్లవాన్ని సృష్టించిందనే చెప్పాలి. పెద్ద నగరాల్లో ఎన్నో కిరాణా దుకాణాలపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. సౌలభ్యంగా ఉండటంతో వినియోగదార్లు ఆకర్షితులయ్యారు. చిన్న వస్తువులనూ ఇందులో కొనడం అలవాటు చేసుకున్నారు. గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) కన్నా 10-20 శాతానికి తక్కువ ధర, ఎలాంటి రుసుములూ లేకపోవడం ఇందుకు కారణం. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారాయి.

చిన్న ఆర్డరుపై భారం..

10 నిమిషాల్లో సరకులను ఇంటికి తెస్తున్న క్విక్ కామర్స్ సంస్థలు సరకులతోపాటు, ఛార్జీల మోతనూ మోసుకొస్తున్నాయి. నిర్ణీత పరిమితి లోపు ఆర్డర్లు ఇస్తే.. హ్యాండ్లింగ్ ఫీజు రూపంలో రూ.10-21 వరకూ ఛార్జీలు విధిస్తున్నాయి. దీంతో పాటు వర్షం రుసుము రూ.15-20, సర్జ్ ఛార్జీ ఫీజు రూ.30 వరకూ అదనంగా విధిస్తున్నాయి. వీటికి జీఎస్‌టీ అదనం. ఇలా ఒక్కో చిన్న ఆర్డరుపై సగటున రూ.50 వరకు భారం పడుతోంది.

పోల్చుకుంటున్నారు..

ఆన్‌లైన్‌లో సరకుల ధరలు తక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంటాయి. కానీ, రుసుముల మోతతో ఇవి దుకాణంలో లభించే ధరతో పోలిస్తే రూ.30-40 వరకూ అధికంగానే ఉంటున్నాయనేది వినియోగదారుల అభిప్రాయం. ఉదాహరణకు కేజీ క్యారట్ ధర మార్కెట్లో రూ.45-50గా ఉంది. ఒక ప్రముఖ క్విక్ కామర్స్ యాప్‌లో రూ.88 వరకూ ఉంది. ఇదొక్కటే కావాలంటే.. డెలివరీ ఛార్జీ కింద రూ.25, హ్యాండ్లింగ్, ఇతర ఛార్జీలు రూ.21 కలిపి రూ.134 వరకూ అవుతోంది. దీంతో చాలామంది క్విక్ కామర్స్ యాప్‌లను వాడే విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప వీటి జోలికి పోవడం లేదు. వీలైనంత వరకూ కొనుగోళ్లను వాయిదా వేయడానికి లేదా అవసరమైన మరికొన్ని వస్తువులను కలిపి ఒకేసారి ఆర్డరు ఇస్తున్నారు. దీంతో క్విక్ కామర్స్ సంస్థలపైనా ప్రభావం పడుతోంది. అవి నిర్వహించే డార్క్ స్టోర్ల నిర్వహణ ఖర్చులు పెరుగుతున్నాయి.

పరిమితి దాటితేనే..

కొన్ని క్విక్ కామర్స్ సంస్థలు రూ.200 పైబడిన కొనుగోళ్లకు డెలివరీ ఫీజును రద్దు చేస్తున్నాయి. కొన్ని రూ.500 పైన తప్పనిసరిగా కొనాలని సూచిస్తున్నాయి. హ్యాండ్లింగ్ ఫీజులూ స్థిరంగా ఉండటం లేదు. కొన్ని రూ.10 విధిస్తే.. కొన్ని రూ.21 వరకూ వసూలు చేస్తున్నాయి. వర్షం పడుతున్నా, డిమాండు పెరిగినప్పుడూ రుసుములు తప్పడం లేదు.

నష్టాలను తట్టుకునేందుకే..

మార్కెట్లో నిలదొక్కుకోవడానికి, పోటీలో నెగ్గడానికీ క్విక్ కామర్స్ సంస్థలు ఎన్నో వ్యూహాలు అమలు చేశాయి. కానీ, ఒక దశ దాటిన తర్వాత వాటికి నష్టాలు రావడం మొదలయ్యాయి. దీంతో వినియోగదారులపై ఛార్జీలను విధిస్తున్నాయి. ముఖ్యంగా చిన్న ఆర్డర్లు ఇచ్చే వారిపై ఇది ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తోంది. కొన్ని యాప్‌లు సభ్యత్వం కోసం ప్రత్యేక రుసుమును తీసుకుంటున్నాయి. ఇలా తీసుకున్న వారికి డెలివరీ ఛార్జీలో మినహాయింపును అందిస్తున్నాయి. ఒకప్పుడు డిస్కౌంట్లను ఇస్తూ పోటీ పడుతూ వినియోగదారులను పెంచుకున్న ఈ సంస్థలు ఇప్పుడు, వారిని దూరం చేసుకోకుండా ఉండేందుకు అష్టకష్టాలు పడుతున్నాయి. సౌలభ్యం కోసం ఇంత ఎక్కువ చెల్లించాలా అని వినియోగదారులు ఆలోచిస్తున్నారు. ఈ సమస్యను ఎలా అధిగమించాలా అని క్విక్ కామర్స్ సంస్థలు చూస్తున్నాయి.

పసిడి, వెండి స్వచ్ఛంద తనఖాకు బ్యాంకులు అంగీకరించొచ్చు



రూ.2 లక్షల్లోపు రుణాలపై ఆర్‌బీఐ

దిల్లీ: రూ.2 లక్షల్లోపు వ్యవసాయ, ఎంఎస్‌ఎమ్‌ఈ రుణాలకు హామీ కింద రుణ గ్రహీతలు పసిడి, వెండిని స్వచ్ఛందంగా తనఖా పెడితే.. బ్యాంకులు అంగీకరించవచ్చని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. వాస్తవానికి రైతులకు రూ.2 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేయొచ్చు. ఈ మేరకు హామీ రహిత రుణ పరిమితి 2024 డిసెంబరులో రూ.1.6 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆర్‌బీఐ పెంచిన సంగతి తెలిసిందే. ద్రవ్యోల్బణం, ముడి సరకు వ్యయాలు పెరిగిన నేపథ్యంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల రైతులు ఎటువంటి హామీ లేకుండా రుణాలు తీసుకునే వెసులుబాటు కల్పించాలన్నదే దీని వెనక ఆర్‌బీఐ ఉద్దేశం. అయితే హామీ రహితంగా రుణాన్ని పొందే అర్హత ఉన్నప్పటికీ... తమకు ఇష్టమైతే పసిడి, వెండిని హామీ కింద రుణ గ్రహీతలు తనఖా పెట్టవచ్చని ఆర్‌బీఐ తాజాగా తెలిపింది. ఇది హామీ రహిత రుణాలకు సంబంధించి ప్రస్తుతమున్న నిబంధనల ఉల్లంఘనగా పరిగణించవని పేర్కొంది. అయితే పసిడి, వెండిని రుణ గ్రహీతలు తనఖా పెట్టడం పూర్తిగా స్వచ్ఛందంగానే జరగాలని, వాళ్లపై బ్యాంకులు ఎటువంటి ఒత్తిడి చేయకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.

భారత్‌లో ప్రీమియం వినియోగదార్లకు 'ఎక్స్' చందా రుసుము తగ్గింపు



దిల్లీ: సామాజిక మాధ్యమ సంస్థ 'ఎక్స్' భారత్‌లోని వినియోగదార్లకు ప్రీమియం ఖాతా సబ్‌స్క్రిప్షన్ ఫీజు (చందా రుసుము)ను తగ్గించింది. గతంలో మొబైల్ యాప్ ద్వారా 'ఎక్స్'ను వినియోగిస్తున్న ప్రీమియం, ప్రీమియం ప్లస్ వినియోగదార్ల నుంచి నెలవారీగా రూ.900 వసూలు చేస్తుండగా, ప్రస్తుతం దాన్ని 48 శాతం తగ్గించి రూ.470కు పరిమితం చేసింది. 'ఎక్స్'లో ప్రీమియం, ప్రీమియం ప్లస్ సేవలు ఎంచుకున్న వారి ఐడీ లేదా పేరు పక్కన చెక్‌మార్క్ (బ్లూటిక్) వస్తుంది. వెబ్ ద్వారా 'ఎక్స్'ను వినియోగిస్తున్న వారి ప్రీమియం చందా రుసుమును రూ.650 నుంచి రూ.427కు తగ్గించింది. బేసిక్ సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలను రూ.243.75 నుంచి 30 శాతం తగ్గించి రూ.170కి పరిమితం చేసింది. బేసిక్ వినియోగదార్ల వార్షిక సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలను కూడా రూ.2,590.48 నుంచి రూ.1,700కు తగ్గించింది.

కోడి గుడ్లు

13న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	515
గోదావరి	490
విశాఖపట్నం	540
చిత్తూరు	583

విద్యా రుణాలకు అమెరికా కోత

ఇతర దేశాలకు వెళ్లే విద్యార్థులపై ఎన్‌బీఎఫ్‌సీల దృష్టి: క్రిసిల్

ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులు తీసుకునే రుణాల్లో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల(ఎన్‌బీఎఫ్‌సీల) వాటా కూడా ఎక్కువగానే ఉంటోంది. క్రెడిలా, ఆక్జిలో, ఇంక్రెడ్, అవాన్సే ఫైనాన్షియల్ సర్వీసెస్ తదితర సంస్థలు ప్రధానంగా ఈ విభాగంలో రాణిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో మాత్రం ఎన్‌బీఎఫ్‌సీల విద్యా రుణాల వృద్ధి తగ్గే అవకాశం ఉందని రేటింగ్స్, పరిశోధనా సంస్థ క్రిసిల్ తెలిపింది. అమెరికా వీసా విధానాల్లో గణనీయ మార్పులు ఇందుకు కారణంగా తెలిపింది. ఈ ఆంక్షల వల్ల ఆ దేశంలో విద్యను అభ్యసించేందుకు రుణాలు తీసుకోవడం తగ్గే అవకాశం ఉందని విశ్లేషించింది. అమెరికాలో విధానపరమైన అనిశ్చితులతో పాటు వీసాల మంజూరును తగ్గించడం, ఐచ్ఛిక ప్రాక్టికల్ శిక్షణా నిబంధనలను తొలగించాలనే ప్రతిపాదన వల్ల కొత్త రుణాలపై ప్రభావం పడిందని వివరించింది. దీనివల్ల గత ఆర్థిక సంవత్సరం అమెరికాలో విద్యను అభ్యసించేందుకు మొత్తం రుణాల మంజూరు 30 శాతం మేర తగ్గిందని తెలిపింది.



కెనడాలోనూ ఇదే పరిస్థితి

విద్యా రుణాలకు రెండో అతిపెద్ద విపణి అయిన కెనడాలోనూ ఇదే పరిస్థితి నెలకొందని క్రిసిల్ తెలిపింది. విద్యార్థి వీసా నిబంధనలను కఠినతరం చేయడంతో ఆ దేశానికి సంబంధించి విద్యా రుణాల మంజూరు తగ్గిందని తెలిపింది. దీంతో 2024-25లో మొత్తంగా విద్యా రుణాల మంజూరు కేవలం 8 శాతమే పెరగగా.. 2023-24లో ఈ వృద్ధి 50 శాతంగా ఉండటం గమనార్హం.

ప్రత్యామ్నాయాలపై దృష్టి

అమెరికా, కెనడా విపణుల్లో విద్యా రుణాలకు ప్రతికూల పరిస్థితులు ఉంటుండటంతో.. కొత్త విపణులపై ఎన్‌బీఎఫ్‌సీలు దృష్టి సారిస్తున్నాయి. విద్యార్థులూ ప్రత్యామ్నాయ దేశాలను ఎంపిక చేసుకుంటుండటంతో బ్రిటన్, జర్మనీ, ఐర్లాండ్‌లో విద్యా కోర్సులను అభ్యసించేందుకు రుణాల మంజూరు గత ఆర్థిక సంవత్సరం రెట్టింపు అయ్యింది. 2024-25లో ఈ తరహా దేశాలకు సంబంధించి మొత్తం విద్యా రుణాల మంజూరులో సుమారు 50 శాతం వృద్ధి ఉంది. 2023-24లో ఇది 25 శాతమే. అయితే అమెరికా నుంచి తగ్గే విద్యా రుణాల ప్రభావాన్ని ఈ దేశాలు పూర్తిగా తగ్గించలేవు. 2025 మార్చి 31 నాటికి మొత్తం విద్యా రుణాల్లో అమెరికా వాటా 50 శాతంగా ఉంది. 2024 మార్చి 31 నాటి 53 శాతంతో పోలిస్తే తగ్గింది. వచ్చే కొన్నేళ్లలో అమెరికా వాటా మరింతగా తగ్గే అవకాశం ఉంది. కొత్త విపణులకు రుణ సంస్థలు ప్రాధాన్యాన్ని పెంచుతుండటమే ఇందుకు కారణం.

ఏయూఎంలో వృద్ధి తగ్గొచ్చు..

భారత్‌లో గత కొన్నేళ్లుగా విద్యా రుణాల విభాగంలో 50 శాతానికి మించి వృద్ధి నమోదవుతోందని క్రిసిల్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో విద్యా రుణాలకు సంబంధించి ఎన్‌బీఎఫ్‌సీల నిర్వహణలోని ఆస్తుల విలువ(ఏయూఎం) 48% పెరిగి రూ.64,000 కోట్లకు చేరింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ విలువ 25 శాతమే పెరిగి రూ.80,000 కోట్లకు చేరొచ్చని క్రిసిల్ విశ్లేషించింది.

అమెరికా కంపెనీలకు రూ.7 లక్షల కోట్ల టారిఫ్ కష్టాలు

● ఆ దేశంలో ధరలూ పెరిగే అవకాశం

● ద్రవ్యోల్బణంపై ఒత్తిడి

● జేపీమోర్గాన్‌చేజ్ విశ్లేషణ



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రణాళికలు కాస్తా ఆ దేశంలోని కీలక కంపెనీలపై భారం వేసే అవకాశం కనిపిస్తోంది. ప్రత్యక్షంగానే 82.3 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.7 లక్షల కోట్లు) మేర ప్రభావం ఉండొచ్చని జేపీమోర్గాన్‌చేజ్ ఇన్‌స్టిట్యూట్ తన విశ్లేషణలో తెలిపింది.

ఈ కంపెనీలపై ప్రభావం

10 మిలియన్ డాలర్ల(రూ.85 కోట్లు) నుంచి 1 బిలియన్ డాలర్ల(రూ.8,500 కోట్లు) మేర ఆదాయం ఉన్న కంపెనీలన్నిటిపైనా దిగుమతి సుంకాల వల్ల వ్యయ భారం పడుతుందని అంచనా. ఈ విభాగంలోని కంపెనీలు అమెరికాలోని ప్రైవేటు ఉద్యోగుల్లో మూడో వంతును కలిగి ఉన్నాయి. ఇవన్నీ చైనా, భారత్, థాయ్‌లాండ్ నుంచి వచ్చే దిగుమతులపైనే ఆధారపడి ఉన్నాయి. రిటెయిల్, టోకు రంగాలు ఈ దిగుమతి పన్నుల వల్ల మరీ ఎక్కువ కష్టాల పాలు కానున్నాయి.

ట్రంప్ చెప్పినదానికి భిన్నం

దిగుమతులపై ఆధారపడ్డ అమెరికా కంపెనీలకు ఎటువంటి టారిఫ్ వ్యయాల భారం ఉండదని, విదేశీ తయారీ కంపెనీలే వాటిని భరిస్తాయన్న ట్రంప్ అంచనాలకు ఈ విశ్లేషణ భిన్నంగా ఉంది. పలు దేశాలపై విధించిన టారిఫ్ రేట్లు ఆగస్టు 1న అమల్లోకి రావడానికి కొద్ది రోజుల ముందే ఈ అంచనాలు రావడం విశేషం. చైనా, మెక్సికో, కెనడాలపై అత్యధిక టారిఫ్‌ను ప్రకటించిన ట్రంప్, ఉక్కు, అల్యూమినియంపై వేరుగా 50% టారిఫ్‌ను విధిస్తోన్న సంగతి తెలిసిందే.

వినియోగదార్లపై భారం

టారిఫ్ వ్యయాల్లో 60% మేర వినియోగదార్లకు కంపెనీలు బదిలీ చేసే అవకాశం ఉందని గోల్డ్‌మాన్‌శాక్స్ అంచనా వేస్తోంది. ఇదే జరిగితే అమెరికాలో వస్తువుల ధరలు పెరగొచ్చు. ద్రవ్యోల్బణంపైనా భారం పడొచ్చు. కొంత మంది దేశీయ తయారీదార్లు మాత్రం తమ వస్తువుల సరఫరాను బలోపేతం చేసుకునే అవకాశం ఉందని జేపీమోర్గాన్‌చేజ్ అంటోంది. అయితే తక్కువ లాభాల మార్జిన్‌లో ఉన్న రిటెయిలర్లు, టోకు వ్యాపార కంపెనీలు తమ టారిఫ్ వ్యయాలను వినియోగదార్లపై బదిలీ చేయాల్సి రావొచ్చు. టారిఫ్‌లు ఏ దిశను తీసుకుంటాయన్నది అనిశ్చితిగానే ఉంది. ఆ దేశ ఆర్థిక శాఖ, వాణిజ్య శాఖ, యూఎస్‌టీఆర్‌లో 20 ఏళ్లుగా పని చేస్తున్న వ్యక్తులు సైతం ఇటువంటి వాణిజ్య ఒప్పందాలను ఎపుడూ చూసిందిలేదని అంటున్నారంటే ఎంత అనిశ్చితి ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రకటించిన రోజే అమల్లోకి వచ్చి ఉంటే

ఏప్రిల్ 2నే ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లు అప్పట్లోనే అమల్లోకి వచ్చినట్లయితే అదనంగా అమెరికా కంపెనీలు 187.6 బి. డాలర్ల వ్యయాలను భరించాల్సి వచ్చేది. ప్రస్తుత రేట్ల కింద 82.3 బి. డాలర్ల భారాన్ని మోయాల్సి రావొచ్చు. ఇది ఒక్కో ఉద్యోగిపై సగటున 2080 డాలర్లు లేదా సగటు వార్షిక వేతనంలో 3.1 శాతానికి సమానం. బ్రిటన్ ఇప్పటికే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయగా.. భారత్, వియత్నాంలు అందుకు దగ్గరగా ఉన్నాయని ప్రకటించిన సంగతి తెలిసిందే.

2030 నాటికి రూ.30,000 కోట్లకు లిథియం అయాన్ బ్యాటరీ రీసైక్లింగ్, ఉత్పత్తి

● విధాన జోక్యం మద్దతుతో: ఐసియా

దిల్లీ: మన దేశంలో 2030 నాటికి విధాన జోక్యం మద్దతుతో లిథియం అయాన్ బ్యాటరీ రీసైక్లింగ్, ఉత్పత్తి పర్యావరణ వ్యవస్థ 3.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.30,000 కోట్ల)కు చేరుకుంటుందని పరిశ్రమ సమాఖ్య ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసియా), యాక్సెంచర్ నివేదిక వెల్లడించింది. ఒకవేళ విధానపరమైన జోక్యం, పెట్టుబడులను సులభతరం చేయడానికి చర్యలు లేకపోయినా, ప్రస్తుత లిథియం బ్యాటరీ రీసైక్లింగ్ విస్తరణ ప్రణాళికలు 2025-2030 మధ్య 500-1000 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,300-8,600 కోట్ల) ఆదాయాన్ని ఆర్జించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని నివేదిక తెలిపింది.

● ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాల ద్వారా సెల్ తయారీ, దేశీయ రీసైక్లింగ్ సామర్థ్యాన్ని పెంచడానికి, లిథియం బ్యాటరీ స్క్రాప్, బ్లాక్ మాస్ వ్యాపారాన్ని సులభతరం చేయడానికి, రివర్స్ లాజిస్టిక్స్-దేశీయ స్క్రాప్ సేకరణను మెరుగుపర్చడానికి చర్యలను నివేదిక సూచించింది.

● ప్రతిపాదిత చర్యలు దేశీయ లిథియం బ్యాటరీ వ్యవస్థను మెరుగుపరుస్తాయని, మొత్తం 3.5 బి.డాలర్ల ఆర్థిక విలువను చేకూరుస్తాయని నివేదిక తెలిపింది. 27,000-41,000 ఉద్యోగాలను కూడా సృష్టిస్తాయని అంచనా వేసింది. 75 కిలోటన్నుల కార్బన్ డయాక్సైడ్‌కు సమానమైన ఉద్గారాలు తగ్గడంతో పాటు 2030 నాటికి 5,700 గ్యాలన్ల నీటి పొదుపు కూడా చేయొచ్చని వివరించారు.

ప్రీమియం మోటార్‌సైకిళ్ల వాటా 22 శాతానికి పెరగొచ్చు

2030పై క్రిసిల్ అంచనా



దిల్లీ: దేశీయ ద్విచక్ర వాహన పరిశ్రమ, ఇతర వినియోగదారు రంగాల తరహాలోనే ప్రీమియం మోటార్‌సైకిళ్ల విభాగంలో దూసుకెళ్లేందుకు సిద్ధమవుతోందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో మొత్తం మార్కెట్ వాటాలో ప్రీమియం మోటార్‌సైకిళ్ల వాటా 19 శాతం కాగా, 2030 నాటికి 22 శాతానికి చేరొచ్చని అంచనా వేసింది.

● ఇంజిన్ సామర్థ్యం 150 సీసీ కంటే ఎక్కువగా ఉన్న మోటార్‌సైకిళ్లను ప్రీమియం మోటార్‌సైకిళ్లుగా పరిగణిస్తారు. 2018-19లో మొత్తం మార్కెట్ వాటాలో వీటి వాటా 14 శాతం కాగా, గత ఆర్థిక సంవత్సరంలో 19 శాతానికి చేరింది. 2018-19లో 19 లక్షల వాహనాలు విక్రయమవగా, 2024-25లో 23 లక్షలకు చేరాయి.

● మరోవైపు అందుబాటు ధరల్లో లభించే(ఎకానమీ) మోటార్‌సైకిళ్ల మార్కెట్ వాటా 2018-19లో 62 శాతం ఉండగా, 2024-25కు 46 శాతానికి తగ్గింది. పరిమాణం పరంగా 84 లక్షల నుంచి 56 లక్షల వాహనాలకు పరిమితమయ్యాయి.

● కొవిడ్ ముందు స్థాయితో పోలిస్తే, మొత్తం ద్విచక్ర వాహనాల విక్రయాలు 94 శాతానికి మాత్రమే చేరాయి. మొత్తం మోటార్‌సైకిళ్ల విక్రయాలు 90 శాతం వద్దే ఉన్నాయి.

ఎన్‌బీఎఫ్‌సీలకు పన్ను సడలింపులు

● సీనియర్ సిటిజన్లకు ఇచ్చే వడ్డీపై ఊరట

● కో-లెండింగ్ ఫీజులపై జీఎస్‌టీ మినహాయింపునూ పరిశీలిస్తున్న ప్రభుత్వం



దిల్లీ: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకూ (ఎన్‌బీఎఫ్‌సీ) పరిమిత పన్ను సడలింపులు ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. కొన్నాళ్లుగా ఈ సంస్థలు చేస్తున్న విజ్ఞప్తులను పరిష్కరించేందుకు, బ్యాంకులతో సమానత్వం కోసం ఈ చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) వడ్డీపై పన్ను మినహాయింపు, కో-లెండింగ్ సర్వీసు ఫీజులపై జీఎస్‌టీ సడలింపు ఇచ్చే ప్రతిపాదన'లను ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సీనియర్ సిటిజన్లకు బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చిన వడ్డీకి రూ.లక్ష వరకు మినహాయింపు లభిస్తోంది. తమ వద్ద చేసే డిపాజిట్లకూ దీన్ని వర్తింపజేయాలని ఎన్‌బీఎఫ్‌సీలు కోరుతున్నాయి. దీనిని సానుకూలంగా పరిశీలిస్తున్నామని ఆ అధికారి వెల్లడించారు.

బ్యాంకులతో కలిసి ఇచ్చే రుణాలపై..

ఎన్‌బీఎఫ్‌సీలు, బ్యాంకులు కలిసి రుణగ్రహీతలకు రుణాలను అందిస్తుంటాయి. దీనిని కో-లెండింగ్ అని పిలుస్తారు. సాధారణంగా బ్యాంకులు 80%, ఎన్‌బీఎఫ్‌సీలు 20% రుణాన్ని అందిస్తుంటాయి. ఈ రుణాలకు సంబంధించి అందించిన సేవలకు గాను, బ్యాంకుల నుంచి ఎన్‌బీఎఫ్‌సీలు కొంత సేవా రుసుము వసూలు చేస్తాయి. ఈ మొత్తంపై 18% జీఎస్‌టీ చెల్లించాల్సి వస్తున్నందున, ఎన్‌బీఎఫ్‌సీల లాభాలపై ప్రభావం పడుతోంది. ఈ రుసుమును జీఎస్‌టీ నుంచి మినహాయించాలని ఎన్‌బీఎఫ్‌సీలు కోరుతున్నాయి. దీన్నీ సమీక్షిస్తున్నట్లు ఆ అధికారి వెల్లడించారు.

చిన్న రుణాల వసూలుకూ..

రుణం తీసుకుని, చెల్లించని వారి ఆస్తులను వేలం వేసేందుకు బ్యాంకులకు అధికారం ఉంటుంది. రుణ మొత్తంతో దీనికి సంబంధం లేదు. సర్ఫేసీ చట్టం ప్రకారం ఎన్‌బీఎఫ్‌సీలు రూ.20 లక్షలు దాటిన రుణాలకే ఇలాంటి చర్యలు తీసుకునేందుకు వీలుంది. ఈ పరిమితిని తొలగించి, బ్యాంకుల తరహాలోనే అనుమతి ఇవ్వాలని ఈ సంస్థలు కోరుతున్నాయి. దీన్ని అనుమతిస్తే.. డెట్ రికవరీ ట్రైబ్యునల్స్‌పై భారం పడుతుందని, చిన్న రుణగ్రహీతలపై వేధింపులకూ దారి తీయొచ్చని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

సంక్షిప్తంగా..

● స్థిరాస్తి రంగ సంస్థ **లోహియా గ్లోబల్** అనుబంధ సంస్థ లోహియా వరల్డ్‌స్పేస్ గృహనిర్మాణంలోకి అడుగుపెట్టింది. ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో 10 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న మొదటి హౌసింగ్ ప్రాజెక్టుకు రూ.200 కోట్ల పెట్టుబడి పెట్టనుందని సంస్థ తెలిపింది. దీన్ని 2029 నాటికల్లా పూర్తిచేసే ఆలోచనలో ఉన్నామని సంస్థ తెలిపింది. రానున్న 5 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా స్థిరాస్తి అభివృద్ధి కోసం రూ.1,000 కోట్ల పెట్టుబడి పెడతామని సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో పేర్కొంది.

● ఆరోగ్య సంరక్షణ రంగ సంస్థ **ఐశ్వర్య హాస్పిటల్** తన ఆంకాలజీ ముఖ్యకార్యనిర్వహణాధికారిగా, విభాగ అధిపతిగా ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రాజసుందరాన్ని నియమించిందని మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) డాక్టర్ అరుణ్ ముత్తువేల్ తెలిపారు.

● **యాంథమ్ బయోసైన్సెస్** తొలి పబ్లిక్ ఆఫర్(ఐపీఓ) కంటే ముందే యాంకర్ మదుపర్ల నుంచి రూ.1,016 కోట్లను సమీకరించింది. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్, యాక్సిస్ ఎంఎఫ్, యూటీఐ ఎంఎఫ్ వంటి పలు 60 ఎంఎఫ్ సంస్థలకు ఒక్కొక్కటి రూ.570 చొప్పున 1.78 కోట్ల ఈక్విటీ షేర్లను సంస్థ కేటాయించింది. రూ.3,395 కోట్ల నిధులను సమీకరించడానికి ఈ సంస్థ ఈ నెల 14న ఐపీఓకి రానుంది. ఇది 16న ముగియనుంది.

భలే మంచి విందు!

సెలవు రోజున అతిథుల్ని ఆహ్వానించడం మామూలే. మరి వాళ్ల కోసం శాకాహారమా.. మాంసాహారమా.. అందరికీ నచ్చేలా ఏమైతే బాగుంటుందని ఆలోచిస్తున్నారా? అయితే ఈ అయిదూ చేసి ఆత్మీయంగా వడ్డించండి!

అచారీ చికెన్



కావలసినవి: చికెన్ లెగ్ పీస్‌లు - 700 గ్రాములు, నూనె - 3 టేబుల్ స్పూన్లు, ఆవాలు, మెంతులు, జీలకర్ర, నల్ల జీలకర్ర, సోంపు - చెంచా చొప్పున, ఎండుమిర్చి - 4, వెల్లుల్లి తరుగు, నిమ్మరసం - టేబుల్ స్పూన్ చొప్పున, అల్లం ముద్ద, టొమాటో గుజ్జు - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, ఉల్లి తరుగు - అర కప్పు, పసుపు - అర చెంచా, కశ్మీరీ కారం - 2 చెంచాలు, చిక్కటి పెరుగు - పావు కప్పు, ఉప్పు - రుచికి తగినంత, కొత్తిమీర తరుగు - పావు కప్పు

తయారీ: కుక్కర్‌లో నూనె వేడయ్యాక ఆవాలు.. అవి చిటపటలాడుతున్నప్పుడు మెంతులు, జీలకర్ర, నల్ల జీలకర్ర, సోంపు, ఎండుమిర్చి ఒకదాని తర్వాత ఒకటి వేయాలి. అవి వేగాక ఉల్లి తరుగును జోడించి లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో వెల్లుల్లి తరుగు, అల్లం ముద్ద, కారం, ఉప్పు, పసుపు జతచేసి కలపాలి. అర నిమిషం తర్వాత కొన్ని నీళ్లు, చికెన్ లెగ్ పీస్‌లు, టొమాటో గుజ్జు చేర్చి ఉడికించాలి. ముక్కలు మెత్తగా అయ్యాక.. గిలకొట్టిన పెరుగు వేసి ఇంకొంతసేపు ఉంచాలి. చివర్లో నిమ్మరసం, కొత్తిమీర తరుగు వేసి దించేయాలి.

చెట్టినాడ్ వెజ్ బిర్యానీ



కావలసినవి: బియ్యం - 3 కప్పులు, నెయ్యి - 3 చెంచాలు, పుదీనా, కొత్తిమీర తరుగు - ముప్పావు కప్పు చొప్పున, వెల్లుల్లి - సగం పాయ, పచ్చిమిర్చి - 8, అల్లం, దాల్చినచెక్క - రెండంగుళాల ముక్క చొప్పున, బటన్ మష్రూమ్స్ - 600 గ్రాములు, పెరుగు - అర కప్పు, ఉప్పు - రుచికి తగినంత, పసుపు - చెంచా, గరం మసాలా, కారం - ఒకటిన్నర చెంచా చొప్పున, ధనియాలపొడి - 3 చెంచాలు, నూనె - 6 టేబుల్ స్పూన్లు, యాలకులు - 6, లవంగాలు - 9, మిరియాలు - చెంచా, బిర్యానీ ఆకులు - 2, బిర్యానీపువ్వు - కాస్త, స్టార్‌మొగ్గ - 2, సోంపు - 2 చెంచాలు, జాపత్రి - కొద్దిగా, ఉల్లి తరుగు - 2 కప్పులు, కొబ్బరిపాలు - 2 కప్పులు, టొమాటో ముక్కలు ఒకటిన్నర కప్పు

తయారీ: బియ్యం కడిగి అరగంట నానబెట్టాలి. మష్రూమ్స్‌ను కడిగి నాలుగు ముక్కలుగా కోసి ఉంచాలి. పచ్చిమిర్చి, వెల్లుల్లి, అల్లం, పుదీనా, కొత్తిమీరలను రెండు చెంచాల నీళ్లతో గ్రైండ్ చేసి మష్రూమ్స్‌లో వేయాలి. అందులో పెరుగు, పసుపు, గరం మసాలా, కారం, ధనియాలపొడి కూడా వేసి బాగా కలిపి అరగంట నాననివ్వాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. బిర్యానీ ఆకులు, స్టార్‌మొగ్గ, యాలకులు, లవంగాలు, మిరియాలు, సోంపు, జాపత్రి, బిర్యానీపువ్వు వేయాలి. మంచి వాసన వస్తుండగా.. ఉల్లి తరుగు జోడించాలి. అది లేత గోధుమ రంగులోకి మారాక.. టొమాటో ముక్కలను రెండు నిమిషాలు వేయించాలి. అందులో మ్యారినేట్ చేసిన మష్రూమ్స్, తగినన్ని నీళ్లు జోడించి ఉడికించాలి. ఆరేడు నిమిషాల తర్వాత నానబెట్టిన బియ్యం, తగినన్ని నీళ్లు, కొబ్బరిపాలు, ఉప్పు జతచేయాలి. అన్నం ఉడకటానికి సుమారు పన్నెండు నిమిషాలు పడుతుంది. అంతే.. ఘుమఘుమలాడే చెట్టినాడ్ బిర్యానీ అందరికీ నచ్చేస్తుంది.

పనీర్ ఖీర్



కావలసినవి: చిక్కటి పాలు - 3 కప్పులు, తురిమిన పనీర్ - అర కప్పు, పంచదార - ఒకటింబావు కప్పు, యాలకుల పొడి - పావు చెంచా, బాదం, పిస్తా, జీడిపప్పులు - ప్రతిదీ 15 చొప్పున, కుంకుమపువ్వు - కొద్దిగా, రోజ్ ఎసెన్స్ - ఒక చుక్క

తయారీ: అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో సన్నసెగ మీద పాలను మరిగించాలి. అడుగంటకుండా మధ్యమధ్యలో కలియతిప్పుతుండాలి. కాస్త చిక్కగా అయ్యాక పంచదార, యాలకుల పొడి, కుంకుమపువ్వు జోడించాలి. అలాగే బాదం, పిస్తా, జీడిపప్పులను కచ్చాపచ్చా దంచి వేయాలి. రెండు నిమిషాల తర్వాత పనీర్ తురుము చేర్చి ఉడికించాలి. అది చక్కగా ఉడికిందనుకున్నాక.. రోజ్ ఎసెన్స్ జతచేసి కలపాలి. ఇంకో నిమిషం ఉంచి దించేస్తే సరిపోతుంది. తియ్యతియ్యటి పనీర్ ఖీర్ సిద్ధం.

మటన్ కుర్మా



కావలసినవి: మాంసం - అర కిలో, పెరుగు - కప్పు, ధనియాల పొడి - 2 టేబుల్ స్పూన్లు, పసుపు, జీలకర్ర, కారం - చెంచా చొప్పున, కశ్మీరీ కారం - ఒకటిన్నర చెంచా, ఉప్పు - రుచికి తగినంత, అల్లం వెల్లుల్లి ముద్ద - 2 చెంచాలు, జీడిపప్పులు - 10, కుంకుమపువ్వు - కొద్దిగా, తాజా కొబ్బరి తురుము - 3 చెంచాలు, ఉల్లి తరుగు - కప్పున్నర, నూనె - అర కప్పు, నెయ్యి - పావు కప్పు, రోజ్ వాటర్ - చెంచా, లవంగాలు, యాలకులు - 4 చొప్పున, నల్ల యాలకులు - చిన్నవి 2, మిరియాలు - చెంచా, దాల్చినచెక్క - అంగుళం ముక్క, జాపత్రి - కాస్త, జాజికాయ పొడి - చిటికెడు, గరం మసాలా - అర చెంచా, సన్నగా తరిగిన అల్లం - కొద్దిగా

తయారీ: మాంసం ముక్కల్లో పెరుగు, ధనియాల పొడి, పసుపు, జీలకర్ర, కారం, కశ్మీరీ కారం, ఉప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి కలిపి అరగంట నానబెట్టాలి. కడాయిలో నూనె వేడిచేసి ఉల్లి తరుగును బంగారు రంగులోకి మారే వరకూ వేయించి చల్లారాక గ్రైండ్ చేయాలి. జీడిపప్పులను కొంతసేపు నానబెట్టి.. కుంకుమపువ్వు, కొబ్బరి తురుము జోడించి నూరాలి. కుక్కర్‌లో నెయ్యి వేడయ్యాక.. లవంగాలు, యాలకులు, నల్ల యాలకులు, దాల్చినచెక్క, మిరియాలను వేయించి మ్యారినేట్ చేసిన మాంసాన్ని జతచేయాలి. వెయిట్ పెట్టకుండా ఉడికిస్తూ ప్రతి ఐదు నిమిషాలకీ కలియతిప్పుతుండాలి. అరగంట తర్వాత కప్పున్నర నీళ్లు, గ్రైండ్ చేసిన ఉల్లి ముద్ద చేర్చి 3 విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. మూత తీశాక.. జాపత్రి, జాజికాయ పొడి, గరం మసాలా, జీడిపప్పు పేస్టు, రోజ్ వాటర్, తరిగిన అల్లం వేసి ఇంకో నాలుగు నిమిషాలు ఉడికించాలి. అంతే.. వహ్వా అనిపించే 'మటన్ కుర్మా' రెడీ.

చీజ్‌బాల్స్



కావలసినవి: బంగాళదుంపలు - పావు కిలో, గార్లిక్ పౌడర్ - చెంచా, ఉప్పు - రుచికి తగినంత, చిల్లీ ఫ్లేక్స్ - చెంచా, మిరియాల పొడి - అర చెంచా, డ్రైడ్ హెర్బ్స్ - చెంచా, కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్లు, బ్రెడ్ పొడి - ముప్పావు కప్పు, నూనె - వేయించడానికి సరిపడా, చీజ్ - 100 గ్రాములు, గరం మసాలా - అర చెంచా, మొక్కజొన్న పిండి - 4 టేబుల్‌స్పూన్లు,

తయారీ: కొన్ని నీళ్లతో మొక్కజొన్న పిండి మరీ చిక్కగా లేదా పల్చగా కాకుండా కలపాలి. బంగాళదుంపలను ఉడికించి పొట్టు తీసి మెత్తగా మెదపాలి. అందులో వెల్లుల్లి, సగం చొప్పున ఫ్లేక్స్, హెర్బ్స్, ఉప్పు, మిరియాల పొడి, కాస్త బ్రెడ్ పొడి వేసి కలపాలి. చీజ్‌లో మిగిలిన ఫ్లేక్స్, హెర్బ్స్, మిరియాల పొడి, గరం మసాలా కలిపి.. పది భాగాలు చేయాలి. బంగాళదుంప మిశ్రమాన్ని కూడా పది సమానమైన ఉండలు చేయాలి. ఒక్కోదాన్నీ చిన్న రొట్టెలా సాగదీసి.. మధ్యలో చీజ్ క్యూబ్‌ను ఉంచి.. అంచులు కలిపేయాలి. ఒక్కో బాల్‌ను మొక్కజొన్న పిండిలో ముంచి తీసి, బ్రెడ్‌పొడిలో దొర్లించాలి. అన్నీ అయ్యాక.. కాగుతున్న నూనెలో బంగారు రంగులోకి మారే వరకూ వేయిస్తే.. నోరూరించే 'చీజ్‌బాల్స్' సిద్ధమైపోతాయి.

బిర్యానీ, మసాలా కూరల్లో లవంగం, దాల్చినచెక్క, యాలకులతో పాటు స్టార్‌మొగ్గ వేస్తాం. ఇది వంటకాలకు పరిమళాన్ని ఇవ్వడమే కాదు ఆరోగ్యపరంగానూ మేలు చేస్తుంది.

ఒత్తిడి, ఆందోళన తగ్గాలంటే..



- స్టార్ మొగ్గలో యాంటీఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉన్నాయి.
- జలుబు, దగ్గు, జ్వరాల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
- డయేరియాను తగ్గిస్తుంది.
- రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తుంది.
- బరువు తగ్గేందుకు తోడ్పడుతుంది.
- అలసటను పోగొట్టి ఉత్సాహాన్ని అందిస్తుంది.
- ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది.
- మూత్రనాళాలు, చెవికి సంబంధించిన ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తుంది.
- ఇది యాంటీబయాటిక్‌గా పనిచేస్తుంది.
- ఇన్‌సోమ్నియాతో బాధపడుతున్నవారికి ఇది దివ్య ఔషధం. ఒక స్టార్‌మొగ్గను కొంతసేపు నీళ్లలో నానబెట్టి, దాన్ని తీసేసి ఆ నీళ్లు తాగటం వల్ల హాయిగా నిద్రపడుతుంది.
- జీర్ణప్రక్రియ సాఫీగా పనిచేస్తుంది. అరుగుదల సమస్య ఉత్పన్నం కాదు.
- సూప్, టీ, ఫ్రైడ్‌రైస్, కూర, సలాడ్, స్వీట్లు, బేకరీ వంటకాల్లో దీన్ని ఉపయోగిస్తారు.
- స్టార్‌మొగ్గలు కొనేటప్పుడు నాణ్యమైన రకాన్ని మాత్రమే ఎంచుకోవాలి. అలాగే అతి తక్కువ మోతాదులో తీసుకోవాలి. మేలైన రకం కాకున్నా, ఎక్కువ మోతాదులో వాడినా ప్రమాదమని గుర్తుంచుకోవాలి.
- గర్భిణీలు, శిశువుకు పాలిస్తున్న మహిళలు వీటికి దూరంగా ఉండాలి.

పాఠక వంట

కొన్ని పిండివంటలు చేయడం ప్రహసనంలా ఉంటుంది. అంత శ్రమించే బదులు హోమ్‌ఫుడ్స్‌లో కొనుక్కోవడం మేలని కూడా అనిపిస్తుంది. ఖజూర్ అలా కాదు.. పని సులువు, రుచి అధికం. ప్రయత్నించి చూడండి!

పిల్లలకు నచ్చే చిరుతిండి

ఖజూర్ కోసం.. గోధుమపిండి - రెండు కప్పులు, పంచదార పొడి - కప్పు, ఉప్మారవ్వ - అర కప్పు, పాలు, నువ్వులు - పావు కప్పు చొప్పున, కర్బూజా గింజలు - టేబుల్ స్పూన్, సోంపు పొడి - 2 చెంచాలు, బేకింగ్ సోడా - చిటికెడు, యాలకుల పొడి - అర చెంచా, నూనె - వేయించడానికి సరిపడా, నెయ్యి, కొబ్బరి తురుము - పావు కప్పు చొప్పున తీసుకోవాలి.



ఎలా చేయాలంటే.. ఒక వెడల్పాటి పాత్రలో గోధుమపిండి, పంచదార పొడి, ఉప్మారవ్వ, నెయ్యి, పాలు, నువ్వులు, కొబ్బరి తురుము, కర్బూజా గింజలు, సోంపు పొడి, బేకింగ్ సోడా, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో కాస్త మందమైన రొట్టెలు చేసి డైమండ్ లేదా నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కోయాలి. అన్నీ అయ్యాక.. కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. వీటిని తడిలేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకుంటే పిల్లలకు సాయంత్రం వేళ చిరుతిండిగా ఇవ్వొచ్చు.



– ఎం.పావని, హైదరాబాద్

కట్లెట్లు ఇష్టపడని వారుండరు. మాంసాహారులకు 'కీమా కట్లెట్' మరీ మరీ నచ్చుతుంది. ఇవి హోటల్ స్టయిల్లో క్రిస్పీగా ఉండాలంటే ఇలా చేయండి!

కీమా కట్లెట్ అదరహో

కావలసినవి: కీమా - పావు కిలో, ఉల్లిపాయలు - చిన్నవి రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు - చెంచా, పుదీనా - చారెడు, కొత్తిమీర తరుగు - 3 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, గరం మసాలా - అర చెంచా, బ్రెడ్ పొడి - అర కప్పు, గుడ్డు - 1, నూనె - వేయించడానికి సరిపడా



తయారీ: గుడ్డుసొనను బాగా గిలకొట్టాలి. ఉల్లిపాయలను సన్నగా తరగాలి. పుదీనా, కొత్తిమీరలను గ్రైండ్ చేయాలి. అందులో కీమా, ఉల్లి తరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు, గరం మసాలా, ఉప్పు జతచేసి కలపండి. ఈ మిశ్రమంతో కట్లెట్లు చేయండి. ఒక్కోదాన్నీ గుడ్డు సొనలో ముంచి తీసి, బ్రెడ్ పొడిలో రోల్ చేయండి. అన్నీ అయ్యాక.. కాగుతున్న నూనెలో రెండు వైపులా లేత గోధుమరంగు వచ్చే వరకూ వేయించండి. అంతే.. 'కీమా కట్లెట్' రుచిని ఆస్వాదించడమే తరువాయి.



– సాయి ప్రణీత్, షెఫ్, హైదరాబాద్

ఈ జామూన్లు ఇట్టే చేసేయొచ్చు



మనకు ఉన్నట్టుండి ఏదైనా స్వీట్ తినాలనిపిస్తుంది. కోవా, పల్లీ ఉండల్లాంటివి చేయాలంటే కాస్త పెద్ద ప్రహసనం. పని తేలిక, రుచి అధికంగా ఉండాలంటే ఇలా బ్రెడ్‌తో జామూన్లు చేసేయండి.

బ్రెడ్‌తో జామూన్ల కోసం పాలు, నూనె, పంచదార, బ్రెడ్, యాలకుల పొడి ఉంటే సరిపోతుంది. ఇవన్నీ దాదాపుగా మనందరి ఇళ్లలో ఎప్పుడూ ఉంటాయి కదా! ఎలా చేయాలంటే.. బ్రెడ్ అంచులు తీసేసి.. మధ్యలో తెల్లని భాగాన్ని కొంతసేపు పాలలో నానబెట్టాలి. చేత్తో మెదిపి మెత్తటి పిండిలా చేయాలి. దీంతో చిన్న చిన్న ఉండలు చేసి.. కాగుతున్న నూనెలో బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. పంచదారలో కొన్ని నీళ్లు, యాలకుల పొడి చేర్చి.. వేడిచేయాలి. కాస్త చిక్కగా అయ్యాక దించేయాలి. వేయించిన ఉండలను ఈ పాకంలో వేయాలి. అంతే.. మైదా, ఖోయా లేని మధురమైన గులాబ్ జామూన్ సిద్ధమైపోతుంది.

మనం కొనే శీతల పానీయాల్లో రసాయనాలే కాదు.. చక్కెర కూడా ఎక్కువగా ఉంటుంది. అవి హానికరం కనుక ఇంట్లోనే ఆరోగ్యకరమైన షికంజీ చేసుకుందామా..

మసాలా పానీయం షికంజీ



షికంజీ కోసం జీలకర్ర - టేబుల్ స్పూన్, మిరియాలు, చాట్ మసాలా - చెంచా చొప్పున, బ్లాక్ సాల్ట్, సాధారణ ఉప్పు - తగినంత, ధనియాలు - అర చెంచా, నిమ్మరసం - 2 టేబుల్ స్పూన్లు, పంచదార పొడి - 4 టేబుల్‌స్పూన్లు, పుదీనా - ఏడెనిమిది ఆకులు తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. జీలకర్ర, మిరియాలు, ధనియాలను దోరగా వేయించి.. చల్లారాక చాట్ మసాలా చేర్చి మెత్తగా గ్రైండ్ చేయాలి. అందులో బ్లాక్ సాల్ట్, సాధారణ ఉప్పు, పంచదార పొడి కలపాలి. ఈ పౌడర్‌తో సుమారు పన్నెండు గ్లాసుల షికంజీ తయారవుతుంది. నీళ్లలో మసాలా కలిపాక.. నిమ్మరసం జతచేయాలి. పుదీనా ఆకులను తుంచి వేయాలి. అంతే.. అందరికీ సర్వ్ చేయండి. ఈ ప్రత్యేక టేస్టుకి ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే.

పొరుగు రుచి

రైస్‌కేక్.. తింటే వదలరు

సిక్కిం సంప్రదాయ వంటకం రైస్‌కేక్. రుచీ, ఆరోగ్యాల సమ్మేళనమిది. దీని తయారీ కొంచెం ప్రత్యేకంగా ఉంటుంది. రైస్‌కేక్ చేసేందుకు బియ్యం - రెండున్నర కప్పులు, నల్ల నువ్వులు - కప్పు, పంచదార - ముప్పావు కప్పు తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. బియ్యం రాత్రి కడిగి, నానబెట్టాలి.



మర్నాడు ఆ నీళ్లు తీసేసి కొంతసేపు ఆరబెట్టాలి. చెమ్మలేని బియ్యాన్ని గ్రైండ్ చేసి జల్లించాలి. నల్ల నువ్వులను వేయించి, వాటిని కూడా గ్రైండ్ చేయాలి. బియ్యప్పిండిలో పంచదార కలపాలి. అడుగుభాగంలో రంధ్రాలున్న మట్టి పాత్రలో (ప్రత్యేకించి ఈ వంటకం కోసం రూపొందిస్తారు) రెండు అరిటాకులు అమర్చాలి. వాటి మీద ముందు నువ్వులను, వాటిపై బియ్యప్పిండిని, మళ్లీ నువ్వులను, పిండిని.. ఇలా పొరలు పొరలుగా వేసి.. చివరికి అరిటాకులను మూసేయాలి.. సగం వరకూ నీళ్లు నింపిన పాత్రను పొయ్యి మీదుంచి.. దాని మీద ఈ కుండను అమర్చి సుమారు పావుగంట ఉడికిస్తే.. వారెవా అనిపించే రైస్‌కేక్ తయారైపోతుంది. నీళ్లపాత్ర, మట్టికుండల మధ్య ఉన్న ఖాళీలోంచి ఆవిరి బయటకు పోకుండా ఒక వస్త్రాన్ని రిబ్బన్‌లా చుట్టి ముడి వేయాలి. నువ్వుల కమ్మదనం నోటికి హితవుగా ఉంటుంది. ఆవిరిమీద ఉడకటం వల్ల ఆరోగ్యం. దీన్ని గారో రైస్‌కేక్, సాకిన్ గాటా పేర్లతోనూ పిలుస్తారు.

బెల్లం-నువ్వుల క్యాండీలు..

నిన్నటి తరం వాళ్లకి బెల్లం జీడీలంటే మహా ఇష్టం. 'గుడ్ గట్టా'గా పిల్చుకునే బెల్లం-నువ్వుల క్యాండీలు రంగులోనూ రుచిలోనూ కొంచెం జీడీలను తలపిస్తాయి. వీటిని ఇంట్లోనే సులువుగా చేసుకోవచ్చు.



ఈ బెల్లం బిళ్లల కోసం.. బెల్లం పొడి - 300 గ్రాములు, నువ్వులు - రెండున్నర చెంచాలు, డ్రై జింజర్ పౌడర్ - చెంచా, యాలకుల పొడి - అర చెంచా, బేకింగ్ సోడా - కొద్దిగా, పంచదార - 2 చెంచాలు, నెయ్యి - టేబుల్ స్పూన్ చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. నువ్వులను చిటపటలాడే వరకూ వేయించి ఉంచాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో బెల్లం పొడి, కొన్ని నీళ్లు, నెయ్యి, పంచదార వేసి వేడి చేయాలి. బెల్లం కరిగి, నురుగు వస్తున్నప్పుడు యాలకుల పొడి, డ్రై జింజర్ పౌడర్, నువ్వులు జోడించాలి. పాకం చిక్కగా అయ్యాక దించేసి బేకింగ్ సోడా కలపాలి. వేడి చల్లారకముందే నెయ్యి రాసిన పళ్లెంలో ఈ మిశ్రమం వేసి.. సమంగా సర్దాలి. పది నిమిషాల తర్వాత ముక్కలుగా కట్ చేయాలి. పూర్తిగా గట్టిపడిన తర్వాత తడి లేని సీసాలో భద్రం చేసుకోవాలి. నువ్వులకు బదులు పుచ్చగింజలు కూడా వేయొచ్చు.

ఉదయానే కప్పు చాయ్ తాగితే బోలెడంత ఉత్సాహం. మళ్లీ సాయంత్రం ఇంకో కప్పు. అతిథులు ఇంటికొస్తే మొదటి మర్యాద టీతోనే. అంతేనా.. ఏ సంతోషాన్నైనా చాయ్‌తోనే సెలెబ్రేట్ చేసుకుంటాం. ఎంతటి నీరసాన్నయినా పోగొట్టేసి ఉల్లాసం కలిగించేదీ అదే. అంత ఇష్టమైన టీకెటిల్‌ని కేక్‌లో మలిచారు. చూసి ఆనందించండి!

కేక్.. కెటిలైంది!

చిత్రంగా..









భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి పట్టణ, నగరపాలక వ్యవస్థ వర్ధిల్లుతోంది. సింధు నాగరికత పట్టణ నాగరికతకు నిదర్శనంగా నిలిచింది. స్వాతంత్ర్యానంతరం పట్టణ ప్రభుత్వాలకు రాజ్యాంగ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో 74వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని రూపొందించారు. మొదటగా రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 65వ రాజ్యాంగ సవరణ చట్టం బిల్లును 1989లో లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ కాలంలోనే సభ రద్దవడంతో ఈ బిల్లు కూడా రద్దయ్యింది. పునర్వ్యవస్థీకరించిన బిల్లును వి.పి.సింగ్ ప్రభుత్వం 1990లో లోక్‌సభలో ప్రవేశపెట్టినా విఫలమైంది. తర్వాతి కాలంలో పి.వి. నరసింహారావు ప్రభుత్వం కొన్ని మార్పులతో 74వ సవరణ బిల్లుగా ప్రవేశపెట్టగా, ఉభయ సభల ఆమోదం పొందింది.



పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

స్థాయీ సంఘాలు.. కళ్లు.. చెవులు.. చేతులు!

74వ రాజ్యాంగ సవరణ చట్టం - 1992



దేశంలో పట్టణ స్థానిక సంస్థలను పటిష్ఠపరిచి, సమర్థవంతంగా కార్యకలాపాలు నిర్వహించేందుకు 74వ రాజ్యాంగ సవరణ చట్టం-1992ను రూపొందించారు. ఈ సవరణ చట్టం బిల్లు పి.వి. నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో 1992 డిసెంబరులో పార్లమెంట్ ఆమోదం పొందింది. 1993 ఏప్రిల్ 20న రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత ఈ బిల్లు చట్టంగా రూపొందింది. 1993 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

చట్టంలోని ముఖ్యాంశాలు:

ఈ చట్టం స్థానిక సంస్థలకు మొట్టమొదటిసారిగా రాజ్యాంగపరమైన గుర్తింపు కల్పించింది.

- ఈ చట్టం ద్వారా రాజ్యాంగంలో 9(ఎ) భాగాన్ని చేర్చడంతో పాటు 12వ షెడ్యూల్‌ను ప్రవేశ పెట్టారు.
- రాష్ట్ర ప్రభుత్వం పట్టణ సంస్థలకు 18 అంశాలపై తీర్మానాలు రూపొందించి, అమలుచేసే అధికారం ఇచ్చింది.
- జనాభా 10 లక్షలు లేదా అంతకుమించి ఉండే పట్టణ ప్రాంతాన్ని మహానగర ప్రాంతం (మెట్రోపాలిటన్ ఏరియా)గా ప్రకటించింది.
- పట్టణ స్థానిక సంస్థల్లో కొన్ని స్థానాల్లో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా సీట్లను కేటాయించాలని పేర్కొంది. అదేవిధంగా 3వ వంతు స్థానాలను మహిళలకు, మహిళా అధ్యక్ష పదవులను రొటేషన్ పద్ధతిలో కేటాయించనున్నట్లు ప్రకటించింది.
- ప్రతి పురపాలక సంస్థ తొలిసమావేశం జరిగినప్పటి నుంచి అయిదేళ్ల పాటు కొనసాగవచ్చని ప్రకటించింది. అలాగే కాలపరిమితి ముగిసేలోగా లేదా కాలపరిమితి పూర్తయిన ఆరునెలల వ్యవధిలోపు ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేసింది.
- పురపాలక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయసు 21 సంవత్సరాలుగా నిర్ణయించింది.
- పురపాలక సంస్థలు తమ ఆదాయాల కోసం ప్రజలపై పన్నులు విధించి, వసూలు చేసుకునేలా రాష్ట్ర శాసనసభలకు చట్టాలు చేసే అధికారమిచ్చింది.
- ప్రతి అయిదేళ్లకొకసారి పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం, పర్యవేక్షణ కోసం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఏర్పర్చింది.
- మెట్రోపాలిటన్ ఏరియాలో మెట్రోపాలిటన్ ప్రణాళికా కమిటీలు ఏర్పాటవుతాయని ఈ చట్టం పేర్కొంది.

నగరపాలక సంస్థలు

ఇవి పట్టణ స్థానిక ప్రభుత్వాల్లో ముఖ్యమైనవి. నగరపాలక సంస్థలను అత్యున్నత పట్టణ, స్థానిక సంస్థలుగా అతిపెద్ద నగరాల్లో ప్రత్యేక చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. 1687లో మద్రాసు నగరంలో మొట్టమొదటి నగరపాలక సంస్థను ఏర్పాటు చేశారు. 3 లక్షల జనాభా, రూ.4 కోట్ల వార్షిక ఆదాయం ఉన్న పట్టణాలను నగరపాలక సంస్థలుగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.

నిర్మాణం: ప్రతి నగరపాలక సంస్థలో నగరపాలక మండలి, మేయర్, కమిషనర్, స్థాయీ సంఘాలు అనే నాలుగు ప్రధాన అంశాలు ఉంటాయి.

నగరపాలక మండలి: నగరపాలక సంస్థ శాసన, చర్చా సంబంధమైన భాగమే నగరపాలక మండలి.

- నగరపాలక సంస్థ పరిధిలోని రిజిస్టర్డ్ ఓటర్ల ద్వారా ఎన్నికైన కార్పొరేటర్లు దీనిలో సభ్యులుగా ఉంటారు.
- కౌన్సిల్ సమావేశాలకు మేయర్ అధ్యక్షత వహిస్తారు. మేయర్‌ను సంప్రదించి నగరపాలక సంస్థ కమిషనర్ సమావేశాల ఎజెండాను రూపొందిస్తారు.

మేయర్: నగరపాలక సంస్థ ప్రథమ పౌరుడు మేయర్. రాజకీయ అధిపతిగా వ్యవహరిస్తారు. పదవీకాలం అయిదేళ్లు.

స్థాయీ సంఘాలు: స్థాయీ సంఘాలు నగరపాలక సంస్థకు సలహా సంస్థలుగా వ్యవహరిస్తాయి. నగరపాలక సంస్థ సమర్థవంతంగా పనిచేసేలా సలహాలిస్తాయి. వీటిని నగరపాలక సంస్థలకు కళ్లు, చెవులు, చేతులుగా పేర్కొంటారు.

మున్సిపల్ కమిషనర్: నగరపాలక సంస్థ పరిపాలనా అధిపతి కమిషనర్. ఇతడిని ఐఏఎస్ కేడర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ప్రభుత్వం తరఫున నగరపాలక సంస్థకు సంబంధించిన వ్యవహారాల్లో ప్రాతినిధ్యం వహిస్తారు.

- మేయర్‌ను సంప్రదించి నగరపాలక మండలి సమావేశాల తేదీని నిర్ణయించడంతో పాటు ఎన్నికల ఎజెండాను సభ్యులకు తెలియజేస్తారు.
- నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ను రూపొందించి, మండలి సమావేశంలో సభ్యుల పరిశీలన ఆమోదం కోసం నివేదిస్తారు. సంస్థ ఆర్థిక వ్యవహారాలను నిర్వహించడంతో పాటు దస్త్రాలను భద్రపరుస్తారు.

పురపాలక సంస్థలు

జనాభా 20001 లేదా అంతకుమించి లేదా 60 లక్షలకు మించి వార్షికాదాయం ఉన్న ప్రాంతాలను పురపాలక సంస్థలుగా ఏర్పాటు చేస్తారు.

- వార్షిక ఆదాయం ఆధారంగా పురపాలక సంస్థలను అయిదు రకాలుగా వర్గీకరించారు. అవి:
  - సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంస్థలు - వార్షికాదాయం రూ.4 కోట్లకుపైగా
  - స్పెషల్ గ్రేడ్ పురపాలక సంస్థలు - వార్షికాదాయం రూ.3 - 4 కోట్ల మధ్య
  - ఫస్ట్ గ్రేడ్ పురపాలక సంస్థలు - వార్షికాదాయం రూ.2 - 3 కోట్ల మధ్య
  - సెకండ్ గ్రేడ్ పురపాలక సంస్థలు - వార్షికాదాయం రూ.1 - 2 కోట్ల మధ్య
  - థర్డ్ గ్రేడ్ పురపాలక సంస్థలు - వార్షికాదాయం రూ.కోటి కంటే తక్కువ

పురపాలక మండలి: ఇందులో ఎన్నికయ్యే సభ్యులు, అనుబంధ సభ్యులు, గౌరవ సభ్యులు ఉంటారు. పురపాలక సంస్థ పరిధిలోని రిజిస్టర్డ్ ఓటర్లు (వయోజనులు) మొదటి తరహా సభ్యులను ఎన్నుకుంటారు. వీరినే కౌన్సిలర్లు అంటారు.

మున్సిపల్ ఛైర్మన్: పురపాలక సంస్థ ప్రథమ పౌరుడు. మున్సిపాలిటీ రాజకీయ అధిపతిగా వ్యవహరిస్తారు.

మున్సిపల్ కమిషనర్: ఇతడు పురపాలక సంస్థ పరిపాలనా అధిపతి. విధి నిర్వహణలో భాగంగా పురపాలక మండలి, రాష్ట్ర ప్రభుత్వానికి బాధ్యత వహిస్తారు.

విధులు

ఆవశ్యక విధులు: రహదారుల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలు చేపట్టడం.

- జనన, మరణాల వివరాలను సేకరించి, రికార్డులు నిర్వహించడం
- ఇళ్ల నంబర్లు కేటాయించడం, పన్నులు, ఫీజులు విధించి, వసూలు చేయడం
- మార్కెట్ ప్రదేశాలు నిర్మించి, నిర్వహించడం

విచక్షణాత్మక విధులు: ఔషధ పరీక్షా కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ

- మాతాశిశు సంరక్షణ కేంద్రాలు, మహిళా సంక్షేమ కేంద్రాల స్థాపన, నిర్వహణ
- పార్కులు, విశ్రాంతి గృహాలు, వ్యాయామ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

Word of the Day 709

Jolted

Telugu meaning: కుదుపడం, ఉలిక్కిపడేలా చేయడం

English meaning: The word jolted (జోల్టెడ్) is a verb that refers to being shaken or shocked suddenly, either physically or emotionally.

Synonyms: Shocked, Startled

Antonyms: Calmed, Settled

Usage: 1. The passengers were jolted awake when the bus suddenly hit a pothole.

2. She was jolted by the unexpected news of her friend's resignation.

నోటిఫికేషన్స్

అప్రెంటిస్ పోస్టులు

నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 361. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2025 ఆగస్టు 11.

మేనేజర్ పోస్టులు

హైదరాబాద్‌లోని భారత ప్రభుత్వ సంస్థ - నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్ఎండీసీ) వివిధ గ్రేడుల్లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 17. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 28 జులై 2025.

డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో మెడికల్ & హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) ద్వారా డెంటల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. టీవీవీపీ (తెలంగాణ వైద్య విధాన పరిషత్), ఐఎంఎస్ (ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్) విభాగాల్లో పోస్టులు భర్తీ చేయనున్నారు. మొత్తం పోస్టుల సంఖ్య 48. దరఖాస్తు ఫీజు రూ.500. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 25 జులై 2025.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (జులై 13) చివరి తేదీ

- ఐఐఎం ముంబయిలో 22 నాన్-ఫ్యాకల్టీ పోస్టులు. డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- ఇండియన్ నేవీ - అగ్నిపథ్ స్కీం అగ్నివీర్ (ఎంఆర్ మ్యుజీషియన్) (02/2025) బ్యాచ్ నియామకం. పదో తరగతి ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కొన్ని ముఖ్యమైన తోక చుక్కలు

స్టడీ-జోన్

సౌర వ్యవస్థ ఏర్పడే క్రమంలో మిగిలిపోయిన అవశేషాలే తోకచుక్కలు (Comets). ఇవి నక్షత్రాలు కావు. ఘనీభవించిన మంచు, ధూళి, రాతితో కూడిన మంచు గోళాలుగా ఉంటాయి. తోకచుక్కలు సౌర వ్యవస్థ నుంచి చాలా దూరంలో అతి పెద్ద దీర్ఘవృత్తాకార వలయాల్లో పరిభ్రమిస్తాయి. సూర్యుడికి దగ్గరగా వచ్చినప్పుడు మాత్రమే వీటిని మనం కొంతకాలం పాటు చూడగలం. ఇవి సూర్యుడికి దూరంగా ఉన్నప్పుడు అతి శీతలంగా ఉండి, చిన్న పరిమాణంలో ఉంటాయి. సూర్యుడికి సమీపంలోకి రాగానే అందులోని మంచు కరిగి, వాయువులు వ్యాకోచించి, చాలా పెద్దగా కనిపిస్తాయి.

- కైపర్ బెల్ట్ (Kuiper Belt), ఓర్ట్ మేఘం (Oort Cloud)లో మిలియన్ల సంఖ్యలో తోకచుక్కలు ఉన్నట్లు శాస్త్రవేత్తల అంచనా. ఇప్పటివరకు సుమారు 3,750 తోకచుక్కలను గుర్తించారు.
- కైపర్ బెల్ట్ వంద కిలోమీటర్ల మందంతో, నెప్ట్యూన్ గ్రహానికి బయట ఉంటుంది. దీనిలో సుమారు 70,000 తోకచుక్కలు ఉన్నట్లు అంచనా. ఇవన్నీ సూర్యుడి నుంచి సుమారు 3050 AU (Astronomical Units) దూరంలో ఉంటాయి.
- ఓర్ట్ మేఘం సూర్యుడి నుంచి 50100 వేల ఖగోళ ప్రమాణాల దూరంలో ఉంది. ఇందులో ట్రిలియన్ల సంఖ్యలో మంచు గోళాలను గుర్తించారు.
- గతంలో ఆర్ఆర్‌బీ ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ పీఓ మెయిన్స్, తెలుగు రాష్ట్రాలకు సంబంధించి పోలీస్ పరీక్షల్లో తోక చుక్కలు - వాటిని కనుక్కున్నవారు - ప్రాముఖ్యతపై ప్రశ్నలు వచ్చాయి. అందుకే వీటిపై దృష్టి సారించాలి.



కొన్ని ముఖ్యమైన తోకచుక్కలను పరిశీలిస్తే..

పేరు	మొదట గుర్తించింది
1. హేలీ	ఎడ్మండ్ హేలీ
2. షూమేకర్ లెవి - 9	కరోలిన్, షూమేకర్, డేవిడ్ లెవి (1993)
3. హయకుటాకే	యుజి హయకుటాకే (1996)
4. హేల్-బాప్	అలెన్ హేల్, థామస్ బాప్ (1995)
5. టెంపుల్ - టటుల్	టెంపుల్ (1865), టటుల్ (1866)
6. బోరెల్లి	ఆల్ఫోన్స్ లూయిస్, నికోలస్ బోరెల్లి (1904)
7. ఎన్కే	పియరీ మెషైన్ (1786), జోహన్ ఫ్రాంజ్ ఎన్కే (1819)
8. వైల్డ్ 2	పాల్ వైల్డ్ (1978)


జనరల్ స్టడీస్ - ఎకానమీ

జాతీయాదాయ భావనలు

ఒక వ్యక్తి లేదా కుటుంబంలోని వ్యక్తులంతా పనిచేసి సంపాదించే ఆదాయాన్ని వ్యక్తిగత ఆదాయం లేదా కుటుంబ ఆదాయంగా పేర్కొంటారు. అదేవిధంగా దేశ ఆదాయాన్ని జాతీయాదాయం అంటారు. ఒక ఆర్థిక వ్యవస్థలోని వ్యక్తులు, కుటుంబాలు, ప్రభుత్వం ఇతర సంస్థలన్నిటినీ కలిపి ఒక జాతి లేదా దేశంగా పేర్కొంటారు. అందుకే జాతిని స్థూల లేదా సమష్టి వ్యవస్థగా పరిగణిస్తారు. వీటన్నింటి ఆదాయాల మొత్తమే జాతీయాదాయం.

నిర్ణీత భూభాగంలో సార్వభౌమాధికారం ఉన్న వ్యవస్థను దేశం లేదా జాతి అంటారు. దేశాల జాతీయాదాయ కూర్పులో నిర్మాణాత్మక మార్పు ఉంటుంది. జాతీయాదాయంలో అనేక భావనలు ఉంటాయి. వాటిలో ముఖ్యమైనవి.

- స్థూల దేశీయోత్పత్తి
- స్థూల జాతీయోత్పత్తి
- మార్కెట్ ధరల్లో స్థూల జాతీయోత్పత్తి
- ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి
- నికర జాతీయోత్పత్తి
- ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర జాతీయోత్పత్తి
- నికర దేశీయోత్పత్తి
- వ్యక్తిగత ఆదాయం
- వ్యయార్హ ఆదాయం
- నిజ జాతీయాదాయం
- తలసరి ఆదాయం
- కలిపిన స్థూల విలువ




దేశంలో జాతీయాదాయాన్ని గణించే పద్ధతులు

జాతీయాదాయ విశ్లేషణ ద్వారా మాత్రమే పేదరికానికి సంబంధించిన అనేక సమస్యలు, అసమానతలు, నిరుద్యోగం, వృద్ధి, ఆర్థిక సంక్షేమాన్ని సాధించడం, మొదలైన అనేక విషయాలను అధ్యయనం చేయడం లేదా సమీక్షించడం వీలవుతుంది.

మనదేశంలో జాతీయాదాయాన్ని అంచనా వేయడానికి అనుసరించే పద్ధతులు - అందులోని ఇబ్బందులు, సమస్యలు; రంగాలవారీ విభజన ఆధారంగా జాతీయాదాయ అంచనా; స్థూల జాతీయోత్పత్తి విభాగాలు; ప్రైవేట్, ప్రభుత్వ అంతిమ వినియోగ వ్యయాలు, స్థూల స్థిర మూలధన కల్పన/ పెట్టుబడి, ఎగుమతులు - దిగుమతుల శేషం, చక్రీయ ఆదాయ ప్రవాహం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



The "Maratha Military Landscapes of India" were officially inscribed on the UNESCO World Heritage List on 11 July 2025. This decision was taken at the 47th session of the UNESCO World Heritage Committee in Paris, France. This significant recognition marks India's 44th World Heritage site. The Maratha Military Landscapes comprise forts located across Maharashtra and Tamil Nadu.



Indian Railways has signed a Memorandum of Understanding (MoU) with the Dedicated Freight Corridor Corporation of India Limited (DFCCIL) for the installation of Machine Vision Based Inspection System (MVIS) to boost train safety on 10 July 2025.

- MVIS is a modern, Artificial Intelligence and Machine Learning-based technology solution that captures high-resolution images of the under-gear of moving trains and automatically detects any hanging, loose, or missing components.

According to the Telecom Regulatory Authority of India (TRAI) data, India's internet subscriber base grew by 1.54% in the financial year 2024-25, rising from 954.40 million in March 2024 to 969.10 million in March 2025. The growth was primarily driven by an increase in broadband subscribers, which rose from 924.07 million to 944.12 million, marking a 2.17% year-on-year gain.

For more Current Affairs: Scan QR code

Railway Exams
Reasoning
Number Series

***Directions (Qs. 1-36):** What comes in the place of "?" mark in the following number series.*

1. 1, 2, 6, 21, 88, ?
A) 445 B) 444 C) 442 D) 446

2. 10, 14, 22, 38, 70, ?
A) 130 B) 116 C) 134 D) 126

3. 3, 6, 11, 18, 27, ?
A) 36 B) 38 C) 41 D) 40

4. 1, 3, 7, 15, 31, 63, ?
A) 124 B) 126 C) 127 D) 128

5. 2, 6, 12, 20, 30, ?
A) 42 B) 36 C) 38 D) 40

6. 1, 8, 27, 64, 125, ?
A) 250 B) 150 C) 200 D) 216

7. 100, 81, 64, 49, 36, ?
A) 25 B) 30 C) 20 D) 18

8. 1, 2, 6, 24, 120, ?
A) 640 B) 720 C) 600 D) 840

9. 1, 5, 14, 30, 55, ?
A) 91 B) 85 C) 80 D) 84

10. 3, 9, 27, 81, ?
A) 243 B) 162 C) 225 D) 216

11. 0, 1, 1, 2, 3, 5, 8, ?
A) 10 B) 11 C) 13 D) 12

12. 2, 3, 5, 7, 11, 13, ?
A) 15 B) 17 C) 18 D) 16

13. 81, 27, 9, 3, 1, ?
A) 0 B) 0.5 C) 1 D) $\frac{1}{3}$

14. 5, 10, 20, 40, 80, ?
A) 120 B) 90 C) 160 D) 100

15. 2, 5, 10, 17, 26, 37, ?
A) 50 B) 53 C) 52 D) 55

16. 2, 3, 5, 9, 17, 33, ?
A) 65 B) 63 C) 67 D) 61


17. 2, 4, 12, 48, 240, ?
A) 1500 B) 1200 C) 1080 D) 1440

18. 0, 7, 26, 63, 124, 215, ?
A) 342 B) 330 C) 337 D) 341

19. 50, 48, 44, 38, 30, ?
A) 21 B) 20 C) 22 D) 23

20. 1, 32, 243, 1024, ?
A) 2125 B) 4125 C) 3125 D) 6125

21. 1, 2, 4, 7, 11, 16, ?
A) 21 B) 22 C) 24 D) 26



22. 81, 64, 49, 36, 25, ?
A) 10 B) 20 C) 16 D) 9

23. 2, 6, 18, 54, ?
A) 162 B) 108 C) 120 D) 144

24. 1, 1, 2, 3, 5, 8, 13, 21, ?
A) 20 B) 34 C) 22 D) 39

25. 10, 7, 4, 1, ?
A) –1 B) 0 C) –2 D) –3

26. 2, 3, 6, 15, 45, ?
A) 157.5 B) 120.5 C) 150.025 D) 111. 075

27. 0, 2, 6, 12, 20, 30, ?
A) 36 B) 42 C) 48 D) 52

28. 243, 81, 27, 9, ?
A) 1 B) 3 C) 0 D) 5

29. 5, 12, 27, 58, 121, ?
A) 240 B) 241 C) 242 D) 248

30. 3, 5, 11, 21, 35, ?
A) 53 B) 55 C) 57 D) 59

31. 1, 4, 10, 20, 35, ?
A) 45 B) 50 C) 56 D) 60

32. 1000, 998, 1001, 999, 1002, ?
A) 1000 B) 1003 C) 997 D) 1004

33. 77, 77, 62, 62, 47, 47, ?, ?
A) 42, 42 B) 25, 25 C) 11, 11 D) 32, 32

34. 1, 1.5, 3.75, 13.125, 59.0625, ?
A) 324.84375 B) 255.027575 C) 425.76125 D) 275.909075

35. 8.8, 8.3, 7.8, 7.3, 6.8, ?
A) 5.3 B) 6.3 C) 4.7 D) 2.9

36. 1, 3, 11, 47, 239, ?
A) 1439 B) 1555 C) 3450.125 D) 1750.0775

Scan the QR code for Key

These model questions were prepared by subject experts



కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



* 2025, మే 8న భారత్ ఏ దేశంతో కలిసి సెపా (CEPA – కాంప్రహెన్సివ్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్) కోసం అధికారికంగా చర్చలను ప్రారంభించింది? (2025, ఏప్రిల్‌లో ఈ దేశ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ ఫాంట్ భారత పర్యటన నేపథ్యంలో సెపా కార్యరూపం దాల్చింది.) జ: చిలీ
* అధికారిక గణాంకాల ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు రికార్డు స్థాయిలో ఎంత మొత్తం మేర లాభాన్ని నమోదు చేశాయి? (2023–24 ఆర్థిక సంవత్సరం కంటే ఇది 26 శాతం అధికం. మొత్తం ఆదాయంలో 40 శాతం కంటే ఎక్కువ వాటాను ఎస్‌బీఐ నమోదు చేసింది.) జ: రూ.1.78 లక్షల కోట్లు
* స్నో లెపర్డ్ పాపులేషన్ అసెస్‌మెంట్ ఇన్ ఇండియా (ఎస్‌పీఏఐ) తాజా గణాంకాల ప్రకారం దేశంలోనే అత్యధికంగా లద్దాఖ్‌లో మొత్తం ఎన్ని మంచు చిరుతలు ఉన్నాయి? జ: 477 (దేశంలోని మొత్తం మంచు చిరుతల్లో ఇది 33 శాతం.)

మరింత సమాచారం

గాలుల కదలికలకు మూలం!

జనరల్ స్టడీస్
ప్రపంచ భూగోళ శాస్త్రం



చుట్టూ ఆవరించి ఉన్న వాతావరణం బరువుతో భూమిపై ఒత్తిడి ఏర్పడుతుంది. అది ఉష్ణోగ్రత, ఎత్తు, నీటిఆవిరి తదితర కారకాలతో ప్రభావితమవుతుంది. దానినే 'వాతావరణ పీడనం' అంటారు. దీనివల్ల గాలి వీస్తుంది, గాలి తీవ్రత నిర్ణయమవుతుంది, అందరూ శ్వాస పీల్చగలుగుతున్నారు. భూమిపై ఒక్కోప్రాంతంలో ఒక్కో విధంగా వాతావరణం ఉండటంతో పీడనం కూడా రకరకాలుగా మారుతుంది. వాతావరణ స్థితిగతులను నిర్దేశించే ఈ కీలకాంశాలపై పోటీ పరీక్షార్థులకు శాస్త్రీయ అవగాహన ఉండాలి. పీడనానికి స్థూల కారణాలు, పీడన ప్రవణత, కొరియాలిస్ శక్తి ప్రభావాలతోపాటు పలు భూస్వరూపాలు, వాతావరణ పరిస్థితులు ఒకే తీరులో ఉండే వేర్వేరు ప్రాంతాలను సూచించే ఊహారేఖల గురించి తెలుసుకోవాలి.

వాతావరణ పీడనం

భూమి ఉపరితలంపై ఒక నిర్దిష్ట స్థానంపైన ఉన్న గాలి బరువునే 'వాతావరణ పీడనం' అంటారు. ఇది భూవాతావరణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. బారోమీటర్ ఉపయోగించి ఈ పీడనాన్ని కొలవవచ్చు. అందుకే 'బారోమెట్రిక్ పీడనం' అని కూడా పిలుస్తారు. మిల్లీబార్లు లేదా కిలోపాస్కల్స్ ఈ పీడనాన్ని కొలిచే యూనిట్లు. వాతావరణ పీడనం వివిధ ఎత్తుల్లో మారుతుంది. సముద్ర మట్టంలో పీడనం ఎక్కువగా ఉంటుంది. ఎత్తు పెరిగే కొద్దీ తగ్గుతుంది. గాలి అణువులు వాటి పైన ఉన్న గాలి బరువుతో కుదించుకుపోవడం వల్ల సముద్ర మట్టంలో గాలి భారీగా ఉంటుంది. గాలి అణువులు భూమి ఉపరితలం నుంచి దూరంగా వెళ్లేటప్పుడు ఎక్కువ స్థలం ద్వారా వేరు కావడంతో గాలి తేలికగా మారుతుంది. గాలి బరువు తగ్గినప్పుడు పీడనం తగ్గుతుంది. సముద్రమట్టం వద్ద గాలి పీడనం దాదాపు 1,000 మిల్లీబార్లు (100 కిలోపాస్కల్స్) ఉంటుంది. అదే 29,032 అడుగులు (8.85 కి.మీ.) ఎత్తున్న ఎవరెస్ట్ శిఖరంపై దాదాపు 300 మిల్లీబార్లకు తగ్గుతుంది. 31 మైళ్ల (50 కి.మీ.) ఎత్తులో గాలి చాలా సన్నగా ఉండి, కేవలం ఒక మిల్లీబార్ (0.1 కిలోపాస్కల్) ఒత్తిడి కలిగిస్తుంది. వాతావరణ పీడనం 5,000 అడుగుల (1,500 మీ.) వద్ద తక్కువగా ఉంటుంది. సృష్టిలో ప్రతి వస్తువుకు కొంత బరువు ఉన్నట్లు.. భూవాతావరణానికి 56,000 కోట్ల టన్నుల బరువు ఉందని శాస్త్రవేత్తల అంచనా.

వాతావరణ పీడనానికి కారణాలు: ఇది ఉపరితలంపైన ఉన్న వాతావరణ వాయువులపై గ్రహం గురుత్వాకర్షణ శక్తి ద్వారా ఏర్పడుతుంది. గాలి వేగం, ఉష్ణోగ్రత-ప్రేరిత సాంద్రత వైవిధ్యాలు, కూర్పు, మార్పులు లాంటి స్థానిక కారకాల మాదిరిగానే గ్రహ భ్రమణం కూడా దీనిని ప్రభావితం చేస్తుంది. సూర్యుడి అసమాన వేడి భూమి వాతావరణ పీడనంలో వైవిధ్యాలను సృష్టిస్తుంది. అధిక పీడనం ఉన్న ప్రాంతాల నుంచి అల్పపీడనం ఉన్న ప్రాంతాలకు గాలి కదులుతున్నప్పుడు, ఈ పీడన వైవిధ్యాలు వాతావరణ కదలికను ప్రభావితం చేస్తాయి. ఫలితంగా గాలి వస్తుంది. వాతావరణ శాస్త్రవేత్తలు రాబోయే వాతావరణ మార్పులకు సూచికగా పీడనంలో మార్పులను పర్యవేక్షిస్తారు. పీడనం తగ్గడం అంటే సాధారణంగా చెడు వాతావరణం సమీపిస్తోందని అర్థం. పెరుగుతున్న పీడనం.. తరచుగా పరిశుభ్రమైన వాతావరణం రావడం లేదా కొనసాగడాన్ని సూచిస్తుంది.



పీడనాన్ని ప్రభావితం చేసే అంశాలు

1) **ఉష్ణోగ్రత:** ఏదైనా భౌగోళిక ప్రాంతంలో వాయు ఘనపరిమాణం స్థిరంగా ఉన్నప్పుడు ఆ ప్రాంత వాతావరణ పీడనం.. ఉష్ణోగ్రతకు విలోమ సంబంధంలో ఉంటుంది (బాయిల్స్ నియమం). అంటే ఉష్ణోగ్రత పెరిగే కొద్దీ వాతావరణ గాలి వేడెక్కి వ్యాకోచించడం వల్ల దాని సాంద్రత తగ్గి పైకి సంవహనం చెందుతుంది. దీనివల్ల ఆ ప్రాంతంలో వాతావరణ పీడనం తగ్గుతుంది. అదేవిధంగా ఉష్ణోగ్రత తగ్గేకొద్దీ వాతావరణంలోని గాలి చల్లగామారి సంకోచించడం వల్ల దాని సాంద్రత పెరిగి అది ఆ ప్రాంతంలో నిమజ్జనం చెంది అక్కడ పీడనం పెరుగుతుంది.

2) **భూభాగాల ఎత్తు:** ఏదైనా భౌగోళిక ప్రాంతంలో ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటే అక్కడి వాతావరణ పీడనం.. భూభాగం ఎత్తుకు విలోమసంబంధంలో ఉంటుంది (ఛార్లెస్ నియమం). అంటే సముద్ర మట్టం నుంచి ఎత్తుకు వెళ్లేకొద్దీ వాతావరణ పీడనం తగ్గుతుంది. కారణం భూఉపరితలం నుంచి ఎత్తుకు వెళ్లేకొద్దీ భూవాతావరణం తేలికైన వాయువులతో ఏర్పడి ఉండటం. అంటే ఆక్సిజన్ సముద్ర మట్టం నుంచి ఎత్తుకు వెళ్లేకొద్దీ తగ్గుతుంది.


3) **వాతావరణంలోని నీటిఆవిరి:** పొడిగాలి బరువుతో పోలిస్తే తడిగాలి బరువు తక్కువ. పొడిగాలి ఉన్న భౌగోళిక ప్రాంతాల్లో వాతావరణ పీడనం అధికంగా, తడిగాలి ఉన్న చోట పీడనం అల్పంగా ఉంటుంది.

ఈ మూడు వాతావరణ అంశాలన్నీ భౌగోళిక ప్రాంతాల్లో ఒకేవిధంగా లేకపోవడంతో భూమిపై కొన్ని ప్రదేశాల్లో అధిక పీడన ప్రాంతాలు, మరికొన్ని ప్రదేశాల్లో అల్పపీడన ప్రాంతాలు ఏర్పడి ఉన్నాయి. వీటినే 'పీడన మేఖలలు' అంటారు.

గాలికీ బరువు

* గాలికి బరువు ఉంటుందని మొదటగా నిరూపించిన శాస్త్రవేత్త గెలీలియో.
* సమాన పీడనం ఉన్న ప్రాంతాలను కలుపుతూ గీసిన రేఖలను 'ఐసోబార్స్' అంటారు.
* వాయువు పీడనాన్ని కొలిచే పరికరం 'మానోమీటర్'.
* వాతావరణ పీడనాన్ని కొలిచే పరికరం - భారమితి/బారోమీటర్. దీనిని రూపొందించిన శాస్త్రవేత్త- ఎవాంజిలెస్టా టారిసెల్లి.
* భారమితిలో పాదరస మట్టం అకస్మాత్తుగా తగ్గడం తుపాను రాకను తెలియజేస్తుంది.
* భారమితిలో పాదరస మట్టం పెరగడం ప్రశాంత వాతావరణాన్ని సూచిస్తుంది.
* పీడనానికి ప్రమాణాలు- మి.మీ./సెం.మీ. లేదా మిల్లీ బార్/ పాస్కల్.
* సముద్ర మట్టం వద్ద సాధారణ వాతావరణ పీడనం 76 సెం.మీ. లేదా 760 మి.మీ. లేదా 1013.25 మిల్లీబార్లు.
* ప్రపంచంలో నమోదైన అత్యధిక పీడనం 1083.3 మిల్లీ బార్లు (సైబీరియాలోని అగాటా), అత్యల్ప పీడనం 870 మిల్లీ బార్లు (మిరియానా దీవుల్లోని టుఫ్ అని పిలిచే చక్రవాత కేంద్రం).


ప్రపంచ పీడన మేఖలలు



ఎ) **భూమధ్యరేఖ అల్పపీడన మేఖల:** భూమధ్యరేఖకు ఇరువైపుల్లో 0°-5° లేదా 10° ఉత్తర, దక్షిణ అక్షాంశాల మధ్య ఉన్న భౌగోళిక ప్రాంతాలనే 'భూమధ్యరేఖ అల్పపీడన మేఖల' అంటారు. దీనినే 'ప్రశాంత మండలం'/'డోల్డ్రమ్స్' అని కూడా పిలుస్తారు. ఇక్కడ ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటంతో గాలి వేడెక్కి, వ్యాకోచం చెంది ఊర్ధ్వముఖంగా సంవహనం చెందడం వల్ల అల్పపీడనం ఏర్పడుతుంది. ఈ మేఖలలో జరిగే అధిక సంవహన ప్రక్రియ వల్ల ప్రతిరోజూ సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడి తక్కువ సమయంలో అధిక పరిమాణంలో వర్షపాతం సంభవిస్తుంది.

బి) **ఉప అయనరేఖ అధిక పీడన మేఖల:** 25°-35°ల ఉత్తర, దక్షిణ అక్షాంశాల మధ్య ఉన్న భౌగోళిక ప్రాంతాలనే 'ఉప అయనరేఖ అధిక పీడన మేఖలలు' అంటారు. భూమధ్యరేఖ ప్రాంతంలో వేడెక్కి పైకి లేచిన గాలులు కొరియాలిస్ ప్రభావం వల్ల 26°-35°ల అక్షాంశాల మధ్య నిమజ్జనమవుతాయి. అందుకే ఈ ప్రాంతంలో అధిక పీడనం ఏర్పడుతుంది. నిమజ్జనం చెందే గాలులే వ్యాపార పవనాలకు మూలాధారం. ఉప అయన రేఖ అక్షాంశాలనే 'అశ్వ అక్షాంశాలు' అంటారు.

కొరియాలిస్ శక్తి ప్రభావం



భూమి ఉపరితలంపై కదిలే వస్తువులు భూభ్రమణంతో ప్రభావితమవుతాయి. దాంతో అవి స్వేచ్ఛగా సరళ మార్గంలో ప్రయాణించవు. అవి ఉత్తర అర్ధ గోళంలో కుడివైపునకు, దక్షిణ అర్ధ గోళంలో ఎడమవైపునకు కదులుతాయి. ఉపరితలం, వాహనం టైరు మధ్య ఘర్షణ లేకపోతే, ఉత్తర అర్ధగోళంలో గంటకు 95కి.మీ. వేగంతో ప్రయాణించే కారు మార్గం కుడి వైపునకు కదులుతుంది. ఈ ధోరణిని 'కొరియాలిస్ ఎఫెక్ట్' అంటారు. కొరియాలిస్ అనే శాస్త్రవేత్త దీన్ని కనుక్కున్నారు. అందుకే రాకెట్ ప్రయోగ ప్రదేశాలు ఎక్కువగా తూర్పు తీరం వెంట కనిపిస్తాయి.


సి) **ఉపధ్రువ అల్పపీడన మేఖల:** 45°- 65°ల ఉత్తర, దక్షిణ అక్షాంశాల మధ్య భౌగోళిక ప్రాంతాలనే 'ఉపధ్రువ అల్పపీడన మేఖలలు' అంటారు. కారణం భూభ్రమణం వల్ల పుట్టే అపకేంద్ర బలాలు అంటే భూమధ్యరేఖ నుంచి ధ్రువాల వైపునకు వెళ్లేకొద్దీ భూమి కోణీయ ద్రవ్యవేగం పెరగడం వల్ల గాలులు ఉన్నత అక్షాంశాల నుంచి కోణీయ వేగం తక్కువగా ఉన్న భూమధ్యరేఖ వైపు పయనించి ఉపధ్రువ ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడుతుంది.

డి) **ధ్రువ అధిక పీడన మేఖల:** 75°-90°ల ఉత్తర, దక్షిణ అక్షాంశాల మధ్య ఉన్న భౌగోళిక ప్రాంతాలనే ధ్రువ అధికపీడన మేఖలలు అంటారు.

* ఈ ప్రాంతంలో సూర్యకిరణాలు ఏటవాలుగా ప్రసరించడం వల్ల అల్ప ఉష్ణోగ్రత కారణంగా అధికపీడనం ఏర్పడుతుంది. దీనిఫలితంగా ఈ ప్రాంతంలో గాలులు చల్లగామారి, బరువెక్కి నిమజ్జనం చెందుతాయి.
* భూమధ్యరేఖ అల్పపీడన మేఖల, ధ్రువ అధిక పీడన మేఖలలు ఉష్ణోగ్రతలో మార్పు వల్ల ఏర్పడుతుండగా; ఉప అయనరేఖ అధికపీడన మేఖల, ఉపధ్రువ అల్పపీడన మేఖలలు కొరియాలిస్ ప్రభావం వల్ల ఏర్పడుతున్నాయి.
* భూమిపై ఒకే వాతావరణ పీడనం ఉన్న ప్రదేశాలను కలుపుతూ గీసిన ఊహా రేఖలను 'సమభార రేఖలు' (ఐసోబార్స్) అని పిలుస్తారు. వీటిని గీసేటప్పుడు పీడనంలో కలిగే మార్పులను సముద్ర మట్టానికి సవరించి లెక్కించాల్సి ఉంటుంది.

పీడన ప్రవణత

ప్రమాణ క్షితిజ సమాంతరంలో పీడనంలో కలిగే మార్పు రేటును 'పీడన ప్రవణత' అంటారు. పీడన ప్రవణత రేఖ, సమభార రేఖలకు లంబంగా ఉంటుంది.




* పటంలో A నుంచి B వరకు పీడన ప్రవణత ఎక్కువగా, C నుంచి D వరకు తక్కువగా ఉంది.
* ఏ భౌగోళిక ప్రాంతంలో పీడన ప్రవణత రేటు అధికంగా ఉంటుందో ఆ ప్రాంతంలో పవనాల వేగం ఎక్కువగానూ; పీడన ప్రవణత రేటు తక్కువగా ఉన్నచోట పవనాల వేగం తక్కువగా ఉంటుంది.



రచయిత: సక్కరి జయకర్

సముద్రాలే భూమిపై ఉష్ణ భాండాగారాలు!



వేడి వస్తువు నుంచి చల్లటి వస్తువు వైపు ప్రవహించే శక్తిని 'ఉష్ణం' అంటారు. మరో రకంగా చెప్పాలంటే భిన్న ఉష్ణోగ్రతలున్న వస్తువుల మధ్య ప్రవహించే శక్తి. జీవులన్నింటికీ ఉష్ణం ప్రాథమిక అవసరం. తాగడానికి కాఫీ, స్నానానికి వేడి నీళ్లు పెట్టుకోవాలన్నా, తినడానికి తిండి వండుకోవాలన్నా ఉష్ణశక్తి కావాలి. శరీర సమతా స్థితి నుంచి వాతావరణ నమూనాల ఏర్పాటు వరకు అన్నింటా ఉష్ణం ప్రభావం ఉంటుంది. నిత్య జీవితంలో అత్యంత కీలకమైన ఆ ఉష్ణం స్వభావం, ప్రదర్శించే ధర్మాలు, ప్రసార పద్ధతులు, ఉష్ణోగ్రతను కొలిచే ప్రమాణాలు, అందుకు వినియోగించే పరికరాలు, సుదూరాల్లోని వస్తువుల ఉష్ణోగ్రతను అంచనా వేసే నియమాలు మొదలైన అంశాలపై పోటీ పరీక్షార్థులకు స్థూల పరిజ్ఞానం ఉండాలి. ఉత్తమ ఉష్ణ బంధక, వాహక పదార్థాలు, పలు ఉష్ణ మాపక పరికరాల్లోని పరిమితుల గురించి తెలుసుకోవాలి.


జనరల్ స్టడీస్ - ఫిజిక్స్

ఉష్ణం


1. మానవ శరీరంలో జరిగే అన్ని జీవక్రియలకు కావాల్సిన శరీర ఉష్ణోగ్రత?
   1) 36°F 2) 300°K 3) 100°C 4) 98.4°F
2. ఉష్ణ తీవ్రతను ఏమంటారు?
   1) విశిష్టోష్ణం 2) గుప్తోష్ణం
   3) ఉష్ణసమతాస్థితి 4) ఉష్ణోగ్రత
3. కింది వాటిలో ఉష్ణ ప్రసార దిశను తెలిపేది?
   1) ఉష్ణదక్షత 2) విశిష్టోష్ణం
   3) ఉష్ణోగ్రత 4) గుప్తోష్ణం
4. వేడి వస్తువు నుంచి చల్లని వస్తువు వైపునకు ప్రవహించే శక్తిస్వరూపం?
   1) ఉష్ణోగ్రత 2) ఉష్ణం
   3) విశిష్టోష్ణం 4) గుప్తోష్ణం
5. ఉష్ణశక్తి ఏ సందర్భంలో విద్యుత్తు శక్తిగా మారుతుంది?
   1) కుంకుడు గింజను రుద్దినప్పుడు
   2) రైలు ఇంజిన్‌ను బొగ్గుతో నడిపినప్పుడు
   3) థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో
   4) విద్యుత్తు హీటర్‌లో
6. కుక్కర్ వేడెక్కిన తర్వాత విజిల్ పైకి లేస్తుంది. ఈ ప్రయోగం దేన్ని తెలియజేస్తుంది?



   1) ఉష్ణం శక్తిస్వరూపం
   2) ఉష్ణోగ్రత శక్తి స్వరూపం
   3) వేడెక్కిన వాయువులు పీడనాన్ని కలిగిస్తాయి
   4) 1, 3
7. గాలి సాంద్రతను తగ్గించి తేలికగా మార్చే శక్తి?
   1) రసాయన శక్తి 2) ఉష్ణ శక్తి
   3) ధ్వని శక్తి 4) కాంతి శక్తి
8. 0°C వద్ద ఉన్న 1 గ్రాము మంచు ముక్కను 100°C వద్ద మరిగించడానికి కావాల్సిన ఉష్ణం (కెలోరీల్లో)?
   1) 720 2) 640 3) 100 4) 180
9. ద్రవాలు, వాయువుల్లో ఉష్ణం ప్రసరించే పద్ధతి?
   1) ఉష్ణవహనం 2) ఉష్ణసంవహనం
   3) ఉష్ణపరావర్తనం 4) ఉష్ణవికిరణం
10. చలిమంట దగ్గర నిల్చున్నప్పుడు మీరు ఏ పద్ధతిలో ఉష్ణాన్ని పొందుతారు?
   1) ఉష్ణవికిరణం 2) ఉష్ణవహనం
   3) ఉష్ణ సంవహనం 4) ఉష్ణ పరావర్తనం
11. 'వేడి గాలి పైకి వెళుతుంది' అనే సూత్రంపై పనిచేసేవి?
   1) వెంటిలేటర్లు 2) ఎగ్జాస్ట్ ఫ్యాన్
   3) పొగగొట్టాలు 4) పైవన్నీ
12. ఒక మంచు ముక్కను ఇనుప దిమ్మెపై, మరొక మంచు ముక్కను చెక్క దిమ్మెపై ఉంచినప్పుడు ఏ దిమ్మెపై ఉన్న ఐస్ ముక్క త్వరగా కరుగుతుంది?
   1) ఇనుప దిమ్మె 2) చెక్క దిమ్మె
   3) రెండింటిపై ఉన్న ముక్కలు ఒకేసారి కరుగుతాయి
   4) రెండూ కరగవు
13. ఉష్ణవహన పద్ధతిలో ఉష్ణాన్ని ప్రసారం చేసేది?
   1) నీరు 2) ఆల్కహాల్
   3) పాదరసం 4) గాలి
14. వాక్యం–ఎ: తాటాకు ఇళ్లు వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటాయి.
   వాక్యం–బి: తాటాకులు మంచి ఉష్ణవాహకాలు.
   1) ఎ సత్యం, బి అసత్యం.
   2) ఎ అసత్యం, బి సత్యం.
   3) ఎ, బి లు అసత్యాలు. 4) ఎ, బి లు సత్యాలు.
15. వాక్యం–ఎ: కరెంటు స్తంభాల మధ్య వైర్లు వదులుగా ఉంటాయి?
   వాక్యం–బి: శీతాకాలంలో లోహాలు సంకోచిస్తాయి.
   1) ఎ సత్యం, బి అసత్యం. 2) ఎ, బి లు సత్యాలు.
   3) ఎ అసత్యం, బి సత్యం. 4) ఎ, బిలు అసత్యాలు.
16. వాక్యం–ఎ: సిమెంటు రోడ్డు వేసినప్పుడు మధ్యలో ఖాళీలు ఉంచుతారు.
   వాక్యం–బి: వేసవిలో కాంక్రీటు, ఇనుము వ్యాకోచిస్తాయి.
   1) ఎ, బి లు సత్యాలు. 2) ఎ అసత్యం, బి సత్యం.
   3) ఎ, బిలు అసత్యాలు. 4) ఎ సత్యం, బి అసత్యం.
17. థర్మామీటర్‌లో ఉపయోగించే పదార్థాలు?
   1) పాదరసం 2) ఆల్కహాల్
   3) 1, 2 4) హైడ్రోజన్
18. పాదరసం థర్మామీటర్‌ను చేతితో పట్టుకున్నప్పుడు థర్మామీటర్‌లోని పాదరసరం ఏ పద్ధతిలో ఉష్ణాన్ని గ్రహిస్తుంది?
   1) ఉష్ణసంవహనం 2) ఉష్ణవికిరణం
   3) ఉష్ణవహనం 4) ఉష్ణపరావర్తనం
19. నీటికి కింది ఏ పదార్థాలు కలిపినప్పుడు దాని ఉష్ణోగ్రత పెరుగుతుంది?
   1) గ్లూకోజ్ 2) బట్టల సోడా
   3) వంట సోడా 4) 2, 3
20. కింది వాటిలో సరికాని దాన్ని గుర్తించండి.



   1) ఫ్లాస్కులో టీ ఎక్కువ సేపు వేడిగా ఉంటుంది.
   2) ఫ్లాస్కులో గాజుగోడల మధ్య శూన్యం చేస్తారు.
   3) ఫ్లాస్కులో గాజుకు వెండి పూత పూస్తారు.
   4) ఫ్లాస్కులో ఎన్నిరోజులైనా టీ వేడిగా ఉంటుంది.
21. కింది వాటిలో పాదరసం మరిగే ఉష్ణోగ్రత?
   1) –39 °C 2) –110 °C
   3) 357 °C 4) 99 °C
22. సెల్సియస్ స్కేలు : 100 విభాగాలు :: ఫారన్‌హీట్ స్కేలు: ....?
   1) 100 2) 180 3) 212 4) 150
23. వడదెబ్బ తగిలినప్పుడు చేయకూడనిది గుర్తించండి.
   1) నీడలోకి తీసుకెళ్లాలి. 2) తడివస్త్రంతో తుడవాలి.
   3) నీరు లాంటి పానీయాలు తాగించాలి.
   4) ఎండలో ఉంచాలి.
24. ఉష్ణోగ్రత, ఆర్ద్రత, గాలివేగం, వర్షపాతం లాంటి అంశాల్లో రోజువారీగా కలిగే మార్పులను ఏమంటారు?
   1) వాతావరణం 2) శీతోష్ణస్థితి
   3) పీడనం 4) పర్యావరణం
25. ఉష్ణోగ్రత దేనికి అనులోమానుపాతంలో ఉంటుంది?
   1) అణువుల సగటు గతిశక్తికి
   2) అణువుల భ్రమణశక్తికి
   3) అణువుల కంపనశక్తికి 4) అణువుల స్థితిశక్తికి
26. కింది వాటిలో విశిష్టోష్ణానికి సంబంధించిన సరైన సూత్రం?
   1) $S = \frac{Q}{M\Delta T}$ 2) $S = \frac{Q}{M}$
   3) $S = \frac{Q\Delta T}{M}$ 4) $S = \frac{QM}{\Delta T}$
27. కింది వాటిలో పరమశూన్య ఉష్ణోగ్రతను గుర్తించండి.
   1) –273 °C 2) 100 °C
   3) 212 °C 4) 37 °C
28. మిశ్రమణీయ సూత్రంపై పనిచేసే పరికరం?
   1) కెలోరిమీటర్ 2) థర్మామీటర్
   3) మల్టీమీటర్ 4) హైగ్రోమీటర్
29. భూమిపై ఉన్న ఉష్ణ భాండాగారాలను గుర్తించండి.



   1) పెట్రోల్
   2) బొగ్గు
   3) సముద్రాలు
   4) అడవులు
30. కింది వాటిలో బాష్పీభవనానికి సంబంధించి సరైన దాన్ని గుర్తించండి.
   1) ఉపరితల దృగ్విషయం 2) శీతలీకరణ ప్రక్రియ
   3) 1, 2 4) ఉష్ణీకరణ ప్రక్రియ
31. ఉష్ణం బదిలీ అయ్యే రేటు గరిష్ఠంగా ఉండే ప్రక్రియ?
   1) ఉష్ణవహనం 2) ఉష్ణసంవహనం
   3) ఉష్ణవికిరణం 4) ఉష్ణదక్షత
32. నీటికి ఏ ధర్మం లేనట్లయితే జలచరాలు, వృక్షజాతులు నాశనమవుతాయి?
   1) బాష్పీభవనం 2) సాంద్రీకరణం
   3) ఉత్పతనం 4) నీటి అసంగత వ్యాకోచం
33. ఖగోళ వస్తువుల ఉపరితలాల ఉష్ణోగ్రతను అంచనా వేయడానికి ఉపయోగపడే నియమం?
   1) స్టీఫెన్ - బోల్జ్‌మన్ నియమం
   2) జౌల్ నియమం
   3) న్యూటన్ - శీతలీకరణ నియమం
   4) వీన్ నియమం
34. 20°C వద్ద ఉన్న 30 గ్రా. నీటిని 50°C వద్ద ఉన్న 20 గ్రాముల నీటికి కలపగా ఫలిత ఉష్ణోగ్రత?
   1) 35 °C 2) 32 °C 3) 30 °C 4) 36 °C
35. నెయిల్ పాలిష్‌ను రిమూవర్‌తో తొలగించేటప్పుడు చల్లగా ఉండటానికి కారణం?
   1) ద్రవీభవనం 2) బాష్పీభవనం
   3) ఉత్పతనం 4) పునర్ఘనీభవనం
36. సాధారణ వాతావరణ పీడనం వద్ద నీటి మరిగే స్థానం?
   1) 373 K 2) 273 K 3) 0 K 4) 100 K
37. మంచుపై స్కేటింగ్ చేయడానికి కారణమైన ధర్మం?
   1) పునర్ఘనీభవనం 2) అసంగత వ్యాకోచం
   3) బాష్పీభవనం 4) ఉత్పతనం
38. కెల్విన్, ఫారన్‌హీట్ ఉష్ణోగ్రత మానాల్లో విలువలు సమానంగా ఉండే ఉష్ణోగ్రత?
   1) 574.6 K 2) 100 K
   3) 273.15 K 4) 0 K
39. ఫారన్‌హీట్(F), సెల్సియస్(C) ఉష్ణోగ్రతల మధ్య సంబంధం?
   1) $C = \frac{5}{9}(F + 32)$ 2) $C = \frac{5}{9}(F - 32)$
   3) $C = \frac{9}{5}(F - 32)$ 4) $C = \frac{9}{5}(F + 32)$
40. విశిష్టోష్ణాన్ని కొలిచే పరికరాన్ని గుర్తించండి.
   1) కెలోరీమీటర్ 2) థర్మామీటర్
   3) మల్టీమీటర్ 4) హైగ్రోమీటర్
41. మంచు ముక్కను తాకగానే చల్లగా అనిపించడానికి కారణం?
   1) ఉష్ణాన్ని మనం కోల్పోవడం
   2) ఉష్ణాన్ని మనం గ్రహించడం
   3) ఉష్ణం బదిలీ జరగకపోవడం
   4) ఉష్ణ సమతాస్థితి
42. యానకం ఉన్నా, లేకపోయినా ఉష్ణప్రసారం జరిగే పద్ధతి?
   1) ఉష్ణవహనం 2) ఉష్ణసంవహనం
   3) ఉష్ణవికిరణం 4) ఉష్ణదక్షత
43. థర్మోఫ్లాస్క్‌ను కనుక్కున్న శాస్త్రవేత్తను గుర్తించండి.
   1) గెలీలియో 2) జేమ్స్ డెవర్
   3) సెల్సియస్ 4) కెల్విన్
44. మానవుడి శరీర సాధారణ ఉష్ణోగ్రత సెల్సియస్‌లలో?
   1) 100 °C 2) 84 °C 3) 37 °C 4) 0 °C
45. కింది వాటిలో ఉష్ణబంధక పదార్థాన్ని గుర్తించండి.
   1) స్టీల్ 2) పాదరసం 3) చెక్క 4) ప్లాటినం
46. ఒక గ్రాము ద్రవ్యరాశి ఉన్న నీటి ఉష్ణోగ్రతను 1°C పెంచడానికి కావాల్సిన ఉష్ణం?
   1) గుప్తోష్ణం 2) విశిష్టోష్ణం
   3) కెలోరీ 4) జౌల్

సమాధానాలు

1-4; 2-4; 3-3; 4-2; 5-4; 6-4; 7-2; 8-1; 9-2; 10-1; 11-4; 12-1; 13-3; 14-1; 15-2; 16-1; 17-3; 18-3; 19-4; 20-4; 21-3; 22-2; 23-4; 24-2; 25-1; 26-1; 27-1; 28-1; 29-3; 30-3; 31-3; 32-4; 33-4; 34-2; 35-2; 36-1; 37-1; 38-1; 39-2; 40-1; 41-1; 42-3; 43-2; 44-3; 45-3; 46-3.

ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

కేంద్ర మంత్రి భూపతిరాజు

గుంతకల్లు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగులుగా చేరుతున్న వారు తమ విధుల్లో అంకితభావంతో పని చేయాలని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సూచించారు. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కొత్తగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు రోజ్‌గార్ మేళా కింద శనివారం ఆయన నియామక పత్రాలు అందజేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే అధికారుల రిక్రియేషన్ కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు దిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోదీ ప్రసంగించారు. అనంతరం శ్రీనివాసవర్మ మాట్లాడుతూ.. నిరుద్యోగులకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనే డబుల్ ఇంజిన్ సర్కారు ప్రాధాన్యం

20 సూత్రాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

ఈనాడు, అమరావతి: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం దేశవ్యాప్తంగా 46 ప్రాంతాల్లో నిర్వహించిన పీఎం రోజ్‌గార్ మేళాలో రైల్వే, ఆరోగ్య, తపాలా, హోం, కార్మిక శాఖల ద్వారా 51 వేల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నియామక పత్రాలు అందించారన్నారు. ఉద్యోగాలు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు మేళాల ద్వారా 10 లక్షల ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని విద్యా శాఖ, వైద్య శాఖల్లో ఉద్యోగాలు, ఏపీపీఎస్సీ గ్రూప్-1, 2ల పోస్టుల భర్తీకి డబుల్ ఇంజిన్ సర్కారు ఉపక్రమించిందని తెలిపారు.

పేర్ని నాని వ్యాఖ్యలు దేనికి సంకేతం?

- తెదేపా నేతలు బోడె ప్రసాద్, కొనకళ్ల నారాయణ ధ్వజం

ఈనాడు, అమరావతి: పేర్ని నాని వ్యాఖ్యలు దేనికి సంకేతం? హింస, విధ్వంసం వైకాపా విధానం అని ఆ మాటలతో అర్థమవుతోందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 'రేషన్ బియ్యం, అక్రమ మైనింగ్, భూదందాలు, అవినీతి సొమ్ముతో పేర్ని నాని విర్రవీగుతున్నారు. గత ప్రభుత్వంలో బీచ్ రోడ్డులో పూరి గుడిసెలకు నిప్పుపెట్టడం, పోలీసు స్టేషన్‌పై దాడిచేయడం నిజం కాదా? మచిలీపట్నంలో ఆక్రమించిన వెయ్యి గజాల తమ్మినవారి సత్రం, కోటా జయరాం పొలం, రంగనాయకస్వామి ఆలయం దగ్గరకు వెళ్తే ఆయన సంగతి స్థానికులే చెబుతారు. గోడౌనులో రేషన్ బియ్యం ఎక్కడికి పోయాయి?' అని దుయ్యబట్టారు.

బాధ్యతలు స్వీకరించిన ద.మ.రైల్వే జీఎం




ఈనాడు, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే జోన్ నూతన జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అలహాబాద్‌లో శనివారం బాధ్యతలు స్వీకరించారు. అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. ఆయన్ను రైల్వేబోర్డు ద.మ.రైల్వే జీఎంగా శుక్రవారం నియమించింది. ఆదివారం ఉదయం రైల్ నిలయంలో జోన్ వివిధ విభాగాల అధిపతులతో జీఎం సమావేశం కానున్నారు.

ట్రిపుల్‌ఐటీ కొత్త డైరెక్టర్‌గా సందీప్ శుక్లా

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక ఐఐఐటీ డైరెక్టర్‌గా ఐఐటీ కాన్పుర్‌కు చెందిన ఆచార్య సందీప్ శుక్లా ఆగస్టులో బాధ్యతలు చేపట్టబోతున్నట్లు గవర్నింగ్ కౌన్సిల్ తెలిపింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ట్రిపుల్‌ఐటీ స్నాతకోత్సవంలో ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రస్తుత డైరెక్టర్ పీజే నారాయణన్ త్వరలో పదవి నుంచి వైదొలగనున్నారు. కొత్త డైరెక్టర్ సందీప్ శుక్లాకు సైబర్ సెక్యూరిటీ, ఎంబెడెడ్ సిస్టమ్స్, బ్లాక్ చెయిన్‌లో విశేష అనుభవముంది. ఐఐఐటీ హైదరాబాద్ తదుపరి నాయకుడి బాధ్యతను అప్పగించడం చాలా గౌరవంగా ఉందని సందీప్‌శుక్లా పేర్కొన్నారు.

'బలవంతపు భూ సమీకరణకు వ్యతిరేకం'

ఈనాడు, అమరావతి: రాజధాని నిర్మాణం పేరిట రైతుల నుంచి బలవంతంగా భూ సమీకరణ చేస్తే ఊరుకోబోమని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ తెలిపారు. 'రాజధాని నిర్మాణమంటే రాష్ట్ర ప్రజల కోరిక, అవసరం. వీటిని ఆసరాగా చేసుకుని సీఎం చంద్రబాబు సహా ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతలు ఎవరైనా భూదోపిడీకి పాల్పడితే సహించం' అని శనివారం ఆయన అన్నారు.



ఆదివారం రాత్రి మీ ఆలోచనలు ఎలా ఉంటాయి?

ప్రతి ఆదివారం రాత్రి మీ ఆలోచనలెలా సాగుతుంటాయి? సోమవారం ఉదయం నుంచి మళ్లీ పని చేయక తప్పదని బాధపడుతుంటారా? లేక ఎప్పుడెప్పుడు పనిని మొదలుపెడదామా అని ఉత్సుకతతో ఎదురుచూస్తుంటారా? మొదటి రకం ఆలోచనతో మీరుంటే, మీ పనిలో ఎప్పటికీ విజయం సాధించలేరు. జీవితాన్ని కూడా ఆస్వాదించలేరు. అందుకే మీకిష్టమైన పనిని ఎంచుకోండి లేదా చేస్తున్న పనిని ఇష్టపడేలా మిమ్మల్ని మార్చుకోండి.

– రేవీ, బిజినెస్ స్ట్రాటజిస్ట్

కనీస హాజరు నిబంధన సరైనదే

హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



ఈనాడు, అమరావతి: బీటెక్ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు కనీస హాజరు శాతం ఉండాల్సిందేనన్న నిబంధనలను హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. కనీస హాజరు విషయంలో జేఎన్‌టీయూ-కాకినాడ, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజాంలోని జీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (జీఎంఆర్ఐటీ) ఇంజినీరింగ్ కళాశాల తీసుకొచ్చిన నిబంధనలు సహేతుకంగా లేవని, ఏకపక్షమంటూ హైకోర్టు సింగిల్ జడ్జి పేర్కొనడం చట్టం ముందు నిలబడదని అభిప్రాయపడింది. సింగిల్ జడ్జి తీర్పులోని ఆ భాగాన్ని రద్దు చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈమేరకు ఉత్తర్వులిచ్చింది.

✦ జీఎంఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కౌశిక్ బీటెక్ చదువుతున్నారు. అనారోగ్యం వల్ల గతేడాది ఆగస్టు, అక్టోబరులో కొన్ని రోజులు తరగతులకు హాజరుకాలేదు. 65 శాతం కన్నా హాజరు తక్కువ ఉందని మూడో సెమిస్టర్ పరీక్ష రాసేందుకు కళాశాల అనుమతించలేదని ఆ విద్యార్థి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం పరీక్ష రాయడానికి అనుమతిచ్చింది. కౌశిక్ మరో వ్యాజ్యం వేస్తూ ఫలితాలు వెల్లడించేలా ఆదేశించాలని, నాలుగో సెమిస్టర్ తరగతులకు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. వీటిపై హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ జరిపారు. 'అనారోగ్యానికి ఎప్పుడు గురవుతామనేది మనిషి చేతుల్లో లేని వ్యవహారం. రోగాల కారణంగా కొన్నిసార్లు సాధారణ పనులు చేసుకునేందుకు వీలుండదు. మానవ నియంత్రణలో లేని ఇలాంటి విషయాల్లో.. అనారోగ్యం పాలైన విద్యార్థులకు ఇంత శాతం హాజరు లేకపోతే పరీక్షలు రాయడానికి అనర్హులవుతారనే నిర్దిష్ట నిబంధన పెట్టడానికి వీల్లేదు. ఇలాంటి నిబంధన సహేతుకం కాదు.. ఏకపక్షం' అని పేర్కొన్నారు. ఆ విద్యార్థి ఫలితాలు ప్రకటించాలని, తరగతులకు అనుమతించాలని కళాశాలను ఆదేశించారు.

✦ సింగిల్ జడ్జి తీర్పుపై జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. న్యాయవాది శివదర్శన్ వాదనలు వినిపించారు. కనీస హాజరు లేని విద్యార్థులను పరీక్షలు రాసేందుకు అనుమతించడం చట్ట నిబంధనలకు విరుద్ధం అన్నారు. అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. జీఎంఆర్ఐటీ నిబంధనలను అనుసరించి తగ్గిన హాజరు శాతాన్ని పెంచుకునేందుకు అదనపు తరగతులకు హాజరయ్యే వెసులుబాటును కౌశిక్‌కు ఇచ్చింది. ఈ తీర్పులో తామిచ్చిన ఉత్తర్వులను భవిష్యత్తులో ఇతరులు ప్రామాణికంగా తీసుకోవడానికి వీల్లేదని స్పష్టంచేసింది.

ఒత్తిడి, కాలుష్యంతో సంతానలేమి సమస్య

- రాష్ట్రస్థాయి గైనకాలజీ సదస్సులో చర్చ
- తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన 1,400 మంది వైద్యులు



మాట్లాడుతున్న డీఎంఈ నరసింహం



సదస్సుకు హాజరైన వైద్యనిపుణులు

కాకినాడ(మసీదు సెంటర్), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఆఫ్ అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ 10వ రాష్ట్రస్థాయి సదస్సు-2025 కాకినాడ ఆర్ఎంసీ ఆడిటోరియంలో రెండో రోజైన శనివారమూ కొనసాగింది. దీన్ని కాకినాడ నగర గైనకాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంఈ డా.నరసింహం, గౌరవ అతిథులుగా కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్, కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్యకుమారి హాజరై ప్రసంగించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1,400 మంది గైనకాలజిస్టులు, పీజీ వైద్యులు హాజరయ్యారు. సదస్సులో మొదటి రోజు లాప్రోస్కోపీ, హిస్టెరోస్కోపీ, మూత్రాశయ సర్జరీల గురించి చర్చించారు. రెండో రోజు సైంటిఫిక్ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 15 మంది వైద్యులు మాట్లాడుతూ.. మహిళలు, పురుషుల్లో సంతానలేమి సమస్య ఈ రోజుల్లో ఎక్కువగా ఉంది. ఒత్తిడి, కాలుష్యం అందుకు ప్రధాన కారణాలు అని వివరించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు డా.అనురాగమయి, ఆర్గనైజింగ్ కార్యదర్శి డా.గీతశ్రీ, ఛైర్‌పర్సన్ డా.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కో-ఛైర్‌పర్సన్లు డా.ఎ.సత్యవతి, డా.రవికుమార్, కోశాధికారి డా.లక్ష్మీకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలు సృష్టించి ఇబ్బంది పెడుతున్నారు

- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: భర్త చనిపోయాక తనకు సంక్రమించిన ఆస్తికి కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి ఇబ్బంది పెడుతున్నారని ప్రకాశం జిల్లా మార్కాపురం మండలానికి చెందిన కాశమ్మ వాపోయారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిలకు వినతిపత్రం అందించారు. గతంలో జరిగిన రీసర్వే సమయంలో ఆన్‌లైన్‌లో పేర్లను తారుమారు చేసి, భూములను వేరొకరి పేరు మీదకు మార్చుకున్నారని అనకాపల్లి జిల్లా ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన పి.శివసత్యనారాయణ ఫిర్యాదు చేశారు. భూమి రీసర్వే చేసి తమ సమస్యకు పరిష్కారం చూపాలని ఎన్టీఆర్ జిల్లా అంబాపురం ప్రాంతానికి చెందిన కోటా శ్రీనివాసరావు వినతిపత్రం అందించారు. తన పొలంలో మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రెడ్డిగూడెం మండలానికి చెందిన జి.రవికిరణ్ కోరారు.

బదిలీల్లో తెలియక తప్పు చేశాను.. రిలీవ్ చేయండి!

షోకాజ్ నోటీసుకు ఆర్జేడీ ఆదినారాయణ వివరణ

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ విద్య బదిలీల్లో తప్పు చోటుచేసుకున్నట్లు ఆర్జేడీ ఆదినారాయణ అంగీకరించారు. ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన ఇంటర్మీడియట్ విద్యా విభాగం ఇటీవల ఆర్జేడీకి షోకాజ్ నోటీసు ఇచ్చింది. తనకు అవగాహన లేకపోవడంతోనే తప్పు జరిగినట్లు ఆదినారాయణ సమాధానమిచ్చారు. తనను ఆర్జేడీ బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని కోరారు. దీనికి సంబంధించిన దస్త్రాన్ని ప్రభుత్వానికి పంపనున్నట్లు డైరెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఇంటర్మీడియట్ విద్య కార్యాలయంలో బదిలీలను పర్యవేక్షిస్తున్న ఓ అధికారి, ఇటీవల బోర్డు నుంచి బయటకు వెళ్లిన ఓ ప్రిన్సిపల్ కలిసి ఆర్జేడీని తప్పుదోవ పట్టించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర కార్యాలయంలోని ఉన్నతాధికారుల వద్ద సమస్య వస్తే తాము చూసుకుంటామని చెప్పి, అక్రమ బదిలీలకు తెరతీసినట్లు ప్రచారం సాగుతోంది. హేతుబద్ధీకరణలో భాగంగా విజయవాడలో ఓ కళాశాల నుంచి మరో కళాశాలకు పోస్టును మార్పు చేసిన అధికారులు అక్కడ పని చేసే లెక్చరర్‌ను నిబంధనలకు విరుద్ధంగా 16% హెచ్‌ఆర్ఏ నుంచి మళ్లీ 16% హెచ్‌ఆర్ఏ ఉన్న పోస్టుకే బదిలీ చేశారు. అవగాహన లేక ఇలా చేసినట్లు ఆర్జేడీ ఆదినారాయణ అంగీకరించారు. బోర్డులో పని చేసేందుకు డిప్యుటేషన్‌పై తీసుకొచ్చిన ప్రిన్సిపల్‌ను తిరిగి విజయవాడలోని ఓ కళాశాలలో సర్దుబాటు చేయడంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో కొన్ని ప్రిన్సిపల్ పోస్టింగుల్లోనూ నిబంధనలు పాటించలేదనే విమర్శలున్నాయి.

ఖైదీ కడుపులో సెల్‌ఫోన్

శివమొగ్గ, న్యూస్‌టుడే: కర్ణాటకలోని శివమొగ్గ కేంద్ర కారాగారంలో దౌలత్ ఖాన్ అలియాస్ గుండ (30) అనే ఖైదీ కడుపులోంచి వైద్యులు సెల్‌ఫోన్ బయటకు తీశారు. పొరపాటున రాయిని మింగానని, కడుపులో నొప్పి వస్తోందని గుండ చెప్పడంతో కారాగారం అధికారులు ఎక్స్‌రే తీయించారు. కడుపులో ఫోన్ ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే ఖైదీని శివమొగ్గ నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి శస్త్రచికిత్స చేసి సెల్‌ఫోన్‌ను బయటకు తీశారు. జైలులో నిబంధనలకు విరుద్ధంగా ఫోన్ వాడి ఉంటాడని, సోదాల సమయంలో మింగి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం గుండ కోలుకుంటున్నాడు.

అల్లుడు కాదు.. యముడు

బీమా సొమ్ము కోసం.. అత్త హత్య

- కారుతో ఢీకొట్టించి.. ప్రమాదం జరిగిందని ఫిర్యాదు
- తెలంగాణలోని పెద్దమాసాన్‌పల్లిలో ఘటన



నిందితులు వెంకటేశ్, కరుణాకర్



హత్యకు ఉపయోగించిన వాహనాలు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: వ్యాపారంలో నష్టపోయిన ఓ యువకుడు దురాశతో.. పిల్లనిచ్చిన అత్తను హతమార్చి.. వచ్చే బీమా సొమ్ముతో అప్పులు తీర్చాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ఆమెను కారుతో ఢీకొట్టించి చంపించాడు. ఆపై ప్రమాదం జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు అనుమానంతో ఆరా తీయగా.. విచారణలో విషయమంతా బయటపడింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలో జరిగింది. కేసు వివరాలను సిద్దిపేట సీపీ అనూరాధ కమిషనరేట్‌లో శనివారం వెల్లడించారు. పెద్దమాసాన్‌పల్లికి చెందిన తాళ్ల వెంకటేశ్‌కు కొండపాక మండలం సిర్సినగండ్ల గ్రామానికి చెందిన యువతితో పెళ్లి జరిగింది. అతను కోళ్లఫారం పెట్టి రూ.22 లక్షలు నష్టపోయాడు. అప్పులు తీర్చే మార్గంలేక తన అత్త తాటికొండ రామవ్వ (57)ను హతమార్చి.. తద్వారా వచ్చే బీమా సొమ్ముతో అప్పులు తీర్చాలనుకున్నాడు. ఆమెకు ముందుగా బీమా పథకం లేకపోవడంతో.. గత మార్చిలో పోస్టాఫీసులో రూ.15 లక్షల బీమా, ఎస్‌బీఐలో రూ.40 లక్షల ప్రమాద బీమా చేయించాడు. రైతు బీమా రూ.5 లక్షల కోసం తన తండ్రి పేరిట ఉన్న 28 గుంటల పొలాన్ని అత్త పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. పథకాన్ని అమలు చేయడం తన ఒక్కడి వల్ల కాదని భావించి.. తాను అప్పు తీసుకున్న సోదరుడు కరుణాకర్ సహకారం తీసుకున్నాడు. పథకం అమలైతే వచ్చే బీమా సొమ్ములో సగం ఇస్తానని చెప్పాడు.

వాహనం అద్దెకు తీసుకుని..

బీమా సొమ్ము క్లెయిమ్ చేయడానికి ఇద్దరు సోదరులు దృశ్యం-2 సినిమా చూసి.. పథకాన్ని అమలుచేయాలని భావించారు. రామవ్వను కారుతో ఢీకొట్టించి. . ప్రమాదంగా చిత్రీకరిస్తే బీమా సొమ్ము వస్తుందని ఆశపడ్డారు. కరుణాకర్ సిద్దిపేటలో ఓ కారును అద్దెకు తీసుకున్నాడు. వెంకటేశ్ ఈనెల 7న అత్త రామవ్వను పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్నామని, దానికి సంతకం అవసరమని నమ్మబలికి సిర్సినగండ్ల నుంచి ద్విచక్రవాహనంపై పెద్దమాసాన్‌పల్లిలోని తన పొలానికి తీసుకొచ్చాడు. ఆమెను అక్కడే రోడ్డుపైనే కూర్చోబెట్టి వెంకటేశ్ పొలంలోకి వెళ్లాడు. అప్పటికే సమీపంలో కారుతో సిద్ధంగా ఉన్న కరుణాకర్‌కు ఫోన్ చేసి.. తన అత్తను కారుతో ఢీకొట్టి చంపాలని చెప్పాడు. వెంటనే కరుణాకర్ కారుతో రామవ్వను ఢీకొట్టి వెళ్లిపోయాడు. వెంకటేశ్ ఆమెను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు అనంతరం సీసీ ఫుటేజీ, టవర్ లొకేషన్ సహాయంతో నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించగా నిజాన్ని అంగీకరించారు. గజ్వేల్ ఏసీపీ నరసింహులు ఆధ్వర్యంలో కేసు ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ లతీఫ్, ఎస్సై రవికాంత్‌రావు, సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు.

బతికుండగానే చనిపోయాడంటూ సమాచారం

- అంత్యక్రియల సమయంలో గుర్తించిన కుటుంబసభ్యులు
- వరంగల్ ఎంజీఎంలో ఘటన

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: బతికున్న వ్యక్తి చనిపోయాడంటూ పోలీసులు మృతదేహాన్ని అప్పగించి ఓ కుటుంబాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేశారు. అంత్యక్రియల సమయంలో ఆసుపత్రి వర్గాలు మరొకరి మృతదేహాన్ని ఇచ్చారని గుర్తించిన కుటుంబ సభ్యులు వెనక్కు తీసుకొచ్చారు. తర్వాత విచారించగా పోలీసులు చనిపోయాడంటూ చెప్పిన వ్యక్తి ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నట్లు తేలింది. ఈ ఘటన తెలంగాణలోని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో జరిగింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం ఎలికట్టె గ్రామానికి చెందిన గోక కుమారస్వామి(50)కి వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారానికి చెందిన రమతో వివాహమైంది. వారికి ఒక కుమార్తె. 20 ఏళ్ల కిందట విభేదాలు రాగా రమ మైలారంలో తల్లిగారి ఇంటివద్ద ఉంటోంది. కుమారస్వామి ఈనెల 9న తొర్రూరులో అపస్మారక స్థితిలో పడిపోయి ఉండగా పోలీసులు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా తొలుత వర్ధన్నపేట ఆసుపత్రికి తర్వాత ఎంజీఎంకు తరలించారు. కాలుకు గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నాడు. తొర్రూరు పోలీసులు ఇచ్చిన సమాచారంతో కుమారస్వామి చనిపోయాడనుకుని ఓ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మైలారం గ్రామానికి శుక్రవారం తీసుకెళ్లారు. అంత్యక్రియల సమయంలో చేతిపై శ్రీ అనే పచ్చబొట్టు లేకపోవడాన్ని గుర్తించి అది కుమారస్వామి మృతదేహం కాదని వారు తిరిగి ఎంజీఎంకు తీసుకెళ్లారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు ఆ మృతదేహం వరంగల్ హంటర్‌రోడ్డు ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాలపై పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిదిగా గుర్తించారు. ఆసుపత్రి అవుట్‌పోస్టు సిబ్బంది రైల్వే పోలీసులకు ఇవ్వాల్సిన సమాచారాన్ని తొర్రూరు పోలీసులకు ఇచ్చారు. వారు కూడా సరిచూసుకోకుండా మృతదేహం అప్పగించారు. ఈ ఘటనపై శనివారం ఎంజీఎం ఆసుపత్రి ఆర్ఎంవో డా.శశికుమార్ విచారణ చేశారు. చికిత్స పొందుతున్న కుమారస్వామిని కలిసి మాట్లాడారు. పోలీసు అవుట్‌పోస్టు పోలీసు తప్పిదం వల్లే ఇలా జరిగిందని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎంజీఎం సూపరింటెండెంట్ డా.కిశోర్‌కుమార్ తెలిపారు.

సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల విడుదల



సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వలోకి విడుదలవుతున్న గోదావరి

అశ్వాపురం, న్యూస్‌టుడే: తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం భీమునిగుండం కొత్తూరులోని సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను శనివారం విడుదల చేశారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రాజెక్టు ఫేజ్-1 పంప్‌హౌస్‌లోని మోటారును ఆన్ చేసి ప్రధాన కాల్వలోకి నీటిని వదిలారు. కుమ్మరిగూడెం వద్ద వరద జలాలను కూడా ఈ కాల్వలోకి మళ్లించి, సుమారు 1,500 క్యూసెక్కుల జలాలను విడుదల చేస్తున్నారు. ఈ నీరు వీకే రామవరంలోని ఫేజ్-2, కమలాపురంలోని ఫేజ్-3 పంప్‌హౌస్‌లకు చేరుకుని అక్కడి నుంచి ఏన్కూరులోని రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సాగర్ కాల్వలో కలుస్తాయి.

తెలంగాణ ఎప్‌సెట్ మాక్‌సీట్ల కేటాయింపు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి టీజీఎప్‌సెట్-2025 మాక్ అలాట్‌మెంట్ ఫలితాలు వెల్లడయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు, కళాశాలల్లో మొత్తం 83,054 సీట్లకు 77,154 మందికి సీట్లు(అంచనా) కేటాయించినట్లు టీజీ ఎప్‌సెట్ కన్వీనర్ దేవసేన తెలిపారు.



వ్యాససంపుటిని ఆవిష్కరిస్తున్న రఘురామకృష్ణరాజు. చిత్రంలో రాఘవేంద్రరావు, వసంత కృష్ణప్రసాద్, మన్నవ సుబ్బారావు, సతీష్ వేమన తదితరులు

'అరాచకంపై అక్షర సమరం' వ్యాససంపుటి ఆవిష్కరణ

- ప్రజల అంతరంగాన్ని శోధించి రాశారని మన్నవ సుబ్బారావుకు పలువురి కితాబు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలోని దుర్మార్గాలపై తెదేపా సీనియర్ నేత, గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు రాసిన 'అరాచకంపై అక్షర సమరం' వ్యాససంపుటిని ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావుతో కలిసి శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆవిష్కరించారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ "వైకాపా ప్రభుత్వ తప్పిదాలను పరిశీలనాత్మకంగా శోధించి, సునిశిత విమర్శలతో మన్నవ సుబ్బారావు వివిధ పత్రికలకు 200కు పైగా వ్యాసాలను రాయడం అభినందనీయం. గత ప్రభుత్వం కుల, మత, ప్రాంతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ వికృత రాజకీయాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజల గొంతుకై సుబ్బారావు తన కలం ద్వారా గళం విప్పారు" అని పేర్కొన్నారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ "సుబ్బారావు ప్రజల అంతరంగాన్ని శోధించి విశ్లేషించారు. వైకాపా పాలనలో హింస, వేధింపులు, అణచివేతలే చూశాం. అందుకే ప్రజలు తిరగబడ్డారు' అని చెప్పారు. మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ అవినీతి, అసమర్థ పాలనకు చరమగీతం పాడేందుకు సుబ్బారావు రాసిన వ్యాసాలు దోహదపడ్డాయని అన్నారు. పౌర హక్కులనే కాదు, అసలు జీవించే హక్కునే మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి కాలరాశారని రచయిత మన్నవ సుబ్బారావు పేర్కొన్నారు. ప్రజలను చైతన్యపరచేందుకు బాధ్యత కలిగిన పౌరుడిగా నా కర్తవ్యాన్ని నిర్వహించానని చెప్పారు. కార్యక్రమంలో తానా పూర్వ అధ్యక్షుడు సతీష్ వేమన, భాను మాగలూరి, సుధీర్ కుమ్మి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల ఐకాస

ఈనాడు, అమరావతి: విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల ఐకాస రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానందను కోరింది. ఈ మేరకు ఐకాస నేతలు సీఎస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అపరిమిత వైద్య సదుపాయం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలని, కాంట్రాక్ట్, పొరుగు సేవల ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని, ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేసినట్లు ఐకాస ఛైర్మన్ కృష్ణయ్య, కన్వీనర్ రాఘవరెడ్డి తెలిపారు.

ఒప్పంద అధ్యాపకుల పెండింగ్ జీతాలు ఇప్పించాలి: ఐకాస

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేసే ఒప్పంద అధ్యాపకుల పెండింగ్ జీతాల విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు లెక్చరర్ల ఐకాస ఛైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో-ఛైర్మన్ కల్లూరి శ్రీనివాస్‌లు ఓ ప్రకటనలో కోరారు. '2024 మే నెల జీతాలు మంజూరు చేయాలి. వీటికి సంబంధించి ఇంటర్మీడియట్ డైరెక్టర్ ప్రభుత్వానికి అందించిన ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆమోదం లభించింది. అయినా ఈ అంశం ఆర్థిక శాఖ వద్ద 20 రోజులుగా పెండింగ్‌లో ఉంది. ఇప్పటికే జీతం రావడంలో సంవత్సర కాలం గడిచిపోయింది' అని పేర్కొన్నారు.

ఉద్యోగులకు బకాయిలపై ఆప్టా వినతి

ఈనాడు, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని, వెంటనే పీఆర్సీ ఛైర్మన్‌ను నియమించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాశ్‌రావు కోరారు. పీఆర్సీ ఇచ్చేవరకు మధ్యంతర భృతి ఇవ్వాలని, కరవు భత్యం కూడా పెండింగ్‌లో ఉందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, కొత్త ప్రభుత్వం వెసులుబాటు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మౌనంగా ఉన్నాయని, ఉద్యమ బాట పట్టేలోపు న్యాయంగా చెల్లించాల్సిన పాత పీఆర్సీ బకాయిలు, ఈఎల్, డీఏలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సీఎంకు సీపీఐ లేఖ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ రాశారు. "రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.6,400 కోట్లు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వం పీజీ చదివే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రద్దు చేసింది. రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో వసతులు అరకొరగా ఉన్నాయి. అధికారంలోకి రాగానే విద్యారంగంలో సమూల మార్పులు చేస్తామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని ఎన్నికల్లో కూటమి పార్టీలు హామీలిచ్చాయి. అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా అమలుకు నోచుకోలేదు" అని ఆయన పేర్కొన్నారు.

డిగ్రీ ప్రవేశాలు ఇంకెప్పుడు: సీపీఎం

ఈనాడు, అమరావతి: విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా డిగ్రీ ప్రవేశాలు మొదలు కాకపోవడం ఆందోళన కలిగిస్తోందని, తక్షణమే ప్రవేశాలు ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'కేంద్రం ఆదేశాలతో వైకాపా ఉన్నత విద్యారంగంలో అనేక మార్పులు చేయడంతో డిగ్రీ విద్యలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విధానాలను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విమర్శించిన కూటమి.. నేడు కొత్త విధానాన్ని రూపొందించకుండా డిగ్రీ ప్రవేశాలు ఆలస్యం చేయడం గర్హనీయం'' అని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

10 కి.మీ... నాలుగైదు గంటల ప్రయాణం

నల్లమలలో.. మెల్లమెల్లగా.. వాహనాల కదలిక



దోమలపెంటలో నిలిచిపోయిన వాహనాలు

శ్రీశైలానికి భక్తులు భారీగా తరలిరావడంతో శనివారం నల్లమలలో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఒకవైపు శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని వదులుతుండటం.. మరోవైపు రెండో శనివారం, ఆదివారం కలిసి రావడంతో.. కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు పర్యాటకులు కూడా పెద్దఎత్తున వస్తున్నారు. దీంతో దోమలపెంట చెక్‌పోస్టు నుంచి తెలంగాణ సరిహద్దున ఉన్న పాతాళగంగ వరకు వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. 10 కి.మీ. ప్రయాణానికి 4 నుంచి 5 గంటలు పడుతోందని వాహనదారులు వాపోతున్నారు. ఏపీలోని లింగాల గట్టు వద్ద ఉన్న అటవీశాఖ సిబ్బంది టోల్‌గేట్ వద్ద రుసుం వసూలు కోసం, తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వైపు వెళ్లే పర్యాటకులు చేపల కోసం లింగాలగట్టు వద్ద రోడ్డుపై వాహనాలు నిలుపుతున్నారు.

– న్యూస్‌టుడే, దోమలపెంట(అమ్రాబాద్)